వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

సంపుటి : 10 సంచిక : 9 హైదరాబాద్ 134 సెప్టెంబర్ 2012 పేజీలు : 68 రు. 15

- ఫీజుల అనిశ్చితి స్వయంకృతం
- అంగారక గ్రహంలో జీవం ఉందా?
- బ్యాంకుల మొండి బాకీలు లక్ష కోట్లు!
- హంతకులకు శౌర్యపతకాలా?
- పేదరికం - పోషకాహార లేమి
- సిరియా పరిణామాలు
- వాకపల్లి ఘటనకు ఐదు సంవత్సరాలు

అరుదైన విశ్లేషకుడి స్మృతిలో ఆలోచనాస్ఫోరక కార్యక్రమాలు
అవగాహనలకు పదునుపెట్టే చర్చలు

రండి పాల్గొనండి వినండి చర్చించండి

ఆర్.ఎస్. రావు స్మారకోపన్యాసం

నవంబర్ 10, 2012, శనివారం, సా. 6 గం.
ప్రెస్ క్లబ్, బషీర్‌బాగ్, హైదరాబాద్

కూడలిలో భారత ఉన్నత విద్య : ప్రత్యామ్నాయాల అన్వేషణ

వక్త: ప్రొ. వి.ఎస్. ప్రసాద్
(సామాజిక శాస్త్రవేత్త, మాజీ డైరెక్టర్ ఎన్ఎఎసి)

ఆర్.ఎస్. రావు స్మారక సదస్సు

నవంబర్ 11, 2012, ఆదివారం ఉ. 10 నుంచి సా. 6

గ్రామ అధ్యయనం, ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనా, ఆరోగ్య రంగం
ఆర్థిక సంక్షోభం, తదితర అంశాలపై పత్రాలు, ప్రసంగాలు, చర్చ

అందరికీ ఆహ్వానం

- ఆర్.ఎస్. రావు మిత్రులు

పరిశోధకులు కావాలి

ప్రజాభిప్రాయ సేకరణ సర్వేలు జరిపే సంస్థ పీపుల్స్ పల్స్‌కు సర్వేలలో ప్రజాభిప్రాయ సేకరణలో గ్రామస్థాయిలోనూ, పట్టణాలలోనూ పని చేయడానికి సిద్ధపడే పరిశోధకులు కావాలి. ఎం.బి.ఎ., ఎకనామిక్స్, జర్నలిజం పట్టభద్రులయితే మంచిది. మారుమూల ప్రాంతాలకు కూడా వెళ్లి సమాచారం సేకరించే శ్రద్ధాసక్తులు ఉండడం కీలకం. ఆసక్తి గల అభ్యర్థులు ఈ కింది చిరునామాకు మెయిల్ ద్వారా మీ బయోడాటా పంపించండి.

PEOPLES PULSE
an ear to the ground

9B, Samrat Complex, Opposite AG's Office,
Saifabad, Hyderabad - 500 004

info@peoplespulse.in

Advt.

పది సంవత్సరాలు పూర్తి చేసుకున్న వీక్షణంకు

శుభాకాంక్షలు

డా. వి.ఎస్. రెడ్డి
ఎం.డి.
కన్సల్టెంట్ హోమియోపత్
1-7-1187/1,ఎం/ఎస్. డా. వి.ఎస్. రెడ్డి కాంప్లెక్స్,
ఏకశిల పార్కు దగ్గర, మెయిన్ రోడ్డు, బాలసముద్రం,
హన్మకొండ, వరంగల్-506 001
ఫోన్ : 0870-2570770, సెల్: 9391226869
ఇ-మెయిల్ :drvsreddy9999@gmail.com
drvsreddy9999@yahoo.co.in

Advt.

134

వీక్షణం
రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

సెప్టెంబర్ 2012
సంపుటి : 10
సంచిక : 9

వ్యవస్థాపక సంపాదకులు : **వి. హనుమంతరావు**
సంపాదకులు : **ఎన్. వేణుగోపాల్**
సహాయ సంపాదకులు : **డి.వి.రామకృష్ణారావు**
కరస్పాండెంట్ / సర్క్యులేషన్ మేనేజర్ : **వై. రామచంద్రం**
ఆఫీస్ అసిస్టెంట్ : **ఎస్. వెంకటేష్**

లోపలి పేజీల్లో...

'వీక్షణం'లో అచ్చువుతున్న రచనలలో వ్యక్తమైన అభిప్రాయాలన్నిటితో సంపాదకులకు ఏకీభావం ఉండనవసరం లేదు. 'వీక్షణం'ను నిజమైన ప్రజాపక్ష రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణా వేదికగా తీర్చిదిద్దడంలో అన్నిరకాల అభిప్రాయాలకు, భిన్నాభిప్రాయాల ఛాయలకు స్థానం కల్పించాలని సంపాదక వర్గం భావిస్తోంది.

ప్రింటర్స్
డక్కన్ ప్రెస్ /
చరితా ఇంప్రెషన్స్
ఆజామాబాద్, హైదరాబాద్
ఫోన్ : 040 - 27678411

డిస్ట్రిబ్యూటర్స్
ఆనంద్ ఏజన్సీస్
హైదరాబాద్
ఫోన్ : 98484 28516
92468 26191

'వీక్షణం' పేరిట ఎం.ఓ.లు, చెక్కులు, డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం
మైత్రీ రెసిడెన్సీ, 3-6-394,
స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029.
ఫాక్స్, ఫోన్ : 040-66843495
Email : veekshanam2003@gmail.com
www.veekshanam.wordpress.com

వీక్షణం చందా వివరాలు

	సంస్థలకు / లైబ్రరీలకు	వ్యక్తులకు	విద్యార్థులకు
విడి ప్రతి	రు. 15	రు. 15	రు. 15
సంవత్సరం	రు. 180	రు. 150	రు. 120
మూడు సంవత్సరాలు	రు. 500	రు. 400	రు. 350
ఐదు సంవత్సరాలు	రు. 800	రు. 650	–
పది సంవత్సరాలు	రు. 1500	రు. 1300	–

వీక్షణం అకౌంట్ నెంబర్ - **013911011002175**
ఆంధ్రాబ్యాంక్, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్
ఇతర బ్యాంకులలో వేసేవారు **ANDB 000/0139** నెంబర్ రాసి వేయవచ్చు.

ప్రొ. జయశంకర్ జయంతి సభను మిర్యాలగూడలోని విజేత డిగ్రీ & పి.జి. కళాశాల యాజమాన్యం ఆగస్ట్ 6న అదే కళాశాలలో నిర్వహించారు. ఈ సమావేశానికి వీక్షణం సంపాదకుడిని ఆహ్వానించారు. వీక్షణం చేస్తున్న కృషి, దాని ఆర్థిక ఇబ్బందులు చర్చించడానికి లెక్చరర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఆ ప్రత్యేక సమావేశానికి కె. శ్రీకాంత్ బాబు (ప్రిన్సిపల్), బి. విజయభాస్కర్, ఎ. నాగయ్య (లెక్చరర్, తెలంగాణ విద్యావంతుల వేదిక సభ్యులు), జె. రోశయ్య, శ్రీనివాస్ (ఆర్టిస్ట్), కె. ప్రభాకర్ (టీచర్, తెలంగాణ టీచర్స్ ఫోరం కన్వీనర్), వి. కోటేశ్వర రావు, కె.ఎల్.ఎన్. రావు, పి. కృష్ణలు హాజరయ్యారు. వీక్షణం నాలుగు కాలాలపాటు నడవడానికి రచనల పరంగా, ఆర్థికంగా తమ సహకారాన్ని, అందిస్తామని వారంతా హామీ ఇచ్చారు. ఈ సమావేశం ఏర్పాటుకు కృషి చేసిన ఎ. నాగయ్యకు కృతజ్ఞతలు.

– సం.

కృష్ణ ఆదిత్య (జూన్ 2012 సంచిక) మంచి వ్యాసం రాశారు. వెనుకబడిన సమాజంలో ఉండే గుడ్డి ఆరాధన, జడత్వం (డాగ్మాటిజం) అన్ని సామాజిక వర్గాలలోను ఏదో ఒక మేరకు ఉంటాయి. తమ నాయకుడు, సంస్థ, సిద్ధాంతం సర్వసమగ్రం, చేయవలసిందల్లా ఏదో ఒక దారిలో (అడ్డదారిలోనో) వాటి ప్రచారం, అనే భావన కాకుండా, తమతో విభేధించే వారితో భావ సంఘర్షణ జరిపి, తమ వాదన నెగ్గించుకునే పద్ధతి కోసం కృషి జరపాలి. పత్రికలో సమకాలీన విషయాల రిపోర్ట్స్ బాగా ఉన్నప్పటికీ విశ్లేషణ, విమర్శ తక్కువగా ఉంది. కేవలం సమాచారం కుప్పపోసే చొప్పదంటు రచనల విషయంలో కొంత క్వాలిటీ కంట్రోల్ అవసరం. పత్రిక ఏ ఒక్కరికీ, లేదా వాదానికి కొమ్ముకాస్తుందన్న భావన కలిగించకుంటే అన్ని రకాల అభ్యుదయవాదులకు వేదికగా ఉండగలదు.

***– నరేంద్రమోహన్,** ఆస్ట్రేలియా*

'మనుషులపై సామ్రాజ్యవాద మాయ' లోకసంచారి వ్యాసం కనువిప్పు కలిగించేదిగా ఉంది. రాజ్యం, ప్రభుత్వం ప్రజల కనీసావసరాలు తీర్చకుండా, పనికిమాలిన ఉత్పత్తులు మార్కెట్‌లోకి విడుదల చేసి ప్రజలను బలి పశువులుగా ఎలా వాడుకుంటున్నాయో వివరించారు. ప్రజల ఆలోచనా శక్తిని బలహీనం చేసేందుకు ప్రభుత్వాలు ఎన్ని విధాలుగా ప్రయత్నిస్తాయో విశ్లేషించారు. గ్రీన్‌హంట్ (ఆదివాసులను చంపడం), బ్రెయిన్ హంట్ (బతికున్న మెదడును పనిచేయకుండా చూడడం), హ్యూమన్ రైట్స్ హంట్ (ఆ కాస్త మానవ హక్కులకై పోరాడే వారి గొంతు నులమడం). అంటే 99.5 శాతం మంది ఈ రాజ్య వ్యవస్థ దుర్మార్గాలకు బలైపోతున్నారని రచయిత చక్కగా వివరించారు.

***– డి. నగేష్,** నవీపేట్, నిజామాబాద్*

వీక్షణం ఆగస్ట్ సంచికలోని ఎడిటోరియల్‌లో లక్ష్మింపేట, బాసగూడలలో జరిగిన దుర్మార్గాలకు ప్రభుత్వాలు ఎలా కారణమో చాలా వివరంగా చెప్పారు. ఈ రెండు విషయాలు వేరు వేరు కాబట్టి రెండింటిని రెండు పేరాలుగా విభజించి రాస్తే బాగుండేది. అట్లాగే డా. జి. రామదేవుడు రాసిన విశ్వ రహస్యం విప్పే హిగ్స్ బోసాన్ వ్యాసం ఇప్పుడు చదువుతున్న పాఠశాల విద్యార్థులకు, అశాస్త్రీయంగా ఆలోచించే ఉపాధ్యాయులకు వెలుగునిచ్చేదిగా ఉంది. సైన్స్‌పై వ్యాసాలు క్రమం తప్పకుండా వచ్చేలా చూడండి. మాకు తెలియని, మేము తెలుసుకోవాల్సిన విషయాలను మాకు అందిస్తున్న వీక్షణానికి కృతజ్ఞతలు.

***– కె. రాజన్న,** టీచర్, మంచిర్యాల్, ఆదిలాబాద్*

వీక్షణం వ్యవస్థాపక సంపాదకులు వి. హనుమంతరావు గారు తాను జీవితకాలం సేకరించి పెట్టుకున్న ఎన్నో అమూల్యమైన, అరుదైన పుస్తకాలను వీక్షణం గ్రంథాలయానికి ఇచ్చి సహకరించినందుకు కృతజ్ఞతలు. ఈనేల మీద జరిగిన పోరాటాలు, చరిత్ర, సాహిత్యాలకు సంబంధించి ఎన్నో విలువైన పుస్తకాలు ఇందులో ఉన్నాయి.

– సం.

వీక్షణం ఆగస్ట్ సంచికలో లక్ష్మింపేట ఘటనపై రాసిన వ్యాసం పరిశోధనా వ్యాసంగా ఉంది. ఈ వ్యాసంలో ఘటనకు సంబంధించిన కార్యకారణ సంబంధాలు పూర్తి వివరాలతో తెలిపారు. ఘటనకు కారకులైన బిసిలను కలిసి వారు ఏమనుకుంటున్నారో చెప్పడం వల్ల పూర్తి విషయాలు తెలుసుకోవడానికి దోహదపడింది. ఇలాంటి వ్యాసాలు వీక్షణంలో రెగ్యులర్‌గా వస్తే పాఠకులకు ఉపయోగకరంగా ఉంటుంది.

***– టి. రమేశ్,** మంథని, కరీంనగర్*

'లక్ష్మింపేట హత్యాకాండ – భూమి – కులం' వ్యాసం చాలా సమాచారాన్ని వివరించింది. సమగ్రంగా ఉంది. సంఘటనే కాకుండా భూమి పూర్వాపరాలు, కుల వివక్ష, అంటరానితనం లోతుగా పరిశీలనతో సమాచారం అందించారు. బాగుంది. లక్ష్మింపేట–బాసగూడ నరహంతక రాజ్యం ఇది. ఎడిటోరియల్‌లో చెప్పినట్లు ఒక చోట ఆదివాసులు – ఇంకొక చోట దళితులు. రాజకీయ ఖైదీలు అడుగుతున్నదేమిటి? ఎన్‌ఎచ్‌ఆర్‌సికి రాసిన పిటిషన్‌లో తెలియజేసినట్లు అన్ని జైళ్లలో అదే పరిస్థితి. విశాఖ సెంట్రల్ జైలులో మావోయిస్ట్ పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యులు అమిత్ బాగ్చి, ప్రసాద్ సింగ్‌లను మొదట 2008లో జరిగిన గునుకురాయి ఎన్‌కౌంటర్ కేసులో చూపించి, ఇంకొక నాలుగు కేసులు పెట్టారు. గునుకురాయి ఎన్‌కౌంటర్ కేసులో ఉన్న కోబడ్‌గాంధీని తీహార్ జైలు నుండి వాయిదాలకు తీసికొని రావడం లేదు. వాళ్ల జీవితాలను జైళ్లలోనే ముగింపు చేయాలని ప్రభుత్వం కుట్ర.

***– టి. శ్రీరామమూర్తి** గాజువాక, విశాఖపట్నం*

'లక్ష్మింపేట హత్యాకాండ – భూమి – కులం' ఆగస్ట్ 2012 సంచిక వ్యాసం లక్ష్మింపేటలో జరిగిన మారణకాండ గురించి చాలా సూక్ష్మ విషయాలను పరిశోధించి రాసిన వ్యాస రచయితలకు అభినందనలు. ఒక మాసపత్రిక స్వయంగా తన టీంను సంఘటన జరిగిన ప్రదేశానికి పంపి ఆ పరిశోధనా వ్యాసాన్ని పాఠకుల అవగాహన కోసం ప్రచురించడం మంచి విషయం. అందులోనూ పేదలు, దళితులు, అట్టడుగు వర్గాల గురించి రాయడం ఆరోగ్యకరమైన విషయం.

***– కిరణ్,** మెదక్*

వీక్షణం ఆగస్ట్ 2012 సంచికలో వచ్చిన 'లక్ష్మింపేట హత్యాకాండ–భూమి – కులం' లో రచయితలిద్దరూ కలిసి రాసిన వ్యాసం ఆ ఘటన మొత్తం క్రమాన్ని సవివరంగా తెలియజేశారు. సరిగ్గా తెలియని వారుంటే ఈ వ్యాసం వల్ల తెలుసుకోగలరు. ఈ ఘటనలో ప్రధానంగా భూమి సమస్యనే తీసుకొని రాశారు. కుల సమస్య కూడా ఉన్నప్పటికీ రెండవ అంశంగా భావించి రాశారు రచయితలు. భారతదేశంలో కుల సమస్య ప్రధానమైంది కాదనుకుంటే దేశ చిత్రపటాన్ని సరిగ్గా అర్థం చేసుకోలేం. ఈ దేశ సామాజిక స్వరూపం కులంతో ముడిపడి ఉంది.

(మిగతా 60వ పేజీలో…)

***సవరణ:** ఆగస్ట్ 2012 సంచికలో లోకసంచారి వ్యాసం 'మనుషులపై సామ్రాజ్యవాద మాయ'లో 38వ పేజీ ఎడమవైపు నాల్గవ పేరాలోని మూడవ లైన్‌లో 'హరిత' బదులు 'వారితో' అని చదువుకోగలరు.*

అసహజ మరణాల సూచి జిల్లాల కరస్పాండెంట్లు

ఆదిలాబాద్ – సి.ఎచ్. శ్రీమన్నారాయణ మూర్తి; హైదరాబాద్ – డి. విజయభాస్కర్; కరీంనగర్ – ద్యామర రేణుక; ఖమ్మం – సి.ఎచ్. గిరిజ; మెదక్ – ఎన్. భగవాన్‌రెడ్డి; మహబూబ్‌నగర్ – మహమ్మద్ ఎక్బాల్; నల్గొండ – గోడిశాల వెంకటేశ్వర్లు; నిజామాబాద్ – ఎం. నర్సయ్య; రంగారెడ్డి – వి. శంకరయ్య; వరంగల్ – ఎ.కుమార్; అనంతపూర్ – కె. నాగేశ్వరాచారి; చిత్తూరు – పలమనేరు బాలాజి; కర్నూలు – జి.వి. సుధాకర్ రెడ్డి; నెల్లూరు – బాలగురువయ్య; విజయనగరం – డి. సుధాకర్; విశాఖపట్నం – పి.వి. రమణ; కడప, క్రిష్ణా, తూర్పు గోదావరి, గుంటూరు – ఏకుల మల్లేష్ (ఇంటర్నెట్ ద్వారా)

వీక్షణం

మళ్లీ మళ్లీ రుజువవుతున్న పాలకుల సాధికారత లేమి


ఈ పాలకులు ప్రజలకు ప్రాతినిధ్యం వహించే పాలకులు కారని, వారు ప్రజల సమస్యల పరిష్కారానికి ఇసుమంత ప్రయత్నం కూడ చేయడం లేదని, వారికి ప్రజలను పాలించే సాధికారత లేదని, కనీస పాలనార్హత లేదని వర్తమాన ఆంధ్రప్రదేశ్ చరిత్ర ప్రతిక్షణం వేనోళ్ల ప్రకటిస్తున్నది. రాష్ట్ర రాజకీయ, పాలనా రంగాలలో జరుగుతున్న పరిణామాలను పైపైన గమనించినా ఈ పాలకుల మీద అసహ్యం కలగక మానదు. లోతుగా, సైద్ధాంతిక స్థాయిలో కూడ పరిశీలించనక్కరలేదు. రోజువారీ సాధారణ వ్యవహారశైలి, ప్రచార సాధనాలలో వెలువడుతున్న వార్తలు, ముఖ్యమంత్రి దగ్గరి నుంచి అధికారుల దాకా చేస్తున్న పనులు, అంటున్న మాటలు పైపైన చూసినా ఇది ప్రజాప్రతినిధులమని చెప్పుకుంటున్నవారి ప్రభుత్వమేనా, ఇది రాజ్యాంగం పేరుమీద నడుస్తున్న పాలనేనా అని అనుమానం బలపడుతుంది. తమ చట్టాల మీద తమకే గౌరవం లేని, కనీస సహజ న్యాయ సూత్రాలు కూడ అమలు కాని, మానవ సహజమైన సిగ్గు ఎగ్గులు లేని, ఏ ప్రజల వోట్లతో అధికారంలోకి వచ్చారో, ఏ ప్రజల పన్నులతో తమ విలాసాలు అనుభవిస్తున్నారో ఆ ప్రజల పట్ల బాధ్యత, జవాబుదారీతనం లేని పాలకుల పాలన ఇవాళ ఆంధ్రప్రదేశ్‌లో నిరాటంకంగా సాగిపోతున్నది. ఒక నెల ఆలస్యంగా, తీవ్రమైన కొరతతో మొదలైన వర్షాకాలం వల్ల రాష్ట్రంలోని అత్యధిక భాగం వ్యవసాయ పనులలో వెనుకబడిపోయి వర్తమానమూ భవిష్యత్తూ అగమ్యగోచరంగా ఉన్నాయి. కళ్లముందర కరవు విలయతాండవం చేస్తున్నది. దుర్భిక్ష నివారణ చర్యలు చేపట్టాలని, కరవు బారిన పడిన, పడుతున్న ప్రజలకు సహాయం అందించాలని పాలకులకు అనిపించడం లేదు. దూరదృష్టి లేమి, ప్రపంచబ్యాంకు నిర్దేశిత చర్యలు, ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్, ప్రైవేటు విద్యుత్ వ్యాపారుల అత్యాశ, అక్రమమైన విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు కలగలిసి విపరీతంగా పెరిగిపోతున్న విద్యుత్ ఛార్జీలు ఒకపక్క, విద్యుత్ కొరత మరొక పక్క రాష్ట్ర గృహ, వ్యవసాయ, పారిశ్రామిక విద్యుత్ వినియోగవర్గాలను తీవ్రమైన ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఈ సంక్షోభాన్ని అరికట్టే దీర్ఘకాలిక చర్యలు సరే, తక్షణ చర్యలు తీసుకోవడానికైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నించడం లేదు. రాష్ట్రంలోని ప్రధాన ఆస్పత్రులలో మౌలిక సౌకర్యాల కొరతతో చిన్నారి శిశువులు నిస్సహాయంగా మరణిస్తున్న వార్తలు రోజూ వస్తున్నాయి. ఆ మరణాలకు కారణాలేమిటో కనుక్కొని, పరిష్కరించి, ఆ ఆస్పత్రులకు మరిన్ని నిధులు కేటాయించి, సౌకర్యాలు పెంచాలనే ఆలోచనే పాలకులకు తట్టడం లేదు. ప్రజలందరికీ నాణ్యమైన విద్యా, వైద్య అవకాశాలు కల్పించవలసిన బాధ్యత ఉన్న పాలకులు ఆ బాధ్యతను ఎప్పుడో లాభార్జనాపరులైన వ్యాపారులకు అప్పగించారు. విద్యార్థులకు, రోగులకు మేలు చేస్తున్నామనే పేరుతో ఆ విద్యా వైద్య వ్యాపారులకు వేల కోట్ల రూపాయల ప్రజాధనం అప్పగించే ఫీ రియింబర్స్ మెంట్, ఆరోగ్యశ్రీ పథకాలు రచించారు. ఇప్పుడు పాలకులకు విద్యా వైద్య వ్యాపారులకు మధ్య ప్రణయకలహం ఏర్పడి ఆ రెండు పథకాల కేటాయింపులపై, చెల్లింపులపై ప్రభుత్వం కోత విధించింది. తమ విద్యా, వైద్య అవకాశాలు, కనీస ప్రయోజనాలు దెబ్బతిన్న నిరుపేద విద్యార్థులు, రోగులు తమ పేరు మీద కోట్లాది రూపాయల లాభాలు దండుకుంటున్న వారిని రక్షించడానికి ఉద్యమాలు చేయవలసిన దుస్థితికి నెట్టబడ్డారు. లక్షల ఎకరాల భూమిని, వనరులను వ్యాపార ప్రయోజనాలకోసం అప్పగించడంలో ముడుపులు చేతులు మారాయని, అప్పటి ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులతో సహా మంత్రివర్గ ప్రముఖులు, అధికారగణం ప్రతిఫలాలు పొందారని నేర పరిశోధన విభాగాలు చెపుతున్నాయి. దాదాపు ప్రతి ప్రభుత్వ ఉత్తర్వూ స్వార్థపర శక్తుల ప్రయోజనం కోసమే, అధికారంలో ఉన్న మంత్రుల, అధికారుల ముడుపుల కోసమే వెలువడుతుంది గాని, ఇప్పుడు కనీసం ఇరవై ఆరు జివోలు తప్పుడు ఉద్దేశాలతో వెలువడ్డాయని, వాటి మీద ఆరుగురు మంత్రులు సంతకాలు పెట్టారని సాక్ష్యాధారాలున్నాయి. తూతూ మంత్రంగా ఒకరిద్దరి అరెస్టులతో విచారణ తతంగం ముగిసిపోయింది. నేరంలో భాగస్తులైన మంత్రులను మంత్రివర్గం నుంచి తొలగించడం లేదు. అరెస్టు చేయడం లేదు. పైగా ప్రజాధనం కైంకర్యం చేశారన్న ఆరోపణను ఎదుర్కొనే వాదనలు చేయడానికి మళ్లీ ప్రజాధనం కేటాయింపులు జరుగుతున్నాయి. నిందితుడైన మంత్రి రాజీనామా సమర్పణ ప్రహసనంగా మారింది. ఆ రాజీనామా ఆమోదమూ జరగదు, తిరస్కరణా జరగదు. నేర విచారణ ప్రక్రియే ముందుకు కదలదు. మంత్రివర్గ నిర్ణయాలకు మంత్రివర్గమంతా బాధ్యత వహించవలసి ఉండగా ఆ నిర్ణయాలు జరిగిన తర్వాత నాలుగైదేళ్లకు తమకు ఆ నిర్ణయంలో భాగం లేదని బుడిబుడి రాగాలు తీస్తున్నారు. నేరంలో భాగస్తులయ్యారని సకల ఆధారాలూ ఘోషిస్తున్నప్పటికీ కొందరు అధికారుల మీద విచారణకు ఏళ్లూ పూళ్లూ గడిచినా ప్రభుత్వ అనుమతి లభించడం లేదు. రాష్ట్రంలో శాంతి భద్రతల, నేరవిచారణా విభాగాల అత్యున్నత అధికార పీఠం అశాంతి మయంగా, భద్రతా రాహిత్యంతో, నేరపూరితంగా నిర్ణయమవుతున్నది. ఈ నిర్ణయంలోని అన్యాయం గురించి, చట్టవ్యతిరేకత గురించి, తప్పుడు సంప్రదాయం గురించి కింది నుంచి పైదాకా ఎన్నో న్యాయస్థానాలు ప్రభుత్వానికి మొట్టికాయలు వేశాయి. ప్రభుత్వం మీద జరిమానా విధించాయి. అయినా ప్రభుత్వం ఆ అధికారిని యథాతథంగా కొనసాగించడం మాత్రమే కాదు, మరింతకాలం పదవిని కట్టబెట్టాలని చూస్తున్నది. రాచరిక ప్రభుత్వాలు కూడ ఇంత నిరంకుశంగా, అరాచకంగా, నియమరహితంగా పాలించలేదని చరిత్ర చెపుతుంది. రాచరికాలను రద్దుచేసి వచ్చిన ప్రజాస్వామిక ప్రభుత్వాన్నని తనకు తాను గప్పలు కొట్టుకునే ప్రభుత్వం ఇంత ఇష్టారాజ్యంగా, అక్రమంగా నడుస్తున్నది. ఒక రకంగా హాస్యాస్పదంగా, అవాస్తవికంగా, అధివాస్తవికంగా, జుగుప్సాకరంగా కనబడుతున్న ఈ పాలన నాటకం నిజానికి అత్యంత దుర్మార్గమైన, అప్రజాస్వామికమైన, ప్రజావ్యతిరేకమైన పాలన అని వెయ్యిన్నొకటోసారి రుజువవుతున్నది. యాభై సంవత్సరాల వెనుక ప్యాసా సినిమాలో పడుపువృత్తిలోని అమానుషత్వాన్ని చూపుతూ జిన్హె నాజ్ హై హింద్‌పర్ వో కహా హై (ఈ దేశాన్ని చూసి గర్వపడే వాళ్లారా, మీరెక్కడ?) అని సాహిర్ లూధియాన్వీ వేసిన ప్రశ్న మరింత ఎక్కువ వర్తించే స్థితికి చేరామంటే సమాజం ముందుకుపోయినట్టా, వెనకే ఆగిపోయినట్టా? ■


బొగ్గు బుక్కి, అబద్ధాలు కక్కి, నెత్తురుటేర్లు పారించి...


మన్మోహన్ సింగ్ నాయకత్వంలోని యుపిఎ ప్రభుత్వం పనితీరును విశ్లేషిస్తూ ఆయన పనిమంతుడు కాదని అమెరికాకు చెందిన టైమ్ పత్రిక అభివర్ణించిందని దేశంలోని మేధావులు కొందరు కోపం తెచ్చుకున్నారు. తమ బహుళ జాతి సంస్థలకు అవసరమైన పనులు చేయడంలో ఆయన చూపవలసినంత పనితనం చూపలేదని ఆ అమెరికన్ పత్రిక అభిప్రాయం. అంతేగాని ఆయన అసలే పనిమంతుడు కాదని కాదు. దేశాన్ని దేశదేశాల సంపన్నుల కుక్కలు చింపిన విస్తరిగా మార్చడంలో, అరకొరగానైనా, కాగితం మీదనైనా సాగుతున్న సంక్షేమరాజ్య భావనను, ప్రభుత్వరంగాన్ని తూట్లు పొడవడంలో, సామ్రాజ్యవాద శక్తుల ముందు జీ హుజూర్ జో హుకుం అని చేతులు కట్టుకుని బానిసత్వం ప్రకటించడంలో ఆయన అనితరసాధ్యమైన పనిమంతుడు. ఆయన ఎంత పనిమంతుడు కాకపోతే వాయుతరంగాల అమ్మకపు కుంభకోణంలో బాధ్యులకు కీలక మంత్రిత్వ శాఖలు అప్పగించగలడు? ఆయన ఎంత పనిమంతుడు కాకపోతే దేశదేశాల ఖనిజ బేహారులకు దేశాన్ని, ప్రత్యేకించి మధ్యభారత సంపన్న వనరులను అప్పగించగలడు? కేవలం అంతర్జాతీయ అణుశక్తి యంత్రసామగ్రి వ్యాపారవేత్తల కనుసన్నలతోనే, తరతరాలను అనారోగ్య పీడితులను చేసే అణుశక్తి కార్యక్రమాన్ని ప్రకటించగలడు? ఆయన ఎంతటి పనిమంతుడో ఇవాళ రెండు ప్రధాన ఉదంతాలు – ఒకవైపు బొగ్గు కుంభకోణం, మరోవైపు అస్సాం మారణకాండ – మళ్లీ ఒకసారి ప్రకటిస్తున్నాయి. ఆయన ప్రవేశపెట్టిన నూతన ఆర్థిక విధానాలలో భాగంగానే దేశపు బొగ్గు నిలువలను బడా ప్రైవేటు కంపెనీలకు అప్పగించవచ్చుననే సరళీకరణ జరిగింది. ఆ తర్వాత ఆయన ప్రధాన మంత్రిత్వంలో 2004–09 మధ్య కాలంలో జిందాల్, టాటా, బిర్లా, ఎస్సార్, ఆర్సెలార్ మిత్తల్, అదాని, హిండాల్కో, లాంకో వంటి దేశంలోని బడా ప్రైవేటు కంపెనీలకు, బహుళజాతి సంస్థలకు బొగ్గు గనులను అప్పగించారు. ఈ అప్పగింత వల్ల దేశ ఖజానా కనీసం ఒక లక్షా ఎనభై వేల కోట్ల రూపాయలు నష్టపోయిందని కాగ్ తేల్చింది. నిజానికి ఈ కాగ్ నివేదిక ముసాయిదా నాలుగు నెలల కింద బయట పడినప్పుడు నష్టం పదిలక్షల కోట్ల రూపాయల పైన ఉండవచ్చునని అంచనా వేశారు. ఇప్పుడు ఆ అంకె తగ్గించడంలో కూడ మన్మోహన మాయాజాలం ఉండవచ్చు. దేశ సంపదను మెక్కే, ఇతరులకు మెక్కబెట్టే వైభోగం ఇలా ఉండగా, మరొకపక్క అస్సాంలో దుర్భరమైన దారిద్ర్య పరిస్థితులలో జీవిస్తున్న రెండు వర్గాల మధ్య రగులుతున్న చిచ్చును సకాలంలో ఆపకపోవడం ద్వారా వందలాది మరణాలకు, మారణకాండలకు, జాతివిద్వేషాలకు ఆయన ప్రభుత్వమే ఆజ్యం పోస్తున్నది. ఉపాధి అవకాశాలు తగ్గిపోతున్న చోట ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొట్టి, అసలు సమస్యల నుంచి పక్కదారి పట్టించే దగుల్బాజీతనం ఇది. ఆ ఘర్షణను హిందూ ముస్లిం ఘర్షణగా వక్రీకరించడానికి సంఘ పరివారం ప్రయత్నిస్తుంటే, బంగ్లాదేశ్ నుంచి వలస వస్తున్న చొరబాటుదారుల వల్లనే సమస్య తలెత్తుతున్నదని స్వయంగా ప్రధానే పచ్చి అబద్ధాలు ప్రకటిస్తున్నాడు. ఇంత అబద్ధాల, అక్రమాల, దుర్మార్గాల పాలనను సహిస్తున్నదంటే భారత సమాజం ఎంత మొండిబారిపోయి ఉండాలి! వీ


అస్సాంజ్‌కు రక్షణలో ఈక్వడార్ సాహసం


వికీలీక్స్ స్థాపకుడు, సామ్రాజ్యవాద ప్రభుత్వాల, ఆధిపత్య శక్తుల రహస్యాలు బట్టబయలు చేసి ప్రపంచ ప్రఖ్యాతి పొందిన ఇంటర్నెట్ కార్యకర్త జూలియన్ అస్సాంజ్ ఉదంతం సామ్రాజ్యవాద కుట్రలకు మాత్రమే కాదు, ఆ కుట్రలను ఎదిరించే శక్తుల సాహసానికి కూడ ప్రతీకగా నిలుస్తున్నది. ‘తన పనిలో వికీలీక్స్ కొన్ని పొరపాట్లు చేసి ఉండవచ్చు, కొంత అతిని ప్రదర్శించి ఉండవచ్చు...అస్సాంజ్ వ్యక్తిగత ప్రవర్తనలో లోపాలు ఉండవచ్చు. కాని ప్రజల నుంచి సమాచారాన్ని దాచిపెట్టి, తమ పబ్బం గడుపుకుంటున్న ప్రభుత్వాలను బహిర్గతం చేయడం అనే పెద్దపనిలో ఈ నష్టాలు చిన్నవే’ అని జనవరి 2011 సంచికలో ఈ సంపాదకీయ వ్యాఖ్యలోనే అని ఉన్నాం. జూలియన్ అస్సాంజ్ అనే వ్యక్తి ఒక మహిళతో అనుచితంగా ప్రవర్తించినందుకు విచారణ జరిపి రుజువైతే శిక్ష విధించవలసిందే. కాని ఆ నేరారోపణ సాకుగా తీసుకుని, అస్సాంజ్‌ను బ్రిటన్ నుంచి బైటికి వెళ్లగొట్టించి, ఆ నేరం జరిగిందంటున్న స్వీడన్‌కు తరలించి, అంతిమంగా అమెరికాకు అప్పగించేలా చూడాలని, వికీలీక్స్ ద్వారా ఆయన సాగిస్తున్న పని జరగకుండా చేయాలని అమెరికన్ పాలకుల కుటిల ప్రయత్నం. ఇది అస్సాంజ్ వ్యక్తిగత ప్రవర్తన అనే నైతిక సమస్య మాత్రమే కాదు. సామ్రాజ్యవాద దేశాల, ప్రభుత్వాల రహస్యాలను బయటపెట్టినందుకు ఒక వ్యక్తిని వేధిస్తున్న, హత్య చేయబోతున్న రాజకీయార్థిక దురహంకార సమస్య. అందుకే ప్రపంచవ్యాప్తంగా అస్సాంజ్ వ్యక్తిగత నేరం చేసి ఉండవచ్చునని అంగీకరిస్తున్న వాళ్లు కూడ, ఆయనను ఆ పేరుతో బ్రిటన్ నుంచి బలవంతాన స్వీడన్‌కు పంపించగూడదని ఆందోళన చేస్తున్నారు. ప్రపంచ ప్రజాభిప్రాయాన్ని లెక్కచేసే అలవాటు ఎన్నడూ లేని అమెరికా పాలకులు తమ గుట్టు బయటపెట్టిన అస్సాంజ్ మీద కత్తి గట్టి అటు స్వీడన్ ప్రభుత్వం మీద, ఇటు బ్రిటన్ ప్రభుత్వం మీద ఒత్తిడి తెస్తూనే ఉన్నారు. ఏరోజు ఏం జరుగుతుందో, ఆయనను బ్రిటన్ నుంచి వెళ్లగొడతారో, ఎత్తుకుపోతారో, హత్య చేస్తారో అని ఆందోళన ఉండగా జూన్ 19న లండన్‌లోని ఈక్వడార్ రాయబార కార్యాలయంలోకి వెళ్లిన అస్సాంజ్ తనను రాజకీయ శరణార్థిగా గుర్తించమని ఆ దేశాన్ని అభ్యర్థించాడు. అప్పటినుంచి అక్కడే ఉన్నాడు. ఆయన బైటికి రాకపోతే రాయబార కార్యాలయం మీద దాడి చేసి అయినా ఆయనను అరెస్టు చేస్తామని బ్రిటన్ ప్రభుత్వం ఈక్వడార్ ను బెదిరించింది. అలా ఒక దేశ రాయబార కార్యాలయం మీద దాడి చేయడం అంతర్జాతీయ న్యాయసూత్రాలకు వ్యతిరేకమని ఈక్వడార్ వాదించింది. ఈ దౌత్య చర్చలు జరుగుతుండగానే ఆగస్ట్ 16న ఈక్వడార్ విదేశాంగ మంత్రి రికార్డో పాటిన్యో తమ దేశం అస్సాంజ్‌కు రాజకీయ ఆశ్రయం ఇవ్వడానికి నిర్ణయించిందని ప్రకటించాడు. కోటిన్నర జనాభా గల ఈ చిన్న దక్షిణ అమెరికా దేశ ప్రభుత్వం సామ్రాజ్యవాద దేశాలను ఎదిరించే ఈ సాహసోపేత నిర్ణయం తీసుకోవడానికి కారణమేదైనా కావచ్చుగాని, ఇవాళ్టి అమెరికా ధూర్త దురహంకార దాడికి ఎదురుచెప్పగల చేవ ఉన్న శక్తులలో తానూ ఒకటని రుజువు చేసుకుంది. ఆ తర్వాత మూడు రోజులకు ఆ రాయబార కార్యాలయ ఆవరణలో చేసిన ఉపన్యాసంలో ‘అధికార పీఠాలలో ఉన్నవారి రహస్య నేరాల మీద వెలుగు ప్రసరింపజేసినందుకు పాత్రికేయులను వెంటాడబోనని ప్రపంచం ముందర అమెరికా ప్రతిజ్ఞ చేయాలి’ అని అస్సాంజ్ అన్నాడు. అమెరికా పాలకులు ఏ మంచిమాట విన్నారు గనుక? వీ















- **సంప్రదాయ సాహిత్యంలో స్త్రీ మనోవిశ్లేషణ** – కాశీ సోమయాజుల సర్వమంగళ గౌరి – 100 పేజీలు, 1/8 డెమీ, రు: 50, ప్రతులకు: కాశీ సోమయాజుల సర్వమంగళ గౌరి, హైదరాబాద్, సెల్ : 9866222978
- **కొండేపూడి నిర్మల కవిత్వం (1978–2011)** – 276 పేజీలు, 1/8 డెమీ, రు: 150
- **నివురు** – కవిత్వం – కొండేపూడి నిర్మల 52 పేజీలు, 1/8 డెమీ, రు: 75


  పై రెండు ప్రతులకు: టి.వి.ఎస్. రామానుజ రావు, ఫ్లాట్ నెం. 205, కె.కె. హైట్స్, మాసబ్‌ట్యాంక్, హైదరాబాద్, సెల్: 9989233749
- **దేవుని రాజ్యం** – ఎలికట్టె శంకర్‌రావు – నోముల సాహిత్య సమితి – 112 పేజీలు, 1/8 డెమీ, రు: 70, ప్రతులకు: ఎన్.ఎస్. అరుణ, 206, సాయి టవర్స్, నాగార్జున కాలనీ, నల్లగొండ, సెల్: 9346359268, ప్రముఖ పుస్తక దుకాణాల్లో
- **భండారు అచ్చమాంబ – సచ్చరిత్ర** – కొండవీటి సత్యవతి – హైదరాబాద్ బుక్ ట్రస్ట్ – 92 పేజీలు, 1/8 డెమీ, రు: 50, ప్రతులకు : హైదరాబాద్ బుక్ ట్రస్ట్, ఫ్లాట్ నెం. 85, బాలాజీనగర్, గుడిమల్కాపూర్, హైదరాబాద్ – 500 006. ఫోన్ : 23521849, www.hyderabadbooktrust.blogspot.com
- **బౌద్ధ దర్శనం** – డా. కత్తి పద్మారావు – లోకాయత ప్రచురణలు – 176 పేజీలు, 1/8 డెమీ, రు: 100, ప్రతులకు: కత్తి స్వర్ణకుమారి, అంబేడ్కర్ రీసెర్చ్ సెంటర్, 6-3-600/ఎ/2/1, ఎఫ్ 5, తేజస్విని అపార్ట్‌మెంట్స్, హిల్‌టాప్ కాలనీ, ఎర్రమంజిల్, హైదరాబాద్-500082, సెల్: 9849741695; ఈమెయిల్ padmaraokathi.@yahoo.co.in; కత్తి స్వర్ణకుమారి, లోకాయత ప్రచురణలు, లుంబినీ వనం, అంబేడ్కర్ కాలనీ, పొన్నూరు-522124, ఫోన్: 08643-42840
- **కవిత 2011** – సంపాదకులు: డా. పాపినేని శివశంకర్, దర్భశయనం శ్రీనివాసాచార్య – సాహితీ మిత్రులు – 157 పేజీలు, 1/8 డెమీ, రు: 120, ప్రతులకు: సాహితీ మిత్రులు, 28-10-26/1, మస్జిద్ ఎదురుగా, అరండల్‌పేట, కార్ల్‌మార్క్స్ రోడ్, విజయవాడ-520002, ఫోన్: 0866-2433359; సెల్: 9490634849; నవోదయ పబ్లిషర్స్; నవోదయ బుక్‌హౌస్; ప్రజాశక్తి బుక్‌హౌస్
- **చిటుక్కు పటుక్కు చెనిక్కాయలు** – అమరనారా బసవరాజు హోసూరు కతలు – కృష్ణగిరి జిల్లా తెలుగు రచయితల సంఘం – 127 పేజీలు, 1/8 డెమీ, రు: 70, ప్రతులకు: కృష్ణగిరి జిల్లా తెలుగు రచయితల సంఘం, 2-1095, ఆవులపల్లి రోడ్డు, బస్తి, హోసూరు – 635109, కృష్ణగిరి జిల్లా, తమిళనాడు; అన్ని ముఖ్యమైన పుస్తక కేంద్రాలలో
- **ఓడిపోతానని తెలిసికూడా** – మానేపల్లి – బుక్స్ అండ్ బుక్స్ – 148 పేజీలు, 1/8 డెమీ, రు: 65, ప్రతులకు: బుక్స్ అండ్ బుక్స్, రైటర్స్ వర్క్‌షాప్, విద్యానగర్ (యానాద్రి కాలనీ), ఎలమంచిలి, విశాఖపట్నం – 531055, ఫోన్: 08931-231834; అన్ని ప్రముఖ పుస్తక దుకాణాల్లో
- **తెలుగు దేవభాషే** – నూర్‌బాషా రహంతుల్లా – తెలుగు మిత్ర ప్రచురణలు – 144 పేజీలు, 1/8 డెమీ, రు: 60, ప్రతులకు: తెలుగు బుక్‌హౌస్, 3-3-862, కాచిగూడ క్రాస్ రోడ్స్, హైదరాబాద్-500027, ఫోన్: 040-65347374, 9247446497; అన్ని ప్రముఖ పుస్తక దుకాణాల్లో; e.book:www.kinige.com











వీరులపాడులో సంపూర్ణ మద్య నిషేధం

కృష్ణా జిల్లాలోని వీరులపాడు గ్రామస్తులు తమ గ్రామంలో మద్యానికి చోటు లేదని విప్లవాత్మక నిర్ణయం తీసుకున్నారు. బెల్టు షాపును ఎత్తివేయించి గ్రామంలో మద్యపానాన్ని నిషేధించారు. గ్రామంలో మద్యాన్ని నిషేధిస్తూ తీర్మానం చేశారు. అన్ని రాజకీయ పార్టీలు దానికి మద్దతు ప్రకటించాయి. జూలై 1 నుంచి మద్యం అమ్మకాలు బంద్ అయ్యాయి. నిషేధం పకడ్బందీగా అమలయ్యేందుకు పదిహేను మంది సభ్యులతో ఒక కమిటీని ఎన్నుకొన్నారు. కల్లుపైనా నిషేధం విధించారు. వీరులపాడు స్ఫూర్తితో పక్కనే గల పల్లెంపల్లి, కొణతమాత్మకూరు గ్రామాలు కూడా మద్య నిషేధం వైపు అడుగులు వేస్తున్నాయి.

శిక్ష పూర్తయిన ఖైదీల విడుదల కోరుతూ...

ఏడేళ్ల శిక్షా కాలం పూర్తయిన వారిని, సత్ప్రవర్తన కలిగిన జీవిత ఖైదీలను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ రాష్ట్రంలోని పలు సెంట్రల్ జైళ్లలో మావోయిస్టు ఖైదీలు జూలై 23న నిరాహార దీక్షలు చేపట్టారు. వీరికి మద్దతుగా ఇతర ఖైదీలూ దీక్షల్లో పాల్గొన్నారు.

కొండపల్లి శేషగిరి రావు ఇకలేరు

తొలితరం మేటి చిత్రకారుడు, ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు డా. కొండపల్లి శేషగిరిరావు (89) జూలై 26న హైదరాబాద్‌లోని దోమలగూడ లోని స్వగృహంలో కన్నుమూశారు. రామచూడమ్మ, గోపాలరావు దంపతులకు 1924 జనవరి 27న వరంగల్ జిల్లా మహబూబాబాద్ మండలం పెనుకొండలో శేషగిరి రావు పుట్టారు. వాటర్ కలర్, ఆయిల్ పెయింటింగ్‌లలో ఆయన సిద్ధహస్తుడు. జెఎన్‌టియు కాలేజ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్, ఆర్కిటెక్చర్‌లో ప్రొఫెసర్‌గా పనిచేశారు. ఎమిరిటస్ ప్రొఫెసర్‌గా, ఉస్మానియా యూనివర్సిటీ అకడమిక్ కౌన్సిల్ సభ్యుడిగా, ఎ.పి. లలిత కళా అకాడమి కోశాధికారిగా పనిచేశారు. కళలపై 'సురేఖ' అనే పుస్తకాన్ని రాశారు.

వెంపటి చినసత్యం మృతి

విశ్వవిఖ్యాత కూచిపూడి నాట్యాచార్యుడు, పద్మభూషణ్ వెంపటి చినసత్యం (82) జూలై 29 తెల్లవారు జామున చెన్నైలోని తన స్వగృహంలో తుది శ్వాస విడిచారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. కృష్ణా జిల్లా మొవ్వ మండలం కూచిపూడిలో వరలక్ష్మమ్మ, చెలమయ్య దంపతులకు 1929 అక్టోబర్ 25న సత్యం పుట్టారు. వేదాంతం లక్ష్మీనారాయణ శాస్త్రి, తాడేపల్లి పేరయ్యల వద్ద నాట్యంలో శిక్షణ పొందారు. చిన్నతనంలో అక్కినేని నాగేశ్వరరావు, ఎన్.టి. రామారావులతో కలిసి నాటకాలు వేశారు. కూచిపూడి నాట్యాన్ని దేశ విదేశాల్లో విస్తరింపచేసి ఆ నృత్యరీతికి గిన్నిస్‌బుక్‌లో చోటు సాధించారు. 1978లో టిటిడి ఆస్థాన నాట్యాచార్యుడుగా పనిచేశారు. పద్మ భూషణ్‌తో సహా ఆయన పలు పురస్కారాలు అందుకున్నారు.

తమిళనాడు ఎక్స్‌ప్రెస్ ప్రమాదం

జూలై 30 తెల్లవారుజామున న్యూఢిల్లీ నుంచి చెన్నై వెళ్తున్న తమిళనాడు ఎక్స్‌ప్రెస్ నెల్లూరు స్టేషన్ దాటి రెండు కిలోమీటర్ల దూరం వెళ్లాక ఘోర అగ్ని ప్రమాదానికి గురయింది. ఈ దుర్ఘటనలో ముప్పై మంది చనిపోయారు. 25 మందికి పైగా గాయపడ్డారు.

టిఎన్‌జిఒ కు కొత్త నాయకత్వం

తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (టిఎన్‌జిఒ) కు కొత్త అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా జి. దేవీప్రసాద్‌రావు, కె రవీందర్ రెడ్డిలు జూలై 31న బాధ్యతలు స్వీకరించారు. అదే రోజు వీడ్కోలు సభలో టిఎన్‌జిఒ పూర్వ అధ్యక్షులు కె.స్వామిగౌడ్‌ను సన్మానించారు.

సామల సదాశివ ఇకలేరు

సంగీత సాహిత్యాలే శ్వాసగా జీవించిన ప్రముఖ కవి, రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ గ్రహీత సామల సదాశివ (85) ఆగస్ట్ 7 ఉదయం ఆదిలాబాద్ పట్టణంలోని స్వగృహంలో గుండెపోటుతో మరణించారు. 1928 మే 11న ఆదిలాబాద్ జిల్లా దెహగాం మండలం తెనుగుపల్లెలో ఆయన పుట్టారు. అనేక పద్య రచనలు, నవలలు, అనువాద రచనలు చేశారు. ఆయన ఉర్దూలో రాసిన మూడు వందల వ్యాసాలు, తెలుగులో రాసిన నాలుగు వందల యాభై వ్యాసాలు పలు ప్రముఖ దిన, వార పత్రికలలో అచ్చయ్యాయి. రాష్ట్ర సాహిత్య అకాడమీ ఉర్దూ అడ్వైజరీ కమిటీ సభ్యునిగా, కాకతీయ యూనివర్సిటీ సెనేట్ మెంబర్‌గా పనిచేశారు. హిందూస్తానీ సంగీతం మీద ఆయన రచన 'స్వరలయలు' పుస్తకానికి 2010లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చింది.

ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి మృతి

ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి (85) ఆగస్ట్ 11న హైదరాబాద్‌లో ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నారు. ఆయన 1928 జూన్ 19న ఒంగోలులో పుట్టారు. భారతమ్మ, సుబ్రమణ్యం దంపతులు ఆయన తల్లిదండ్రులు. 1948లో ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి బిఎ (ఆనర్స్) పట్టా పొందారు. అక్కడే అధ్యాపకుడిగా వృత్తి జీవితం ప్రారంభించారు. ఆ తరువాత 1955లో అమెరికా వెళ్లి పెన్‌సిల్‌వేనియా యూనివర్సిటీ నుంచి మాస్టర్స్ డిగ్రీ, పిఎచ్.డి.లు పూర్తి చేశారు. తెలుగు భాషపై లోతైన, విస్తృతమైన అధ్యయనం చేశారు. తెలుగు భాషపై 27 పుస్తకాలు, 80కి పైగా పరిశోధనా పత్రాలు రాశారు.

డా. కాపు రాజయ్య ఇక లేరు

ప్రముఖ చిత్రకారుడు డా. కాపు రాజయ్య (87) మెదక్ జిల్లా సిద్ధిపేటలోని తన స్వగృహంలో ఆగస్ట్ 20 సాయంత్రం తుదిశ్వాస విడిచారు. ఆయన 1925 ఏప్రిల్ 27న పుట్టారు. భూలక్ష్మమ్మ, రాఘవులు ఆయన తల్లిదండ్రులు. ఆయన చిత్రించిన ఇతివృత్తాలన్నీ సమాజంలోని అట్టడుగు వర్గాల సాంస్కృతిక వైభవానికి చిహ్నాలే. బతుకమ్మ, ఎల్లమ్మ, జోగి, శారదకాండ్రు, గొర్రెల కాపర్లు, కోయ దంపతులు, బోనాలు, పంట కోసే మహిళలు, కనుమరుగవుతున్న గ్రామీణ వృత్తి కళాకారులు, సంచార భిక్షుక తెగల వారి కళారూపాలు ఆయన కుంచెకు ముడిసరుకులు. తెలంగాణ పల్లెపట్టులో ప్రదర్శించే అన్ని కళారూపాలను రాజయ్య ఆవిష్కరించారు.

ఎరువులూ లేవు.. కరెంటూ లేదు...

రాష్ట్రంలో రైతులకు నిన్నటి వరకు వర్షాలు రాక సమస్య. అరకొరగా వేసిన పంటలకు ఇప్పుడు ఎరువులూ, పురుగు మందుల సమస్య మొదలయ్యింది. యూరియాతో సహా వివిధ ఎరువులను వ్యాపారులు నల్లబజారులో అమ్ముకుంటున్నారు. అర్ధరాత్రి నుంచే నిద్రలు కాసి ఎరువుల కోసం రైతులు క్యూలు కడితే, ఏ మధ్యాహ్నానికో ఎరువు సంచి దొరికితే దొరకవచ్చు. వచ్చిన కొద్దిపాటి ఎరువులూ అయిపోతే మళ్లీ ఎప్పుడు వచ్చేది తెలియని పరిస్థితి. మరోపక్క విద్యుత్ డిమాండ్ రోజుకు 270 మిలియన్ యూనిట్లు అయితే, విద్యుత్ లోటు 67.51 మిలియన్ యూనిట్లుగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో పద్నాలుగు గంటల పాటు, నగరాల్లో ఐదు గంటల పాటు విద్యుత్ కోత అమలవుతోంది. వ్యవసాయానికి ఇస్తామన్న ఏడు గంటల విద్యుత్ పక్కకుపోయి, రెండు, మూడు గంటల విద్యుత్ కూడా అందని స్థితి ఉంది. ఈ సమస్యలతో రైతులు ఆందోళన బాట పడుతున్నారు.

వేలూరి వెంకటకృష్ణ శాస్త్రి మృతి

చరిత్ర పరిశోధనలో విశేష కృషి చేసిన సుప్రసిద్ధ పరిశోధకులు వేలూరి వెంకటకృష్ణ శాస్త్రి (78) ఆగస్ట్ 22 ఉదయం హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో మరణించారు. రాష్ట్ర పురావస్తు శాఖలో మూడు దశాబ్దాలకు పైగా వివిధ హోదాలలో ఆయన పనిచేశారు. కృష్ణా జిల్లా చిరివాడలో 1934, అక్టోబర్ 23న ఆయన పుట్టారు. అనసూయ, పార్థసారథి ఆయన తల్లిదండ్రులు. ఆయన తన పరిశోధనలలో తెలుగువారి చారిత్రక జీవనశైలిని వెలుగులోకి తెచ్చారు.

జువ్వాడి గౌతంరావు మృతి

ప్రముఖ సాహితీవేత్త జువ్వాడి గౌతంరావు (83) ఆగస్ట్ 24న కరీంనగర్‌లో తన స్వగృహంలో మృతి చెందారు. 1929 ఫిబ్రవరి 1న కరీంనగర్ జిల్లాలోని ఇరుకుల్ల గ్రామంలో జన్మించారు. సోషలిస్టు నాయకుడిగా, తెలుగు సాహిత్యంలో విశేష కృషి చేసినవారిగా గుర్తింపు పొందారు. కరీంనగర్‌లో సాహిత్య చైతన్యాన్ని పెంపొందించి, ఎంతోమంది సాహితీకారులకు ఆశ్రయమిచ్చారు. కొంతకాలం పాటు 'జయంతి' పత్రికకు సంపాదకుడిగా ఉన్నారు. వివిధ పత్రికల్లో రాసిన వ్యాసాలను 'సాహితీధార' పేరుతో ముద్రించారు. వీ

రైతే లేకపోతే.. బతికే అవకాశం ఎవరికైనా ఉంటుందా?

ఆగస్ట్ 24న రాజ్యసభలో ఉత్తరప్రదేశ్ ఎంపి కుసుంరాయ్ రైతుల ఆత్మహత్యలపై అడిగిన ప్రశ్నకు వ్యవసాయ శాఖ మంత్రి శరద్‌పవార్ లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు. 1995-2011 మధ్య పదిహేడేళ్లలో 2,70,946 మంది రైతులు దేశవ్యాప్తంగా ఆత్మహత్యలు చేసుకున్నారని చెప్పారు. అదే కాలంలో మన రాష్ట్రంలో 33,326 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకొన్నారు. మన రాష్ట్రంలో సగటున ఏటా 1960 మంది రైతులు, దేశవ్యాప్తంగా సగటున ఏటా 15,938 మంది రైతులు ఆత్మహత్యల పాలవుతున్నారు. వాస్తవ సంఖ్యలు వీటికన్నా ఎక్కువ ఉంటాయనేది మనకు తెలిసిన విషయమే. ఈ నేలపై రైతు చనిపోయాక బతికే అర్హతా, అవకాశం ఎవరికైనా మిగుల్తాయా? 'అగ్రికల్చర్ ఈజ్ ది బేసిస్ ఆఫ్ ఆల్ కల్చర్స్' అని అంటారు. వ్యవసాయాధారంగా స్థిర నివాసాలు ఏర్పర్చుకున్నాకే, అన్ని నాగరికతలు, సంస్కృతులు వికసించాయి. రైతాంగ సంక్షోభం ఆయా వ్యవస్థల సంక్షోభం. మన దేశంలో, రాష్ట్రంలో ప్రజలు ప్రధానంగా వ్యవసాయాధారంగానే బతుకుతున్నారు. ఇప్పటికీ 65 శాతానికి పైగా జనాభా వ్యవసాయంపైననే ఆధారపడి ఉంది. రైతులకు వ్యవసాయం తెలీక తనువు చాలించడం లేదు. పాలకుల విధానాల ఫలితంగా వ్యవసాయం కష్టాల సాగుగా మారిపోయింది. మనలాంటి వ్యవసాయక దేశంలో మొదటి అడుగు వ్యవసాయానిదైతే, దాన్ని అనుసరిస్తూ పరిశ్రమలు వికసించాలి. అయితే, పాలకుల దళారీ స్వభావం వల్ల విత్తనం, ఎరువులు, పురుగు మందులు, సాంకేతికత అన్నింట్లోకి బహుళజాతి కంపెనీలు ప్రవేశించి అనవసరంగా, అశాస్త్రీయంగా సాగు ఖర్చును పెంచేస్తున్నాయి. వ్యవసాయాన్ని నష్టదాయకంగా మార్చేస్తున్నాయి. పరిశ్రమలకు 'సహకారం' పేరిట వేల కోట్ల రూపాయల రాయితీలు ఇస్తూ, వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేసిన క్రమమే మన వ్యవసాయ విధానంలో ఉంది. (ఆ పరిశ్రమలు కూడా విదేశీ కంపెనీల పొత్తుతోనే). వ్యవసాయానికి సాగు నీళ్లూ లేవు, సహకార బ్యాంకులూ లేవు. పాలకులు అంతా చక్కెర, గడ్డి, బొగ్గు, ఫోన్‌లు, విమానాలు, రోడ్లు, ఫ్లై ఓవర్లు పేరిట నానా గడ్డి తినేవాళ్లే. కాదేదీ అవినీతికి అనర్హం. పాలకులు రకరకాలుగా వ్యవసాయాన్ని నష్టదాయకంగా మార్చి వేసి, వరుణ దేవుడి కరుణకు జనాన్ని వదిలి, అతిరాత్ర యాగాలకు, చండీ యాగాలకు కోట్లు ఖర్చు పెట్టేవారే. పాలకులు ఎవరైనా విధానాలు ఒక్కటే అనే విషయం ఈ పదిహేడేళ్ల కాలంగా కొనసాగుతున్న రైతాంగ ఆత్మహత్యలు తెలియజేస్తునే ఉన్నాయి. ఈ మరణాలు వారి వ్యక్తిగత వైఫల్యం ఎంత మాత్రం కాదు. దీనికి పాలకులు, మొత్తంగా సమాజం జవాబు చెప్పాలి.

దొరికితేనే దొంగలు

దొంగలు దొంగలు కలిసి ఊళ్లు పంచుకున్నట్లు పాలకులు ఎవరికి అందింది వారు దోచుకుంటున్నారు. జగన్ అక్రమాస్తుల కేసులో నాల్గవ అభియోగపత్రం దాఖలు చేసిన సిబిఐ, నాటి రెవెన్యూ మంత్రి, నేటి రోడ్లు, భవనాల మంత్రి ధర్మాన ప్రసాదరావును ఐదవ నిందితునిగా చేర్చింది. (మొత్తం పద్నాలుగు మంది నిందితులు- ఎ-1. వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి, ఎ-2. వి. విజయసాయిరెడ్డి, ఎ-3. నిమ్మగడ్డ ప్రసాద్, ఎ-4. మోపిదేవి వెంకటరమణ, ఎ-5. ధర్మాన ప్రసాదరావు, ఎ-6. కె.వి. బ్రహ్మానందరెడ్డి, ఎ-7. మన్మోహన్‌సింగ్, ఎ-8. సామ్యూల్, ఎ-9. నిమ్మగడ్డ ప్రకాశ్, ఎ-10. వాన్‌పిక్ ప్రాజెక్ట్స్, ఎ-11. జగతి పబ్లికేషన్స్, ఎ-12. రఘురాం / భారతి సిమెంట్స్, ఎ-13. కార్మెల్ ఏషియా హోల్డింగ్స్, ఎ-14. సిలికాన్ బిల్డర్స్). వాన్‌పిక్ (వాడరేవు, నిజాంపట్నం నౌకాశ్రయ, పారిశ్రామిక కారిడార్) ప్రాజెక్ట్ వెనుక జరిగిన 'మేల్ల కుట్ర'ను ఈ అభియోగ పత్రంలో సిబిఐ బట్టబయలు చేసింది. నిమ్మగడ్డ ప్రసాద్ ప్రధాన ప్రమోటర్‌గా ఉన్న వాన్‌పిక్‌కు అనుకూలంగా జారీ అయిన జిఒలు, ఇచ్చిన రాయితీలు, 24 వేల ఎకరాల భూముల కేటాయింపుల్లో లోటుపాట్లను గుదిగుచ్చుతూ ఆగస్ట్ 13న నాంపల్లి సిబిఐ కోర్టుకు అభియోగపత్రాన్ని సమర్పించింది. నమ్మకద్రోహం, అధికార దుర్వినియోగం, నేరపూరిత కుట్ర, మోసం తదితర అభియోగాలతో, అవినీతి నిరోధక చట్టం సెక్షన్ 9, 11, 12, 13 (2), రెడ్‌విత్ 13 (1) సి, డి, ఐపిసి సెక్షన్ 409, 419, 420, 120బి, 468, 471, 477ఎ ల కింద సిబిఐ కేసులు నమోదు చేసింది. ఈ నేపథ్యంలో ఆగస్ట్ 14న ధర్మాన ప్రసాదరావు తన రాజీనామా లేఖను ముఖ్యమంత్రికి ఇచ్చారు. ఈ మొత్తం క్రమంలో కోట్ల రూపాయలు చేతులు మారాయి. రైతులు బాధితులు అయ్యారు. మొత్తంగా ప్రజలు మోసపోయారు. రాజ్యాంగబద్ధంగా ప్రజలకు పరిపాలన అందిస్తామని వాగ్దానం చేసిన పాలకులు ప్రజావ్యతిరేకమైన పనుల్లో మునిగిపోయారు. తమ ఆస్తులను, తమ ప్రయోజనాలను కాపాడుకోవడానికి, తమను కాదన్నవారిని, తమ 'అభివృద్ధి' నమూనాను ప్రశ్నిస్తున్న వారిని పోలీసులను, సైన్యాన్ని, ప్రైవేట్ సైన్యాన్ని ప్రయోగించి హత్యలు గావిస్తున్నారు. ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో విఫలమైన పాలకులు, వారి ప్రశ్నలకు జవాబు చెప్పలేక అణచివేతను సాధనంగా ఎంచుకుంటున్నారు. 'స్టిక్ అండ్ క్యారట్' (అణచివేత - తాయిలాలు) విధానంతో పాలన కొనసాగిస్తున్నారు. జాతినుద్దేశించి 66వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశ రాష్ట్రపతే స్వయంగా 'భారతీయులంతా రెండో స్వాతంత్ర్య సంగ్రామం చేయాల్సిన సమయమిది. అది కూడా ఆకలి, వ్యాధులు, పేదరికం నుంచి విముక్తి కోసం' అని పిలుపునిచ్చారు. ఆయన ఏ అర్థంలో అన్నా ఈ అవినీతిమయ, ప్రజావ్యతిరేక పాలకులతో సంగ్రామం తప్ప ప్రజలకు దారేముంది?

బూటకపు ఎన్‌కౌంటర్లు-అక్రమకేసులు-నిషేధాలు

గుంటూరు, కర్నూలు జిల్లాల్లో ఎస్.పి.గా పనిచేసిన సీతారామాంజనేయులు ఆధ్వర్యంలో జరిగిన వివిధ ఎన్‌కౌంటర్లలో పంతొమ్మిది మంది చనిపోయారు. వారిలో పదమూడు మంది బూటకపు ఎన్‌కౌంటర్ హతులేనని జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌ఎచ్‌ఆర్‌సి) తేల్చి చెప్పింది. పోలీసుల కట్టుకథలను తిరస్కరించింది. ఇవే కాదు, పోలీసుల చొరవతో, రాజ్యం కనుసన్నల్లో జరిగిన, జరుగుతున్న ఎన్‌కౌంటర్‌ల నిజా నిజాలు నిగ్గుతేల్చాల్సే ఉంది. ఈ అరాచకాన్ని ప్రశ్నిస్తే పోలీసుల 'ఆత్మస్థైర్యం' దెబ్బతింటుందనే పేరుతో ఈ హంతక సంస్కృతిని పాలకులు ప్రోత్సహిస్తున్నారు. ప్రత్యర్థులను, రాజకీయ ప్రత్యర్థులను, సమాజంలో న్యాయమైన ప్రశ్నలను ముందుకు తీసుకువచ్చేవారిని హతమార్చడం చరిత్ర పొడవునా జరుగుతున్నదే. ఈ పరిస్థితి ఇలా ఉంటే, సకల జనుల సమ్మె నాటి కేసులు ఎత్తివేయాలని తెలంగాణలోని ఉద్యోగ, ఉద్యమ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. తెలంగాణ ఉద్యమంలో భాగంగా విద్యార్థులపై పెట్టిన కేసులను ఇప్పటికీ ఎత్తివేయలేదు. ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థులకయితే ఇవ్వాల్టికీ కనీసం బస్సు సౌకర్యం కూడా పునరుద్ధరించలేదు. తెలంగాణ కావాలనీ, గ్రీన్‌హంట్ ఆపాలనీ అడుగుతున్న సంస్థలపై, నాయకులపై, కార్యకర్తలపై ఉపా (యుఎపిఎ) వంటి చట్టాలను ప్రయోగిస్తున్నారు పాలకులు. ఈ పరిణామాల కొనసాగింపుగా ఆగస్ట్ 9న రెవల్యూషనరీ డెమొక్రటిక్ ఫ్రంట్ (ఆర్‌డిఎఫ్) అనే జాతీయ స్థాయి ప్రజా సంఘాన్ని నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఒక జిఒ జారీ చేసింది. ఆ సంఘం రాష్ట్రంలో ఇంకా తన నిర్మాణాన్ని కూడా ఏర్పరచుకోనేలేదు. ప్రజల పరిస్థితి ఇలా ఉంటే, స్వయంగా పోలీసు శాఖలో అమలవుతున్న అణచివేతను నిరసిస్తూ తమ హక్కుల కోసం పోలీసు కానిస్టేబుళ్ల కుటుంబాలు పోరుబాట పట్టాయి. సెలవులు ఇవ్వకుండా, కనీస హక్కులు అమలు చెయ్యకుండా, సాగుతున్న అణచివేతను వివరిస్తూ వారి స్త్రీలు, పిల్లలు ఆందోళనకు దిగారు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం నాగరిక సమాజానికి చిహ్నాలు. అయితే, అవి పాలకులు ఇచ్చేవి కావు. ప్రజలు కొట్లాడి సాధించుకున్నవి, సాధించుకునేవే!

వార్త - వ్యాఖ్య : డి.వి. రామకృష్ణారావు

అమెరికాలో రెడ్ ఇండియన్స్‌ను ఎలా తరిమివేశారో, ఇంగ్లండ్‌లో ఎన్‌క్లోజర్స్ చట్టం పేరుతో రైతుల జీవితాలను ఎలా విధ్వంసం చేశారో, అదే విధంగా ప్రస్తుతం మన దేశంలో అభివృద్ధి పేరుతో విధ్వంసం, విస్థాపన కొనసాగుతూ ఉంది. దేశంలో నెలకొన్న పేదరికానికి, అసమానతలకు భారతీయులే కారణం అని ఆనాడు బ్రిటిష్ పాలకులు ఆపాదించారు. ఈ ఆరోపణలను జాతీయ నాయకులు తీవ్రంగా ఖండించారు. దేశంలో పేదరికానికి, అసమానతలకు బ్రిటిష్ విధానాలతో పాటు దేశ వనరులను బ్రిటిష్‌వారు యథేచ్ఛగా దోచుకోవడమే ప్రధాన కారణం అని ఆనాడు నెహ్రూ సమాధానం ఇచ్చారు. నేడు పాలకవర్గాలు, విధానకర్తలు, అధికార యంత్రాంగం సామ్రాజ్యవాదుల, దళారీ బూర్జువాల ప్రయోజనాలకు అనుకూలంగా వ్యవహరిస్తూ, సహజ వనరుల దోపిడీకి సహకరిస్తున్నారు.

– ప్రొ. ఎస్. శేషయ్య, 'అభివృద్ధి' మాయలో సహజ వనరుల దోపిడీ,
ప్రజాస్వేచ్ఛ మాసపత్రిక, జూలై 2012

నేడు సామాజిక అభ్యుదయం ఒక అడుగు ముందుకు వేస్తే, సమాజాన్ని పట్టి పీడిస్తున్న మతజాడ్యం ఆమడ దూరం వెనకకు నెట్టివేస్తున్నది. శాస్త్ర సాంకేతిక రంగాలలో పెరుగుదలతో మారుతున్న లోకం అయిదువేల ఏళ్లనాటి అనాగరిక సంస్కృతి ఇక్కడి మానవ ప్రవృత్తిని తొక్కిపెడుతున్నది. శాస్త్రీయ దృష్టిని, సంఘ సంస్కరణని అభిలషించే మానవతావాదాన్ని, పరిశీలనా తత్వాన్ని రాజ్యాంగం ప్రబోధిస్తుంటే, మరోవైపు చీకటి యాగాలను, యజ్ఞాలను, కర్మకాండలను కొనసాగిస్తూ స్త్రీ జాతిని కించపరుస్తూ ఈ విధంగా మత కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు. దీనికి ఉదాహరణ ఈనాడు భద్రాచలంలో జరిగిన అతిరాతిరి సోమయాగం అని చెప్పవచ్చును. ఆర్య విష సంస్కృతిని నిర్మూలించవలసిన అవసరం ఈనాడెంతైనా ఉంది. నేడు ఈ నేలపై నివసిస్తున్న ప్రజానీకం అంతా బ్రాహ్మణీయ విష సంస్కృతిలో కూరుకొనిపోయి ఉన్నారు. ఈ సంస్కృతి ద్వారానే విషం మానవుని నరనరాల ఎక్కించబడింది. కాబట్టి జనం అజ్ఞానంలో కూరుకొనిపోవడం వలన వారి నిజమైన చరిత్రను తెలుసుకోలేకపోతున్నారు. పరాయీకరణ పొందుతున్నారు. భక్తిపేర, భజనల పేర, ప్రార్థనల పేర భావదాస్యంలో మునిగి వంచించ బడుతున్నారు.

– సంపాదకీయం, *చార్వాక* మాసపత్రిక, ఏప్రిల్–జూన్ 2012

వైఎస్ రాజశేఖరరెడ్డి అధికారంలో ఉండగా లక్షల కోట్ల రూపాయలను తన కొడుకు జగన్మోహన్ రెడ్డికి కట్టబెట్టిన వైనం మనం రోజూ మీడియాలో చూస్తున్నాం. ఒక లక్షా 35 వేల ఎకరాల దళితుల భూమిని లాక్కుని కార్పొరేట్‌లకు ధారాదత్తం చేశాడు. వేల కోట్ల రూపాయలను దారి మళ్లించి ఎస్.సి., ఎస్.టి. ఉప ప్రణాళికకు తూట్లు పొడిచాడు. దళితులను టాటా, బిర్లాలను చేస్తానని చెప్పి, కనీసం ఒక్క దళితుణ్ని అయినా రాష్ట్రం నుండి కోటీశ్వరుణ్ని చేసిన దాఖలా లేదు. 2009 ఎన్నికల్లో తన సామాజిక వర్గమైన రెడ్లకు 97 సీట్లు ఇప్పించాడు. నిజానికి వారి జనాభా 6 శాతం. వారికి రావాల్సిన సీట్లు కేవలం 18 సీట్లే. ప్రభుత్వ శాఖలలోని నామినేటెడ్ పోస్టులైన సెక్రటరీలు, కమిషనర్‌లు, డైరెక్టర్‌లు, వైస్ ఛాన్సలర్‌లుగా 200 పోస్టులలో 178 పోస్టులు తన సామాజిక వర్గమైన రెడ్డి కులం వారికి కట్టబెట్టాడు. దళిత క్రైస్తవుల ఓట్లు గుంజడానికి నేను క్రైస్తవుడినని నమ్మించాడు. తెలుగుదేశం అధికారంలో ఉంటే కమ్మలు, కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటే రెడ్లు రాష్ట్ర సంపదను దోచుకున్నారు తప్ప బహుజనులకు ఎటువంటి మేలు జరుగలేదు.

– సంపాదకీయం, *సమాంతర* మాసపత్రిక, జూన్ 2012

తన అమూర్త భావనలకు, ఆలోచనలకు సమర్థవంతమైన మూర్తరూపం ఇచ్చారు పొట్లపల్లి రామారావు. ఆలోచనలను, భావాలను రాసుకుంటూ పోతే కథ కాదు. కథా నిర్మాణానికి కావాల్సిన పనిముట్లు వేరే ఉంటాయి. సమస్య, సంఘటన, పరిష్కారం కథను నిర్మిస్తాయి. ఈ మూడు విషయాల్లో పొట్లపల్లి రామారావు తన సామర్థ్యాన్ని, విచక్షణను తన కథల్లో ప్రదర్శించారు. క్లుప్తత పాటించారు. అక్కడక్కడ ఆ కాలం తెలుగు రచయితల మాదిరిగానే జోక్యంచేసుకొని వ్యాఖ్యానాలు చేసినప్పటికీ అతి వ్యాప్తి ఎక్కడా కనిపించదు. అమూర్త భావనలకు, ఆలోచనలకు సంఘటనలు, పాత్రలద్వారా మూర్తరూపాన్ని కల్పించి, అద్భుతమైన శిల్ప నిర్మాణాన్ని ప్రదర్శించారు. మరి ఎందుకు పొట్లపల్లి రామారావు తెలుగు సాహిత్యానికి ఆనకుండా పోయాడు.

– కాసుల ప్రతాపరెడ్డి, కాలం కన్నా ముందున్న రచయిత,
మీడియా టుడే మాసపత్రిక, జూలై 2012

అందుకే ఈనాడు దళిత ప్రజా సంఘాలు, అభ్యుదయ వామపక్షాల సంఘాలు కలిసికట్టుగా లక్షింపేట దళితుల భూమికోసం, స్వీయ గౌరవం కోసం పోరాడడం చారిత్రక ఘటనగా భావించవచ్చు. ఎర్ర, నీలి ఉద్యమాలు పోరాటంలో కదను తొక్కుతున్నాయి. ఏ కులమైనా, ఏ మతమైనా వర్గ–మైత్రి–భూమిలేని పేద జనాల ఐక్యత – పోరాట ఐక్యత ఎంతో ఆవశ్యకమైనది కదా! అలా సమరశీల ప్రతిఘటనా పోరాటాలు సాగిస్తేనే ఇలాంటి అమానుష దాడులు నివారించబడతాయి తప్ప, కేవలం పత్రికా ప్రకటనలు, నిరసన ప్రదర్శనలు, సభలు–సమావేశాల వల్ల సాధ్యం కాదనే వాస్తవం అందరూ గ్రహించాలి.

ఇలాంటి సమస్యలు ఉత్పన్నమైనప్పుడు దళిత బుద్ధులు, దళిత బుద్ధ మేధావులు, దళిత క్రైస్తవులు, దళిత ముస్లింలు, బూర్జువా పార్టీలు, ఇతర సంస్థలలో ఉన్న దళిత నాయకులు, మేధావులు ఎందుకు స్పందించరు? స్పదించి ఎందుకు ఉద్యమించరు? 'దున్నేవాడికే భూమి' కోసం ఎందుకు పోరాటాలు నిర్వహించరు? అలా కృషి చేయడం వారి మేధావితనానికి, నాయకత్వానికి హీనంగా భావిస్తున్నారా? వారి కార్యాచరణే వారేమిటో చెప్పకనే చెబుతున్నది కదా!

– సంపాదకీయం, *హేతువాదం*, ఆగస్ట్ 2012

మీ సీట్లో కూర్చుని మీరు చేయాల్సిన పనులు చెయ్యకుండా, వేల ఫైళ్లు మీ టేబుల్ మీద పెండింగ్‌లో పెట్టి, మంత్రులూ సరిగ్గా ఆఫీసుకు రాకుండా, చెయ్యాల్సిన పనులు చెయ్యకుండా, అసలు సచివాలయమే పనిచేస్తుందా? లేదా? అనే సందిగ్ధ పరిస్థితుల్లో ఊళ్లు పట్టి తిరగడం ప్రజా సమస్యలు తెలుసుకోవడానికేనా? అదే నిజమైతే ఒక్కరోజు – మీ సచివాలయానికి వచ్చే సందర్శకుల్ని కలుసుకోండి! నెలల తరబడి, సంవత్సరాల తరబడి కాళ్లు అరిగేలా సెక్రటేరియట్ చుట్టూ తిరుగుతున్న వాళ్ల సమస్యలేమిటో తెలుసుకోండి. పరిష్కరించండి. ఫలితముంటుంది. మీ శాసనసభ్యుల్ని కూడా మందీ మార్బలంతో కాకుండా వావిలాల గోపాలకృష్ణయ్య గారిలా తన నియోజకవర్గంలో ప్రజా సమస్యలు తెలుసుకోవాడనికి ఆర్‌టిసి బస్సులలో గ్రామాలలో ఎలా తిరిగారో తెలుసుకోమని చెప్పండి. ఇంకా అవసరం అయితే, మీకు తెలిస్తే వావివాల ఎవరో చెప్పండి.

– సంపాదకీయం, *ఈభూమి* మాసపత్రిక, ఆగస్ట్ 2012

ఆకృత్యానికి పాల్పడుతున్న వారి సంఖ్య ఎక్కువగా ఉండడం వల్ల నేరాన్ని నిరోధించలేకపోయామని గువాహటి, మంగుళూరు పాత్రికేయులు పేర్కొన్నారు. అందులో వాస్తవం ఉన్నప్పటికీ వారు పరిసరాల ప్రజలను సమీకరించే ప్రయత్నం చేయలేదు. కనీసం పోలీసులకు సమాచారం ఇవ్వలేదు. అయితే వారి వీడియో చిత్రీకరణ వల్ల నిందితులను గుర్తించే వీలు పోలీసులకు చిక్కింది. ఆ మేరకు జర్నలిస్టుల సహకారాన్ని అభినందించాల్సిందే కాని, వృత్తి ధర్మంతోపాటు సమాజంలో బాధ్యతాయుత పౌరులుగా వారు 'వ్యక్తి'ధర్మం కూడా నెరవేర్చి ఉంటే బాగుండేది. మొదట మనం మనుషులం, ఆ తర్వాతే జర్నలిస్టులం. ఆ స్పృహ కోల్పోవడం వల్లనే జర్నలిస్టులు వివాదాల్లో చిక్కుకుని విమర్శల పాలవుతున్నారు. కొన్నిసార్లు కేసుల్లో ఇరుక్కుంటున్నారు. తాజా పరిణామాల నేపథ్యంలో ఈ అంశంపై మరింత లోతయిన చర్చ జరగాల్సిన అవసరం ఉంది.

– సంపాదకీయం, *ప్రతిస్పందన* మాసపత్రిక, ఆగస్ట్ 2012

పోలీసు కానిస్టేబుళ్లు ప్రధానంగా పేద రైతు, కార్మిక కుటుంబాల నుండి వస్తారు. వారిని ఖాకీ దుస్తుల్లోని రైతులని చెప్పొచ్చు. స్పెషల్ బెటాలియన్‌లలో పనిచేసే పోలీసులు తమ స్వస్థలాలను విడిచి సుదూర ప్రాంతాలలో పనిచేయాల్సి ఉంటుంది. తరచుగా ఒక చోట నుండి మరో చోటికి బదిలీలకు గురవుతుంటారు. వారి వేతనాలు తక్కువ. పని పరిస్థితులు దారుణంగా ఉంటాయి. 36 ఏళ్లుగా అమలు జరుగుతున్న రేంజి విధానం స్థానంలో (200–300 కిలోమీటర్ల లోపే డ్యూటీలు వేసే విధానం) 800 కిలోమీటర్ల దూరంలోని ప్రాంతాలకు డ్యూటీ వేసే ఎబిసి విధానాన్ని ప్రస్తుతం అధికారులు అమలు చేస్తున్నారు. దీనివల్ల వీరు దీర్ఘకాలం పాటు భార్యా, పిల్లలకు దూరంగా ఉండాల్సి వస్తోంది. కనీసం తరచుగా కుటుంబాలతో గడపడానికి ప్రత్యేక సెలవులు మంజూరు చేయాల్సిందిపోయి కేవలం 15 సాధారణ సెలవులు, 30 ఆర్ధిక సెలవులు మాత్రమే ఇస్తున్నారు. వీటిని కూడా అధికారులు నిరంకుశంగా మంజూరు చేయడానికి నిరాకరిస్తున్నారు.

– సంపాదకీయం, *ప్రజాపంథా* పక్షపత్రిక, ఆగస్ట్ 2012

ఫీజుల అనిశ్చితి స్వయంకృతం

విద్య ఒక పెద్ద వ్యాపారంగా అయిపోయాక నాణ్యతా ప్రమాణాలు గాలికి ఎగిరి పోయాయనీ, లాభమే అన్నింటికీ ప్రధాన విలువ అయిపోయిందనీ అంటున్నారు **ఎ. నర్సింహారెడ్డి**

రాష్ట్రంలోని 2000 ప్రైవేట్ వృత్తి విద్యా కళాశాలల్లో ఫీజుకు సంబంధించి ఏకీకృత విధానం ఉండాలని ఆగస్ట్ ఒకటిన సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. కన్వీనర్, యాజమాన్య కోటాలకు వేర్వేరుగా ఉన్న ఫీజులను రద్దు చేస్తూ ఇంజనీరింగ్, ఫార్మసీ, ఎంబిఎ, ఎంసిఎ వంటి వృత్తి విద్యా కోర్సుల్లో ఏకీకృత ఫీజును అమలు చేయాలని సుప్రీంకోర్టు జస్టిస్ ఆర్ఎం లోధా, జస్టిస్ ఎఆర్ ధవే, జస్టిస్ సుదాంశుజ్యోతి ముఖోపాధ్యాయలతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ తీర్పు రాష్ట్ర ప్రభుత్వానికి ఇరకాటంగా, విద్యార్థులకు సంకటంగా పరిణమించింది. సుప్రీం ఉత్తర్వుల ఫలితంగా ప్రభుత్వం గంపగుత్త వ్యవహారాలను పక్కనబెట్టి కళాశాలల ఖర్చుల ఆధారంగా ఫీజులను నిర్ధారించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో మరో 500 కోట్ల రూపాయలు భరించాల్సి రావడం ప్రభుత్వాన్ని వ్యాకులపరుస్తోంది. మరోవైపు 717 ఇంజనీరింగ్ కాలేజీల్లో 31 వేల నుంచి 50 వేల రూపాయలకు ఫీజు పెరగబోతుండగా, ఆరో వేతన సంఘం పే స్కేల్స్ అమలు చేస్తున్న, చేస్తామని వాగ్దాన పత్రాలిచ్చిన 133 కాలేజీల్లో సగటు ఫీజు లక్ష నుంచి లక్షా 25 వేలు కానుంది. ఈ ఫీజు అంతా మొదటి సంవత్సరం విద్యార్థులపైనే పడనుంది. ఇప్పటికే ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేయడానికి సవాలక్ష ఆంక్షలు పెట్టిన ప్రభుత్వం ఇకముందు పెరగబోయే ఫీజుల పెంపు భారంతో మరిన్ని అడ్డంకులు సృష్టించే అవకాశాలు లేకపోలేదు. ఇది ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆధారంగా చదువుకో వచ్చునుకున్న విద్యార్థులకు శరాఘాతంగా మారింది. ఆగస్ట్ 6 నుండి ఆరంభం కావాల్సిన కౌన్సిలింగ్‌పై నీలినీడలు కమ్ముకున్నాయి. భవిష్యత్ వ్యూహం ఖరారు బాధ్యతను ప్రభుత్వం బొత్స నేతృత్వంలోని మంత్రివర్గ ఉపసంఘంపై మోపింది. దీంతో యాజమాన్యపు కోటా ఫీజులకు అడ్డుకట్టవేయడానికి చేసిన ప్రభుత్వ ప్రయత్నాలు పేద విద్యార్థుల చదువులకు విఘాతంగా పరిణమించాయి. విద్యార్థులపై ఫీజుల పిడుగు పడనుంది.

ప్రభుత్వం విద్య, వైద్య బాధ్యతల నుంచి తప్పుకోవాలనుకున్న మరుక్షణం నుంచే పేదవర్గాల పాట్లు ప్రారంభమయ్యాయి. ప్రైవేటు విద్యా సంస్థలను ప్రోత్సహిస్తూ విచ్చలవిడిగా అనుమతులిచ్చిన ఫలితమే తామరతంపరగా వెలసిన కార్పొరేట్ కళాశాలలు, వైద్యాలయాలు. కార్పొరేట్లు రాజకీయాల్లోకి సైతం ప్రవేశించడంతో ప్రభుత్వాలనే శాసించే స్థితికి చేరుకున్నాయనడానికి ప్రస్తుత పరిస్థితులే నిదర్శనం. దేశంలోకెల్లా అత్యధిక ఇంజనీరింగ్ కళాశాలలున్నది మన రాష్ట్రంలోనే. అందులో ప్రైవేటువే అత్యధికమని ప్రత్యేకంగా పేర్కొనవసరం లేదు. ఇప్పటి వరకూ కన్వీనర్ కోటా 'ఎ' కింద 70 శాతం సీట్లు, యాజమాన్య కోటా 'బి' కింద 30 శాతం సీట్లు భర్తీ చేస్తున్నారు. 'ఎ' కేటగిరీ కింద విద్యార్థులు 31,000 రూపాయలు చెల్లిస్తుండగా, 'బి' కేటగిరీలో 95 వేల రూపాయల ఫీజు చెల్లించి కళాశాలల్లో చేరుతున్నారు. కళాశాలల్లోని బోధన, బోధనేతర సిబ్బందికి యోగ్యమైన వేతనాలివ్వాలంటే ప్రస్తుత ఫీజులతో సాధ్యం కాదు కనుక ఫీజులు పెంచుకుంటామంటూ ప్రైవేటు యాజమాన్యాలు గత సంవత్సరం రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించాయి. రెండు రకాల కేటగిరీలను రద్దు చేస్తూ విద్యార్థులందరికీ ఒకే ఫీజు విధానాన్ని అమలు చేయాలని గత అక్టోబరులో హైకోర్టు తీర్పు ఇచ్చింది. వృత్తి విద్యా కళాశాలలకు ఫీజులు నిర్దేశిస్తూ ఉన్నత విద్యాశాఖ జారీ చేసిన 76, 77, 85, 86 జీవోలను సైతం రద్దు చేసింది. మౌలిక సదుపాయాల ప్రాతిపదికన ఫీజు పెంచుకునే అవకాశం కూడా కళాశాలలకు కల్పించింది. కాకపోతే కళాశాల నిర్వహణలో తమ ఖర్చుల నివేదికను ప్రభుత్వానికి సమర్పించమని కోర్టు సెలవిచ్చింది.

ఈ మొత్తం వ్యవహారంలో విద్యార్థుల ప్రయోజనాలను కాపాడేందుకు జోక్యం చేసుకోవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం అది తన బాధ్యత కాదన్నట్లుగా మిన్నకుండింది. ఫీజుల పెంపుకోసం ప్రైవేట్ కాలేజీలు చేస్తున్న వాదనల్లోని లోటుపాట్లను ఎండగట్టే సాహసం కానీ, అక్రమాల పుట్టగా మారిన మేనేజ్‌మెంట్ కోటా సీట్లు అమ్మకాల గురించి ప్రశ్నించే ధైర్యం కానీ ప్రభుత్వం చేయలేకపోయింది. ప్రభుత్వం ఇంతగా నిస్సహాయ స్థితిలో పడడానికి అది అనుసరించిన అనుచిత విధానాలే కారణం. క్యాపిటేషన్ ఫీజు చట్టం ప్రకారం ప్రైవేటు కాలేజీలు పేరాశతో లాభార్జనకు దిగకుండా అజమాయిషీ చేసే అవకాశం మాత్రమే ప్రభుత్వానికి ఉంటుందిగాని, ఫీజులు ఎంత ఉండాలో నిర్ధారించి, ప్రకటించే అధికారం లేదని హైకోర్టు జస్టిస్ గోడ రఘురాం, జస్టిస్ పి. దుర్గాప్రసాద్‌లతో కూడిన ధర్మాసనం గత అక్టోబర్ 29న ఎ-బి కేటగిరి ఫీజు విధానాన్ని రద్దు చేస్తూ తీర్పు చెప్పింది. ఆ ఆదేశాల్ని అంగీకరిస్తే బోధన రుసుముల చెల్లింపు తలకు మించిన భారమవుతుందన్న బెదురుతో హైకోర్టు తీర్పు రాజ్యాంగ విరుద్ధమంటూ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించడం తెలిసిందే. కోర్టు ఉత్తర్వుల మేరకు నిర్వహణ వ్యయాల్ని సమర్పించిన కాలేజీలకు ఏకీకృత ఫీజులు అమలు చేయడానికి అభ్యంతరం లేదని ప్రమాణ పత్రం సమర్పించిన రాష్ట్ర ప్రభుత్వం కన్వీనర్, యాజమాన్యం కోటాలవారీగా ఫీజులు ప్రతిపాదించే ప్రయత్నం చేసి భంగపడింది. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన కీలకాంశంపై కడనిమిషం దాకా తాత్సారం చేసిన ప్రభుత్వ నిర్వాకం అంతిమంగా

సృష్టించింది అయోమయం, గందరగోళం. ఆగస్ట్ ముగియవస్తున్నా ఈ ఏడాది ఇంజనీరింగ్ కౌన్సిలింగ్ ప్రక్రియ ప్రారంభం కాక పోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో ఆందోళన వెల్లువెత్తుతోంది. అసలు ఫీజు ఎంత ఉంటుందో తెలియని సందిగ్ధ పరిస్థితి నెలకొంది.

ఇంజనీరింగ్ కళాశాలల్లో బోధనా సిబ్బందికి ఆరవ వేతన సంఘం సిఫారసులు, బోధనేతర సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిదో వేతన సంఘం సిఫారసులు అమలు చేయాలన్నది నిబంధన. ఈ నిబంధనను సరిగా అమలు చేస్తున్న కాలేజీలు డజనుకు మించి లేవు. మిగతా కాలేజీలు అసలు ఉత్తమ ప్రమాణాలను పట్టించుకోనేలేదు. వాటిపై ఎలాంటి చర్యలూ లేవు. అయినా సరే అఫిడవిట్ దాఖలు చేసిన కాలేజీలకు ఫీజు పెంచుకోవడానికి అడ్మిషన్ అండ్ ఫీ రెగ్యులేటరీ కమిటీ (ఎఎఫ్ఆర్‌సి) అనుమతిస్తుందని సుప్రీం కోర్టు చాలా ఉదారంగా ప్రకటించింది. ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్య కోటాలో సీట్ల అమ్మకాలు కొన్ని చోట్ల పక్కా వ్యాపారంగా మారాయి. ఎంసెట్‌లో క్వాలిఫై అయినా, కాకపోయినా, ఇంటర్ గ్రూపు సబ్జక్టులలో 50 శాతం మార్కులు ఉండాలన్నది నిబంధన. ఎక్కువ రేటు వస్తుందనుకుంటే ఆ నిబంధనను సైతం తుంగలో తొక్కి సీటు ఇచ్చేస్తున్నారు. ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో యాజమాన్య కోటా కింద లభించే సీట్లను 2011-12లో ఒక్కొక్కటి 80 లక్షల నుండి కోటి రూపాయల దాకా అమ్ముకున్నట్లు మీడియా కోడై కూసింది. అయినా, దీనిపై ఇంతవరకు ఎలాంటి చర్యలు లేవు. ఈ అక్రమాలను అరికట్టాల్సిన ప్రభుత్వం యాజమాన్యాలతో షరీకైపోతోంది. దీంతో అక్రమాలకు పాల్పడే యాజమాన్యాలకు భయం లేదు.

ప్రైవేటు కళాశాలల్లో ప్రమాణాలు ఎలా ఉన్నా, యాజమాన్య కోటా కింద సీట్లు ఎంతకు అమ్ముకున్నా పట్టించుకోని సర్కారుకు సుప్రీం తీర్పుతో కళ్లు బైర్లు కమ్మినంత పనైంది. తాము చెల్లించే ఫీజు రీయింబర్స్‌మెంటు ఖర్చు అదనంగా రు. 500 కోట్లు పెరగడమే అందుకు కారణం! పైగా ఇక నుంచి తూతూ మంత్రంగా నిర్వహించే కాలేజీలు సైతం ఏకీకృత ఫీజులు వసూలు చేస్తాయి. అంటే పేద మధ్యతరగతి విద్యార్థులకు, ఇటు ఖజానాకు చేటు, కార్పోరేట్లకు లాభం. కార్పొరేట్ యాజమాన్యాలతో సంప్రదించి సమస్యను పరిష్కరించి విద్యార్థులకు ఊరట కల్పించగల సత్తా సర్కారులో లేకపోవడంతో కేసు సర్వోన్నత న్యాయస్థానం దాకా పోవాల్సి వచ్చింది. అదే రాష్ట్ర హైకోర్టు తీర్పు వెలువబడిన వెనువెంటనే చర్యలు చేపట్టి ఉంటే ఇప్పుడీ దారుణ అనిశ్చితి నెలకొని ఉండేదికాదు. రీయింబర్సుమెంట్ పేర ప్రైవేటు సంస్థలకు కోట్లకు కోట్లు కుమ్మరించే బదులు ప్రభుత్వ కళాశాలలు స్థాపించి ఇంజనీరింగ్ వంటి ఉన్నత వృత్తి విద్యా కోర్సులను పేద వర్గాలకు అందించాలన్న ఆలోచనే సర్కారుకు రాలేదు. అందుకే ఏ చట్టం ప్రకారం ప్రైవేటు కాలేజీలకు ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తోంది? ఎక్కువగా ప్రభుత్వ కళాశాలలను తెరచి ఉచితంగా సీట్లు ఇవ్వాలిగాని ప్రైవేటు కళాశాలలకు నిధులివ్వడం సరికాదని సుప్రీంకోర్టు సూటిగా వ్యాఖ్యానించింది. చంద్రబాబు మొదలుకొని వైఎస్ వరకు అనుసరించిన, ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం కొనసాగిస్తున్న విధానాలలోని డొల్లతనంపై మొత్తం సమాజం ఆలోచించుకోవలసిన సందర్భమిది. మన రాష్ట్రంలో అడ్డగోలుగా ప్రారంభించిన ఇంజనీరింగ్ కాలేజీల గురించి, ఫీజు రీయింబర్స్‌మెంట్ గురించి సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో అయినా మన పాలకులను నిలదీయవలసిన అవసరం ఉన్నది. కొందరు న్యాయకోవిదులు సైతం విద్యార్థుల పక్షానగాక విద్య వ్యాపారీకరణను ప్రోత్సహించేలా మాట్లాడడం విచారకరం. ప్రపంచీకరణ నేపథ్యంలో కోర్టు తీర్పులు కూడా విద్యా వ్యాపారీకరణను ప్రోత్సహించే విధంగా ఉన్నాయి. 2002లో సుప్రీంకోర్టు టిఎం పాయ్ కేసులో యాజమాన్యాలకు ఫీజుల ద్వారా సమంజసమైన మిగులు ఉండవచ్చునని తీర్పు ఇచ్చింది.

దేశంలోనే అతిపెద్ద స్థాయిలో 20 లక్షల మంది పోస్ట్ మెట్రిక్ విద్యార్థులకు ఫీజులు చెల్లించిన రాష్ట్రం ఇదేనంటూ 2009 ఎన్నికల ప్రణాళికలో కాంగ్రెస్ పార్టీ ఘనంగా చాటుకుంది. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ప్రామాణిక సదుపాయాలు కల్పించకపోవడంతో కొత్తగా రావాల్సిన వైద్య విద్య సీట్లు కొండెక్కి ప్రతిభావంతులైన రాష్ట్ర విద్యార్థులు నష్టపోయిన వైనం రాష్ట్ర ప్రభుత్వ ప్రాథమ్యాలు ఎంత దిగనాసిగా ఉన్నాయో వెల్లడిస్తోంది. రాష్ట్రంలో కాలేజీలు పెరగడం వల్ల చాలా సీట్లు ఖాళీగా ఉంటున్నాయని, కొన్ని కాలేజీల్లో అసలు భర్తీయే కావడం లేదన్న సత్యాన్ని రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాదే సుప్రీంకోర్టు దృష్టికి తీసుకొచ్చారు. వృత్తివిద్యా కోర్సులకు అర్హత పొందుతున్న విద్యార్థుల సంఖ్య కన్నా సీట్ల సంఖ్య అధికంగా ఉండడం, అంతర్జాతీయ ఆర్థిక మాంద్యంతో కంప్యూటర్ విద్య పట్ల కొంత నిరాసక్తత, ఉపాధి అవకాశాలు పడిపోయినందున ఎంసిఎ, ఎంబిఎల పట్ల ఆకర్షణ తగ్గిపోవడం వంటి కారణాలతో గత కొద్ది సంవత్సరాలుగా అధిక సంఖ్యలో సీట్లు భర్తీ కావడం లేదు. అయినా చిత్రమేమిటంటే అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఎఐసిటిఇ) రాష్ట్ర ప్రభుత్వ ప్రమేయం లేకుండానే ఇంకా నూతన కాలేజీలకు అనుమతులిస్తూనే ఉంది. ఇటు దరఖాస్తు చేసేవారికి, అటు అనుమతిలిచ్చేవారికి విద్య ఎంత లాభసాటి వ్యాపారంగా మారిందో !

మన రాష్ట్రంలో 2000-01 నాటికి 106 ఇంజినీరింగ్ కళాశాలలు, వాటిలో 30176 సీట్లు ఉండేవి. 2004-05లో 238 ఇంజనీరింగ్ కాలేజీలు వాటిలో 82 వేల పైచిలుకు సీట్లు ఉండేవి. మూడేళ్ల కాలావధిలో 2007-08 నాటికవి 337 కాలేజీలు, లక్షా 19 వేల సీట్లుగా విస్తరించాయి. బోధన రుసుముల చెల్లింపు పథకం ప్రకటించిన దరిమిలా 2009-10 నాటికి కాలేజీలు తామరతంపరగా 656కు, సీట్లు రెండు లక్షల 27 వేలకు చేరుకొన్నాయి. ప్రస్తుతం ఇంజనీరింగ్ కాలేజీల సంఖ్య 717. వీటిలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలు 31 మాత్రమే. వీటిలో మొత్తం 3,42,376 సీట్లున్నాయి. కన్వీనర్ కోటా కింద 70 శాతం అంటే 2,40,000 సీట్లు భర్తీ చేస్తారు. ఎంసెట్ పాసైన వాళ్లందరికీ సీట్లు ఇచ్చినా ఇంకా లక్షా 75 వేల సీట్లు మురిగిపోయే ప్రమాదం ఉంది. ఫీజుల పెంపుపై కసరత్తు చేసిన ప్రభుత్వానికి వివరాలు సమర్పించినవి 240 కాలేజీలు. వాటిలో సంతృప్తికర సమాచారం అందజేసినవి 133 కళాశాలలే. తక్కిన కాలేజీలన్నింటా మౌలిక సదుపాయాలు, బోధన ప్రమాణాల వాసిని ఆరా తీస్తే ముక్కున వేలేసుకోక తప్పదు. అందుకే కనీస వసతులు

లేకుండా నడుస్తున్న 400కు పైగా కాలేజీలు ఆదాయ వ్యయాల వివరాలను సమర్పించడానికి సాహసించలేదు. ఇంజనీరింగ్ విద్య ప్రమాణాల్ని గాలికొదిలి వేలకోట్ల ప్రజాధనం వెచ్చించి కొరగాని చదువులకు మహారాజ పోషకత్వం వహిస్తున్న ప్రభుత్వ విధానమే ఇంతటి సంక్షోభానికి తెర లేపింది!

మంచి ర్యాంకు సాధించినప్పటికీ పైరవీలు, డొనేషన్ల బెడదతో ఆశించిన కాలేజీలో సీటు రాదేమోనన్న బెదురు ఇప్పటికే ఇరవై వేలమంది విద్యార్థులను వలసబాట పట్టించింది. ఇక్కడ కౌన్సిలింగ్‌లో జాప్యం, తమిళనాట పరిశ్రమలు ఎక్కువగా ఉండడంతో వలసలు అటు పోటెత్తుతున్నాయి. రాష్ట్రంలోని కళాశాలలకు ఎంటెక్ పూర్తి చేసినవారు 20 వేల మంది, పీహెచ్‌డీలు 15 వేలమంది అధ్యాపకులు అదనంగా కావాలి. బీటెక్ ఉత్తీర్ణులైన వారితోనే బండి లాగిస్తున్న వందల కళాశాలలకు ప్రభుత్వం ఇస్తున్న బోధన రుసుములే వెన్నుదన్ను. ఇలాంటి కళాశాలలకు రు. 20 వేల ఫీజు కూడా వృథాయేనని అధికార వర్గాలు అంటుంటే – సుప్రీం ఏకీకృత ఉత్తర్వు పుణ్యమా అని వాటికీ రు. 50 వేల పైచిలుకు సమర్పించాల్సి వచ్చేటట్టుంది. సుప్రీం ఉత్తర్వును అవకాశంగా తీసుకొని కన్వీనర్, మేనేజ్‌మెంట్ అన్న విచక్షణ వద్దని, అన్ని సీట్లను ప్రభుత్వమే భర్తీ చేయాలని కొన్ని ప్రైవేటు కాలేజీలు డిమాండ్ చేస్తున్నాయి. రీయింబర్స్‌మెంట్ పథకం కింద మరింత మొత్తాలను పొందవచ్చని వాటి ఆలోచన. రాష్ట్ర ఉన్నత విద్యారంగాన కనీవినీ ఎరుగని సంక్షోభమిది. కొరగాని కాలేజీల్లోనూ అరలక్ష ఫీజు తల్లిదండ్రుల గుండెల మీద కుంపటి కానుందిప్పుడు! పేరున్న కాలేజీల్లోనూ భారీగా పెరిగే ఫీజులు ప్రతిభావంతుల ఉన్నత చదువుకు ప్రతిబంధకం అయ్యే ప్రమాదమూ పొంచి ఉంది. తానే సృష్టించిన ఈ సమస్యల పద్మవ్యూహం నుంచి లక్షలాది మంది ఆశావహ విద్యార్థుల్ని రాష్ట్ర ప్రభుత్వం ఎలా ఒడ్డున పడేస్తుందో వేచి చూడాలి!

వైద్యం లేక మరణిస్తున్న ఆదివాసులు, పండించిన పంటలకు గిట్టుబాటు రాక అప్పులపాలై ఆత్మహత్యలకు పూనుకుంటున్న రైతులు, ఉపాధి దొరకక వలసలు పోతున్న గ్రామీణ పేదలు, పోషకాహార లేమితో బాధపడుతున్న పిల్లలు, కనీస వసతులు లేక కునారిల్లుతున్న ప్రభుత్వ పాఠశాలలు, బతకలేక కన్న బిడ్డల్ని అమ్ముకుంటున్న పేదలు. వీటిలో ఏ ఒక్క సమస్య పరిష్కారానికీ చొరవచూపని పాలకులు ఇంజనీరింగ్ కాలేజీల పేరిట ఇన్ని వేల కోట్ల ప్రజాధనం ఎవరినుద్ధరించడానికో ప్రజలకు చెప్పవలసిన బాధ్యత ఉంటుంది. ఫీజుల చెల్లింపు ఉన్నంతకాలం ప్రభుత్వ విద్యా సంస్థలు పటిష్టం కావు. పేదలకు చదువు ఉచితంగా లభించదు. అన్ని హంగులున్న ఇంజనీరింగ్ కాలేజీలలో చదువుకున్న వారికి తప్ప లక్షలాది పేద ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉద్యోగాలు లభిస్తాయనే ఆశ లేదు. వారి సేవలు మన సమాజానికి ఉపయోగపడేటివి కావు. ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలు గల కళాశాలలో విద్యార్జన అసాధ్యంగా మారుతున్నది. అందుకు ప్రజల డబ్బునే వినియోగించడం ఒక పెద్ద విషాదం.

ప్రపంచబ్యాంకు ఆదేశాలతో చేపట్టిన ఆర్థిక సంస్కరణలలో భాగంగానే విదేశీ సంస్థల అవసరాలకంటూ ఇన్ని ఇంజనీరింగ్ కాలేజీలకు అనుమతిచ్చి, లక్షలాది మంది నిరుద్యోగులను తయారు చేయడం వల్ల ఒరిగిందేమిటి? ఈ సాంకేతిక విద్య మన విద్యా ప్రగతికి చిహ్నమా? మన సాంకేతికాభివృద్ధికి దోహదం చేస్తుందా? సాఫ్ట్‌వేర్, బయోటెక్నాలజీ, ఫార్మసీవంటి రంగాలను మన ఆర్థికాభివృద్ధికి చోదక శక్తులుగా చంద్రబాబు విజన్ పేర్కొంది. విదేశీ సంస్థల కోసం మన డబ్బుతో నీళ్లు, నిధులు అనేక వసతులు కల్పించారు. పాశ్చాత్య ప్రభువులకు చౌకగా మానవ వనరుల అందించడానికి అడ్డగోలుగా కళాశాలలు తెరిచారు. చంద్రబాబు తరువాత వచ్చిన వైఎస్ ఫీజుల చెల్లింపు పథకం ప్రవేశపెట్టిండు. ఆరోగ్యశ్రీ ప్రవేశపెట్టిండు. గ్రామీణ ప్రాంతాలలో వైద్యం లేక అల్లాడుతున్న జనాలకు మందులు ఇవ్వకుండా కార్పొరేట్ ఆస్పత్రులను బతికించిండు. గ్రామీణ సమాజానికి అవసరమైన వైద్యులను భారీగా తయారు చేసి గ్రామాలలో నియమించే పని మాత్రం పెట్టుకోలేదు. అందుకే సుప్రీం కోర్టు న్యాయమూర్తి విచారణ సందర్భంగా "సమస్య అధిక ఫీజులకు సంబంధించింది కాదు, అధిక సీట్లకు చెందినది" అని వ్యాఖ్యానించారు. ఇన్ని కోట్ల రూపాయలు ప్రైవేటు కళాశాలలకు ఇవ్వడమేమిటి? ప్రభుత్వమే కాలేజీలు తెరిచి ఉచితంగా విద్యను అందించవచ్చు కదా? అని ప్రశ్నించారు.

వృత్తి విద్యా కళాశాల యాజమాన్యాలతో ప్రభుత్వ సంప్రదింపులు, బెదిరింపులు, ఆర్డినెన్స్, చివరగా రు.35 వేలుగా ఫీజు నిర్ణయించడం జరిగింది. ప్రభుత్వ నిర్ణయాన్ని అంగీకరించని కాలేజీలకు కఠిన చర్యలు తప్పవని, దాడులు చేస్తామని, క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించినా ఆగస్ట్ 16న ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్య సంఘం, కొన్ని కళాశాలలతో పాటు కొంతమంది వ్యక్తిగతంగా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇంజనీరింగ్ వృత్తి విద్యా కోర్సుల ఫీజు విషయంలో ఫీజుల నియంత్రణ కమిటీ (ఎఎఫ్ఆర్‌సి) సూచనలు, సిఫారసుల మేరకే నడుచుకోవాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఫీజులను నిర్ణయించాల్సింది ప్రభుత్వం కాదని స్పష్టం చేస్తూ, ఇందులో సర్కార్ జోక్యం ఉండరాదని సూచించింది. ఫీజులను నియంత్రించేది ఎఎఫ్ఆర్‌సినేనని ఆగస్ట్ 17న తీర్పునిచ్చింది. ఫీజులపై వెంటనే నిర్ణయం తీసుకోవాల్సిందిగా ఆదేశించింది. ఆగస్ట్ 18 నాటికి 550 ఇంజనీరింగ్ కాలేజీలు 35 వేల రూపాయల ఫీజును అంగీకరిస్తూ ఒప్పంద పత్రాలు అందజేశాయి. అయితే ఒప్పంద పత్రాలు ఇవ్వని కాలేజీలకు భారీ మొత్తాల్లో ఫీజులు నిర్ణయిస్తే తాము అంగీకరించేది లేదని కొన్ని కళాశాలల యజమాన్యాలు తెగేసి చెబుతున్నాయి. దీంతో కౌన్సిలింగ్ జరిగినా ఫీజుల వివాదం మరికొంత కాలం కొనసాగే పరిస్థితి నెలకొంది. తనిఖీల నుండి తప్పించుకోవడానికే ఒప్పంద పత్రాలు ఇచ్చాయి. ఆ కాలేజీల పరిస్థితి ఎంత దుర్భరంగా ఉందో అందరికీ తెలిసిందే.

ఏకీకృత ఫీజులు అమలు చేయాలన్న హైకోర్టు తీర్పుతో ఎఎఫ్ఆర్‌సి గందరగోళంలో పడింది. ప్రభుత్వం నిర్ణయించిన 35 వేల రూపాయల ఫీజును అంగీకరిస్తూ అండర్ టేకింగ్ పత్రాలిచ్చిన కాలేజీలకు 35 వేల రూపాయలు ఖరారు చేయాలని తొలుత ఎఎఫ్ఆర్‌సి భావించింది. అయితే హైకోర్టు తీర్పు ఏకీకృత ఫీజుతో పాటు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం పేస్కేలు ఆధారంగా వేర్వేరుగా ఫీజులను ఖరారు చేయాల్సిన బాధ్యత దానిపై పడింది. గతంలో అఫిడవిట్‌లు సమర్పించిన 240 కాలేజీలలో ఫీజులు పెంచాలా? కేవలం అండర్ టేకింగ్ పత్రాలు ఇవ్వని

కాలేజీలకు మాత్రమే ఫీజులు పెంచాలా? అన్న మీమాంసలో పడింది. ఎవరైనా మళ్లీ కోర్టుకెళ్లితే ఎలా అన్న అయోమయంతో ఎఎఫ్ఆర్‌సి మల్లగుల్లాలు పడుతోంది. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుకు 483 కాలేజీలు అంగీకరిస్తూ అండర్ టేకింగ్‌లు ఇచ్చినా.. మిగిలిన కాలేజీలపై ఇంకా సస్పెన్స్ కొనసాగుతూనే ఉంది. వాటికి ఎంత ఫీజు నిర్ణయించాలనే అంశం ఇంకా కొలిక్కి రాలేదు. ఈనెల 27వ తేదీలోగా ఆయా కాలేజీల్లో తనిఖీలు నిర్వహించి ఫీజును ఖరారు చేస్తామని ప్రభుత్వం చెబుతోంది. వృత్తి విద్యా కళాశాలల్లో తనిఖీకి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వు 54 ఆగస్ట్ 20న జారీచేసింది. అయితే, ఇంత తక్కువ సమయంలో ఇది సాధ్యమేనా అన్న సందేహాలూ నెలకొన్నాయి. అసలు కళాశాలలను తనిఖీలు చేయకుండానే ఏ ప్రాతిపదికన రు. 35 వేల ఫీజు నిర్ణయించారని ఎపిఆర్‌సిని హైకోర్టు న్యాయమూర్తి నాగార్జున రెడ్డి ప్రశ్నించారు. హామిపత్రాలు ఇవ్వని, కోర్టును ఆశ్రయించిన వారిని వేధిస్తారా అని వ్యాఖ్యానించారు. మరోవైపు, ఏ కాలేజీలో చేరినా, ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రు.35 వేలనే భరిస్తామని, మిగిలిన భారాన్ని ఆయా విద్యార్థులే భరించుకోవాలంటూ ప్రభుత్వం ఇప్పటికే సంకేతాలు పంపిన సంగతి తెలిసిందే. దీంతో, మిగిలిన కాలేజీల ఫీజు ఖరారు అనంతర పరిణామాలపై ఉత్కంఠ కొనసాగుతోంది. సెకండియర్‌లో 50 శాతం మార్కులు సాధించకుంటే ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వం అని ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించింది.

ఇకనైన ఇంజనీరింగ్ విద్యా ప్రమాణాలు పెంపు చేసేందుకు ప్రభుత్వం నిర్దిష్టమైన చర్యలు తీసుకోవాలి. లేనట్లయితే, కాలేజీలు ఉత్పత్తి చేస్తున్న నిపుణతలేని వృత్తి విద్యాపరులు నిరుద్యోగ సైన్యం పెరగడానికి తప్ప సమాజాభివృద్ధికి తోడ్పడలేరు. అటువంటి కాలేజీలకు చెల్లిస్తున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రజాధనాన్ని వృథా చేయడమే అవుతుంది. అత్యధిక కాలేజీలు రాజకీయ నాయకులతో ప్రత్యక్ష, పరోక్ష సంబంధం కలిగి ఉన్నాయి. వారి ఒత్తిళ్లకు లొంగకుండా విద్యా ప్రమాణాల పెంపుదలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలి. యాజమాన్యాలతో కఠినంగా వ్యవహరించాలి. ఈ స్థాయిలో విద్యలో వ్యయం కన్నా నాణ్యత ముఖ్యం. విద్యకు, వ్యాపారానికి మధ్యగల సంబంధాన్ని చెరిపేయాలి. సాంకేతిక విద్య దేశాభివృద్ధికి తోడ్పడాలి. ఇప్పటికే అది ఎంతో దిగజారింది. దాన్ని చక్కదిద్దకపోతే విద్యార్థులు, వారిపై ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రులు, రాష్ట్రం ఎంతో నష్టపోతుంది. అనేక కాలేజీల్లో బహుకొద్దిమంది అర్హత, అనుభవం ఉన్న అధ్యాపకులుంటే, అత్యధికంగా అప్పుడే గ్రాడ్యుయేషన్, పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారు ఎక్కువగా పాఠాలు బోధిస్తున్నారు. యాజమాన్యాలు వారి శ్రమను కారుచౌకగా దోచుకోవడంతో పాటు విద్యార్థులకు తీరని అన్యాయం చేస్తున్నాయి. ఈ పరిస్థితిని చక్కదిద్ది నాణ్యమైన వృత్తి విద్యావంతులను దేశానికి అందించాల్సిన ప్రభుత్వం దీనిపై దృష్టి పెట్టడం లేదు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు యాజమాన్యాలు ఒత్తిడి చేసినప్పుడు మాత్రం వారి నిర్వహణ లోపాలను ఎత్తిచూపుతూ నోరుమూయించటానికి ప్రయత్నిస్తున్నది. ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుకుంటోంది. ఇది క్షంతవ్యం కాదు. వృత్తి కళాశాలల్లో ద్వంద్వ ఫీజు వసూళ్లు రాజ్యాంగ విరుద్ధంగా కన్పించవచ్చుగాక. అసమాన సమాజంలో సమానమైన ఫీజులు చెల్లించమనడం ఎంతమాత్రం సబబో ఒక్కసారి మానవతా దృష్టితో న్యాయమూర్తులు, ప్రజాస్వామికవాదులు, సామాజిక ఉద్యమకారులు, మేధావులు ఆలోచించాలి. అన్నిటినీ మించి వృత్తివిద్యా కళాశాలలను, అక్కడి ఫీజులు, అడ్మిషన్లను నియంత్రించే 'సామాజిక నియంత్రణ గల ఏకీకృత చట్టం' ఒకటి తేవాల్సిన ఆవశ్యకత ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వంపై ఎంతైనా ఉంది. ప్రభుత్వాలకు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా అందుకు కృషి చేయాలి. ఇంజనీరింగ్, వృత్తి విద్యార్థుల్లో నెలకొన్న గందరగోళాన్ని, అయోమయాన్ని తొలగించాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉంది.

(రచయిత ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు) వీ

'ఉపాధ్యాయ' కథలు, కవితల పోటీ

అరవై ఐదు సంవత్సరాలుగా నిరంతరాయంగా వెలువడుతున్న ఎపిటిఎఫ్ అధికార మాసపత్రిక 'ఉపాధ్యాయ' గత మూడు సంవత్సరాల నుండి కథలు, కవితల పోటీ నిర్వహిస్తోంది. అందుకై వివిధ రచయితల, కవుల నుండి రచనలను పోటీకి ఆహ్వానిస్తున్నాం. ఫిబ్రవరి జన్మదిన సంచిక నుండి బహుమతి పొందిన రచనలను ప్రచురిస్తున్నాం. అందువల్ల రచయితలు, కవులు తమ రచనలను పంపవలసిందిగా ఆహ్వానిస్తున్నాం.

రచయితలకు సూచనలు: *కథలు తెల్లకాగితం (ఫుల్ స్కేప్)పై ఒకవైపున 10-12 పేజీలకు మించకుండా ఉండాలి; కవితలు, గేయాలు 'ఉపాధ్యాయ'లో ఒక పేజీకి మించకుండా ఉండాలి; రచనలు తెలుగువారి సాంస్కృతిక, సాంఘిక జీవితానికి సంబంధించినవై ఉండాలి; ప్రపంచంలో ఏ ప్రాంతంలోని కథాంశమైనా తెలుగువారికి సంబంధించినదై, తెలుగువారి సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక సమస్యలను ప్రతిబింబించేదిగా ఉండాలి; ఉపాధ్యాయుల విద్యారంగ సమస్యలకు సంబంధించిన కథాంశం మాత్రమే కావలసిన అవసరం లేదు; కథలు, కవితలు తమ స్వంతమేనని, దేనికీ అనుసరణ కాని, అనువాదం కాని కాదనే హామీ పత్రాన్ని జతపరచాలి; ప్రధాన రాతప్రతిపై రచయిత పేరు, చిరునామా రాయకూడదు. వేరే కాగితంపై రాసి జతపరచాలి; అనుభవజ్ఞులైన న్యాయనిర్ణేతల కమిటీ బహుమతులను ప్రకటిస్తుంది. కమిటీదే తుది నిర్ణయం; బహుమతి పొందిన కథలను, కవితలను ఫిబ్రవరి 2013 సంచిక నుండి ప్రచురిస్తాం; ప్రచురణకు స్వీకరించని రచనలను తిప్పిపంపాలంటే తగు పోస్టేజీని కూడా జతపరిచి పంపించవలెను.*

రచనలు చేరవలసిన తేదీ: 31 అక్టోబర్, 2012

బహుమతుల వివరాలు

	కథ	కవిత
ప్రథమ బహుమతి	రు. 5,000	రు. 2,000
ద్వితీయ బహుమతి	రు. 4,000	రు. 1,500
తృతీయ బహుమతి	రు. 3,000	రు. 1,000

రచనలు పంపవలసిన చిరునామా :

కథలు, కవితల పోటీకి, సంపాదకులు, 'ఉపాధ్యాయ',
సింగరాజు భవన్, 29-7-22, విష్ణువర్ధనరావు వీధి,
సూర్యారావుపేట, విజయవాడ - 520002;
ఫోన్ : 0866-2433505

బోధన రుసుముపై మల్లగుల్లాలు

***ప్రైవేట్ కాలేజీలకు లాభాలు చేకూర్చడానికి ఉద్దేశించిన బోధనా రుసుం చెల్లింపు పద్ధతిని ఉపసంహరించి, నాణ్యమైన విద్యను అందించడానికి ప్రభుత్వమే బాధ్యత పడాలని అంటున్నారు* సిలువేరు హరినాథ్**

ఎన్నికల ముందు హామీలిచ్చి, ఆ తదుపరి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వానికి ఆ హామీలు నెరవేర్చడం తప్పడం లేదా? ఇచ్చిన హామీలు ఒక్కొక్కటి కనుమరుగు చేద్దామనుకున్న ప్రభుత్వానికి ప్రజల ఆగ్రహం తప్పడం లేదా? ఒకటి కాదు రెండు కాదు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న ప్రభుత్వానికి ఒక పక్క మంత్రుల అరెస్టులతో, మరొక పక్క ప్రజా సమస్యలతో అల్లాడుతున్న ప్రభుత్వానికి ప్రజల సమస్యలు కత్తిమీద సాములాగా మారాయి.

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం బి.సి., ఈ.బి.సి. విద్యార్థులకు కూడా ఉన్నత చదువులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని 2008లో అమలులోకి తీసుకొచ్చింది. ఎలాంటి ప్రణాళికా లేకుండా అమలు చేస్తామనుకున్న ప్రభుత్వానికి తీరా చూసే సరికి నెత్తిమీద కొండంత బరువు ఎత్తుకున్నట్లు అయింది. 2006 కంటే ముందు రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ఫీజుల రుసుముల నిమిత్తం రు.400 కోట్లు కేటాయించేది. క్రమంగా విద్యార్థుల సంఖ్య పెరగడంతో 2007-08 సంవత్సరానికి 8 లక్షల మంది విద్యార్థులు ఉన్నత చదువులకై పేర్లు నమోదు చేసుకున్నారు. వీరికి 1200 కోట్ల రూపాయలు కేటాయించింది. అలాగే 2008లో 14 లక్షల మంది విద్యార్థులు ఉన్నత విద్యా సంస్థల్లో చేరగా రు. 1700 కోట్లు అవసరం అయింది. 2009లో ఈ సంఖ్య 20 లక్షలు కాగా రు.2800 కోట్లు కేటాయించారు. అలాగే 2010లో 21 లక్షల విద్యార్థులు ఉన్నత చదువులకు చేరగా రు. 3500 కోట్లు కేటాయించక తప్పలేదు. 2012-13 విద్యా సంవత్సరానికి 24 లక్షల మంది విద్యార్థులు అర్హులుగా ఉండగా రు. 4000 కోట్లు కేటాయించాలి. ఇంత మొత్తంలో ప్రైవేట్ విద్యా సంస్థలకు రుసుముల పేరుతో చెల్లించడంతో ప్రభుత్వం తిరోగమనంలో పడింది. ఈ భారం నుండి తప్పించుకోవడానికి బి.సి., ఈ.బి.సి. విద్యార్థులను బలిపశువులను చేయాలనుకుంటున్నది. అనేక ఆంక్షలతో అటు ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యాలను, ఇటు విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తూ ప్రస్తుత విద్యా సంవత్సరానికి తూట్లు పొడుస్తున్నది. ఎప్పుడో అడ్మిషన్లు పూర్తయి క్లాసులు ప్రారంభం కావాల్సిన ఇంజనీరింగ్ విద్య ఇప్పటికింకా ఎలాంటి బోధన ప్రక్రియ ప్రారంభం కాకపోవడంతో విద్యార్థులు నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. విద్యార్థుల ఫీజులకు రు. 4000 కోట్లు అవసరమవుతున్నాయని వాటిని తగ్గించడానికి అనేక రకాలుగా ఇప్పుడు కమిటీల మీద కమిటీలు వేసి ప్రభుత్వం కాల యాపన చేస్తున్నది.

రాష్ట్రంలో ఫీజుల విషయంపై ఇంత రచ్చ జరగడానికి కారకులెవరు? బోధన రుసుముల చెల్లింపులపై 2008 నుండి లేని ఆలోచన ఈ విద్యా సంవత్సరం నుండే చర్యలు ఎందుకు తీసుకోవాలనుకున్నారు. ఫీజుల పేరుతో విద్యార్థులు లేకున్నా ఉన్నట్లు రికార్డులు సృష్టించి కోట్లాది రూపాయల ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టిన ప్రైవేట్ యాజమాన్యాల మోసం తీరు ప్రభుత్వానికి తెలువదా? ఆయా కళాశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదని ప్రభుత్వానికి తెలువదా? విద్యా ప్రమాణాలు లేని అనేక కళాశాలల వివరాలు ప్రభుత్వానికి తెలియనివా? ఎ.ఐ.సి.టి.ఐ. నిబంధనలు పాటించని కళాశాలల సంగతి ప్రభుత్వానికి తెలియదా? కళాశాలల్లో కనీసం 20 శాతం విద్యార్థులే ప్రతిభ కనబరుస్తున్నారన్న చేదు నిజం ప్రభుత్వానికి తెలియదా! అనేక కళాశాలలో అర్హత కలిగిన ఉపాధ్యాయులు లేరన్న సంగతి తెలియందా? ప్రభుత్వానికి ఇంకా కొత్తగా తెలవాల్సిన అవసరం లేదు. కాని ప్రభుత్వం ఇచ్చే ఫీజులనే అమలు చేయాలని ఆయా ప్రైవేట్ కళాశాలలను బెదిరింపులకు గురి చేయడం, బెదిరింపులకు లొంగని కళాశాలలపై టాస్క్‌ఫోర్స్ దాడి చేయిస్తామనడంలో ఆంతర్యం ఏమిటి? దీనికి తలొగ్గిన ప్రైవేట్ కళాశాలలు ప్రభుత్వం ఇచ్చే ఫీజులకు తలలూపాయి.

అయితే ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఇంజనీరింగ్ కోర్సుల రుసుములు పెంచే విషయంపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వలన 40 నుండి 150 శాతం వరకు రుసుములు పెరగవచ్చని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఇదే జరిగితే బోధన ఫీజుల పథకం పై ప్రభుత్వానికి అదనంగా నిధుల భారం పెరగడంలో సందేహం లేదు. ప్రస్తుతం ఈ పథకం కింద బోధన రుసుములకు రు. 2600 కోట్లు కేటాయిస్తుండగా ఉపకార వేతనాలకు రు. 1,100 కోట్లు కేటాయిస్తున్నారు. ప్రస్తుతం ఏకీకృత ఫీజులు అమలు అయినందున ప్రభుత్వం ఇస్తున్న 31 వేల రూపాయల కంటే మరో రు. 4 వేలు పెంచుతూ రు.35 వేలు చేసింది. దీని ద్వారా ప్రభుత్వానికి రు. 4000 కోట్ల బడ్జెట్ అవసరం ఏర్పడుతుంది.

ఇంజనీరింగ్ విద్యపై ప్రభుత్వం వేస్తున్న పిల్లి మొగ్గలకు భావి ఇంజనీర్లు ఇప్పటికే ఇతర రాష్ట్రాలకు వలసలు వెళ్లారు. రాష్ట్రంలో 3.4 లక్షల ఇంజనీరింగ్ సీట్లు ఉండగా 2012-13 విద్యా సంవత్సరానికి కేవలం 2.07 లక్షల మంది విద్యార్థులే అర్హత సాధించారు. అంటే ఇంకా లక్ష సీట్లు విద్యార్థులు లేకుండా మిగిలిపోయాయి. ఇక 2.07 లక్షల్లో ఇంటర్ పాస్ అయినవారు 70 శాతం మంది విద్యార్థులే ఉంటారు. అందులో ఇప్పటికే దాదాపు 15-20 శాతం మంది విద్యార్థులు ఐ.ఐ.టి., ఐ.ఐ.ఐ.టి., డీమ్డ్ యూనివర్సిటీల్లో చేరిపోయారు. ఇక మిగిలింది కేవలం 50 శాతం మంది విద్యార్థులే. ఈ సంవత్సరం

దాదాపు 2 లక్షల సీట్లు మిగిలిపోవడం ఖాయమని విద్యావేత్తలు అంటున్నారు. ఇంత దానికి ఫీజుల విషయంలో ప్రభుత్వం రోడ్డెక్కి పరువు తీసుకున్నట్లయింది.

బోధనా రుసుముల పథకంలో ఎస్.సి./ఎస్.టి విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం భారీగానే నిధులు ఇస్తుంది. వారి సంఖ్య 7.5 లక్షలు అయితే రుసుముల పథకం లబ్ధిదారుల్లో అత్యధికులు బి.సి., ఈ.బి.సి. విద్యార్థులే. వీరిలో బి.సి.లు 14.4లక్షలు కాగా ఈ బి.సి.లు 3.03 లక్షల మంది విద్యార్థులు అర్హులుగా ఉన్నారు. వీరికి బోధనా రుసుములో పరిమితి విధిస్తే సరిపోతుందన్న తాజా ప్రతిపాదనల్లో ఒకటి. మొత్తం ప్రభుత్వం చెల్లిస్తున్న రు. 2600 కోట్ల బోధనా రుసుము పథకం నిధుల్లో బి.సి., ఈ.బి.సి.లకు రు. 1612 కోట్లు వెచ్చిస్తున్నారు. అయితే ఎస్.సి./ఎస్.టి. విద్యార్థులకు ఆదాయ పరిమితి రెండు లక్షల రూపాయలు ఉండగా బి.సి. ఈ.బి.సి.లకు లక్ష రూపాయల ఆదాయ పరిమితి ఉంది. అయితే ఈ నేపథ్యంలో ప్రస్తుతం ప్రభుత్వం అమలు చేసిన 35 వేల రూపాయలు రుసుముగా చెల్లిస్తే మిగతా 15వేల రూపాయలు విద్యార్థులే భరించాల్సి వస్తుంది. ఇప్పటి వరకు విద్యార్థులకు ప్రభుత్వం బోధనా రుసుములతో పాటు ప్రత్యేక, పరీక్ష ఫీజులు చెల్లించేది. ఇది మొత్తం 450 కోట్ల రూపాయలు ఉంటుంది. ఇకపై ఈ మొత్తాన్నే చెల్లిస్తే సరిపోతుందని అధికారుల ప్రతిపాదన. ఇదే కనుక అమలు జరిగితే విద్యార్థులు ఆయా కళాశాలకు తిరిగి సొమ్ము చెల్లించాల్సి ఉంటుంది. ప్రభుత్వం ఆలోచనలో ఉన్న ఏ ఒక్క ప్రతిపాదన అమలు జరిగినా నిరుపేద విద్యార్థులకు కష్టాలు తప్పవు. ఇప్పటికే కష్టాల కడలిలో ఉన్న విద్యార్థులు సాంకేతిక విద్యకు దూరం అవుతుంటే, ఈ కొత్త ప్రతిపాదనతో ఇంజనీరింగ్ చదివే బి.సి., ఈ.బి.సి. విద్యార్థుల్లో 75 శాతం మంది విద్యార్థులు సాంకేతిక విద్యకు దూరం అయ్యే అవకాశం లేకపోలేదు.

అడ్మిషన్స్ అండ్ ఫైనాన్స్ రెగ్యులేటరీ కమిటీ (ఏ.ఎఫ్.ఆర్.సి.) నిర్దేశించిన రుసుములనే 2012-13, 2013-14 విద్యా సంవత్సరానికి ఆయా కళాశాలలు తీసుకునేట్లుగా యాజమాన్యం సంతకాలు చేయాలని ప్రమాణ పత్రంలో పేర్కొన్నారు. రాష్ట్ర హైకోర్టు కూడా ఎ.ఎఫ్.ఆర్.సి. సిఫార్సు చేసిన ఫీజులే అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరింది. బి.ఇ./బి.టెక్‌లో ఎ/బి కేటగిరిల కింద -రు.35,000, బి.ఫార్మసి-రు.31,000, బి.ఆర్క్ -రు.31,000, డి.ఫార్మసి-రు.68,000, ఎం.బి.ఎ./ఎం.సి.ఎ. - రు.27,000 రుసుము ఉంటాయని ప్రమాణం పత్రంలో పేర్కొన్నాయి. అయితే ఇంజనీరింగ్ ఏ కేటగిరిలో రు.31,000, బి కేటగిరిలో రు.95,000 తీసుకుంటున్నారు. అయితే కామన్ ఫీజు రు.50,200 ఉండాలని అడ్మిషన్ అండ్ ఫైనాన్స్ రెగ్యులేటరీ కమిటీ నిర్దేశించింది. ఈ కామన్ ఫీజులు నిర్దేశించడం ద్వారా ఆయా కళాశాలల్లో విద్యా ప్రమాణాలు పడిపోవడం ఖాయం.

రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వలన కొన్ని కళాశాలలకు నష్టం కలిగినా మెజారిటీ కళాశాలకు ఇది సువర్ణావకాశం. రాష్ట్రంలో ఉన్న 685 ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల్లో ఉన్న ప్రమాణాల విలువ ఒకే గాటన కట్టలేం. రాష్ట్రంలో కొన్ని కళాశాలలు ప్రమాణాలతో, మరి కొన్ని రాజీ ధోరణితో, అత్యధికంగా వ్యాపార దృక్పథంతో నడుస్తున్నాయి. ఇక మూత పడడం ఖాయం అనుకున్న కళాశాలలు దాదాపు 300 పైనే. ఈ కళాశాలలను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకున్నట్లే, ఈ కళాశాలల్లో కేవలం 15వేల రూపాయలకే మేనేజ్‌మెంట్ సీట్లను భర్తీ చేసుకున్నారంటే వీటి ప్రమాణాలను అర్థం చేసుకోవచ్చు. గత సంవత్సరం 10లోపు సీట్లు భర్తీ అయిన కళాశాలలు 37. అలాగే 50 లోపు విద్యార్థులు భర్తీ అయిన కళాశాలలు 107 అదే విధంగా 100లోపు విద్యార్థులు భర్తీ అయిన కళాశాలలు 97 మాత్రమే. యాజమాన్య కోటా కింద 5-10 శాతం మాత్రమే భర్తీ అయిన కళాశాలకు లెక్కలేవు. వీటికి ఫీజులు పెంచినా పెంచకపోయిన విద్యారంగంలో ఎలాంటి పురోగతి ఉండదు.

ప్రభుత్వం ఇస్తున్న రుసుముల పథకం దేశంలో ఆదర్శమే అయినా దాని వల్ల విద్యార్థులకు ఎంత మేరకు మేలు జరుగుతుందని ఆలోచించాలి. గతంలో 8లక్షలు ఉన్న లబ్ధిదారులు ఇప్పుడు 24 లక్షలకు చేరారు. అయితే కోట్లాది రూపాయల రుసుముల పేరుతో ప్రైవేట్ కళాశాలలకు కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నప్పుడు అందులో చదివే విద్యార్థులకు ఎంత మేరకు సరైన నాణ్యతతో కూడిన విద్య అందుతోందో చూడాలి. మన రాష్ట్రం ఇంజనీరింగ్ విద్యలో ఇతర రాష్ట్రాలకంటే వెనకంజలో ఉంది. ఇంజనీరింగ్ కళాశాలలు తక్కువ ఉన్న రాష్ట్రాల్లో ఎక్కువ మందికి ఉద్యోగ అవకాశాలు వస్తున్నాయి. కళాశాలలు ఎక్కువ ఉన్న మన రాష్ట్రంలో తక్కువ మందికి ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. ఇంజనీరింగ్ విద్యలో కనీస నైపుణ్యతను కనబర్చడంలో మన రాష్ట్ర విద్యార్థులు చాలా వెనకబడి ఉన్నారు. రాష్ట్రంలో 25 శాతం కళాశాలల్లో పాస్ శాతం 60 శాతం కంటే తక్కువగా ఉంది. 77 కళాశాలలో 21 నుండి 40 శాతం మంది విద్యార్థులే పాసవుతున్నారు. 30 కళాశాలల్లో 20 శాతం కంటే తక్కువ పాసవుతున్నారు. కేవలం 5లోపు కళాశాలలో మాత్రమే 80 శాతం పైగా విద్యార్థులు పాసవుతున్నారు.

ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే మేల్కొని ప్రభుత్వమే కొత్తగా ఇంజనీరింగ్ కళాశాలలు నిర్మించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అర్హులైన అధ్యాపకులచేత అందించవచ్చు. పైగా నిరుద్యోగులకు ఉద్యోగులుగా అవకాశం కల్పించి ప్రజల ఆదరాభిమానాలు పొందవచ్చు. జలయజ్ఞం, ఆరోగ్యశ్రీ వంటి ప్రాజక్టులలాగా కాకుండా చరిత్రలో నిలిచిపోయే విధంగా, విద్యావేత్తలతో సంప్రదింపులు జరిపి పక్కా ప్రణాళిక సిద్ధం చేయాలి. కళాశాలలపై నియంత్రణ తప్పని సరి. లేదంటే విద్యా ప్రమాణాలు ఇంకా పడిపోయే ప్రమాదం ఉంది. అయితే కామన్ ఫీజుల నిర్ణయం ద్వారా ప్రభుత్వానికి భారీగా బడ్జెట్ అవసరం. ఇది విద్యార్థుల ఉన్నత విద్యారంగం కోసం కాబట్టి ప్రభుత్వం భరించక తప్పదు. లేదంటే ప్రజల నుండి తిరుగుబాటు తప్పదు.

(రచయిత డాక్టొరల్ ఫెలో, హైద్రాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ) వీ

వీక్షణంకు వచ్చే రచనలలో కొన్ని జిరాక్స్ కాపీలు వస్తున్నాయి. జిరాక్స్ నాణ్యత సరిగా ఉండడంలేదు. కొన్నిటిలో చేతి రాతలు కూడా కష్టంగా ఉంటున్నాయి. అందువల్ల అర్థం చేసుకొని టైప్ చేయడంలో చాలా ఇబ్బందులు, సమస్యలు ఎదురవుతున్నాయి. అక్షరాలు అర్థమయ్యేలా రాయండి. జిరాక్స్ మీరు ఉంచుకుని ఒరిజినల్స్ మాకు పంపి సహకరించండి.

- సం.

అంగారక గ్రహంపై జీవం ఉందా?

అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో అంగారక గ్రహంపై జీవాన్వేషణ సాగుతోందనీ, అంతకన్నా ముందు భూమి మీద ఉన్న జీవాన్ని మిగిల్చి ఉంచే చర్యలు చేపట్టాల్సి ఉందనీ అంటున్నారు **డా. జి. రామదేవుడు**

ఆకాశంలో జరిగే ఖగోళ సంఘటనలు అందరినీ ఆకర్షిస్తూ ఉంటాయి. నిండు వెన్నెల కురిపించే చందమామ, మిలమిల మెరిసే నక్షత్రాలు, ఉల్కాపాతం, గ్రహ గమనం, గ్రహణాలు, తోక చుక్కలు, శుక్ర గ్రహ సంక్రమణ వంటి ఖగోళ దృశ్యాలు శాస్త్రజ్ఞులను, సాధారణ ప్రజానీకాన్ని విశేషంగా ఆశ్చర్యచకితులను చేస్తాయి. అనంత విశ్వంలో అంతులేని రహస్యాలు దాగి ఉన్నాయి. గ్రహాంతర వాసుల ఉనికి ఇంకా శాస్త్రీయంగా, సశేషంగా మిగిలిన ప్రశ్నే. ఖగోళ శాస్త్రవేత్తల వద్ద దీని తాలూకు సమాచారం ఏమీ లేదు. భూమి కాకుండా మరే ఇతర గ్రహంపై జీవం, జీవనం సాధ్యమేనా? విశ్వంలో ఎక్కడైనా ఉన్న ఖగోళ పదార్థాలు ఆవాసయోగ్యమైన లక్షణాలను కలిగి ఉండే అవకాశాల గురించి వివిధ దేశాల ఖగోళ శాస్త్రవేత్తలు అనేక ప్రయోగాలు చేస్తున్నారు. భూమికి సమీపంలోనే ఉన్న అంగారక గ్రహం జీవంకు మద్దతును ఇచ్చే అవకాశాలు ఉండవచ్చుననే ఊహ ఉంది. కొన్ని కోట్ల సంవత్సరాల క్రితం అంగారకునిపై ఉన్న వాతావరణం నేటి భూ వాతావరణాన్ని పోలి ఉండేదని శాస్త్రజ్ఞులు నమ్ముతున్నారు. ఈ నేపథ్యంలోనే అమెరికా అంతరిక్ష సంస్థ నాసా అంగారక గ్రహంపైకి తిరగాడే బుల్లి రోబోలను పంపిస్తోంది.

సౌర కుటుంబంలో ఒకప్పుడు తొమ్మిది గ్రహాలు ఉండేవి. ప్రస్తుతం అష్టగ్రహాలే. చెక్ రిపబ్లిక్ దేశంలో ప్రేగ్ నగరం కేంద్రంగా పని చేస్తున్న అంతర్జాతీయ ఖగోళ యూనియన్ (ఐఎఎల్) గ్రహాల పునఃనిర్వచనం ప్రకారం ప్లూటోను గ్రహస్థాయి నుండి 2006లో తీసివేశారు. కొత్త నిర్వచనం ప్రకారం దానికదే నక్షత్రం కాకుండా మరో నక్షత్రం చుట్టూ తిరుగుతూ, తగినంత ద్రవ్యరాశి వలన, గురుత్వాకర్షణ కారణంగా ఇంచుమించు గోళాకృతిని పొంది, దాని పరిసరాలను ప్రభావితం చేస్తూ ఉండే ఖగోళ పదార్థమే గ్రహస్థాయిని పొందుతుంది. ఈ లక్షణాలు లేని ఖగోళ పదార్థాలను గ్రహాలుగా గుర్తించరు. కాబట్టి ప్లూటో గ్రహస్థాయిని కోల్పోయింది. ప్లూటో మాదిరి ఖగోళ పదార్థాలు చాలా ఉన్నాయి. ఇటువంటి వాటిని కుబ్జ లేదా మరుగుజ్జు గ్రహాలంటారు. సౌర కుటుంబంలో ఎనిమిది గ్రహాలు వరసగా బుధుడు (మెర్క్యూరీ), శుక్రుడు (వీనస్), భూమి, అంగారకుడు (మార్స్), బృహస్పతి లేదా గురు (జూపిటర్), శని (సాటర్న్), యూరేనస్, నెప్ట్యూన్. భూమిపై ఆవాసాలను ఏర్పర్చుకున్న మనకు దాని గురించి చాలా విషయాలు తెలుసు. తెలియని, తెలిసీ తెలియని విషయాలు కూడా ఉన్నాయి. భూమిపై నివసించే ప్రాణకోటికి నీరు ప్రధాన వనరు. నీరు లేకపోతే జంతు, వృక్ష జాలాలు లేనట్టే. అందుకే నాసా వంటి సంస్థల ప్రముఖ నినాదం 'నీటి జాడను తెలుసుకుందాం'. బహుళజాతి బడా కంపెనీల లాభాపేక్ష, పాలకవర్గాల నిర్లిప్తత, భారీ పరిశ్రమల నిర్లక్ష్యం, చదువరుల అలసత్వం, గత్యంతరం లేని సామాన్య ప్రజానీక అవసరాలు వెరసి భూగర్భ జలాలు, నదీ నదాలు, చెరువులు, కుంటలు, కొలనులు, సరస్సులు, కాలువలు, వాగులు, జలపాతాలు, సముద్రాలు – మొత్తంగా నీటి వనరులు ప్రమాద స్థాయికి చేరుకుంటున్నాయి. మరో గ్రహంలో జీవించాలంటే అక్కడా జలం కావాల్సిందే. జీవికకు అనుకూల వాతావరణ పరిస్థితులు ఏ గ్రహంలో ఉన్నాయి? ఈ ప్రశ్నలకు సమాధానంగా అందరి ఆలోచనలు అంగారక గ్రహం వైపు ఉన్నాయి. నాసా అంచనాల ప్రకారం సుమారు 350 కోట్ల సంవత్సరాల క్రితం అంగారకుని వాతావరణం నేటి భూవాతావరణానికి దగ్గరగా ఉండేది. ప్రత్యామ్నాయ మానవ గ్రహాంతర ఆవాసాల పరిశోధనలో అమెరికా, రష్యా, జపాన్, ఐరోపా ప్రయోగాలలో భాగంగా అంగారక గ్రహం వాతావరణం, భూవిజ్ఞానంపై అధ్యయనం కొరకు లాండర్లు, ఆర్బిటర్లు, రోవర్లను పంపిస్తున్నాయి.

ఎరుపు రంగులో సాధారణ కంటికి కనిపించే అంగారక గ్రహం అరుణ గ్రహంగా, కుజుడుగా ప్రసిద్ధి. గ్రీకులు, రోమన్లు, భారతీయ ఖగోళవేత్తలు ఆకాశంలో తాము గమనించిన ఖగోళ వస్తువులకు దేవుళ్ళ, దేవతల పేర్లు పెట్టారు. ఆకాశంలో ఎరుపు రంగు (తుప్పు)లో కనిపించే అంగారకుడు యుద్ధ దేవుని కోపాగ్నికి ప్రతిరూపంగా గ్రీకులు, రోమన్లు భావించేవారు. రోమన్ యుద్ధ దేవుడు 'మార్స్'. గ్రీకుల యుద్ధ దేవుని పేరు ఏరిస్. అందుకే గ్రీకులు అంగారకుడును 'ఏరిస్' అంటారు. భారతీయ శాస్త్ర ప్రకారం భూమి పుత్రుడు అంగారకుడు. శాస్త్రీయ పరిభాషలో గ్రహాలన్ని ఖగోళ పదార్థాలు. వాటి వాటి వాతావరణాలను బట్టి వివిధ రంగులలో గ్రహాలు మనకు కనిపిస్తాయి.

కాల్పనిక సాహిత్యంలో కూడా అంగారక గ్రహానికి మంచి పలుకుబడి ఉంది. 1880లలోనే అంగారకుడుని టెలిస్కోప్ సహాయంతో చూసిన పూర్వీకులు దానిపై ఉన్న చారలను అంగారక గ్రహ వాసులు నిర్మించిన నదులుగా భావించేవారు. వైజ్ఞానిక కాల్పనిక సాహిత్యంలో గ్రహాంతర వాసులు చాలా తెలివైనవారిగా, చెడ్డవారిగా, భూమిని నాశనం చేసేవారిగా ప్రచారం అయ్యారు. అంగారక వాసులు భూమిపై దాడిచేసి ఆక్రమించుకునే కథనంతో ఎచ్.జి. వెల్స్ 'ది వార్ ఆఫ్ వరల్డ్స్' నవలను రాశాడు. దీని ఆధారంగా ప్రసారం అయిన రేడియో కార్యక్రమాలు ప్రజలలో భయాందోళనలను రేకెత్తించాయి. అంగారక గ్రహ చందమామల కథాంశంగా జొనాథన్ స్విఫ్ట్ రాసిన 'గలివర్ ట్రావెల్స్',

'అంగారక కథలు' పేరుతో ఎడ్గార్ రైస్ బరోగ్స్ ధారావాహిక నవలలను రాసారు. ఈ నవలలలోని నాయకుడు అంగారక గ్రహం చేరుకొని అక్కడి సంస్కృతికి అలవాటు పడతాడు. 'స్ట్రేంజర్ ఇన్ స్ట్రేంజ్ ల్యాండ్' నవలా నాయకుడు అంగారకుని దగ్గర నుండి భూమికి చేరుకొని ఇక్కడ అలవాట్లను నేర్చుకుంటాడు. కాల్పనిక సాహిత్య ప్రక్రియను పక్కన పెడితే ఇప్పటి వరకూ వివిధ మార్గాల ద్వారా సేకరించిన సమాచారం ప్రకారం అంగారక వాతావరణం ప్రస్తుతం జీవానికి ఏ మాత్రం అనుకూలంగా లేదని తెలుస్తుంది.

అంగారక గ్రహం ఉపరితలం 'రెగోలిత్'లో ఇనుప ఆక్సైడ్ రూపంలో ఉన్న ఖనిజాల మూలంగా ఆ గ్రహం 'ఇనుప తుప్పు' రంగులో కనిపిస్తుంది. అంగారక వాతావరణం విషపూరితంగానూ, రేడియేషన్‌తో, గోతులు, రాళ్లతో నిండి, శీతలంగా ఉండి ప్రాణుల మనుగడకు ప్రతికూలంగా ఉంటుంది. అంగారకునిపై వాతావరణ పీడనం తక్కువ కాబట్టి ద్రవ రూపంలో నీరు ఉండే అవకాశం లేదు. అంగారక వాతావరణంలో సుమారు 95.32 శాతం కార్బన్ డై యాక్సైడ్, 2.7 శాతం నత్రజని, 1.6 ఆర్గాన్ వాయువులు ఉన్నాయి. ఆ గ్రహం సాంద్రత కూడా తక్కువే. అంగారక నేల క్షారప్రాయమైనది. అక్కడ మెగ్నీషియం, పోటాషియం, సోడియం వంటి మూలకాలు ఉన్నాయి. భూమి కంటే సూర్యుడు నుండి దూరంగా ఉండడం వలన అంగారక గ్రహం శీతలంగా సగటు ఉష్ణోగ్రత సున్నా కన్నా తక్కువగా ఉంటుంది. అంగారక కక్ష్య అతి దీర్ఘ వృత్తాకారం కావడం వలన సూర్య కిరణాలు గ్రహమంతా ఒకే విధంగా పడవు). అంగారకుడు భూమి కంటే పరిమాణంలో చిన్నవాడు. భూ భ్రమణాక్షం 23.5 డిగ్రీలు వంగి ఉంటే అంగారక అక్షం 25 డిగ్రీలు వంగి ఉంటుంది. మనకంటే అంగారక గ్రహం రోజు సుమారు నలభై నిమిషాలు ఎక్కువ. అంగారక రోజును 'సోల్' అంటారు. కాబట్టి అంగారక గ్రహ ప్రయోగాలకు పంపే పరికరాల కాలంను సోల్‌లోనే కొలుస్తారు. మనకు ఒకే చందమామ ఉంటే అంగారకునికి రెండు చందమామలు ఉన్నాయి. సౌర కుటుంబంలో అత్యంత ఎత్తైన శిఖరాలు (ఎవరెస్ట్ కంటే ఎత్తు అయిన ఒలంపస్ మన్స్), లోతైన, పొడవైన లోయలు (మారినెర్ లోయ), అతి పెద్ద అగ్ని పర్వతాలకు నిలయం అంగారక గ్రహం. అంగారక రాళ్ల అడుగు భాగంలో నీటి జాడ కోసం అన్వేషణ కొనసాగుతోంది. అంగారక గ్రహ ఉపరితలంలో ఉన్న వికిరణ పొరను తొలిగిస్తేనే అది నివాస యోగ్యం కాగలదు. అందుకు ఇప్పటి నుంచే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. భూధృవాల వద్ద మంచు టోపీలు ఉన్నట్లే అంగారకగ్రహం ధృవాల వద్ద చల్లబడి ఘన రూపంలోకి మారిన కార్బన్ డై యాక్సైడ్ (డ్రై ఐస్) మంచు ముద్దలు ఉన్నాయి.

అంగారక గ్రహ అధ్యయనం కోసం అమెరికా, రష్యా, యూరోపియన్ యూనియన్, జపాన్ ఇప్పటి వరకూ సుమారు 40 ప్రయోగాలు చేశాయి. వీటిలో కొన్ని విజయవంతం అయ్యాయి. మరికొన్ని విఫలం అయ్యాయి. అంగారక గ్రహ పరిశోధనలకై సాగుతున్న యాత్రల ముఖ్య లక్ష్యం గ్రహంతరవాసం. నాసా చేపట్టిన దీర్ఘకాల అంగారక గ్రహ అన్వేషణ కార్యక్రమం ఆ గ్రహంపై నీటి చరిత్రను తెలుసుకొనేందుకు నాలుగు ముఖ్య లక్ష్యాలను నిర్దేశించుకుంది. మొదటి లక్ష్యం అంగారకగ్రహంపై అసలు ఎప్పుడన్నా జీవం ఉనికి ఉందా అని నిర్దేశించడం. రెండోది ఆ గ్రహ వాతావరణ స్వభావాన్ని తెలుసుకోవడం, మూడోది అంగారక నేల స్వభావాన్ని అర్థం చేసుకోవడం కాగా చివరిది మానవులను అంగారక గ్రహవాసానికి తయారు చేయడం. అంగారక గ్రహం చుట్టూ కక్ష్యలో తిరుగుతూ దాని ఛాయా చిత్రాలను పంపే 'ఆర్బిటర్ల'ను మొదట అంచెలో ఉపయోగించారు. అంగారక ఉపరితలంపై దిగి నిలకడగా ఉంటూ అక్కడి సమాచారాన్ని భూ కేంద్రానికి పంపే లాండర్లు రెండో రకం కాగా, అంగారక గ్రహంపై దిగి అక్కడ తిరుగుతూ అనేక పరీక్షలు జరిపి సమాచారాన్ని అందించే మూడో రకానికి చెందినవి రోవర్లు. రోవర్ల ప్రధాన లక్ష్యాలను క్లుప్తంగా ఇక్కడ చూద్దాం.

వివిధ రకాల రాళ్లు, నేలలను పరిశీలించి గతంలో అంగారక గ్రహంపై సాగిన నీటి చర్యలను (అవక్షేపం, బాష్పీకరణ, హైడ్రోథర్మల్ చర్యలు) కనుగొనడం, రోవర్లు దిగిన ప్రాంతాలలో ఖనిజాలు, రాళ్లు రసాయన రచనను తెలుసుకోవడం, కక్షలో తిరుగుతూ అంగారక గ్రహంపై 'ఆర్బిటర్లు' అందించిన సమాచారాన్ని ధృవీకరించడం, అక్కడ జీవం సాధ్యమేనా అని పరిశీలించడం వీటి ప్రధాన కార్యక్రమం. అయితే ప్రత్యక్షంగా అంగారక గ్రహంపై జీవం గురించి ఎటువంటి సమాచారాన్ని రోవర్లు ఇవ్వలేవు. పరోక్షంగా అక్కడ పరిస్థితులను బట్టి ఒక అవగాహనకు రావలసి ఉంటుంది. ఇప్పటి వరకు అంగారక గ్రహం పరిశోధనలో పాలుపంచుకున్న కొన్ని అంతరిక్ష అంగారక కార్యక్రమాల పట్టిక చూపిస్తుంది.

2012 ఆగస్ట్ 6న అంగారక గ్రహంపై దిగిన క్యూరియాసిటీ రోవర్ రోబో ప్రస్తుతం అందరి దృష్టినీ ఆకర్షించింది. అమెరికా అంతరిక్ష సంస్థ నాసా 26 నవంబర్ 2011లో కె.పి. కెనవెరల్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ నుంచి అట్లాస్ వి రాకెట్ ద్వారా ప్రయోగించిన మార్స్ సైన్స్ లాబొరేటరీ అనుకున్న ప్రకారం 'క్యూరియాసిటీ' రోవర్‌ను 6 ఆగస్ట్ నాడు అంగారక గ్రహంపై విజయవంతంగా దించింది. 35.2 కోట్ల మైళ్ల దూరంలో ఉన్న క్యూరియాసిటీ పంపే సంకేత సమాచారం భూమికి అందడానికి సుమారు 13.8 నిమిషాలు పడుతుంది. ఈ బుల్లి రోబో పొడవు మూడు మీటర్లు, వెడల్పు 2.8 మీటర్లు, ఎత్తు 2.1 మీటర్లు. దీని రోబో చెయ్యి 2.1 మీటర్లు పొడవు ఉంటుంది. నిర్ణయించిన జీవితకాలం 98 వారాలు. సాధ్యమైతే ఆ తరువాత పొడిగింపు. క్యూరియాసిటీలో అత్యంత అధునాతన ప్రయోగ పరికరాలను ఉంచారు. ఇది అంగారక గ్రహంలోని గేల్ బిలంలో దిగి తన ప్రయాణాన్ని మెల్లగా సాగిస్తుంది. అంగారక గ్రహ వాతావరణం, భూగర్భ పరిశోధనలు, పరిసరాలు, జీవ ధాతువు ఉనికి తెలుసుకోవడానికి క్యూరియాసిటీలో మూడు కెమెరాలు, నాలుగు వర్ణమాపకాలు, రెండు వికిరణ శోధనాకారిణులు, ఒక పరిసరాల సెన్సర్, ఒక వాతావరణ సెన్సర్లను ఉంచారు. మార్స్ డీసెంట్ ఇమేజర్ (ఎంఎఆర్‌డిఐ) రంగు వీడియో 'క్యూరియాసిటీ' దిగుతున్నప్పుడు తీసి భూమికి పంపిస్తుంది. మాస్ట్‌కామ్ కెమెరా అంగారక మైదాన ప్రాంత ఛాయా చిత్రాలు, వీడియోలను తీస్తుంది. రోవర్‌ను నడపడానికి కావలసిన కార్యక్రమాలను నిర్దేశించడానికి ఇది ఉపయోగపడుతుంది. అంగారకునిపై గల ఖనిజాలు, రాళ్ల నిర్మాణంను అందించడానికి మార్స్ హ్యాండ్ లెన్స్ ఇమేజర్ (మహలి)

సంవత్సరం	ప్రయోగం	దేశం	వివరాలు
1960–73	మార్స్–2,3,4,5,6,7	రష్యా	కొన్ని విఫలం చెందాయి. కొన్ని అంగారక గ్రహం ఛాయాచిత్రాలను పంపించాయి.
1964	మారినెర్–3	అమెరికా	
1969	మారినెర్ – 4,6,7	అమెరికా	మారినెర్–4 అంగారక గ్రహం ఉపరితల చిత్రాలను మొదటిసారిగా భూమికి పంపించింది. సుమారు 21 చిత్రాలను సేకరించింది. అంగారక గ్రహంపై జీవం లేదని, బంజరు భూమి అనే అవగాహన వచ్చింది.
1971	మారినెర్–9	అమెరికా	అంగారక గ్రహం చుట్టూ (ఇతర గ్రహాలపై తిరిగిన మొదటి అంతరిక్ష నౌక) అరుణ గ్రహంపై అగ్నిపర్వతాలు ఉన్నట్లు రుజువు
1975	వైకింగ్ 1, 2	అమెరికా	అంగారక గ్రహ ఉపరితల జ్ఞానానికి సంబంధించిన అవగాహనను పూర్తిగా మార్చివేసింది. అరుణగ్రహంపై దిగిన (1976లో) మొట్టమొదటి లాండర్. అత్యంత సమీప ఉపరితల ఛాయా చిత్రాలను పంపించాయి.
1988	ఫోబోస్ – 1,2	రష్యా	మొదటిది విఫలం కాగా, రెండోది సుమారు 38 చిత్రాలను పంపిన తరువాత సంబంధాలు కోల్పోయింది.
1992	మార్స్–అబ్జర్వర్	అమెరికా	విఫలం
1996	మార్స్ పాత్ ఫైండర్	అమెరికా	లాండర్, రోవర్లు ఉన్నాయి. లాండర్ సుమారు 16,500 చిత్రాలను, రోవర్ 500 చిత్రాలను భూమికి పంపించింది. దీనిలో రోవర్ సౌజర్నెర్ చక్రాల రోబో నీళ్ల ఉనికి, రాళ్ల విశ్లేషణపై సమాచారం అందించింది.
1996	మార్స్ గ్లోబల్ సర్వేయర్	అమెరికా	తొమ్మిది సంవత్సరాలు పైగా కక్ష్యలో తిరిగి బ్యాటరీ విఫలం కావడంతో నిశ్శబ్దం అయ్యింది.
1998	నోజోమి (ప్లానెట్–బి)	జపాన్	–
1998	మార్స్ క్లైమేట్ అబ్జర్వర్	అమెరికా	1999లో సంబంధాలు తెగిపోయాయి.
2001	మార్స్ ఒడిస్సీ	అమెరికా	మార్స్ వాతావరణం వికిరణ పూరితమని రాళ్లలో నీటి మంచు సమాధి అయ్యి ఉండవచ్చునని కనుగొంది. ప్రస్తుతం ఇంకా సేవలు అందజేస్తుంది.
2003	ఫోనిక్స్ రాండర్	అమెరికా	మార్స్ ఉత్తర ప్రాంతాలలో నీళ్ల ఉనికిపై సమాచారం
2003–04	స్పిరిట్, ఆపర్చునిటీ (ఎంఇఆర్–ఎ, ఎంఇఆర్–బి)	అమెరికా	గ్రహానికి ఇరువైపులా దిగిన రెండు లాండర్స్. సుమారు రెండూ కలిపి రెండున్నర లక్షల చిత్రాలను పంపాయి. గ్రహంపై పూర్వ నీటి చర్యలపై ప్రయోగాలు చేసాయి. హైమటైట్ ఖనిజం ఉనికిని తెలియజేసాయి. 2010లో ఇసుకలో కూరుకుపోయిన స్పిరిట్ సంకేతాలను పంపడం ఆపివేసింది.
2005	మార్స్ రికనైస్సాన్ ఆర్బిటర్	అమెరికా	అధునాతన పరికరాలు గల ఇది అన్నింటి కంటే ఎక్కువ సమాచారం సేకరించింది.
2005	మార్స్ ఎక్స్‌ప్రెస్	ఐరోపా అంతరిక్ష ఏజెన్సీ	
2011	ఫోబోస్ గ్రుంట్ యన్‌గువో–1	రష్యా చైనా	విఫలం విఫలం
2012	మార్స్ సైన్స్ లాబ్ – క్యూరియాసిటీ	అమెరికా	అద్భుతమైన వర్ణ చిత్రాలు, వీడియోలను పంపించడం ప్రారంభించింది.
2013	మావెన్ (ఎంఎవిఇఎన్)	అమెరికా	అంగారక పై వాతావణంపై అధ్యయనానికి, వాతావరణ వాయువులను ఏ విధంగా అంగారకుడు వదిలి వెళ్లాయని తెలుసుకొనేందుకు ఉద్దేశించింది.
2013	మార్స్ ఆర్బిటర్ మిషన్	ఇండియా	అంగారక వాతావరణంలో కర్బన్ అణువుల ఉనికి ద్వారా ఆ గ్రహ భూగర్భ రచనను తెలుసుకోవడం

ఉపయోగపడుతుంది. రసాయన శాస్త్ర కెమెరా కెమ్‌కామ్ రోవర్‌లో ఉంచిన లేజర్ కాంతి సమీప రాళ్లపై పడేటట్లు చేసి వాటి రసాయన రచనను తెలుసుకుంటుంది. ముందుగా గుర్తించిన రాయిపై ప్రయోగాలను చేసే విధంగా భూమి నుండి శాస్త్రజ్ఞులు ఆదేశాలు పంపుతారు. ప్రస్తుతం ఆ రాయిని శాస్త్రవేత్తలు నిర్ధారించి కెమ్‌కామ్ ద్వారా రోవర్ భవిష్యత్ పనిని ఇచ్చారు. మానవ సహిత అంగారక గ్రహ యాత్ర కోసం అక్కడి వాతావరణంలో ఉన్న అధిక శక్తి వికిరణాలను (గామా కిరణాలు, ప్రోటానులు, ఇతర మూలకాల ఆయానులు తదితర అంశాలను) కొలవడానికి రేడియేషన్ డిటెక్టర్ (ఆర్ఎడి) లను మొదటిసారిగా వాడుతున్నారు. ఈ సమాచారాన్ని ఉపయోగించి అంగారక గ్రహ యాత్రికులపై వికిరణ ప్రభావాలను అంచనా వేస్తారు. అంగారక గ్రహంపై రెండు ప్రాంతాలలో ఉన్న ఖనిజాలలో, నీటి మంచులో నీటి జాడను తెలుసుకొనేందుకు రష్యా వినతితో ఉపరితలం, భూగర్భంలో ఉండే అతి సూక్ష్మ మంచును సైతం శోధించే సున్నితమైన డైనమిక్ ఆల్‌బెడో ఆఫ్ న్యూట్రాన్స్ (డిఎఎన్) పరికరాన్ని కూడా క్యూరియాసిటీలో ఉంచారు.

స్పెయిన్ సహకారంతో రోవర్ చుట్టూ, వాతావరణ పీడనం, ఆర్ద్రత, అతినీలలోహిత కిరణాల తీవ్రత, గాలి వేగం, దిశ, గాలి ఉష్ణోగ్రత, భూ ఉష్ణోగ్రత వివరాలను రోజువారిగా, రుతువుల వారిగా సేకరణకు రోవర్ ఎన్విరాన్‌మెంట్ మానిటరింగ్ స్టేషన్ (రెమ్స్)ను ఉంచారు.

ఇన్ని అద్భుతమైన ప్రయోగ పరికరాలు, తెలియని ప్రాంతంలో కదలాడుతున్న రోవర్ నియంత్రణకు ఉపయోగించే కంప్యూటర్, దాని సాఫ్ట్‌వేర్ మనం ఉపయోగించే ఖరీదైన సెల్‌ఫోన్ కంటే చిన్నదే అయితే దాని సామర్థ్యం అమోఘం. అంగారక గ్రహ వాతావరణంలోని అయానులు, ప్రోటానులు, విశ్వకిరణాలు దీన్ని ఏమీ చేయలేవు. బిఎఇ సంస్థ తయారు చేసిన ఆర్ఎడి 750 పవర్ పిసి మైక్రో ప్రాసెసర్ క్యూరియాసిటీకి ప్రధాన కంప్యూటర్ చిప్. రోవర్‌లో ఉంచిన రెండు కంప్యూటర్లలో ఒకటే ఎప్పుడూ పనిచేస్తుంది. రెండింటిని బిఎఇ ఆర్ఎడి 750తోనే తయారు చేశారు. దీనికి 2జి బి ఫ్లాష్ మెమొరీ, 256 ఎం.బి. రామ్, 256 కెబి ర్యామ్ మాత్రమే ఉన్నాయి. ప్రయోగానికి అవసరమయ్యే సాఫ్ట్‌వేర్‌ను అక్కడ దిగాక తీసివేసి కొత్త సాఫ్ట్‌వేర్‌ను ఎక్కించడం ప్రారంభించారు. గ్రహతలంపై తిరుగుతూ చేసే పనులకు అవసరమయిన సాఫ్ట్‌వేర్‌ను దాంట్లోకి ఎక్కించారు. పరిసరాలను కచ్చితంగా గమనించి ప్రమాదాలను పసిగట్టి – తనకున్న కెమెరా కళ్లతో అంగారక గ్రహంపై దిగడానికి చూపించే నమూనా వీడియోను ఇంటర్నెట్‌లో www.youtube.com/watch\vea_ljhhtka6c లో దర్శించవచ్చు. ఎన్నో జాగ్రత్తలు, అత్యంత కఠిన పరీక్షల తరువాత సుమారు 2.5 బిలియన్ అమెరికా డాలర్ల ఖర్చుతో 'క్యూరియాసిటీ' అంగారక గ్రహంపై విహరిస్తోంది. భవిష్యత్‌లో పంపే ఇతర రోవర్లు మరింత సమాచారాన్ని అందించి అంగారక గ్రహంపై స్పష్టమైన అవగాహనను ఇస్తాయి.

అత్యంత అవసరమైన సందర్భంలో మానవజాతి మనుగడ కొనసాగింపుకు అంగారక గ్రహాంతరయానం అవసరం కావచ్చు. అయితే ఇప్పటికే భూమిపై మనం జీవనం కొనసాగిస్తున్నాం. అద్భుతమైన వాతావరణంలో జీవ జాలానికి ఆవాసమైన భూ వాతావరణ వ్యవస్థను ఎంతో వేగంగా 'అభివృద్ధి' పేరుతో ధ్వంసం చేస్తున్నాం. భూమిని కాపాడవలసిన బాధ్యత అందరిదీ. అయితే ప్రభుత్వాల బాధ్యతే అధికం. జీవావరణానికి అవసరమైన నీటివనరులను, అడవులను, పర్వత శ్రేణులను, ఓజోన్ పొరను నాశనం చేస్తున్నది ప్రభుత్వ విధానాలే. అంగారక గ్రహంపై నివాసానికి ముందే, భూమిని ధ్వంసం చేసి (మన దగ్గర అణ్వాయుధాలున్నాయి బహు పరాక్) ఇతర గ్రహాలపై ఆవాసం కోసం పరిశోధనలు ఎంతవరకూ సబబు అనేది బిలియన్ డాలర్ల ప్రశ్న. భూమిపై జీవనం, జీవితం మరింత గుంభనంగా, ప్రయోజనపరంగా, సామాన్యులకు సులువుగా, బీదాబిక్కి, పేద, సాదా లేకుండా సమ సమాజ స్థాపనకు ప్రయోగాలు, పరిశోధనలు చేసినట్లయితే గ్రహాంతర వాసం ప్రస్తుతానికి అవసరం లేదు. సైన్సు పరిశోధనలు, ప్రయోగాలు రాజకీయ కార్యక్రమాలైతే, పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద విధానాల పథకాలైతే కొత్త గ్రహాలలో ఆవాసయోగ్యమైన వాటిని త్వరగా కనిపెట్టేసి వాటిని తొందరగా 'అభివృద్ధి'తో ధ్వంసం చేసేస్తాయి. ఈ భయం ఎందుకంటే యుద్ధాల కాలంలోనే సైన్సు విజ్ఞానం అభివృద్ధి చెందింది. మొదటగా చాలా సైన్సు (డైనమైట్, అణుబాంబు మొదలైనవి) ప్రయోగాలు యుద్ధావసరాల కోసం జరిగాయి. శాంతి కోసం సాధారణ ప్రజలే ఉద్యమించాలి. వాటికి మేధావులు మద్దతు ఇవ్వాలి. సమాజం ప్రస్తుతం కొత్త గ్రహాల నివాసం కోసం ఎదురు చూడడం లేదు. భూమిపై తమ ఆవాస స్థలాలను రక్షించుకునే ప్రయత్నంలో కోట్ల మంది ప్రజలు ప్రపంచ వ్యాప్తంగా పోరాటాలు చేస్తున్నారు. భూమిని రక్షించే వారే భూవాసులకు రక్షణ.

(రచయిత అసిస్టెంట్ ప్రొఫెసర్ (సీనియర్), డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజిక్స్, వాసవి ఇంజనీరింగ్ కాలేజి) వీ

కావ్య పబ్లిషింగ్ హౌస్

కావ్య పబ్లిషింగ్ హౌస్
12-13-830/13/బి, ఫ్లాట్ నెం.103,
ఎస్.ఎస్.ఆర్. అపార్ట్‌మెంట్స్, గోకుల్‌నగర్, తార్నాక,
సికింద్రాబాద్ - 500 017. ఫోన్ : 9989599135


KAVYA PUBLISHING HOUSE
A/c. 060411100000681
Andhra Bank, Vidyanagar Branch,
IFSC Code No. ANDB 000 0604

పుస్తకాలు రిజిస్టర్ పోస్టులో పంపిస్తాం. ఎం.ఓ. పద్ధతి లేదు. డి.డి.లు మాత్రమే పంపాలి. లేదా మా అకౌంట్‌లో డబ్బులు జమ చేయండి. మా ఫోన్ నెంబర్‌కి మీ వివరాలు ఎస్.ఎం.ఎస్. చేయండి. లేదా మా అడ్రసుకి ఉత్తరం ద్వారా లేదా ఇమెయిల్ ద్వారా వివరాలు తెలియచేయండి.
email : kavyaph11@gmail.com

తెలుగు వాక్యం
చేకూరి రామారావు

తెలుగు సాహిత్య ప్రపంచానికి విమర్శకుడుగా పరిచయమైన చేకూరి రామారావు ప్రధానంగా శిక్షణపొంది మౌలికపరిశోధన చేసింది భాషాశాస్త్రంలో. ఆయన తెలుగు వాక్య నిర్మాణంపై చేసిన పరిశోధనలను భాషా పరిశోధకులు విలువైనవిగా పరిగణిస్తారు. ఆయన చేసిన భాషా పరిశోధనకు 'తెలుగు వాక్యం' అనే పుస్తకం సంగ్రహ రూపం. అనతి కాలంలోనే ఇది పండితుల మన్నన పొందింది. కేంద్ర సివిలు సర్వీసు పరీక్షలకు, రాష్ట్రంలో వివిధ విశ్వవిద్యాలయాల కోర్సులకు, ఇతర పోటీ పరీక్షలకు పాఠ్యగ్రంథమైంది.

1/8 డెమ్మి సైజ్ 144 పేజీలు రూ. 80/-



Advt.

బ్యాంకుల మొండి బాకీలు లక్ష కోట్లు!

మొండి బకాయిలతోనూ, పాలక విధానాల ఫలితంగానూ రోజు రోజుకూ పతనం అవుతున్న బ్యాంకింగ్ వ్యవస్థ తీరు తెన్నులను వివరిస్తున్నారు **వి. హనుమంతరావు**

రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ దువ్వూరి సుబ్బారావుకు ధరల పెరుగుదల అంటే ఏమిటో క్షవరం చేసే వ్యక్తి ద్వారా తెలిసొచ్చింది. ఆయన నెత్తిన జుట్టు తగ్గిపోతున్న కొద్దీ క్షవరం ఛార్జీలు పెరిగిపోతు న్నాయని వాపోయారు. క్షవరం ఛార్జీ రు.150లు చెల్లిస్తున్నారట. ఆయన రిజర్వ్ బ్యాంకు గవర్నరాయె. ఆ పాటి ఖర్చు చేయకపోతే, అందరిలాగే ఆయనా చెల్లిస్తే ఆయనకు నామోషీ కదా. అలా నామోషీకి ఆయన గురికాకూడదనే మంగలి అంత వసూలు చేస్తున్నాడు. రిలయన్స్ అంబానీ అందరిలాగే ఇండియాలో తయారయ్యే దిక్కుమాలిన కారులో ప్రయాణిస్తే అంబానీ గొప్పేముంది? ప్రపంచంలో కెల్లా అత్యంత ఖరీదైన కారులోనే ప్రయాణం చేస్తేనే, 28 అంతస్తుల భవనంలో నివసిస్తేనే హోదాకు సరిపోతుంది. గవర్నర్ కాకముందు ఆయన మన రాష్ట్రానికి ఆర్థిక శాఖ కార్యదర్శిగా ఉన్నపుడు చాలా సార్లు కలిసా. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించిన సమాచార గని ఆయన.

జూలై 1969లో ఇందిరా గాంధీ బ్యాంకులను జాతీయం చేసిన విషయం గుర్తుకొచ్చింది. అంతవరకూ బ్యాంకులన్నీ ప్రైవేట్ రంగంలో ఉండేవి. 43 సంవత్సరాల తర్వాత మళ్లీ ప్రైవేటీకరణ చేయడానికి ప్రభుత్వం పావులు కదుపుతోంది. భూమి గుండ్రంగా ఉంది కదా. అప్పట్లో జాతీయం చేయడం కూడా దాని మీద నమ్మకంతో కాదు. ఆ రంగాన్ని ప్రజోపయోగం చేద్దామనే లక్ష్యంతోనూ కాదు. కాంగ్రెస్‌లో ఒక వర్గం ఇందిరాగాంధీ మీద ధ్వజమెత్తింది. అప్పటికే దేశంలో వామపక్షాలు బ్యాంకులను జాతీయం చేయాలని ఆందోళన చేస్తున్నాయి. ఆ నేపథ్యంలో బ్యాంకులను జాతీయం చేసి తన పార్టీలో ప్రతిపక్షం నోరు నొక్కేసింది. ఆ తర్వాత 1971లో బంగ్లాదేశ్ యుద్ధం కూడా ఆ కోవలోనిదే. జాతీయం చేసిన బ్యాంకింగ్ రంగం మూడు పువ్వులూ, ఆరు కాయలుగా విస్తరించింది. పట్టిక చూడండి

	1969	31.3.2012 (ఆర్ఆర్‌బిలు కాక జాతీయ బ్యాంకులు)
శాఖలు	8268	82306
గ్రామీణ శాఖలు	1833	24701
డిపాజిట్లు (రు. కోట్లు)	4665	43,72,985
రుణాలు (రు. కోట్లు)	3609	33,05,632

జాతీయం చేయక ముందు ఉన్నతవర్గాలకే పరిమితమైన బ్యాంకింగ్ రంగం, యావన్మంది ప్రజలకు చేరువైంది.

అమెరికాలో 2008లో కుప్పకూలిన బ్యాంకింగ్ రంగం మొత్తం ప్రైవేట్ రంగంలో ఉన్న విషయం గమనంలో ఉంచుకుంటే, ప్రస్తుతం మన దేశ బ్యాంకింగ్ రంగం ప్రైవేటీకరణ వైపు, అలాగే విదేశీ బ్యాంకులు తమ శాఖలను ప్రారంభించడం, జాతీయ బ్యాంకింగ్ రంగంలో దగ్గర దగ్గరగా 50 శాతం ప్రైవేట్ రంగాన్ని అనుమతించడం ఎంత అప్రయోజనకరమైనదో అర్థమవుతుంది. బ్యాంకులు ప్రభుత్వ రంగంలోనే ఉండడం ఎంత ప్రజోపయోగకరమైనదో వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, ఆరోగ్యం, విద్య, మౌలిక సౌకర్యాలు, పేదరికం తగ్గింపు, మహిళా శక్తి లాంటి రంగాలకు బ్యాంకింగ్ రంగం అందజేస్తూ వచ్చిన నిధులే తార్కాణం. అయితే ఇంకా ఎంతో చేయాల్సి ఉంది. ప్రైవేటీకరిస్తే, ఈ వ్యవస్థలన్నిటికీ ఈపాటి సహాయం అంది ఉండేదా? ఈపాటి ఆర్థిక సహాయం అందిస్తూనే 19 ప్రభుత్వ రంగ బ్యాంకులు మార్చ్ 2012 నాటికి రు. 32,099 కోట్లు నికర లాభం సంపాదించాయి. బ్యాంకులను విజాతీయం చేస్తే ఈ లాభం అంతా ప్రైవేట్ రంగానికి దక్కి ఉండేది.

ఒక్క 2011–12లోనే ప్రభుత్వ రంగ బ్యాంకులు సుమారు ఐదువేల శాఖలను ప్రారంభించాయి. ప్రపంచ ఆర్థిక సంక్షోభం సంభవించిన 2008లోనే 2400 శాఖలు ఏర్పాటయ్యాయి. అన్నీ కలిపి ఈనాటికి 65 వేల శాఖలున్నాయి. ఆరు లక్షల గ్రామాలున్న మన దేశంలో 65 వేల శాఖలు ఏ మూలకు? రిజర్వ్ బ్యాంక్ లెక్కల ప్రకారమే 60 శాతం ప్రజలకు బ్యాంకింగ్ సౌకర్యం అందుబాటులో లేదు. ఆ సౌకర్యం అవసరం ఎంతగా ఉందంటే కేవలం ఒక్క అలహాబాద్ బ్యాంక్ గత సంవత్సరంలో లక్షా తొంభై వేల కోట్ల రూపాయల వ్యాపారం చేసింది. డిపాజిట్లు లక్ష కోట్ల రూపాయలు దాటాయి.

రూపాయి బిళ్లకు రెండు వైపులున్నట్లే, బ్యాంకింగ్ రంగాన్ని రెండో వైపు నుంచి చూస్తే ఆందోళనకరంగా ఉంది. బ్యాంకు నుంచి రుణాలు తీసుకొన్న 49 లక్షల మంది లక్ష కోట్లు తిరిగి చెల్లించలేదు. శాఖల సంఖ్య గణనీయంగా పెరిగిందే కాని, అందులో సింహభాగం పట్టణాల్లో, నగరాల్లోనే ప్రారంభించబడ్డాయి. వ్యవసాయరంగానికిచ్చిన రుణాలు వ్యవసాయేతర ఖర్చులకు ఉపయోగపడుతున్నాయని స్వయంగా రిజర్వ్ బ్యాంక్ గవర్నర్‌రే ఆందోళన వ్యక్తం చేశారు. అయితే అలా రుణాలను మళ్లించిన వారు సంపన్నవర్గాల నుంచి వచ్చిన వారేనని చెప్పాల్సిన పనిలేదు. చిన్న, సన్నకారు రైతులు కూడా రుణాలను వివాహాలకు, తదితర విధాలుగా ఖర్చు చేస్తున్నారన్న విషయాన్ని కాదనలేం. అయితే వారికి అందే రుణాలే చాలా తక్కువ. రిజర్వ్ బ్యాంక్ ప్రతీ సంవత్సరం బ్యాంకింగ్ గణాంకాలను ప్రకటిస్తోంది. ఆ గణాంకాలను పరిశీలిస్తే రుణం తీసుకొన్న చిన్న, సన్నకారు రైతుల సంఖ్య సంపన్నులతో పోలిస్తే ఎక్కువగా కనిపిస్తుంది. కాని వారికిచ్చిన రుణం చాలా చాలా తక్కువ. అలాగే పట్టణాల్లో, నగరాల్లో ఎక్కువ మొత్తం రుణాలు పారిశ్రామికవేత్తలకు, బడా వ్యాపారస్తులకే అందుతోంది. వారే మొండి

బాకీలకు ప్రధాన కారకులు. చిన్న, సన్నకారు రైతులు తీసుకొన్న రుణం సకాలంలో చెల్లించకపోతే, చెంబూ, తపాళా విసిరి అవతల పారేస్తారు. ఇందుకేనా బ్యాంకులను జాతీయం చేసింది? సంపన్నులతో పోల్చి చూస్తే వాళ్లకిచ్చే రుణమే, ఎంగిలి చెయ్యి విదిలించినంత మాత్రమే. అలాంటి వారు లక్ష కోట్ల రూపాయలు మొండి బాకీలకు కారకులు కాదు కదా!

పరిశ్రమల్లో పెట్టుబడులు పెట్టేవారు వారి జేబుల్లో నుంచి తీసి పెట్టుబడి పెట్టరు. పరిశ్రమల స్థాపనకు పూనుకున్న వారు మహా అయితే 10 శాతం మాత్రమే పెట్టుబడిగా పెడతారు. మిగతా పెట్టుబడి షేర్ హోల్డర్స్ నుంచి, విదేశాల నుంచి యంత్రాల రూపంలో వచ్చే డబ్బు, దేశంలో బ్యాంకులు ఇచ్చే రుణాలుంటాయి. బ్యాంకు మానేజర్లయితే, వారు అడగడం తడవుగా లక్షల, కోట్ల రూపాయల రుణాలిస్తారు. సకాలంలో తిరిగి చెల్లించకపోతే, వారిని పిలిచి 'బాబ్బాబూ, రుణాలు వాయిదాల్లో చెల్లించండి, వడ్డీ ఇవ్వనక్కర్లేదు, అసలు చెల్లించండి' అంటూ రకరకాల పద్ధతుల ద్వారా చెల్లింపులకు వెసులుబాటు కలుగ జేస్తారు. ఇలాంటి బ్యాంకులన్నీ కూడా కలుపుకొంటే మొండి బాకీలు ఇంకా పెరుగుతాయి. బ్యాంకర్లు ఇలా అందజేసే సౌకర్యాల వల్ల లాభ పడినవి ఇనుము, ఉక్కు, వస్త్రాలు, పంచదార మిల్లులు వగైరా. వీళ్లందరికీ రుణాలివ్వడానికి బ్యాంకుల వద్ద నిధులు ఆ బ్యాంకుల సొంత సొమ్మేమీ కాదు. మనమందరం బ్యాంకుల్లో డిపాజిట్ చేసుకొన్న నిధులే. ఇలా మొండి బాకీలు పెరిగిపోతుంటే మొన్నటిదాకా ఆర్థిక మంత్రిగా ఉన్న ప్రణబ్ ఏం చేశారు? గుడ్డి గుర్రానికి పళ్లు తోముతున్నారా? బ్యాంకు అధికారులతో సమావేశమై, మొండి బాకీలు మేటవేసి పోతున్నాయంటూ ఓ హెచ్చరిక చేసారంతే. అవును మరి పారిశ్రామివేత్తలకు, కార్పొరేట్లకు ప్రభుత్వానికి ఉన్న బీరకాయ పీచు చుట్టరికం అలాంటిది. మొండి బాకీల్ల వసూలు చేయడానికి చట్టాలున్నాయి. వాటిని ఉపయోగించాలని సుప్రీంకోర్టు మొట్టికాయ మొట్టింది. బ్యాంకు మానేజర్లు చేస్తున్న ఈ దగుల్బాజీ పనులను అరికట్టాలంటే కాగ్ సంస్థ తరహా స్వతంత్ర ఆడిట్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని బ్యాంకు ఉద్యోగుల సంస్థలు డిమాండ్ చేస్తున్నాయి. బ్యాంకు ఉద్యోగులు అపుడపుడు ఒకటి రెండు రోజులు సమ్మె చేస్తుంటారు. ఈ సమ్మెలు కేవలం వారి జీతభత్యాల కోసం మాత్రమే కాదు, బ్యాంకింగ్ వ్యవస్థను తీర్చిదిద్దడానికి కూడా అని సమ్మెలను విమర్శించేవారు గ్రహించాలి. వారి సూచనలను అమలు చేస్తేనే, బ్యాంకుల్లో మీరు చేసిన డిపాజిట్లు క్షేమంగా ఉంటాయని గ్రహించాలి.

మధ్యతరగతి ప్రజలు కూడా బ్యాంకుల నుంచి ఏ పెళ్లి చేయడానికో, గృహ నిర్మాణానికో, మోటార్ సైకిలు కొనుక్కోవడానికో రుణాలు తీసుకొంటూంటారు. అవి చెల్లించే కాలంలో బ్యాంకు వడ్డీ రెట్లు పెరగవచ్చు. సిమెంట్, ఉక్కు ధరలు పెరగవచ్చు. కూరగాయల ధరలు పెరుగుతూనే ఉంటాయి. రుణం తీసుకొన్నప్పుడు, ఎన్ని వాయిదాల్లో చెల్లించాలో గమనంలో ఉంచుకొని వారి బడ్జెట్లు తయారు చేసుకొంటారు. కాని ధరల, వడ్డీల పెరుగుదలతో వారి బడ్జెట్లు తలకిందులవుతాయి. మరోపక్క స్కూలు ఫీజులు పెరుగుతాయి. ఇలాంటి పరిణామలు ఏర్పడినపుడు కార్మికులు ప్రదర్శనలు, సమ్మెలు తదితర విధాలుగా తమ నిరసనలు తెలియజేస్తుంటారు. మధ్యతరగతి ప్రజలు భేషజాలకు పోకుండా, వారితో చేతులు కలపాలి. బ్యాంకు అధికారులకు కొన్ని రుణాలను రద్దు చేయడం, ఖాతాదారుల రుణ భారాన్ని తగ్గించడానికి (దొంగచాటుగా ఏర్పాటు చేసుకొని) లాభాలను తగ్గించి చూపడం, వన్-టైం సెటిల్‌మెంట్ చేయడం లాంటి అధికారాలున్నాయి. ఈ పద్ధతుల ద్వారా మొండి బాకీలను తగ్గించి చూపించడం జరుగుతుంది. రిజర్వ్ బ్యాంక్ నివేదిక ప్రకారమే చాలా సందర్భాల్లో కావాలనే రుణాలు తిరిగి చెల్లించరు (రాజకీయ జోక్యం కారణంగా), పారిశ్రామికవేత్తలు బ్యాంకు అధికారులను 'మేనేజ్' చేయడం వల్ల బ్యాంకులు నష్ట పోతాయి, వారు లాభపడతారు. ఈ దందాలను అరికట్టాలంటే మొండి బాకీలుగా ఉన్న వారి పేర్లను ప్రకటించాలి. అలాంటి వారిని కఠినంగా శిక్షించాలి. కావాలనే మొండి బాకీలు పేరబెట్టడం క్రిమినల్ నేరంగా భావించాలి. మొండి బాకీదారుల ఆస్తులను జప్తు చేయాలి, అలాంటి వారిని ఎన్నికల్లో పోటీ చేయడాన్ని నిషేధించాలి. రద్దు చేసిన బాకీలను పునఃపరిశీలించాలి. వీలయినన్ని న్యాయపరమైన చర్యలు తీసుకోవాలి. బాకీల రద్దుపై పార్లమెంట్ అజమాయిషీ ఉండాలి. రాజకీయ – కార్పొరేట్ల గుట్టు బయటపెట్టాలని బ్యాంకు ఉద్యోగులు కోరుతున్నారు.

ప్రభుత్వ రంగం నుంచి బ్యాంకులను తప్పించి విదేశీ, స్వదేశీ ప్రైవేట్ బ్యాంకులకు ఎలా కట్టబెట్టాలా అనే ప్రయత్నానికి రాజీవ్‌గాంధీ ప్రధానిగా ఉన్న కాలంలోనే అంకురార్పణ జరిగింది. ప్రధాని హోదాలో ప్రభుత్వరంగ బ్యాంకులను బహిరంగంగా విమర్శించడం మొదటి మెట్టుగా భావించవచ్చు. ఇటీవల ప్రైవేట్ రంగ బ్యాంకుల్లో విదేశీయుల ఓటింగ్ హక్కు పరిమితిని 10 నుంచి 26 శాతానికి పెంచడాన్ని కేంద్ర మంత్రి మండలి ఆమోదించింది. రాను రాను ఇది బ్యాంకింగ్ రంగాన్ని బ్యాంకుల్లో ఓటింగ్ హక్కులను విదేశీయుల చేతుల్లో పెట్టడమే అవుతుంది. ఇందిరాగాంధీ ప్రైవేట్ బ్యాంకులను జాతీయం మాత్రమే చేయగా, ప్రణబ్ ముఖర్జీ జాతీయ బ్యాంకులను విదేశీ బ్యాంకులకు కట్టబెట్టడం ప్రారంభించారు.

ఇటు ప్రభుత్వానికి, అటు బ్యాంకులకు ఒకే రోగం ఉంది. బడ్జెట్లో వివిధ శాఖలకు కేటాయింపులు చేసే ప్రభుత్వం సంవత్సరం అంతా కునికిపాట్లు పడుతూ, ఆర్థిక సంవత్సరం ఆఖరి మాసం ఒక్క మార్చ్‌లోనే 30–40 శాతం ఖర్చు పెడుతుంది. అలాగే బ్యాంకులు కూడా సంవత్సరం లో ఇన్ని కోట్లు డిపాజిట్లు సేకరించాలని లక్ష్యం ప్రకటించి ఆఖరు నెలలో బడా ఖాతాదారుల నుంచి పెద్ద ఎత్తున (తాత్కాలికంగా) డిపాజిట్లు సేకరించి, మా లక్ష్యాన్ని అధిగమించి డిపాజిట్లు సేకరించామని గొప్పలు పోతుంది. ఏప్రిల్ నెలలో ఇలా అదనంగా సేకరించిన డిపాజిట్లను డిపాజిటర్లు వాపస్ తీసుకొంటారు. ఉదాహరణకు చూడండి–

	డిపాజిట్ల పెరుగుదల (కోట్ల రు.)
24-2-2012	58,15,470
9-3-2012	58,53,370
23-3-2012	59,03,660
30-3-2012	61,12,480

నష్టాల్లో ఉన్న చిన్న బ్యాంకులను, ఆరోగ్యంగా ఉన్న బ్యాంకుల్లో విలీనం చేసే ఆలోచన ప్రభుత్వం తలకాయల్లో చోటు చేసుకొంది. ఇదివరకే ఈ విలీన ప్రక్రియ కొనసాగుతూనే వస్తోంది. ఇపుడు ప్రభుత్వ ఆలోచన ఏమంటే, మన దేశం ప్రపంచంలో చాలా ప్రముఖ స్థానం ఆక్రమించిందనీ, మన స్థాయికి తగ్గట్లు మనం కూడా విలీనం ద్వారా నాలుగైదు పెద్ద బ్యాంకులను ఏర్పాటు చేయాలనీ అంటోంది. బ్యాంకుల ప్రధానోద్దేశం డిపాజిట్లు సేకరించి దేశాభివృద్ధి, ప్రజల ఆర్థిక జీవనస్థాయి పెంచడం. పెద్ద బ్యాంకులుగా చేయడం ఈ లక్ష్యాలకు వ్యతిరేకం. మాట వరసకు పెద్ద బ్యాంకులను సృష్టించామే అనుకొందాం. కాని ఎంత పెద్ద? ప్రపంచంలో పెద్ద బ్యాంకులతో పోల్చి చూస్తే మన

హంతకులకు శౌర్యపతకాలా?

***పీడిత ప్రజల వైపు నిలిచి వారి స్వావలంబన, సార్వభౌమాధికారాల కోసం పోరాడుతున్న విప్లవకారులను చంపిన వారికి పతకాలు ఇవ్వడమే ఈ రాజ్య స్వభావమని అంటున్నారు* వరవరరావు**

శౌర్యం ఎంత గగుర్పాటు కలిగిస్తుంది. ఎంత థ్రిల్లింగ్.

కిషన్‌జీ ఎన్‌కౌంటర్ - తాటికాయంత అక్షరాలు

సారథులకు శౌర్యచక్ర - గుమ్మడికాయంత అక్షరాలు

ముందుండి నడిపించిన ఇద్దరికి పురస్కారాలు - రేగుపళ్లంత అక్షరాలు.

అది 2011 నవంబర్ 24. స్థలం - పశ్చిమబెంగాల్‌లోని పశ్చిమ మిద్నాపూర్ జిల్లా సాల్బోని వద్ద దట్టమైన అడవులు. మావోయిస్టు అగ్రనేత మల్లోజుల కోటేశ్వరరావు అలియాస్ కిషన్‌జీ తన అనుచరులతో అక్కడున్నట్లు భద్రతా దళాలకు ఉప్పందింది. అంతే.... సిఆర్‌పిఎఫ్‌లోని కోబ్రా దళం మరికొన్ని బలగాలతో కలిసి ఆ ప్రాంతాన్ని జల్లెడపట్టింది. వారికి కిషన్‌జీ ఆచూకీ దొరికింది. ఎదురుకాల్పులు జరిగాయి. కిషన్‌జీ సహా మరో నలుగురు మావోయిస్టులు నేలకొరిగారు.

ఇది పోలీసులు చెప్పిన 'కథ'నం. ఈ 'కథ'లో తనకు తాను కోబ్రా (నాగుబాము)నని పేరుపెట్టుకున్న సిఆర్‌పిఎఫ్ - 'భద్రతా'దళమే అయింది. ఆ ప్రాంతాన్ని బుల్లెట్లతో జల్లెడపట్టిందో? లేక చేతికి చిక్కిన కిషన్‌జీ దేహాన్ని జల్లెడపట్టిందో? ఆ మృతదేహాన్ని, ఆ ప్రాంతాన్ని చూసిన అందరికీ తెలుసు.

ఎదురుకాల్పులు జరిగాయా? అప్పటికీ ఇప్పటికీ పోలీసులు, ప్రభుత్వం మనకు చూపింది కిషన్‌జీ మృతదేహాన్ని మాత్రమే. బంధుమిత్రులకు అప్పగించిందీ అదే.

మరో నలుగురు మావోయిస్టులు నేలకొరిగి ఏమయినట్లు? అదృశ్యమయ్యారా? భూమిపొరల్లో కూరుకపోయారా?

ఈ సంఘటనలో వీరోచిత పాత్ర పోషించి, బలగాలను ముందుకు నడిపించి మావోయిస్టు అగ్రనేతను నేలకూల్చిన ఘనత సాధించినందుకు ఇద్దరు సిఆర్‌పిఎఫ్ అధికారులకు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'శౌర్యచక్ర' పురస్కారాలు ప్రకటించారు. సిఆర్‌పిఎఫ్‌లోని కోబ్రా దళం 207 బెటాలియన్‌కు చెందిన అసిస్టెంట్ కమాండెంట్లు వినోద్ పి.జోసెఫ్, నాగేంద్రసింగ్ ఈ అవార్డులకు ఎంపికయ్యారు. గతంలో శౌర్యచక్ర అవార్డును కేవలం సైనికదళాలకే ఇచ్చేవారు. కానీ గత కొన్నేళ్లుగా సిఆర్‌పిఎఫ్ సిబ్బందికి కూడ ప్రకటిస్తున్నారు.

ప్రభుత్వరంగ బ్యాంకులన్నిటినీ ఒకే బ్యాంకుగా ఏకం చేసినా, ఒకే ఒక విదేశీ బ్యాంకు కాలిగోటికి కూడా సరిరాదు. ఉదాహరణకు సిటీ బ్యాంకు పెట్టుబడులు రు. 33,000 కోట్లు కాగా మన దేశంలో 26 ప్రభుత్వ బ్యాంకులన్నింటి పెట్టుబడి కేవలం రు.13,065 కోట్లు మాత్రమే. అలాగే మన ప్రభుత్వ రంగం పెట్టుబడులను (మూడు బిలియన్ డాలర్లు) చైనాలోని 20 బిలియన్ డాలర్లతో పోల్చగలమా? పరుగెత్తుతూ పాలు తాగేకన్నా నిలబడి నీళ్లు తాగడం మంచిదని ప్రభుత్వం గుర్తుంచుకోవాలి. విలీనం పిచ్చి వదలించుకోవాలి.

అనేక రంగాల్లో లాగే బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ రంగాలను ప్రైవేటీకరణ దిశగా తీసుకొని వెళుతోంది. లాభాలు పండించు కోవడమే ప్రైవేటీకరణ లక్ష్యంగా ఉంటుంది. వీలయినంత మేరకు ఉద్యోగుల సంఖ్యను తగ్గించడం రెండవ లక్ష్యం. రైతులకు రుణాలిస్తే, వసూలు చేసుకోవడానికి వాళ్ల చుట్టూ తిరగాలి. ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడినపుడు వసూళ్లు మరీ కష్టం. అందుచేత బ్యాంకర్ల దృష్టి అంతా పారిశ్రామిక వేత్తలు, వ్యాపారస్తుల వైపే ఉంటుంది. వాళ్ల వైపు దృష్టి కేంద్రీకరిస్తే తమకూ 'లాభం'. కాని ప్రభుత్వమేమో వ్యవసాయానికి, రైతాంగానికి ఎక్కువ రుణాలివ్వాలని ఒత్తిడి చేస్తుంటుంది. రైతాంగానికి అంటే సంపన్న రైతులని వేరే చెప్పాల్సిన పని లేదు. చిన్న, సన్నకారు రైతులు సోదిలోకి కూడా రారు. ప్రభుత్వ రంగంలో బ్యాంకులుంటేనే పరిస్థితి ఇలా ఉంటే, ప్రైవేట్ రంగంలోకి వెళితే, ఏమవుతుందో ఊహించుకోవచ్చు. 1969కు ముందు ప్రైవేట్‌రంగంలో ఉన్న బ్యాంకింగ్, ఇపుడు మళ్లా ఆ ప్రైవేట్ రంగానికే చోటు కల్పిస్తోంది. ఇదేనా అభివృద్ధి? ప్రభుత్వం, ప్రైవేటీకరణ దిశగా పయనించడం మాత్రమే కాదు, ఇప్పటికే ప్రైవేట్ రంగంలోని బ్యాంకుల్లో విదేశీ పెట్టుబడులు 40 నుంచి 70 శాతం వరకూ ఉన్నాయి. విదేశీ పెట్టుబడిదారులకు ఇది వరకు 10 శాతం వరకు పరిమితం చేసిన ఓటింగ్ హక్కులను ఇటీవల చేసిన చట్ట సవరణ ఫలితంగా హద్దుల్లేని ఓటింగ్ హక్కు కల్పించారు. అంటే విదేశీ పెట్టుబడులు పెట్టిన బ్యాంకులను సొంతం చేసేసుకోవచ్చు.

బ్యాంకుల్లో నిధులు మీవి, నావి. ఆ నిధులను మనకు లాభదాయకంగా ఉండేలా చూసుకోవడం మన హక్కు, మన అవసరం. మనం డిపాజిట్ చేసిన సొమ్ముపై బ్యాంకులు ఇచ్చే వడ్డీయే మనకు లాభం. మనం బ్యాంకుల్లో దాచుకొన్న సొమ్మును బ్యాంకులు పరిశ్రమలకు, వ్యాపారస్తులకు ఎక్కువ వడ్డీకి అప్పుగా ఇచ్చి, ఆ వడ్డీలో కొంత మనకు ఇస్తాయి. ఒకవేళ, ఆ పరిశ్రమలు దివాళా తీస్తే, మన డిపాజిట్లకు రక్షణ కరువవుతుంది. కాగా బ్యాంకింగ్ రంగంలో వచ్చే మార్పులు, ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలపై ఒక కన్నేసి ఉంచాలి.

తాజా వార్త: మొండి బాకీలు మరింత పెరుగుతాయని అంతర్జాతీయ రేటింగ్ సంస్థ స్టాండర్డ్ అండ్ పూర్ వెల్లడించింది. కారణాలు, అధిక ద్రవ్యోల్బణం, రూపాయి మారక విలువ క్షీణత, అధిక వడ్డీ రేట్లు.

(రచయిత వీక్షణం వ్యవస్థాపక సంపాదకులు) వీ

పోలీసుల 'కథ'నంతో మీడియాకు కూడ 'కిక్' వచ్చినట్లున్నది. వీరోచిత పాత్ర పోషించి, ముందుకు నడిపించి సారథుల పాత్ర వహించి అగ్రనేతను నేలకూల్చి ఘనత సాధించిన – విశేషణాలు చేర్చింది. అది కూడ స్వాతంత్ర్యదినోత్సవ సందర్భం కావడం మీడియాకు కూడ కనుల పండువగా, వీనులవిందుగా తోచినట్లున్నది. ఈ క్రమంలో తన దగ్గర గతంలో ఉన్న సమాచారాన్ని కూడ మీడియా విస్మరించింది.

1999 డిసెంబర్1వ తేదీన బెంగళూరులో అరెస్టుచేసిన అప్పటి పీపుల్స్‌వార్ అగ్రనేతలు నల్లా ఆదిరెడ్డి (శ్యాం), ఎర్రంరెడ్డి సంతోష్‌రెడ్డి (మహేశ్), శీలం నరేశ్ (మురళి)లను కరీంనగర్ జిల్లా కొయ్యూరు అడవుల్లో పశులకాపరి లక్ష్మీరాజంతోపాటు కాల్చిచంపి వీరోచితపాత్ర పోషించామని ఆంధ్రప్రదేశ్ అప్పటి పోలీసు ఉన్నతాధికారులు ఎచ్.జె. దొర, శివశంకర్, రాం తివారీలు 'శౌర్యపతకాలు' తీసుకున్నారు. ఆ 'ఎన్‌కౌంటర్'కు వాళ్లకు ఏ సంబంధం లేదని పోలీసు శాఖాపరంగా దర్యాప్తు జరగడం, ఆ శౌర్యపతకాలు వాపసు తీసుకోవాలని వివాదం రేగడం ఈ మీడియా మరచిపోయినట్లున్నది. మరీ ఇటీవలనే టైమ్స్ ఆఫ్ ఇండియా రెసిడెంట్ ఎడిటర్ కింగ్‌షుక్‌నాగ్ శివశంకర్ 'శౌర్యపతకం' తీసుకోవడం వివాదాస్పదమైందని రాసారు. కనుక సిఆర్‌పిఎఫ్ మాత్రమే కాదు, నక్సలైట్లను ఎన్‌కౌంటర్ చేసినందుకు ఏ పోలీసుశాఖ అధికారులైనా శౌర్యపతకాలు తీసుకోవడం – మన స్వాతంత్ర్యదినోత్సవ సందర్భాల్లో ఒక సంప్రదాయమే అయిందని అనుకోవాల్సి ఉంటుంది.

కరీంనగర్ జిల్లా జగిత్యాల పోరాటంతో మల్లోజుల కోటేశ్వరరావు, ఆయన సహచరులు విప్లవోద్యమంలో వికసిస్తున్న రోజుల్లో రాడికల్స్ నోట, విప్లవాభిమానుల నోట, తెలంగాణ గ్రామాల, పట్టణాల గోడల మీద 'నక్సలైట్లే దేశభక్తులు' అనే ఒక నినాదం విస్తృత ప్రచారంలో ఉండేది. 'నక్సలైట్లు ఏ దేశభక్తులు' అని ఎబివిపి వాళ్లు, ఇతర సంఘ పరివార్ శక్తులు ప్రశ్నిస్తుండేవాళ్లు. నక్సలైట్లు 'రష్యా తొత్తులు, చైనా చెంచాలు' అని నినాదాలు రాస్తుండే వాళ్లు. అవిభక్త కమ్యూనిస్టు పార్టీ ఉద్యమకాలంలో, ముఖ్యంగా 1956 దాకా రష్యాలో వానపడితే కమ్యూనిస్టులు ఇక్కడ గొడుగు పడతారు అని స్టాలిన్ వ్యతిరేకులు విమర్శిస్తుండే వాళ్లు. నక్సలైటు ఉద్యమం ప్రారంభం కావడమే, ప్రపంచ వ్యాప్తంగా మార్క్సిస్టు– లెనినిస్టు పార్టీలు ఏర్పడడమే కృశ్చేవ్ సిద్ధాంత నిరాకరణతో జరిగింది. జెకోస్లవేకియాపై రష్యా చేసింది దురాక్రమణ అనే సైద్ధాంతిక అవగాహనతో జరిగింది కనుక రష్యాలో వాన కురవడం కాదు, కమ్యూనిస్టులు ఇక్కడ గొడుగు పట్టడం ఇంక గత చరిత్ర నానుడి అయిపోయింది. నక్సలైట్లు 1990 దాక కూడ రష్యన్ సోషల్ సామ్రాజ్యవాదం ప్రపంచస్థాయిలో తమ ప్రథమ శత్రువని భావించారు. ఇదే సమయంలో కృశ్చేవ్ రివిజనిజంతో మావో నాయకత్వంలో పోరాడిన శక్తులన్నీ ప్రపంచవ్యాప్తంగా గ్రేట్ డిబేట్ (1956–66)తో ముగింపుగా జరిగిన శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవంతో ప్రభావితమయ్యాయి. వెనువెంటనే మనదేశంలో వచ్చిన నక్సల్బరీ ఉద్యమ నిర్మాత అయిన చారుమజుందార్ 'చైనా చైర్మన్ మన చైర్మన్' అన్నంత పారవశ్యానికి గురైతే మావో స్వయంగా సవరించవలసి వచ్చింది.

నక్సల్బరీని 'వసంతమేఘ గర్జన'తో పోల్చిన దగ్గర్నించి ఒకటిరెండు సంవత్సరాలు చైనా కమ్యూనిస్టు పార్టీ పత్రిక 'పీపుల్స్‌డెయిలీ' ప్రతినిత్యం ఇండియాలో జరిగిన ప్రతి ప్రభుత్వ వ్యతిరేకచర్యను గొప్పగా ప్రచారం చేసింది. ఏమైనా 1976 నుంచి మొదలై 80ల ఆరంభం నాటికి, అంటే మల్లోజుల కోటేశ్వరరావు ప్రహ్లాద్‌గా పీపుల్స్‌వార్ రాష్ట్ర కార్యదర్శి అయ్యేనాటికి చైనా రివిజనిస్టు మాత్రమే కాదు పెట్టుబడిదారీ పంథాకు మళ్లిందని ఒకటికన్న ఎక్కువ నక్సలైటు పార్టీలే నిర్ధారణకు వచ్చాయి. దానితో ఇంక 'చైనా చెంచాలు' అయ్యే బదనామీ కూడ తొలగింది. ఆ కాలంలో మరి పాలకవర్గ 'దేశభక్తులు' నిర్వహించిన పాత్ర ఏమిటి?

జార్జ్‌రెడ్డి, చాంద్‌పాషా, శేషయ్య వంటి విద్యార్థులను, గోపిరాజన్న వంటి ఎపిసిఎల్‌సి నాయకుడిని ఎబివిపి, సంఘ్‌పరివార్ శక్తులు చంపేశాయి. నల్లగొండలో శేషుసార్‌పై హత్యాప్రయత్నం చేసాయి.

పోశయ్య, లక్ష్మీరాజం, లొత్తూన్రు పోశెట్టి మొదలుకొని ఎందరో దళితులు, భూమిలేని నిరుపేదలు, వ్యవసాయ కూలీలను భూస్వాములు, పోలీసులు చంపేసారు. దళిత మహిళా వ్యవసాయ కూలీలను కూడగట్టి సంఘం పెట్టిన కుదురుపాక రాజవ్వపై సామూహిక లైంగిక అత్యాచారం చేయించారు వెలమ భూస్వాములు. గోదావరి సరిహద్దు దాటినందుకే పెద్దిశంకర్‌ను 'ఎన్‌కౌంటర్' చేసారు.

ఈ జగిత్యాల, సిరిసిల్లా, కరీంనగర్, ఆదిలాబాదు, ఉత్తర తెలంగాణ నక్సలైట్లు, వాళ్ల అనుచరులు, అభిమానులు అత్యధికులు ఎన్నడూ రైలు కూడ ఎక్కినవాళ్లు కాదు, వాళ్లంతా భూమి పుత్రులు, సృష్టికర్తలు.

ఈ గడ్డమీద పుట్టి ఈ మట్టిని నమ్ముకున్న మట్టిమనుషులు. ఎనభైల నాటికి ఈ నేపథ్యాన్ని భావావేశంతో వివరిస్తూనే ఎన్‌కె 'లాల్‌బనో గులామీ చోడో, బోలో వందేమాతరమ్' అని దీర్ఘకవిత రాసాడు. దేశభక్తి బంధువులం, సింధువులం అని రాసుకున్న వాళ్లకు ముక్కు గుద్ది జవాబు ఇచ్చాడు.

మరి ఆగస్టు 15 స్వాతంత్ర్యదినం ప్రతిఏటా ఆడంబరంగా, అట్టహాసంగా, సంబరంగా జరుపుకుంటున్న 'దేశభక్త' పాలకవర్గాలు ఏం చేసాయి?

స్టాలిన్ ఆరేళ్ల ప్రణాళికతో ప్రభావితమై నెహ్రూ పంచవర్ష ప్రణాళికలు ప్రవేశపెట్టడం, సోషలిజంతో ప్రభావితమై సోషలిస్టుతరహా రాజ్యాంగాన్ని అమలు చేస్తామనడం చాల పాత చరిత్ర.

1971లో అంటే 67లో నక్సలైటు ఉద్యమం ప్రారంభమైనాక నాలుగేళ్లకు 'అపరకాళిక' ఇందిరాగాంధీ ముక్తిఫౌజ్ నిర్మాణం చేసి తూర్పు పాకిస్తాన్‌ను జయించి, బంగ్లాదేశ్ స్థాపించి అమెరికా నావికా ఏడవ ఫ్లీట్‌ను ఎదుర్కోవడానికి రష్యాతో సైనిక ఒడంబడిక చేసుకున్నది. 77లో అధికారానికి వచ్చిన వాజపేయి 'దేశభక్త' ప్రభుత్వం దానిని రద్దుచేయలేదు. కొనసాగించింది. అంతేకాదు మళ్లీ అధికారానికి వచ్చినపుడు కూడ రివిజనిజం వైపు మళ్లిందని నక్సలైట్లు ఆరోపిస్తున్న చైనా కమ్యూనిస్టు ప్రభుత్వంతో ఎంతోమంచి సంబంధాలు నెరపింది ఎన్‌డిఎ ప్రభుత్వం. ఎన్‌డిఎ ప్రభుత్వ కాలంలోనే మురసోలిమారన్ చైనాకు వెళ్లివచ్చి అక్కడ అమలులో ఉన్న ప్రత్యేక ఆర్థిక మండలాల పథకాన్ని ఇక్కడ ప్రవేశ పెట్టాడు. ఇంక చైనా ఎట్లా పెట్టుబడిదారీ అగ్రరాజ్యం అవుతుంటే అట్లా చంద్రబాబు మొదలు వైఎస్ఆర్ వరకు దాని 'అభివృద్ధి' పంథా పట్ల పరవశమైనవాళ్లే.

ఇంక 99లో ఆంధ్రప్రదేశ్ పోలీసు అధికారులకు శౌర్యపతకాలు

ఇచ్చేనాటికి మన కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల స్వతంత్రం, సార్వభౌమత్వం, దేశభక్తి – నూతన ఆర్థిక విధానం పేరుతో సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ఏకాత్మతా (మొనాపలీ) రథానికి గట్టిగా కట్టివేయబడిన విలువలయ్యాయి. పివి నరసింహారావు, మన్మోహన్‌సింగ్‌లతో ప్రారంభమై మనం మళ్లీ దేశభక్తులయిన వాజపేయి, అద్వానీ, చంద్రబాబుల శకంలోకి, శౌర్యపతక గ్రహీత ఎచ్.జె. దొర పోలీసుపాలనలోకి ప్రవేశించిన కాలం.

ఈ శౌర్యపతక గ్రహీతలు నేలకూల్చిన ఆ ముగ్గురు నాయకులు అప్పుడు ఏం చేస్తున్నారు? తెలంగాణ నుంచి, తెలుగునేల నుంచి విస్తరించి దండకారణ్యంలో ఒక ప్రజాప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనా ప్రయోగం చేస్తున్నారు. 95 పీపుల్స్‌వార్ స్పెషల్ కాన్ఫరెన్స్‌లో రూపొందించిన ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనా అది. 99 నాటికి వందలాది ఉత్తరతెలంగాణ గ్రామాల్లో కూడ అమలయిన గ్రామరాజ్య కమిటీల నాయకత్వంలోని అభివృద్ధి నమూనా – భూమి, తాగునీరు, సాగునీరు, విత్తనాలు, ఎరువులు, ప్రాథమిక విద్య, ప్రాథమిక ఆరోగ్యం – గ్రామ అభివృద్ధి కమిటీల నాయకత్వంలో ప్రజల సహకారం, శ్రమలతో స్వచ్ఛందంగా, స్వావలంబనగా అమలుచేసుకొని తీవ్ర నిర్బంధానికి, నెత్తుటి ఏర్లకు గురయిన ప్రయోగం. ఈ ప్రయోగానికి నాయకత్వం ఇచ్చిన వారిని బిల్‌క్లింటన్ రాక సందర్భంగా 'ఎన్‌కౌంటర్' చేసిన అద్వానీ, చంద్రబాబు, ఎచ్.జె. దొర ఇత్యాదులు 'దేశభక్తుల'య్యారు. శౌర్యపతకాలు పరస్పరం ఇచ్చుకున్నారు, పుచ్చుకున్నారు.

ఇంకా వీరబాహులై విస్తరించిన కోటేశ్వరరావు ప్రహ్లాద్ నుంచి రామ్‌జీ గోండుగా పరివర్తన చెంది దండకారణ్యంలో జనతన సర్కార్ రూపొందడంలో తనవంతు భూమిక నిర్వహించాడు. జల్, జంగల్, జమీన్ పై ఆదివాసులదే అధికారం అని ప్రకటించడమే కాదు, ఆదివాసులతో పాటు విప్లవకారులు ఆచరించడంలో పాల్గొన్నాడు. 99 తర్వాత పశ్చిమబెంగాల్‌లో ప్రవేశించాడు. మరి గత పదేళ్లలో శౌర్యపతకాలు ఇచ్చిన 'స్వతంత్ర' భారత పాలకుల ఆచరణ ఏమిటి? శౌర్యపతక గ్రహీతలు నేలకూల్చిన మావోయిస్టుల ఆచరణ ఏమిటి?

కిషన్‌జీ 'ఎన్‌కౌంటర్' అయ్యేనాటికి ఆయన మావోయిస్టుపార్టీ అన్ని కీలకనిర్ణయాలలో, కమిటీలలో నాయకత్వ స్థానంలో ఉన్నాడు గనుక ఆయననే ప్రతీకగా తీసుకొని విశ్లేషిద్దాం.

పాలకులు (కేంద్రంలో కాంగ్రెస్ – యుపిఎ, రాష్ట్రంలో సిపిఎం లెఫ్ట్‌ఫ్రంట్ అయితేనేం) నందిగ్రాంలో సస్యశ్యామలమైన భూములు ఇండోనేషియాకు చెందిన సలీంకంపెనీకి ఇచ్చారు. దానికి వ్యతిరేకంగా పోరాడి నిలువరించిన శక్తులలో కిషన్‌జీ నాయకత్వంలోని మావోయిస్టు పార్టీ, అనుయాయులు, అభిమానులు ఉన్నారు. సింగూరులో టాటా కార్ల కంపెనీకి పాలకులు సస్యశ్యామలమైన భూములు కేటాయించారు. దానిపై పోరాడి నిలువరించిన శక్తులలో మళ్లీ కిషన్‌జీ అనుచరులున్నారు. ఆ రాజకీయాలను విశ్వసించి ఆచరించిన ప్రజలున్నారు. జంగల్ మహల్‌లో పోలీసు అత్యాచారాల వ్యతిరేక కమిటీ కావచ్చు, ఛత్రధర్ మహతో, శశిధర్ మహతో మొదలు లాల్‌మోహన్ టుడు వరకు ఆదివాసి నాయకుల నాయకత్వంలోని పోరాటం కావచ్చు. వారికి అండగా మావోయిస్టు పార్టీ ఉన్నది. సోల్‌బనీలో బుద్ధదేవ్ ఆదివాసుల ఐదువేల ఎకరాల భూమిని జిందాల్ ఉక్కు ఫ్యాక్టరీకి ఇవ్వజూపితే కిషన్‌జీ నాయకత్వంలో మావోయిస్టుపార్టీ ఎట్లా ఎదుర్కున్నదో ఆ పద్ధతిని విమర్శించిన వాళ్లకు కూడ ఈనాడు తెలుసు.

బ్రిటిష్‌వాడికి పన్ను కట్టొద్దని ప్రజలకు పిలుపుయిచ్చి పోరాడుతూ జెండా వదలకుండా నేలకొరిగిన దళిత మహిళ మాతంగినీహజ్రా ఇదే మేదినీపురం జిల్లాలో 1942లో స్వతంత్రం కోసం పోరాడింది. 'పీఛోబర్నా' (వెనక్కి వెళ్లొద్దు) అని ఆమె పిలుపు ఇచ్చి నేలకొరిగిన ప్రాంతానికి ఆమె పిలుపుయే ఊరుపేరయింది. ఆ సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాట వారసత్వాన్ని కొనసాగించిన వాళ్లు కిషన్‌జీ, ఆయన సహచరులు.

నక్సలైట్లను దేశద్రోహులు, ఉగ్రవాదులు, రష్యా తొత్తులు అన్న 'దేశభక్తులు' పాలకులై ఇవ్వాళ రష్యాతో కూడంకుళం అణువిద్యుత్ ఒప్పందాన్ని దేశమంతా వ్యతిరేకించినా అమలుచేసి తీరుతాం అని ప్రతిజ్ఞలు చేస్తున్నారు. నక్సలైట్లను 'చైనా చెమ్చాలు' అన్న 'దేశభక్తులు' పాలకులై దేశమంతా 'ప్రత్యేక ఆర్థిక మండలాలు' అమలుచేస్తూ ప్రజల భూముల్ని చాపచుట్టగా కార్పొరేట్‌శక్తులకు కట్టబెడుతున్నారు.

నక్సలైట్లను సిఐఎ ఏజెంట్లని కూడ ఉక్రోషంతో నిందించినవాళ్లు సిఐఎ, ఎఫ్‌బిఐల సహకారంతో దండకారణ్యంలో, సైనిక శిక్షణాలయాలు నెలకొల్పి సిఆర్‌పిఎఫ్‌కు, కోయకమాండోలకు యుద్ధశిక్షణ ఇస్తున్నారు. దీనికంతా గ్రీన్‌హంట్ ఆపరేషన్ అని పేరుపెట్టారు. అమెరికాలో ఆదివాసుల నిర్మూలనకోసం రూజ్వెల్ట్ పెట్టినపేరు 'గ్రీన్‌హంట్'. దానికి వందేళ్ల సామ్రాజ్యవాద దురాక్రమణ చరిత్ర ఉన్నది.

కిషన్‌జీకి, ఆయన పూర్వీకులకు కూడ అంతకన్నా ఎక్కువే పోరాట చరిత్ర ఉన్నది. సంతాల్‌పోరాటం, భూంకాల్ పోరాటం, మన్నె పోరాటం మొదలు రాంజీగోండు, కొమురంభీం, తెలంగాణ, నక్సల్బరీ, శ్రీకాకుళం పోరాటాల దాకా –ఆయనకు, ఆయన సహచరులకు జగిత్యాల, దండకారణ్య, జంగల్‌మహల్, నారాయణపట్నా పోరాటాల కొనసాగింపు ఉంది.

ఆగస్టు 15న దేశభక్త పాలకులు ఏం వాగ్దానాలు చేస్తున్నారు? బహుళజాతి కంపెనీలకు, బడాకంపెనీలకు దేశాన్ని తాకట్టు పెట్ట చూస్తున్నారు. రాజ్యాంగంలో ఆదివాసులకు, దళితులకు, అశేష శ్రమ జీవులైన ప్రజానీకానికి పడిన హామీలన్నిటినీ భగ్నం చేయచూస్తున్నారు.

దేశభక్త పాలకులు చిత్రిస్తున్న దేశద్రోహ మావోయిస్టులు ఏం చేస్తున్నారు – జనతన సర్కార్ నాయకత్వంలో జల్, జంగల్, జమీన్‌పై ఆదివాసులది, ప్రజలదే అధికారం అంటున్నారు. ప్రజల స్వావలంబనను, సార్వభౌమత్వాన్ని కాపాడుకుందామంటున్నారు. అటువంటి మావోయిస్టులకు ఒక మూడు దశాబ్దాల ప్రతీక, పతాక – కిషన్‌జీ.

దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్ అన్న కాలం నుంచి ఈ మనుషుల కోసం, దేశంలోని మట్టి, మట్టి కింద, మీద ఉన్న వనరులు కూడ అంటున్న కాలం దాకా దేశభక్తితో పోరాడుతున్న ప్రజల ప్రతినిధి కిషన్‌జీ. అటువంటి 'అగ్రనేతను నేలకూల్చిన' వారికి శౌర్య పతకాలు ఇచ్చే ప్రభుత్వాన్ని ఏ పేరుతో పిలవాలి? ప్రజాద్రోహి అనే పేరుతో. ఆగస్టు 15 చేసిన ద్రోహాన్ని చెప్పకపోతే ఆనాడు నాకు అన్నం సయించదు అని చెరబండరాజు అన్నదానికన్న మిన్నగా ఇంకేమనగలమని.

(రచయిత విప్లవ రచయితల సంఘం సభ్యులు,
రెవల్యూషనరీ డెమోక్రటిక్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షులు) వీ

పేదరికం - పోషకాహారలేమి

ఒక పక్క ఈ దేశ సంపదలన్నీ కొద్దిమంది చేతుల్లో పోగు పడిపోతుంటే, మరో పక్క అత్యధిక జనాభా ఆకలితో, పోషకాహారలేమితో బాధపడుతోందని అంటున్నారు **డా. నళిని**

అది ఒక దృశ్యం. హృదయవిదారకమైన చిత్రం – పాలిపోయిన, ఎండిపోయిన ఎలుక పిల్లలాంటి పాప – కాళ్లు చేతులూ పుల్లల్లాగా ఎండిపోయి, ఉదరభాగం ఊరిపోయి, జుట్టు పలుచబడి సునాయాసంగా ఊడిపోతూ, మంచం మీద వెల్లకిలా పడుకుని, పై కప్పుకేసి నిస్తేజంగా చూస్తోంది. ఊపిరి లేనట్టున్న ఆ పిల్ల వయసు ఆరు నెలలు. కానీ బరువు రెండున్నర కిలోలు (అప్పుడే పుట్టిన పాపంత). దీన్నే ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుఎచ్ఒ) తీవ్రమైన పోషకాహార లేమి (ఎస్ఎఎం – సివియర్ అక్యూట్ మాల్ న్యూట్రిషన్) గా అభివర్ణించింది. ఇది మన దేశంలో కూడా చాలా చోట్ల కనిపించే దృశ్యమే.

ఇటీవల ఆకలి, పోషకాహారలేమిపై ఒక ఎన్‌జిఒ 'హంగామా' పేరుతో ఒక పరిశోధనని ప్రకటించింది. వారు పరిశీలించిన వంద జిల్లాల్లో ఐదేళ్లలోపు పిల్లల్లో 42 శాతం మంది వయసుకి తగిన బరువులేరని, 59 శాతం వయసుకి తగిన ఎత్తు కూడా లేరని, అందులో దాదాపు సగం మంది మరీ పొట్టిగా ఉన్నారని తేల్చింది.

ఈ రిపోర్ట్ చూసి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ ఉలిక్కిపడ్డారు. కలత చెందారు. ఇది 'మన దేశానికే సిగ్గుచేటు' అని ప్రకటించేశారు. అయితే ఈ 'సిగ్గుచేటు' ఈనాటిది కాదనీ, అది తరతరాలుగా వస్తోందనీ, కాంగ్రెస్ విధానాలే దీనికి ఆజ్యం పోశాయనీ వారికి తెలియదా? ఇప్పుడు కొత్తగా ఈ విషయం తెలిసినట్టుగా ఈ నటన దేనికి?

అసలు సదరు ప్రధానమంత్రిగారి హయాంలో పేదల ఆహారానికి ఎంత మొత్తం కేటాయిస్తున్నారు? పేదల వైద్యానికి ఎంత పక్కన పెడుతున్నారు? దేశంలో ఆహారలేమి పెరగకుండా ఏమి చర్యలు తీసుకుంటున్నారు? మన అవసరాలు తీర్చాక ఆహార పదార్థాలు ఎగుమతి చేస్తున్నారా? తీరకముందే చేస్తున్నారా? ఆహార భద్రత అంటే వారి ఉద్దేశం ఏమిటి? రైతులు ఎందుకు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు? ఐదేళ్లలోపు పిల్లలు ఎందుకు చనిపోతున్నారు? ఇలాంటి ప్రశ్నలకు వరుసగా సరైన సమాధానాలు ఇచ్చుకుంటూ పోతే, మన్మోహన్‌గారి కన్నీరు మొసలి కన్నీరని తేలిగ్గానే అర్థమవుతుంది. ఈ 'నేషనల్ షేమ్'కి కారణం అమాత్యులవారు కాపాడుతున్న ఈ దోపిడీ సమాజమేనని తేటతెల్లమవుతుంది.

'ఇద్దరు ఆదివాసి పిల్లలు పోషకాహార లేమితో చనిపోయారు. పోషకాహార లేమితో పాటు రక్తహీనత, మలేరియా తదితర వ్యాధుల వల్ల ఐదేళ్లు, మూడేళ్ల వయసుగల ఇద్దరు పిల్లలు జిల్లా వైద్య ఆరోగ్య కేంద్రంలో మృతిచెందారు' – ఇది మార్చ్ 30, 2012 'హిందూ' పత్రికలో కథనం. అంటే, ఆకలి, దానికి తోడు పోషకాహార లేమి, వీటికి తోడు అంటువ్యాధులు, అందుబాటులో లేని వైద్యం! పైన చూపిన కలిచివేసే దృశ్యం తీవ్రత పెరుగుతోంది.

పోషకాహార లేమికి కారణాలు వెతికే ముందు అసలు పోషకాహార లేమి (మాల్ న్యూట్రిషన్) అంటే ఏమిటో చూద్దాం. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఇది వ్యాధి రూపంలో వేధిస్తున్న అతి పెద్ద సమస్య.

ఎముకల గూడుగా మారిపోవడమో, శరీరం ఉబ్బిపోవడమో మాత్రమే ఆహారలేమి అనుకుంటే అది పొరపాటే. సమస్య తీవ్రమైనపుడు కనిపించే లక్షణాలు అవి. కానీ కనిపించకుండా, ఏ కొలబద్దలకీ దొరక్కుండా, నిశ్శబ్దంగా దాడి చేసే ఆహారలేమి మనల్ని భయపెడుతోంది. నిజానికి ఆయా సమూహాల ఆహార పరిస్థితిని సూచించేది – పిల్లల పోషణ, ఎదుగుదలే. పిల్లల బరువు, ఎత్తు, చేతి చుట్టు కొలతల వల్ల వారి పోషకాహార స్థాయిని నిర్ధారించవచ్చు. కానీ పొట్టిగా ఉన్న పిల్లలందరినీ అనారోగ్యంతో బాధపడుతున్న వారిగా చెప్పలేం. అలానే, వారు ప్రస్తుతం తినే ఆహారం మొత్తాన్ని బట్టి కూడా వారి ఆహార స్థాయిని అంచనా వేయలేం. ఎందుకంటే, చాలా కాలంగా పోషకాహారలేమితో బాధపడుతున్న వారిలో మాత్రమే గణనీయమైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి.

పిల్లలు పుట్టిన ఆరు నెలల వరకు తల్లిపాలు సరిపోతాయి. కానీ అటు తర్వాత తల్లిపాలతో పాటు ఘనాహారం అవసరం. అలా సమయానికి ఉగ్గు వగైరాలు మొదలుపెట్టక పోతే, క్రమంగా ఆహారాన్ని పెంచకపోతే వారిలో శైశవ దశ నించే పోషకాహార లేమి మొదలవుతుంది. అలానే మొగవారితో పోలిస్తే ఆడవారిలో ఈ లోపం ఎక్కువగా కనిపిస్తుంది. ఇలాంటి స్త్రీలు పిల్లల్ని కంటే, ఆ పిల్లల్లో గర్భస్థ కాలం నుంచే ఈ లేమి కనిపిస్తుంది. అలానే స్కూలుకు వెళ్లే పిల్లల కంటే చంటి పిల్లల్లో, ఈ తేడా చూడవచ్చు. గ్రామాల్లో, దళితుల్లో, నిరక్షరాస్యుల్లో ఈ లోపం ఎక్కువ. ఇంకా, పెద్ద కుటుంబాల్లో మంది ఎక్కువయితే మజ్జిగ పలుచబడినట్టు, ఈ ఆహారలేమి సర్వసాధారణం. మలేరియా, పొంగు, మూత్రం ఇన్‌ఫెక్షన్, నీళ్ల విరేచనాలు మొదలైన అనారోగ్యాల వల్ల పరిస్థితి మరింత విషమించి, ఈ పోషకాహార లేమి తీవ్రతరమవుతుంది. చర్మం పలుచబడి, పొడారిపోయి పగులుతుంది. జుట్టు ఎర్రబడి రాలిపోతుంది. కళ్లు కళావిహీనమైపోయి, పోను పోను రేచీకటి సంభవించి, చివరికి చూపు మందగించిపోతుంది. కార్జము పెరుగుతుంది. పొట్ట ఉబ్బుతుంది. దేనిమీదా ఆసక్తి ఉండదు. ఎప్పుడూ ఏడుస్తూ, చిరాగ్గా ఉంటారు. ఎదురుగా ఆహారం పెడితే ఆబగా గబగబా తింటారు. వారి పంటి చిగుళ్ల నుంచి రక్తం కారుతుంది. నడిచే వయసు వచ్చేసరికి ఎముకల్లో పటుత్వం తగ్గి, కాలి ఎముకలు వంగిపోతాయి. దొడ్డు కాళ్లు తయారవుతాయి. వయసు ఎదిగే కొద్దీ వయసుకి తగిన శారీరక మానసిక ఎదుగుదల ఉండదు. పర్యవసానంగా తరచుగా జబ్బు పడుతూ, చదువులో కూడా వెనుకబడతారు.

అయితే, ఇంటిల్లిపాదీ మంచి ఆహారం తినగల కుటుంబాలు మన దేశంలో ఎన్ని ఉన్నాయి? పేదరికంతో మగ్గిపోయే జనాభానే ఎక్కువ. వారు ఈ ఆహార లేమి వల్ల సరిగ్గా పనిచేయలేరు. వారి శక్తి క్షీణిస్తుంది. దానివల్ల వారి సంపాదన తగ్గుతుంది. అలా పేదరికం – పోషకాహార లేమి – పని చేయలేనితనం – తక్కువ రాబడి – మళ్లీ పేదరికం – అనే

విషవలయంలో వారు చిక్కుకుపోతారు.

దీర్ఘకాలికంగా ఆకలికి గురై, పోషకాహార లేమి సంభవిస్తే, మానవ సమూహాలు తమ శరీరాకృతిని కుదించుకుంటాయి. దీనికి ఆంత్రపలాజికల్ నిదర్శనలు కూడా ఉన్నాయి. తల్లికి పోషకాహార లేమి ఉంటే, గర్భంలోనే శిశువుకి ఈ రుగ్మత మొదలవుతుంది. పుట్టిన మూడేళ్ల వరకు ఇది కొనసాగుతుంది. ఒకసారి కురచదనం మొదలయాక, ఎంత బలమైన ఆహారం ఇచ్చినా ఇక ఆకృతి మారదు. దీనివల్ల పెరిగి పెద్దయ్యాక కీలకమైన అవయవాలు సరిగ్గా పనిచేయవు. గుండె, మూత్రపిండాలు, మెదడు మొదలైనవి బలహీనపడుతాయి. ఆహార లేమి వల్ల కురచగా ఉండే వారిని అనారోగ్యం పీడిస్తుంది. చిన్న వయసులో పోషకాహార లేమి వల్ల తెలివి పెరగదు. వారి 'ఐక్యూ' దిగజారిపోతుంది.

ప్రస్తుతం మన దేశంలో ఉన్న పరిస్థితిని చూస్తే ఈ సమస్య తీవ్రత అర్థమవుతుంది –

– పోషకాహార లోపంలో మన దేశం ప్రపంచంలో రెండవ స్థానంలో ఉంది. (మొదటి స్థానం బంగ్లాదేశ్‌ది)

– మన దేశంలో ఐదేళ్లలోపు పిల్లలు సంవత్సరానికి 2.1 మిలియన్లు చనిపోతున్నారు. అంటే, ప్రతి నాలుగు నిముషాలకి ఒక మరణం.

– నివారణకు లొంగే నీళ్ల విరేచనాలు, టైఫాయిడ్, మలేరియా, తట్టు, న్యూమోనియా వంటి రోగాలతో ఇప్పటికీ పిల్లలు మరణిస్తున్నారంటే మన ఆరోగ్య వ్యవస్థ పనితీరు స్పష్టమవుతుంది.

– మన దేశంలో ప్రతిరోజు వెయ్యిమంది పిల్లలు నీళ్ల విరేచనాలతో మరణిస్తారంటే అందులో అతిశయోక్తి లేదు.

– మన జనాభాలో దాదాపు 18 శాతం మంది ఆరేళ్లలోపు పిల్లలే ఉంటే, (దాదాపు 150 మిలియన్లు), వారి పరిస్థితి అంత అధ్వాన్నంగా ఉన్నప్పుడు మన దేశ పురోగతి ఎలా సాధ్యం?

– మన దేశంలో చనిపోతున్న పిల్లల్లో 50 శాతం మంది పోషకాహార లేమి వల్లనే చనిపోతున్నారు.

– పిల్లల్లో 75 శాతాన్ని ఇనుము లోపం వల్ల సంభవించే రక్తహీనత వేధిస్తోంది.

– వారిలో 57 శాతానికి ఏదో ఒక రూపంలో 'ఎ' విటమిన్ లోపం కనిపిస్తుంది.

– 85 శాతం జిల్లాల్లో అయోడిన్ లోపం ఉంది (దీనివల్ల 13 శాతం తెలివి తగ్గుతుంది) రెండు సంవత్సరాలు నిండే సరికి వారి శరీరం సరిగ్గా ఎదగదు.

– వయసుకి తగిన బరువు లేనివారు గ్రామాల్లో 50 శాతం, పట్టణాల్లో 38 శాతం ఉంటారు. (ముఖ్యంగా ఆడపిల్లలు)

ఈ దయనీయ స్థితిని చూసీ చూడనట్టుగా బతికేస్తున్న సమాజాన్ని డీట్రిజ్ బోన్‌హాఫర్ హెచ్చరిస్తారు – 'ఒక సమాజం నైతికత, అది తన పిల్లలకి ఏమి చేసిందనే పరీక్షలోనే బయటపడుతుంది.'

మరోవైపు, ధనికులు అమితంగా ఆహారం తీసుకోవడం వల్ల కూడా నష్టం జరుగుతోంది. శరీర కష్టం లోపించడం, కదలకుండా కూర్చుని చేసే ఉద్యోగాలు, రోజువారీ పనుల కోసం వివిధ మెషీన్ల వాడకం, సాంప్రదాయకమైన ఆహారం లోపించడం, ఆహారంలో సమతుల్యత లేకపోవడం, జీవితంలో విపరీతమైన ఒత్తిడి – ఇవి ఈ నష్టాల్ని పెంచుతున్నాయి.

అందుకే మన దేశంలో పోషకాహార లేమి పేదవారిని ఎక్కువగా బాధిస్తుంటే, అతి ఆహారం అనే రోగం ధనికులను వేధిస్తోంది.

ఈ పరిణామాలన్ని ఒక్క రోజులో సంభవించలేదు. ఆహార వ్యవస్థ పట్ల, ఆరోగ్యం, వైద్యం పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యమే ఈ పర్యవసానానికి కారణం. అందుకే ఈ పరిస్థితికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలి. మరి ఇదంతా ఈరోజే వెలుగులోకి వచ్చినట్టు ప్రధానమంత్రి 'వాపోతున్నారు' ఏమిటో? ఫిడెల్ కాస్ట్రో చెప్పినట్టు 'ప్రపంచంలో 820 మిలియన్ ప్రజలకు పైగా ఆకలితో బాధపడుతున్నారు. వారిలో 790 మిలియన్ ప్రజలు మూడవ ప్రపంచ దేశాల్లోనే ఉన్నారు'. ఇంకా 'ఏ దేశంలోనైనా ఒక్క మనిషి ఆకలికి, చలికి గురయినా అది ఆ దేశ నాయకుడి తప్పే అవుతుంది.'

ఇది చాలదన్నట్టు, ఇటీవల వెల్లడయిన బడ్జెట్‌లో ఆహారానికీ, విద్యకీ, వైద్యానికీ కేటాయింపులు చాలా తక్కువగా ఉన్నాయి. భవిష్యత్తులో పురోగతి సాధించాలంటే నేటి కఠినమైన బడ్జెట్ తప్పలేదని ప్రణబ్ ముఖర్జీ సమర్థించుకున్నారు. అంతేకాక, ప్రణాళికా సంఘం నించి మాంటెక్ సింగ్ అహ్లూవాలియా కూడా గారడీ లెక్కలు వేసి, మన దేశంలో పేదరికం తగ్గిపోయిందని చెప్పారు. సగటు మనిషికి పట్టణంలో రోజుకి రు. 32, పల్లెల్లో రోజుకి రు. 28 చాలన్నారు. ఇటీవల 'టైమ్స్ నౌ' ఛానల్‌లో జరిగిన చర్చలో ఈ మాటలను నిపుణులు చీల్చి చెండాడారు. కిలో పెసరపప్పు రు.70లుగా ఉన్న ఈ సమయంలో, మనిషికి రోజుకి రు.1.02 విలువ గల పప్పు దినుసులు సరిపోతాయంది ప్రణాళికా సంఘం. కానీ కనీసం 50 గ్రాముల పప్పు తినాలంటే 3.50 రూపాయలు ఖర్చు అవుతుంది. అలానే అరటి పళ్ల ధర డజను రు. 30. ప్రణాళికా సంఘం మాత్రం రు. 1.02 విలువగల పళ్లు చాలంటుంది. ఒక్క పండు ధర రు. 2.50 పైనే. అంటే సగం పండు కూడా తినకూడదా? లీటరు ఆవు పాల ధర రు. 25. కనీసం రు. 2.33 పాలు చాలంటుంది ప్రణాళికా సంఘం. కానీ 100 మిల్లీలీటర్ల పాల కోసం రు.3.50 చెల్లించక తప్పదు. (ఈ వ్యాసం ప్రచురితమయ్యే నాటికి ధరలు ఇంకా పెరిగాయి)

అంటే, ప్రణాళికా సంఘం లెక్కల ప్రకారం, అర్థాకలితో మిగిలిన వారు మాత్రమే పేదవాడు అవుతాడు. అతనికి కావలసిన విద్య, వైద్యం ఈ కనీసపు రు.28లలో లేదు. అంటే, సామాన్య మానవుడు జంతువు కంటే కనాకష్టంగా జీవించాలన్న మాట. పాలకుల ఈ అవకతవక పాలనతో జాతి బలహీనపడుతోంది. పోషకాహార లేమి తాండవిస్తోంది. ఆకలి కేకలు వేస్తోంది. అనారోగ్యంతో బాధ పడుతోంది.

కొందరు పాశ్చాత్య మేధావులే చెప్పినట్టు, 'ఆకలిగొన్న మానవుడు స్వేచ్ఛాయుత మావుడు కాడు!' అలానే, 'సామాజిక న్యాయంలో ఉండవలసిన మొట్టమొదటి అంశం – అందరికీ ఆహారం సరిపోవడం. ఈ ప్రపంచంలో ఊపిరి పీల్చుకునే ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు, నైతిక హక్కు – ఆహారం!'

మరి 'ప్రపంచ ఆకలి ప్రమాణం' (గ్లోబల్ హంగర్ ఇండెక్స్) ఇచ్చిన 2011 నివేదిక ప్రకారం చూస్తే, ఆకలిలో మన దేశం స్థానం 15. గత ఐదేళ్ల కాలంలో ఇది మరింత పెరిగింది. మరి మనం ఇంకా దేనిలో పెరుగుతున్నాం? జనాభా వృద్ధి చెందింది. మన ఆర్థిక వనరులు కూడా పెరుగుతున్నాయి. అయినా కూడా మన దేశాన్ని తక్కువ ఆదాయం గల దేశంగా పేర్కొంటాయి. ఎందుకంటే, పెరుగుతున్న వనరులన్నీ అసమానంగా పంచబడుతున్నాయి. దారిద్ర్యరేఖ దిగువ ఉన్న ప్రజలు పెరుగుతున్నారు. ఒక పక్క పేదరికం, మరోపక్క సంపద, లేదా కోటీశ్వరులు! అందుకే ఒకవైపు పోషకాహార లేమి, మరోవైపు అనారోగ్యపు అతి తిండి వల్ల దీర్ఘకాలిక వ్యాధులు! గుండె జబ్బులు, మధుమేహం పెరుగుతున్నాయి. క్యాన్సర్‌తో పాటు క్షయ, న్యుమోనియా వంటి అంటు వ్యాధులు ప్రబలుతున్నాయి.

ఇదంతా జనాభా పెరుగుదల కంటే ఆర్థిక అసమానతల వల్ల, వనరుల్ని,

ఆదాయాన్ని, వసతుల్ని అసమానంగా పంచడం వల్ల జరుగుతోంది. డార్విన్ చెప్పినట్టు, 'పేదల కష్టాలకు కారణం ప్రకృతి నియమాలు కాక మన సంస్థలే, వ్యవస్థలే అయితే, మన పాపం చాలా పెద్దది!'

ఎవరూ ఆకలికి గురి కానవసరం లేనన్ని వనరులు ప్రపంచంలో ఉన్నాయి. అయినా గాని, కాలిన్ ఫారెల్ అన్నట్టు 'ప్రతి చోట, ప్రతి పేదవాడలో, పల్లెల్లో ప్రతివారం ఒక సునామీ విజృంభిస్తోంది. ఆ సునామీ పేరు ఆకలి!' ప్రపంచం మొత్తంగా ఒక బిలియన్ ప్రజలు నిరంతరం ఆకలితో అలమటిస్తున్నారు. అసమ సమాజమే దీనికి కారణం. ఉన్న వనరుల అసమ పంపిణీ ఈ రోగానికి కారణం.

మన దేశంలో దీని నివారణ కోసం ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టింది. మధ్యాహ్న భోజన పథకం, ఐసిడిఎస్, నేషనల్ చిల్డ్రన్స్ ఫండ్ (ఎన్‌సిఎఫ్), పిల్లల కోసం నేషనల్ ప్లాన్ ఆఫ్ యాక్షన్, యునిసెఫ్, జాతీయ గ్రామీణ ఆరోగ్య పథకం (ఎన్ఆర్ఎచ్ఎం) వంటివి అమల్లో ఉన్నాయి. ఇంత చేసినా, ఐదేళ్ల లోపు పిల్లల మరణాలలో మన దేశం ప్రపంచంలో 48వ స్థానంలో ఉంది. మరి మన పథకాలన్నీ ఏమయిపోతున్నాయి. సిగ్గుచేటయిన లెక్కలు మాత్రమే ఎందుకు మిగులుతున్నాయి? రోజూ ఏదో ఒక పేపర్‌లో ఐసిడిఎస్ పనితీరులో అవకతవకలను ఎవరో ఒకరు ఎత్తి చూపుతూనే ఉన్నారు.

నిజానికి మన దేశంలో ఆర్థిక పురోగతి వెల్లివిరుస్తోందని లెక్కలు చెప్తున్నాయి. కానీ ఈ ప్రగతి అందరికీ చేరడం లేదు. దీనివల్ల చాలా తక్కువ శాతం లాభపడుతున్నారు. మన దేశం అందరికీ పని కల్పించలేకపోతోంది. ఒక మనిషి, తనకి, తన కుటుంబానికి సరిపడినంత ఆహారాన్ని సమకూర్చగల పనిని కల్పించలేకపోతోంది. అలా, ఆహారాన్ని పొందే హక్కుని పరిరక్షించలేకపోతోంది. ఒకపక్క ఆర్థిక ప్రగతి, మరోపక్క ఆహారలేమి. ఏమిటీ వైరుధ్యం? ఏమిటీ వైపరీత్యం? ఒక పక్క ఆకాశహర్మ్యాలు, మరోపక్క చేతికి చిప్పలు! ఒక పక్క లక్షల్లో వేతనాలు, మరోపక్క కనీస గిట్టుబాటు ధరలేక పంట నేలపాలు, లేదా రైతుల ఆత్మహత్యలు! ఒకపక్క విందులు, వినోదాల పేరుతో ఆహార దుర్వినియోగం, మరోపక్క కనీస పోషకాహార అవసరాలు తీరక చిక్కిశల్యమైపోతున్న బాల్యం! ఒక పక్క కొవ్వు ఎక్కువై వచ్చే రోగాలు, మరోపక్క ఆహార లేమితో వచ్చే రోగాలు. కాల్షియం, ఫోలిక్ యాసిడ్, జింక్ వంటివి మైక్రోన్యూటియంట్స్. ఇవి లోపించడం వల్ల కూడా ఆహారలేమి మరీ తీవ్రమవుతోంది. దీన్నే 'మరుగునపడిన ఆకలి' (హిడెన్ హంగర్) అంటారు. ఇది దీర్ఘకాలిక సమస్య, కనపడకుండా చాలా హాని చేస్తోంది. చెప్పుకో వీలు లేని సమస్యలను తెచ్చిపెడుతోంది.

ఆర్థిక వ్యవస్థలో అసమానతల వల్ల, పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రతిబింబంగా పైన చెప్పిన వైరుధ్యాలు నేడు మనల్ని వెక్కిరిస్తున్నాయి. ఆకలిని మించిన ఆహారాన్ని కలిగి ఉన్న వర్గం ఒకటయితే, ఆకలికి తగిన ఆహారం లేక అలమటిస్తున్న వర్గం మరొకటి. అయితే, మన దేశంలో ఎన్నో వనరులున్నాయి. అత్యధిక జనాభా ఇప్పటికే వ్యవసాయంపై ఆధారపడి బతుకుతున్నారు. భారత ఆహార సంస్థ గోదాముల్లో ధాన్యం పొంగిపొర్లి ముక్కిపోతోంది. కానీ ప్రజాపంపిణీ వ్యవస్థలో లంచగొండితనం వల్ల, అవకతవకల వల్ల ఆ ధాన్యం ప్రజలకి చేరడం లేదు. పైగా మొదటిరకం మేలైన ధాన్యం అంతా ఎగుమతి అయిపోతోంది. ఎగుమతులు పెరిగిన వెంటనే మన దేశంలో ధరలు పెరుగుతాయి. చక్కెర విషయంలో కూడా ఇదే జరిగింది.

అంతర్జాతీయ ఆహార విధానాల పరిశోధన సంస్థ (ఐఎఫ్‌పిఆర్ఐ) అంచనాల ప్రకారం మనం ఐదు మిలియన్ టన్నుల గోధుమలను తేలిగ్గా ఎగుమతి చేయగలం. దీని డైరెక్టర్ అశోక్ గులాటీ అలా ప్రకటిస్తుంటే, మనకి ఆహార కొరత ఎక్కడి నుంచి వస్తోంది? 'ఆకలితో అలమటిస్తున్న ఇండియా ఆహార ధాన్యాలను ఎగుమతి చేస్తోంది!' అనే పతాక శీర్షిక ఎంత హాస్యాస్పదం! ఎంత దారుణం! ప్రజల బాగోగులు కాక లాభాల వేట మన ఆర్థిక విధానాలను నిర్దేశిస్తోంది. ఇదేనా ప్రజాస్వామ్యం? కాదు. ఇది దోపిడీ విధానం! సామ్రాజ్యవాదుల నిర్దేశాలకు తలొగ్గే బడాబాబుల రాజ్యం!

నిజానికి మన వ్యవసాయం రోజురోజుకీ దిగజారిపోతోంది. ప్రభుత్వం ఇచ్చే రాయితీలు తగ్గిపోయాయి. నీటిపారుదలకి మద్దతు తగ్గిపోయింది. కొత్తగా తవ్విన కాల్వలన్నీ కోట్లను మింగాయే తప్ప నీటిని ఇవ్వలేదు. అవి నాయకుల వాగ్దానాల నీటి మూటలుగా మిగిలాయి. పైగా, నూతన ఆర్థిక విధానం పేరుతో వ్యవసాయ క్షేత్రాల మీద సెజ్‌లు నిర్మించారు. రోడ్ల విస్తరణ, హైవేల నిర్మాణం పేరుతో వ్యవసాయ భూములన్నీ కొట్టుకుపోయాయి. రహదారుల పక్కన భూములకు పెరుగుతున్న ధరలతో పంట పొలాలు ఇళ్ల స్థలాలుగా మార్పు చెందుతున్నాయి. నాణ్యమైన విత్తనాలు, పురుగు మందులు సరఫరా లేకపోవడంతో దిగుబడి దిగనాసిపోయి, వ్యవసాయ భూములు అమ్ముకోవలసిన పరిస్థితి ఉద్భవిస్తోంది. ఆ పంట పొలాల మీద కాంక్రీటు జనారణ్యాలు లేస్తున్నాయి.

పట్టణాల్లో కొనుగోలు శక్తి బాగా పెరిగిన కొంతమంది ధనిక వర్గాలకు మాంసాహారం అవసరమవుతోంది. వాళ్ల అవసరాలు తీర్చడం కోసం కోళ్లు, మేకలు కావాలి. వాటికి మేత కావాలి. అలా కూడా మనుషులకి అవసరమైన ధాన్యం జంతువులకి ఎక్కువగా చేరుతోంది. ఇంకా, ప్రస్తుతం గోధుమలు, వంటనూనెల దిగుమతి పెరగడంతో వాటి ధరలూ పెరుగుతున్నాయి.

ఈ సమస్యలు గడ్డువే అయినా, వాటికీ పరిష్కారాలు ఉన్నాయి. వ్యవసాయాన్ని అభివృద్ధి చేయడానికి ఆర్గానిక్ ఫార్మింగ్ పద్ధతులను అవలంబించాలి. ఆహార ధాన్యాలను ఎక్కువగా పండించాలి. వ్యాపార పంటల మీద కేంద్రీకరించేలా రైతుల్ని మభ్యపెట్టి, పత్తి రైతుల ఆత్మహత్యలకి దారితీసే పరిణామాలను అరికట్టాలి. ఆహార ధాన్యాల ఉత్పత్తిని ప్రోత్సహించే విధంగా రైతులకు రాయితీలు పెంచాలి. మరింత భూమిని సేద్య యోగ్యం చేయాలి. అలా పేదరికాన్ని నిర్మూలించి, ఆహార కొరతని తీర్చాలి. లేకపోతే, జోరా అనే అమెరికా జానపద రచయిత చెప్పినట్టు 'చావు కంపు కొట్టే పేదరికం'లో మనం మగ్గిపోక తప్పదు.

మరొకవైపు నించి చూస్తే వ్యవసాయంలో మనది ప్రపంచంలో రెండవ స్థానం! (సాగులో ఉన్న భూమి 184 మిలియన్ హెక్టార్లు) ప్రపంచంలో నీరు అందే భూమిలో కూడా మనదే పైచేయి. (అది 55 మిలియన్ హెక్టార్లు). ప్రపంచంలో పండించే గోధుమల్లో మనది 15 శాతం భాగం. పప్పుధాన్యాల్లో 21 శాతం మనదే. పాల ఉత్పత్తి మనది 90 మిలియన్ టన్నులు. వరి ఉత్పత్తిలో మనది 21 శాతం. సుగంధ ద్రవ్యాల ఎగుమతిలో మనదే పై చేయి. ప్రపంచంలో పేరెన్నికగన్న బాసుమతి వరి మనదే. కోళ్లు, మేకలు వగైరా పశు పెంపకంలో మనదే పైచేయి. పళ్లు, కూరగాయల పంటలో మనది ప్రపంచంలో రెండవ స్థానం. ఇన్ని అనుకూలాంశాలు ఉండి కూడా మనం ఆహార సరఫరాలో వెనుకబడుతున్నాం.

ఆహార పరిరక్షణ నిలకడగా ఉండాలంటే మూడు ప్రమాణాలు నెరవేరాలి. 1) అసలు ఆహారం అంటూ ఉండాలి. 2) అది మనకి అందుబాటులో ఉండాలి. 3) అది శరీరంలో జీర్ణం కావాలి.

ప్రపంచంలో మరణాల రేటు చూస్తే, ఆ మరణాలకు ప్రధాన కారణం

ఆకలే! అందుకే చిలీ కవి, నోబెల్ బహుమతి గ్రహీత పాబ్లో నెరూడా ఇలా అన్నాడు 'ప్రస్తుతం నేను ఆహారం తినే న్యాయాన్ని తప్ప మరేమి కోరను!'. కానీ ఈ న్యాయం అందక ఆకలి విలయతాండవం చేస్తోంది.

ఆకలిని కొలవడానికి రెండు ఎండిజి (మిలీనియం డెవలప్‌మెంట్ గోల్స్) సూచికలున్నాయి. సాధారణమైన రోజువారీ పనులు చేసుకోవడానికి కావలసిన శక్తి కోసం ఒక మనిషికి రోజుకి రెండు వేల కిలో కేలరీలు అవసరం. (కానీ మన ప్రణాళికా సంఘం వేసిన అసంబద్ధమైన లెక్కలు ఇంతకు ముందే చూశాం.) ఈ కనీసపు ఆహారం అందని ప్రజలు 1990లో 824 మిలియన్‌లు ఉంటే, 2010లో వారు 925 మిలియన్‌లకు పెరిగారు. రెండవ సూచిక ప్రకారం, వయసుకి తగిన బరువు లేని ఐదేళ్ల లోపు పిల్లలు 43 శాతంగా ఉన్నారు. ప్రపంచంలో అతి పేదవారైన రెండు బిలియన్ ప్రజలు వారి ఆదాయంలో దాదాపు 50-70 శాతాన్ని ఆహార పదార్థాలకే వెచ్చించవలసి వస్తోంది. పెరిగే ధరలను తట్టుకోవడం కోసం వారు ఎంచుకునే ప్రత్యామ్నాయం – తాము తినే ఆహారాన్ని పరిమాణంలో, ప్రమాణంలో తగ్గించుకోవడం!

డాక్టర్ వాల్డెన్ బెల్లో చెప్పినట్టు 'ప్రపంచంలో అందరికీ సరిపడినంత ఆహారం ఉంది. కానీ విషాదం ఏమిటంటే, ఒక పక్క వేలాది, లక్షలాది మంది పిల్లలు, పెద్దలు పోషకాహార లేమితో, కరువుతో అలమటిస్తుంటే, ధనికుల పొట్టలు నింపే విధంగా ప్రపంచంలోని ఆహార వనరులు, పశువులు బందీ అయిపోయాయి.'

ఆహార ధాన్యాల ధరలు అదుపు చేయలేక పోవడం వల్ల మన సామాజిక స్థిరత్వం దెబ్బతింటోంది. 2008లో 23 దేశాల్లో కరువు దాడులు జరిగాయి. ఇప్పటికీ మన దేశంలో ఆకలి చావులు చూస్తూనే ఉన్నాం.

ఈ పరిస్థితిని ఆసరా చేసుకొని సంపన్న దేశాలు తమ చౌకబారు ఆహార పదార్థాలను మన దేశం మీదికి గుప్పిస్తారు. ప్రపంచంలో ఆహార పదార్థాల ధరలను నిర్ణయించేది అంతర్జాతీయ మార్కెట్లో పెద్దపీట మీద కూర్చునే వ్యాపారులే. చమురు ధర కూడా ఈ ధరలపై చాలా ప్రభావం చూపుతుంది. అంటే, కళ్లకు కనిపించే కారణాలే కాక, తెరచాటు కారణాల వల్ల కూడా ధరలు అదుపు తప్పుతున్నాయి.

అలానే, ప్రజారోగ్యం మీద కూడా ప్రభుత్వం శీతకన్ను పడడంతో పేదలకు అది కూడా భారంగానే పరిణమిస్తోంది. తమ వైద్యం ఖర్చులో 75 శాతం వారే పెట్టుకోవాలి. క్యూబా వంటి చిన్న దేశం ప్రతి పౌరుడికీ విద్య, వైద్యం ఉచితంగా ఇవ్వగలుగుతుంటే, ఆర్థిక ప్రగతి అనే డప్పుని మోగిస్తూ మనం మాత్రం పేదల వైద్యాన్ని వారి నెత్తి మీదకే తోసేస్తున్నాం. ఇంకా పైగా 'ఆరోగ్య శ్రీ' వంటి అసమగ్రమైన పథకాలతో కార్పొరేట్ వైద్యానికి కోట్లు సరఫరా చేస్తున్నాం. 2012-13 బడ్జెట్ ప్రతిపాదనల్లో ఆరోగ్య శ్రీకి 925 కోట్ల రూపాయలు కేటాయిస్తే, అందులో 85 శాతం కార్పొరేట్ ఆసుపత్రులకు చేరుతుంది. డా. శ్రీనాథ్‌రెడ్డి, తదితరులు చేసిన శాస్త్రీయమైన సిఫార్సులను అమలు చేస్తే ఇప్పటికైనా మన వైద్య రంగాన్ని ప్రజోపయోగం చేయవచ్చు.

పోషకాహార లేమి వల్ల వ్యాధి తీవ్రత ఎలా పెరుగుతుందో చూశాం. అయితే, రెండేళ్ల లోపు పిల్లలకు ఆరు వ్యాధులను నివారించే టీకాలు పూర్తిగా ఇచ్చే విధంగా పని చేయవలసిన అర్బన్ హెల్త్ సెంటర్లు, అంగన్‌వాడి సెంటర్లు సక్రమంగా పనిచేయకపోవడం వల్ల అంటు వ్యాధులు ప్రబలుతూనే ఉన్నాయి. జాతీయ టీకా పథకంలో ఉన్న పొంగు వ్యాధి ఇప్పటికీ ఐదేళ్ల లోపు శిశు మరణాలకి కారణమవుతోందంటే, మన వైద్యరంగం ఎంత గాఢ సంషుప్తిలో ఉందో తెలుస్తోంది.

ఇలాంటి చీకటి కోణాలు మన దేశాన్ని వేధిస్తుంటే, మన ప్రధానామాత్యుల వారు మొదటిసారిగా పోషకాహారలేమిని చూసినట్టు ఉలిక్కిపడ్డారు! ఆయన మరి దానికి నివారణోపాయం సూచించారా? లేదు. పైగా, ఈసారి 2012-13 బడ్జెట్‌లో ఆరోగ్య శాఖ కేటాయింపుల్ని చాలా తక్కువ శాతం పెంచారు. (10-15 శాతం) అంటే, మన ప్రభుత్వం ఒక చేత్తో ఏమి చేస్తుందో, రెండో చేతికి తెలీదు! ఈ విధంగా, ప్లానింగ్ కమిషన్ ఆరోగ్యంపై వెచ్చించే మొత్తాన్ని తగినంతగా పెంచలేదు. అందుకే, మనం ప్రజారోగ్యంపై వెచ్చించే మొత్తం అన్ని దేశాల కంటే తక్కువ! కానీ ఆరోగ్యం మీద ప్రైవేటుగా పెట్టే ఖర్చు 67 శాతంగా ఉంది. ఇది అన్ని దేశాల కంటే ఎక్కువ. ఈ ద్వంద్వ నీతి వల్ల ప్రజల ఆరోగ్యం దిగజారిపోతోంది. ఆరోగ్య సదుపాయాలు సరిగ్గా లేకనే మాతా శిశు మరణాల సంఖ్య కూడా పెరుగుతోంది. ఈ సమస్యని తీర్చడం కోసం ఎన్.ఆర్.ఎచ్.ఎం.ని ప్రవేశపెట్టారు. కొన్ని రాష్ట్రాల్లో ఇది ఫలితం చూపుతోంది. మన రాష్ట్రంలో మాత్రం అది నత్తనడక నడుస్తోంది. ఉన్న నిధుల్ని సద్వినియోగపరచడానికి బదులు వాటిని స్వాహా చేస్తున్నారు. అందుకే, శిశు మరణాల సంఖ్య ఇంకా వెయ్యి పుట్టుకులకి 46 మరణాలుగా ఉంది. (దాన్ని 30కి తగ్గించడం మన లక్ష్యం.) గ్రామాల్లో అయితే అది 54. అలానే, గర్భిణీ స్త్రీల మరణాల సంఖ్య లక్ష కాన్పులకి 134గా ఉంది. (దాన్ని 100కి తగ్గించడం మన లక్ష్యం). గత సంవత్సరం 69 వేల మంది పిల్లలు చనిపోయారు. కారణాల్లో రక్తహీనతది 59 శాతం. మన ముందు తరాన్ని కాపాడుకోలేని ఈ దయనీయ స్థితిని ప్రగతి అందామా? వారికి బంగారు బాటలు వేయకపోగా ముళ్ల మీద నడిపించడాన్ని అభివృద్ధి అందామా?

ఒక పక్క వైద్య రంగంలో దశాబ్దంపాటు (2000-2010) ఆవిష్కరింపబడిన పది పురోగమనాల గురించి బాకాలూదుతున్నారు – జీనోమ్‌ని డీకోడ్ చేయడం, స్టెమ్‌సెల్‌పై పరిశోధనలు, మైక్రో సర్జరీలు వగైరా. మరోవైపు మన ఆరోగ్యం ఎంత క్షీణ దశలో ఉందో చూడండి. (శాతంలో)

సరిపడనంత ఆహారం లేని జనాభా	–	52.0
సరైన నీరు లేని జనాభా	–	51.4
సరైన ఇంటి వసతిలేని జనాభా	–	71.2
ప్రమాదకరమైన పరిస్థితుల్లో పనిచేసేవారు	–	77.7
ప్రమాదకరమైన అలవాట్లు కలిగిన ప్రజలు	–	62.0
సరైన వైద్యం అందుబాటులో లేనివారు	–	63.0

ఇక ఆహార భద్రత విషయానికి వస్తే, మధ్యప్రదేశ్‌లో జోరాసాబర్‌గర్ ప్రాంతంలో ఆదివాసులు రోజూ ఆహారం తీసుకునే వనరులు లేక, వంతుల వారీగా తింటారట. మూడు పూటలా కడుపు నిండా భోంచేసే కుటుంబాలు ఎన్ని ఉన్నాయి? సుబ్బారావు పాణిగ్రాహి పాటలాగా 'ఎన్నాళ్లీ కాపురాలు, ఏ చెరోగిరో పడి చేద్దామన్నా, ఎట్లాగీ కాపురాలు?... పూట పూటకూ చేట పట్టుకుని గడప గడప గాలించేదెట్లా?' అంటూ సతమతమయ్యే కుటుంబాలే ఎక్కువ. బడిలో మధ్యాహ్న భోజన పథకంలో పెట్టే అన్నం మాత్రమే రోజువారీ ఆహారంగా స్వీకరిస్తున్న బడిపిల్లలు, ఆ అన్నాన్ని కూడా మిగుల్చుకుని ఇంటికి తెచ్చి, చెల్లెళ్లకి, తమ్ముళ్లకి తినిపిస్తే, అది పాచిపోయి రోగాల పాలైన సంఘటనలు ఎన్నో. మరి ఆహార భద్రత ఏది?

అసలు ఆహార భద్రత అంటే ఏమిటి? ప్రజలందరూ అన్ని వేళలా తమ ఆహారపు అవసరాలను తీర్చడానికి తగినంత శుభ్రమైన, బలవర్ధకమైన ఆహారాన్ని సమకూర్చుకోగల శారీరక శక్తి, ఆర్థిక వనరు, సామాజిక అవకాశం కలిగి ఉండాలి. అలా వారు చురుకైన ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపగలగాలి. అదే ఆహార భద్రత. అది కొరవడితే పేదరికం, దీర్ఘకాలిక ఆకలి, ఆహారలేమి పరిణమిస్తాయి.

అభివృద్ధి చెందుతున్న దేశాల్లో 70 శాతం జనాభా గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తారు. వారికి భూమి మీద ఎలాంటి యాజమాన్యపు హక్కులు ఉండవు. భూమినే నమ్ముకున్నా గాని, హక్కులు లేకపోవడంతో వారు ఆ భూమిని మెరుగుపరిచే ప్రయత్నం చేయరు. అలా వారు క్రమంగా పేదరికంలోకి నెట్టబడతారు. దీర్ఘకాలిక ఆకలితో అలమటిస్తారు. కరువు కాలంలో, ఆహార కొరత కాలంలో గ్రామీణ ప్రజలు మరింతగా బలవుతారు. మరోవైపు, ఎగుమతుల కోసం వ్యాపార పంటలు పండించి, గిట్టుబాటు ధర లేక ప్రాణాలు తీసుకుంటున్నారు.

ఇలాంటి నేపథ్యంలో ఆహార భద్రత బిల్లు నీటి మూటగానే మిగులుతోంది. ప్రజలకు ఉపయోగపడే బిల్లు అయితే, రైతులకు ప్రత్యక్ష సబ్సిడీలు ఇవ్వాలి. రైతు నించి నేరుగా ప్రభుత్వ సేకరణ పెరగాలి. మధ్యవర్తులు లేకుండా రైతులు స్వయంగా అమ్ముకునే సౌకర్యం కల్పించాలి. కానీ మన బిల్లు ఈ కర్తవ్యాన్ని నెరవేర్చడం లేదు. ప్రజా పంపిణీ వ్యవస్థ (పిడిఎస్) లో 58 శాతం ధాన్యం ప్రజలకి చేరదు. అది అవినీతికి మరిగిన పందికొక్కుల బొక్కసాల్లోకి పోతోంది. ఐసిడిఎస్‌లో సరఫరా చేసే బలవర్ధకమైన పిండి పిల్లలకు, గర్భిణీ స్త్రీలకి చేరదు. అది పశువుల దాణాగా రూపాంతరం చెందుతుంది.

పేదవారు ఎవరనే విషయం మీద కూడా పాలకులు మల్లగుల్లాలు పడుతున్నారు. ఎండిజిలో మొదటి లక్ష్యం – అతి పేదరికాన్ని, ఆకలిని అంతమొందించడం. అంటే, 2015 నాటికి ఆకలితో అలమటించేవారి సంఖ్యని సగానికి సగం తగ్గించాలనేది మన లక్ష్యం. అయితే, మధుర స్వామినాథన్ అనే ఆర్థికవేత్త మన ఆహార భద్రత బిల్లుపై అనుమానాలు వ్యక్తం చేశారు. మనలాంటి పెద్ద దేశంలో నిరుపేదలను లెక్కవేయడం కష్టం అని, అతి పేదవారు ఈ బిల్లు కిందికి రాకపోయే ప్రమాదం ఉందని ఆమె హెచ్చరించారు. మన ప్రభుత్వం మెక్సికో, బ్రెజిల్ వంటి దేశాల నమూనాలు చూపుతోందని, కానీ పిల్లల్లో పోషకాహార లేమి అక్కడ 5 నించి 6 శాతం మాత్రమేనని, మన దేశంలో అది 46 శాతం అని గుర్తు చేశారు. అంత పెద్ద లోటు ఉండగా, పేదవారు లెక్కల్లోకి రాకుండా తప్పిపోరని ఏమిటి హామీ అని ఆమె ప్రశ్నించారు. తమ ఖర్చుల్లో 33 శాతం ఆహారం కోసం వెచ్చించేవారికి అమెరికాలో ఆహార స్టాంపులు ఇస్తారని ఆమె అన్నారు. దానిని కొలబద్దగా తీసుకుంటే, మన దేశంలో గ్రామీణ ప్రాంతంలో 95 శాతం, పట్టణాల్లో 90 శాతం ఆ కోవకే చెందుతారు. కానీ మన భద్రతా బిల్లులో వారిని గ్రామాల్లో 25 శాతంగానూ, పట్టణాల్లో 50 శాతంగానూ కుదించివేశారు. ఆర్థిక కొలబద్దలే కాక, శిశు మరణాలు, పోషకాహార లేమి వంటి సామాజిక అంశాలను కూడా ఈ బిల్లు పరిగణనలోకి తీసుకోవాలని ఆమె సూచించారు. అయితే, వైద్యం తెలియని వైద్య ఆరోగ్య శాఖ మంత్రులు, సామాజిక హెచ్చు తగ్గులు తెలియని ఆర్థిక మంత్రులు, నిజమైన విజ్ఞానం లేని విద్యామంత్రులు, ఆకలి తెలియని ప్రణాళికా సంఘం నిపుణులు రాజ్యం ఏలుతుంటే, ఈ అవకతవక ప్రభుత్వం కింద ఇలాంటి అవకతవక బిల్లులే పుట్టుకొస్తాయి! ఇది ఆహార 'అ'భద్రత బిల్లుగానే మిగిలిపోతుంది.

అంగట్లో అన్నీ ఉండి అల్లుడి నోట్లో శని ఉన్నట్లు! పొంగులు వారుతున్న గిడ్డంగుల ధాన్యం మధ్య చిప్ప చేతపట్టుకున్న బాల్యం! విరివిగా ఉన్న ధాన్యపు గుట్టల మధ్య ఆకలి విలయతాండవం అనే విడ్డూర పరిస్థితి.

అన్నిటికంటే ఆక్షేపణీయ విషయమేమిటంటే, రాజకీయ నాయకులు, పాలకులు ఆహారాన్ని రాజకీయ ఆయుధంగా వాడుకుంటున్నారు. వారు తమ మద్దతును కూడగట్టుకోవడానికి ఆహారం ద్రవ్యం అయిపోతోంది. ప్రతిపక్షాలకు వ్యతిరేకంగా ఉపయోగించుకోవడానికి కరువు అనేది శక్తిమంతమైన ఆయుధంగా ఉపయోగపడుతోంది.

దేశాన్ని అధోగతిపాలు కాకుండా రక్షించాలనుకునే వాళ్లు ప్రతి పత్రికలో బడ్జెట్ గురించి, పోషకాహార లేమి గురించి ఆహార భద్రతా బిల్లు గురించి చర్చలు జరుపుతున్నారు. కానీ దేశాన్ని తాకట్టు పెట్టే పాలకులు వీటిని పట్టించుకోవడం లేదు. అవినీతికి చట్టబద్ధత కల్పించడం ఎలా అని, అప్పనంగా సంపాదించుకున్న ఆస్తులను ఎక్కడ ఎలా దాచుకోవాలా అని ఎత్తుకి పై ఎత్తులు వేసే పాలకులు కోట్లాది పేదల కడుపులు కొడుతూ, వారి ఆహార లేమిని పెంచి పోషిస్తున్నారు. సగటు మనిషిని పశువు కంటే హీనంగా అంచనా వేస్తూ, వారికి రోజుకి రు.28 చాలనే వింత లెక్కలు వేస్తూ, ఆక్షేపణలు వినపడనంతగా చెవులూ, కళ్లూ మూసుకున్నారు. సమయం వస్తే ప్రజల సమస్యలకు స్పందిస్తున్నట్లు మొసలి కన్నీరు కారుస్తున్నారు.

ఆలన్ పేటన్ చెప్పినట్టు 'సమాజాన్ని సంస్కరించే లక్ష్యాన్ని మర్చిపోతే, స్వేచ్ఛాయుతమైన మానవుడిగా నీ బాధ్యతని వదులుకున్నట్టే అవుతుంది'. అలానే ఐసెన్ హోవర్ అన్నట్టు 'ప్రతి తుపాకి తయారీ, ప్రతి యుద్ధ నౌక తయారీ, ప్రతి రాకెట్ సారాంశంలో, ఆకలిగొన్న వారికి తిండిని అందించకుండా, గుడ్డలు లేని వారికి గుడ్డలు అందించకుండా చేస్తున్న దొంగతనమే అవుతుంది.'

ఇలాంటి పరిస్థితుల్లో, ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలను బహిర్గతపరిచి, ప్రజలని చైతన్యవంతం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత కావాలి. ఈ అవకతవకల వల్ల కలిగే ఫలితాన్ని చూసి వాపోవడం కాక, వీటి వెనక గల కారణం ఏమిటో అందరూ గుర్తెరగాలి. పోషకాహార లేమి నివారణ చర్యలను వేగవంతం చేసేలా ప్రభుత్వాన్ని నిలదీయాలి. 'నేషనల్ షేమ్'కి తెరదించి, బడ్జెట్‌లో విద్య, వైద్యం కేటాయింపులని పెంచమని డిమాండ్ చేయాలి. ఆహారోత్పత్తి, పంపిణీలలో లాభాలు బేరీజు వేయకుండా, ముందుగా ప్రజల అవసరాలను తీర్చి, తర్వాతనే ఎగుమతులను అనుమతించాలి. ఇలాంటి ప్రజోపయోగ విధానాలు చేపట్టి దేశాన్ని పురోగమింప చేయాలనే చిత్తశుద్ధి పాలకుల్లో లోపించడం వల్ల ప్రజలే వారిని పదే పదే హెచ్చరించాలి. పెరుగుతున్న ధరలతో, మండుతున్న కడుపులతో పిడికిళ్లు బిగించి ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి. లేకపోతే మన దేశం మరింత దుర్భరమైన స్థితికి దిగజారక తప్పదు.

(రచయిత పిల్లల వైద్య నిపుణులు) వీ

వీక్షణం పుస్తకాల కోసం ఫ్లిప్‌కార్ట్‌నూ సంప్రదించవచ్చు!

వీక్షణం: http://www.flipkart.com/search-books?query=Veekshanam&field=publisher

స్వేచ్ఛాసాహితి: http://www.flipkart.com/search-books?query=Swechchaa+Saahiti&field=publisher

బి1 కలెక్టివ్: http://www.flipkart.com/search-books?query=B1Collective&field=publisher&searchGroup=all&filter=language%3ATelugu

సిడిఆర్‌సి: http://www.flipkart.com/search-books?query=Center+for+Documentation&searchGroup=all&filter=language%3ATelugu

ఆహార (అ)భద్రతా బిల్లు

ఎన్నికల రాజకీయాల్లో భాగంగానే ఆహార భద్రత బిల్లును తెస్తున్నారనీ, గతంలో తెచ్చిన పలు పథకాల్లాగే ఇది కూడా దళారులకు జేబులు నింపడానికే తప్ప ప్రజల మేలు కోసం కాదనీ అంటున్నారు జి. సూరి

2012 ఫిబ్రవరి, మార్చ్ నెలల్లో అంచలంచలుగా ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖాండ్, పంజాబ్, మణిపూర్, గోవా రాష్ట్ర శాసన సభలకు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలకు ముందే కేంద్ర ప్రభుత్వం 'ఆహార భద్రత' బిల్లును కూడ విడిగా పార్లమెంటులో ప్రవేశపెట్టింది. ఈ బిల్లును ఇంత ఆఘమేఘాల మీద ప్రవేశపెట్టడంలో గల మర్మమేమిటి? ఈ బిల్లు 65 శాతం ప్రజలను ఆకలి బారి నుండి కాపాడి, భద్రత కల్పిస్తుందని కాంగ్రెస్ పార్టీ, యు.పి.ఎ. ప్రభుత్వం భారీగా ప్రచారాన్ని చేపట్టాయి. ప్రచారాన్ని ఇంత భారీగా చేపట్టడంలో గల ఉద్దేశం ఏమిటి? అయిదు రాష్ట్రాలలోనూ గెలిచి, తన అధికార దాహాన్ని, ఆకలినీ తీర్చుకోవడం కోసం వేసిన ఎరగా ఈ బిల్లును మనం చెప్పుకోవచ్చు. కానీ ఎన్నికల ఫలితాలను చూస్తే, ఈ 'ఆహార భద్రత' బిల్లు ప్రభుత్వం ఆశించినట్టుగా ప్రజలలో భ్రమలు కల్పించలేక పోయింది. ఆ భ్రమలను ఓట్లుగా మార్చుకోలేక పోయింది. ఘోరంగా విఫలమయింది. గతంలో ప్రవేశ పెట్టబడి అమలవుతున్న ఎన్నో ప్రజాకర్షక పథకాలలాగానే ఈ పథకం కూడా ప్రజలకు నిరుపయోగమై చతికిలబడి పోతుందనడానిదితీ, ప్రజలు పాలకవర్గాల మాయమాటలు నమ్మలేదనడానికి ఈ అయిదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలే ప్రబల నిదర్శనం.

ఈ బిల్లు చట్టమైన తర్వాత దేశంలో ఏ ఒక్కరూ ఆకలితో అలమటించారంటూ, దేశ భావి ప్రధానమంత్రిగా కలలుగంటున్న రాహుల్‌గాంధీ తన ఎన్నికల ప్రచారంలో ఢంకా బజాయించారు. ఈ బిల్లు అమలుకు 27,500 కోట్ల రూపాయలు అదనంగా ఖర్చు అవుతాయని అంచనా, ఇంత భారీ ఖర్చుకు ప్రణాళికా సంఘ ఉపాధ్యక్షుడు మాంటెక్‌సింగ్ అహ్లూవాలియా, కేంద్ర వ్యవసాయమంత్రి శరద్‌పవార్ మొదట అంగీకరించలేదు. తదుపరి సోనియా గాంధీ పట్టు మీద ఈ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టడం జరిగింది. సోనియా ఈ బిల్లు ప్రవేశపెట్టడానికి కారణమైందని పొగిడారు. రాహుల్‌గాంధీని భావి ప్రధానమంత్రిగా చూడాలనే సోనియా గాంధీ చిరకాల వాంఛ ఈ భజనల వెనుక దాగి ఉన్నదనేది జగద్విదితమే!

అయితే ఒకసారి గనుక మనం గతంలోకి తొంగిచూసినట్లైతే, ఇలాంటి భ్రమలు కల్పించే ప్రజాకర్షక పథకాలు ఆచరణలో పాలకు పాలు, నీటికి నీరుగా విడిపోయి, ఇందతా సంపన్న వర్గాల, పాలకుల మోసం, మాయ, దగా, కుట్ర అని తేలిపోయిన సందర్భాలు, ప్రజలను ఏ మార్చిన సందర్భాలు కోకొల్లలు. ఈ విషయాల్ని ప్రజలు గమనిస్తున్నారు. అనుభవ పూర్వకంగా గ్రహిస్తున్నారు. ఉదాహరణకు ఇందిరాగాంధీ 'గరీబీ హఠావో' పథకం తమ దారిద్ర్యాన్ని తీసివేయలేక పోయిందనీ, రాజీవ్‌గాంధీ 'నిరుద్యోగ నిర్మూలన' పథకం తమకు ఎటువంటి ఉద్యోగ భద్రతని ఇవ్వలేక పోయిందనీ, కొన్ని సంవత్సరాల క్రితం ప్రవేశ పెట్టబడిన 'గ్రామీణ ఉపాధి హామీ' పథకం తమ పేదరికాన్ని అపహాస్యం చేస్తోందనీ క్షుణ్ణంగా తెలుసుకుంటూనే ఉన్నారు. ఈ పథకాలకు కేటాయించబడుతున్న అపారమైన నిధులన్నీ మోసంతో, దౌర్జన్యంతో దోచుకుంటున్న నిచ్చెన మెట్ల నాయక గణానికి తరలిపోవడం చూస్తున్నారు. తమకు ఆ నిధుల్లో 10 శాతం కూడా దక్కడంలేదని అట్టడుగు వర్గాల ప్రజలు తెలుసుకుని ఆవేదన చెందుతున్నారు. మోసపూరితమైన ఈ అన్యాయాల్ని, అక్రమాల్ని పాలకవర్గాలు, పాలకవర్గాల వత్తాసుతో బడాపెట్టుబడి చెలరేగి చేసే దోపిడీకి పట్టపగ్గాలు లేకుండా పోయాయి. పెట్టుబడిదారీ వర్గాలు 'ప్రజలు చస్తే మాకేంటి' అనే ధోరణితో అన్ని విధాలా దోచుకుంటూ ఉంటే ప్రేక్షకుల్లాగా చూస్తూ ఉండి పోవడమేనా అని, అత్యధిక పేద ప్రజానీకం తమను తాము ప్రశ్నించుకుంటున్న సందర్భం కనబడుతోంది.

గతంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న ఎన్.టి రామారావు, తమిళనాడు ప్రభుత్వం పేదలకు రెండు రూపాయలకు కిలో బియ్యం ఇస్తున్నా, కేంద్రం అంత్యోదయ పథకాన్ని సంవత్సరాల తరబడి అమలు పరుస్తూ వస్తున్నా, నేడు ఒక్క రూపాయకే కిలో బియ్యం ఇస్తున్నా, పేదరికం తగ్గలేదు సరికదా రోజు రోజుకు పెరిగిపోతోంది. మరో వైపు సంపన్న వర్గాలకు ప్రభుత్వం పన్ను రాయితీల పేరుతో, అనేక రకాలుగా దోచిపెడుతూ, పేదలకూ, సంపన్న వర్గాలకూ మధ్య అంతరాన్ని రోజు రోజుకూ పెంచి పోషిస్తూనే ఉంది. ఈ పరిణామాలు ఏమి చెపుతున్నాయి? ఇన్ని చేసినా ఆహార అభద్రత అట్టడుగు వర్గాల ప్రజల జీవితాల నుండి ఎందుకు తొలగి పోవడం లేదు? వీటికి జవాబులు మన కళ్ల ముందే ఉన్నాయి. రూపాయికి కిలో బియ్యం ఇచ్చినంత మాత్రాన నిత్యావసరాల వస్తువులైన కూరగాయలు, వంట నూనెలు, పప్పుల ధరలు ఆకాశాన్నంటుతుంటే, ఆహార భద్రత ఏవిధంగా ఏర్పాడగల్గుతుంది? ఒక వైపు భవిష్య వాణిజ్యం ఆహార ధాన్యాల ధరలను పెంచుతూ పోతుంటే ఆహార భద్రత ఏవిధంగా ఒనగూరుతుంది? ప్రతి ఒక్కరు ఈ ప్రశ్నలను సంధించుకోవలసిన సందర్భం ఏర్పడింది. ఈ పరిణామాలన్నింటికి ఆయువుపట్టు సామ్రాజ్యవాద ద్రవ్యపెట్టుబడిలో ఉంది. ఆ పెట్టుబడి నిర్దేశించిన నూతన ఆర్థిక విధానాల్లో ఉంది. వాటిని నిర్ద్వందంగా అమలు పరుస్తున్న ప్రభుత్వ దగా కోరుతనంలో ఉంది. మొత్తంగా చూస్తే ఈ ఆహార అభద్రతకు, ఉపాధి రంగాలకు మౌలికమైన వ్యవసాయ రంగాన్ని ధ్వంసం చేయడంలో ప్రభుత్వం చూపిస్తున్న చొరవ ధనిక వర్గాలకు దోచిపెట్టడానికేనన్నది విశదమవుతుంది.

రాజ్యంతో, సామ్రాజ్యవాద పెట్టుబడితో అమీ తుమీ తేల్చుకోవలసిన అనివార్య పరిస్థితులలోకి ఈనాడు యావత్ భారతదేశ ప్రజానీకం నెట్టివేయబడింది. బడాపెట్టుబడిదారులు, వారికి వత్తాసు పలుకుతున్న మన పాలకులు ప్రజలను నిలువుదోపిడి చేసే విధానం ఎలా ఉందంటే ప్రజలను ఎత్తైన కొండమీద నిలబెట్టి, పాతాళ లోయను చూపిస్తూ 'దూకి

చస్తారా? నెట్టెయ్యమంటారా? అన్నచందంగా ఉంది. ఈ అఖాతంలోనికి ప్రజలు దూకక పోతే వాళ్లనెలాగూ నెట్టి చంపేస్తారనే ప్రభుత్వ దుర్మార్గపుటాలోచనని ప్రజలు గ్రహిస్తున్నారు. జీవించే హక్కుకోసం, తమ అస్తిత్వాన్ని నిలబెట్టుకోవడం కోసం తిరగబడుతూ ఉన్నారు. ఈ క్రమంలో సకలజనులు తమకెదురవుతున్న పెద్ద సమస్యల నుండి, చిన్న సమస్యల వరకు పరిష్కార మార్గానికి పోరాటం వైపు చూస్తున్నారు. ఉద్యమాల వైపు చూస్తున్నారు. బుద్ధిజీవులు క్రమక్రమంగా ఈ పరిస్థితుల వైపు మొగ్గచూపుతున్నారు. అట్టడుగు వర్గాల ప్రజలు ఉద్యమాల్లో భాగస్వాములవుతున్నారు. ఇది ప్రజాతంత్ర విప్లవానికి అవసరమైన మలుపుగా మనం చూడవచ్చు.

ప్రస్తుత ఆహార భద్రతా బిల్లు కూడా కిలో బియ్యం మూడు రూపాయలకు, కిలో గోధుమలు రెండు రూపాయలకు పేదలకందించాలని సంకల్పించిందే. ఈ బిల్లు పుట్టుక మూలాల్లోకి వెళ్తే, గత అయిదారేళ్లుగా ఆహార భద్రత గురించి చర్విత చర్వణాలనే నాటకం రక్తి కట్టించిన ప్రభుత్వం, అంతిమంగా 'ప్రభుత్వ గోదాముల్లో నిలువ ఉన్న ఆహార ధాన్యాలను ముక్క బెట్టె బదులు పేదలకు పంచమన్న' సుప్రీం కోర్టు ఆదేశాలను కారణంగా చెప్పుకోవచ్చును. అయితే ఈ బిల్లు చట్టమైన పక్షంలో అందులో రెండు ముఖ్యమైన విషయాలు క్రోడీకరించబడ్డాయి. ఈ చట్టాన్ని అమలు పరిచే అధికారం న్యాయస్థానాలకు లేక పోవడం ఒకటైతే, ధరలను పెంచే అధికారాన్ని ప్రభుత్వమే అట్టేపెట్టుకోవడం రెండవది. ఏ న్యాయస్థాన ప్రేరణ వల్ల ఈ బిల్లు రూపుదిద్దుకుందో, ఆ బిల్లు చట్టమైన తదుపరి దాన్ని అమలు చేసే అధికారాన్ని న్యాయస్థానాలకు ఇవ్వక పోవడంలోని ప్రభుత్వ ఆంతర్యమేమిటో బుద్ధిజనులకు విదితమే!

మరో నిగూఢమైన విషయమేమిటంటే, ఈ బిల్లు చట్టమైతే, ప్రభుత్వం వారు వారి ఇచ్ఛానుసారం దశలవారీగా అమలుచేసే పరిస్థితే కనబడుతోంది. అంతే కాని, ఏ పేదల కొరకైతే ఈ చట్టం రూపొందించ బడుతోందో వారి ఆశల మేరకు వెంటనే అమలు పరిచే పరిస్థితి మాత్రం లేదు. ఈ బిల్లును పేదల పాలిట పెన్నిధిగా పైకి ప్రచారం చేసుకుంటూ, లోలోపల తమ సంకుచిత రాజకీయాలతో ప్రజలకు మోసపు మాటలు చెప్పి ఓట్లు దండు కోవడానికే.

ఈ బిల్లును అమలు జరిపే క్రమంలో దీనికయ్యే ఖర్చు విషయంలో కూడా ప్రభుత్వ ద్వంద్వ వైఖరిని మనం గమనించవచ్చు. ఒక వైపున సాలీనా 27,500ల కోట్ల రూపాయల భారీ అదనపు ఖర్చు అవుతుందని ప్రభుత్వం చెబుతోంటే, మరో వైపున అదే ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న కేంద్ర ఆహార మంత్రి కె.వి. థామస్ అదనపు భారం 21,000ల కోట్ల రుపాయలేనని ప్రకటించాడు. ప్రభుత్వ ఈ ద్వంద్వ వైఖరిని మనమెలా అర్థం చేసుకోవాలి? ప్రజలంటే గొర్రెల మందేనని, ఏది చెప్పిన నమ్మేస్తారని-'సబ్ చల్‌తా' అని ప్రభుత్వాలు భావిస్తున్నాయా?

పైగా ఈ బిల్లు చట్టమై అమలు అయితే, అమలులో ఉన్న అంత్యోదయ, ఐసిడిస్ లాంటి పథకాలన్నీ వెంటనే రద్దు చేస్తారు. వీటి నిధులన్నీ మిగిలిపోతాయి. అందుచేత, ఈ ఆహార భద్రతా బిల్లు విషయంగా అదనపు ఆర్థిక భారం పడుతుందని చేసే ప్రభుత్వ ప్రచారంలో నిజం లేదు. ఇదంతా 'పేదల గురించి ఇంత భారీ మొత్తాన్ని ఖర్చు పెడుతున్నామనే' సూడో హీరోయిజం ప్రదర్శించడమే తప్ప మరోటి కాదు.

ఒకవేళ ప్రభుత్వానికి అదనపు ఆర్థిక భారం ఉందనుకున్నా, ఈ సంవత్సరం బడ్జెట్‌లో పన్నురాయితీగా సంపన్న వర్గాలకిచ్చిన రు. 4,18,000 కోట్ల ముందు ఈ రు. 27,500 కోట్లు దిగదుడుపే! సంపన్న వర్గాలు ఎగ్గొట్టిన పన్నులు, వసూలు చెయ్యని పన్నులు మొత్తంగా రు. 2,00,000 కోట్ల వరకు ఉంటాయి. ఈ కొండ ముందు రు. 27,500 కోట్ల చిట్టెలుక ఏపాటిది? సంపన్నులకి, పేదవారికి మధ్య దూరం రోజు రోజుకీ అత్యంత వేగంగా పెరుగుతున్న ఈ అసమ సమాజంలో ఇలా ఎన్నో పోలికల్ని చెప్పుకోవచ్చు.

ఏ అల్పాదాయ వర్గాల (రోజుకు 25 రు.సంపాదించేవారు) ప్రజల కొరకు ఈ బిల్లు ఉద్దేశించబడిందో, ఏ అల్పాదాయ వర్గాల ప్రజలకు భద్రత అనివార్యమో, అటువంటి వర్గాలకు చెందిన నిరాశ్రయుల్ని, దిక్కులేని ఒంటరి మహిళల్ని, నిరుపేద నేతపనివారిని, వికలాంగుల్ని ఈ బిల్లు పరిధి నుండి తప్పించారు. మరి ఈ బిల్లు ఎవర్ని ఉద్ధరించడానికి? ఇలా జరగడానికి దారి తీసిన పరిస్థితులేమిటి అని విశ్లేషిస్తే, నయా ఉదారవాద ఆర్థిక విధానాలకు దిక్సూచిగా నిలిచిన ప్రపంచ బ్యాంకే. ప్రపంచంలో ఎవ్వరూ 'ఆకలితో బాధపడరాదన్న మౌలిక హక్కు' ను ధృవపరుస్తూ ప్రపంచ ఆహార భద్రతపై 1996 నాటి 'రోమ్ డిక్లరేషన్' పై ఘనమైన మనదేశం కూడా సంతకం చేసింది. ఆ విషయాన్ని ప్రక్కనపెట్టడం ఎంతవరకు సమంజసం? ఆత్మగౌరవంతో కూడిన ఒక జీవితమంటే ఆహార, కనీస విద్య, ఆరోగ్యం మొదలైన అవసరాల ఆకాంక్షకు మోకాలడ్డు. ఈనాడు ప్రపంచ బ్యాంక్ ఆదేశాల కనుగుణంగా గులాములుగా పని చేయడంలో మన పాలకుల అనైతికతను మనమెలా అర్థం చేసుకోవాలి? అత్యధిక భారత ప్రజానీకం ఆహారానికీ, ఉపాధికీ మౌలిక వనరుగా ఉన్న వ్యవసాయ రంగాన్ని పాలకులు ధ్వంసం చేశారు.

ప్రపంచ పెట్టుబడిదారీ విధానం రోజురోజుకు పరిష్కారించలేని సంక్షోభపు ఊబిలో మునిగిపోతూ క్షీణదశకు చేరుకుంటున్న నేటి తరుణంలో ఉవ్వెత్తునలేస్తున్న ఉద్యమాలనూ, పోరాటాలనూ అందిపుచ్చుకోవలసిన అవసరం ప్రతి భారతీయుడికి ఉంది. ఎందుకంటే క్షీణదశలో ఉన్న పెట్టుబడిదారీ విధానాన్ని అంతమొందించే క్రమంలో విప్లవిస్తున్న నేటి భారత ప్రజారాశులు, ప్రజాయుద్ధతంత్రంతో ముందుకు సాగుతున్నాయి. విప్లవకారుల ఆశయాలను, ఆచరణను మానసికంగా, భౌతికంగా ధృవపరుస్తూ, వారికి బాసటగా నిలబడడం సమాజంలోని ప్రజాస్వామిక వాదుల, మేధావుల, బుద్ధిజీవుల కనీస నైతికత.

మన పాలకులు ఆహారానికి బదులుగా స్టాంపులు అంటే కూపన్లు, నగదు బదిలీ పద్ధతిని ప్రవేశపెట్టాలని తాపత్రయపడుతున్నారు. గతంలో ఈ ప్రయోగం శ్రీలంక, మెక్సికో, జమైకా వంటి దేశాలల్లో వ్యతిరేక ఫలితాన్నిచ్చింది. అయినా అటువంటి పద్ధతిని ప్రవేశపెట్టడంలో మన పాలకుల అభిమతమేమిటి అని విశ్లేషిస్తే, మన ప్రభుత్వంవారు వ్యవసాయ పరిశ్రమాధిపతులతో మ్యాచ్ ఫిక్సింగ్ చేసుకున్నారని పరిస్థితులు వెల్లడిస్తున్నాయి. ఈ కూపన్ పద్ధతిని ప్రవేశపెట్టిన అచిరకాలంలోనే ప్రజాపంపిణీ పద్ధతిని ప్రభుత్వం బలహీనం చేసేటట్టు, ఆహారధాన్యాల ధరలను వ్యవసాయ పరిశ్రమాధిపతులు అక్రమంగా పెంచివేసేటట్టూ, అలా అత్యంత ఎక్కువగా పెరిగిన ఆహార ధాన్యాలను పేదప్రజలు కొనే పరిస్థితికి నెట్టివేసి, ఆ లాభాలను వ్యవసాయ పరిశ్రమాధిపతులకు కట్టబెట్టేటట్టూ, ఆ క్రమంలో దళారీ పాలకులు తగిన ముడుపులు పొందేటట్టు! ఇదీ ప్రభుత్వం మ్యాచ్ ఫిక్సింగ్‌ను అమలు పరచేక్రమం.

ఈ బిల్లు అమలు విషయానికొస్తే, మన పురుషాధిక్య, అర్ధభూస్వామ్య

ఆర్‌టిసి సమస్యలకు కారకులెవరు?

ప్రైవేట్ శక్తులకు, బహుళజాతి కంపెనీలకు మేలు చేసే విధానాలతో ఆర్‌టిసి కార్మికుల హక్కులను కాలరాస్తూ, సంస్థను నష్టాల పాలు చేస్తున్నారని అంటున్నారు **ఎం.ఎస్. సాయి**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఎపిఎస్ఆర్‌టిసి) పరిస్థితిపై గత కొన్ని నెలలుగా రవాణాశాఖ మంత్రి, ఆర్‌టిసి ఉన్నతాధికారులు కార్మికులను, ప్రజలను ఆందోళనకు గురిచేసే ప్రకటనలు చేస్తున్నారు. ఎపిఎస్ఆర్‌టిసి 3500 కోట్ల రూపాయల అప్పులలో ఉన్నదనీ, (నిజంగా ఇంత అప్పున్నదా?), రాష్ట్రంలోని 210 డిపోలలో 15 డిపోలే లాభాలలో నడుస్తున్నాయనీ, రోజుకి 2 కోట్ల రూపాయలు సంస్థకు నష్టం వస్తున్నదనీ, ప్రతి కార్మికునిపై 3 లక్షల రుణభారం ఉందనీ, ప్రయాణికుల రద్దీ సమయంలో ఛార్జీలను పెంచడంతోపాటుగా విమాన ఛార్జీల తరహాలో డిమాండ్‌ను బట్టి ఛార్జీలను వసూలు చేయాలనీ ఆర్‌టిసి ఎండి ఎకె ఖాన్ ప్రకటించారు. రవాణాశాఖ మంత్రి వివిధ సందర్భాలలో మాట్లాడుతూ ఆర్‌టిసికి ఇప్పటికే ప్రభుత్వం చాలా సహాయం చేసిందనీ, ఎల్లప్పుడూ సహాయం చేయలేమనీ, జీతాలకు కూడా డబ్బుల్లేవనీ, ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే ఆర్‌టిసిని ముక్కలు చేయక తప్పదనీ, రాష్ట్రంలోని 40 శాతం రూట్లను ప్రైవేట్ వారికి అమ్మివేయాలనీ, ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యం పెంచాలనీ ప్రకటనలు చేస్తున్నారు. మరొకవైపున ఆర్‌టిసిని నష్టాల నుండి, అప్పుల నుండి కార్మికులే బయట పడవేయాలని, సంస్థను పరిరక్షించుకోవాలనీ, అందుకు కార్మికులు కఠోర శ్రమ చేయాలనీ, త్యాగాలు చేయాలనీ ఆర్‌టిసి ఉన్నతాధికారులు, పాలకులు ఉపదేశాలు చేస్తున్నారు.

ఆర్‌టిసి ఉపయోగించే డీజిల్, పెట్రోల్, టైర్లు, ట్యూబులు, ఇంజన్‌లు, ఛాసిస్‌లు, బాడీ బిల్డింగ్, విడిభాగాలు, ఉపకరణాలు విదేశీ సామ్రాజ్యవాద కంపెనీలద్వారా కొనుగోలు చేస్తున్నారు. వాటి ధరలను కంపెనీలు ప్రతి సంవత్సరం పెంచుతున్నాయి. వీటిపై ప్రభుత్వానికి నియంత్రణ లేదు. అందుచేత పాలకులు ఆర్‌టిసి ఆదాయంలో మెజారిటీ భాగాన్ని విదేశీ కంపెనీలకు దోచి పెడుతున్నారు. ఆర్‌టిసికి సమాంతరంగా ప్రైవేట్ అక్రమ రవాణాను ప్రభుత్వమే ప్రోత్సహిస్తున్నది. దీని మూలంగా ఏటేటా 1800 కోట్ల రూపాయలు ఆర్‌టిసికి వచ్చే ఆదాయంలో గండి పడుతున్నది. ఆర్‌టిసి వాడే డీజిల్‌పై, రైల్వేలకు 4 శాతం మాత్రమే పన్ను వేస్తుండగా ఆర్‌టిసికి అంతకన్న ఎక్కువపన్ను వేయడం వలన సంస్థపై 160 కోట్ల రూపాయల అదనపు భారం పడ్తున్నది. గ్రామీణ ప్రాంతాలలో తిరిగే బస్సు సర్వీసులకు పక్క రాష్ట్రాలు 2 శాతం వాహన పన్ను వేస్తే, మన రాష్ట్రం 7 శాతం పన్ను వేసింది. దీని మూలంగా 400 కోట్ల రూపాయలను సంస్థ అదనంగా ఖర్చు చేయాల్సి వస్తున్నది. ప్రతి సంవత్సరం ఆర్‌టిసి సంస్థ నుండి ఎక్సైజ్ సుంకం, అమ్మకపు పన్ను, ఆస్తిపన్ను, స్పేరు పార్టులపై పన్ను మొదలగు పన్నుల ద్వారా రు. 1000 కోట్లుపైగా ప్రభుత్వం దండుకుంటున్నది. సుమారు 4000 అద్దెబస్సులను సంస్థలో ప్రవేశపెట్టి సంస్థ ఆదాయాన్ని ప్రైవేట్ యజమానులకు దోచిపెడుతున్నది.

సమాజంలో ఈ కూపన్లు, బదిలీ అయిన నగదు కుటుంబంలోని మగవాడి చేతిలోపడితే, సారా, మత్తు పదార్థాలకు బానిసై సారా వ్యాపారుల అక్రమ ధనార్జనకు బలైపోతాడు. భార్యాపిల్లలు, వృద్ధులైన తల్లిదండ్రులు ఆహారం అందక ఆకలితో అల్లాడిపోతారు. అంతిమంగా కుటుంబ భారం మహిళ మీదకు నెట్టివేయబడుతోంది.

ఈ విధంగా ఈ బిల్లు పేదలకు ఏ విధమైన ఆహార భద్రతనూ ఇవ్వదు. బడా పెట్టుబడిదారులకు, కుహనా రాజకీయ నాయకుల అక్రమ సంపాదనకు ఒక వనరుగా ఉపయోగపడుతుంది. పేదలను మరింత పేదలుగా దిగజార్చి వేస్తుంది. ఇదంతా బహుళ జాతి కంపెనీలు, ప్రపంచ బ్యాంక్ జమిలీగా రచించిన విష వలయమే! ఈ విష వలయం నుండి బయటపడాలని ఈనాడు ప్రజలు ఆలోచిస్తున్నారు. చిరకాల పీడన, తాడనల నుండి వచ్చిన అనుభవమే వారిని నిర్మాణాత్మకమైన ఆచరణ వైపు ఉద్యమింపచేస్తుంది.

ఈ బిల్లు చట్టమైతే, గత సంక్షేమ పథకాల నిధులకు పట్టిన గతే ఈ పథకం నిధులకు కూడా పట్టి పాలక వర్గాలు అక్రమార్జనలు పెంచుకుంటాయి. అధికార పీఠాన్ని తమ ధృతరాష్ట్ర కౌగిలిలో బంధించి ఉంచుకోవడానికేనన్న నిజాన్ని ప్రజలు పసిగడుతున్నారు. ఏ కోణంలో చూసినా, ఈ బిల్లు ఓట్ల రాజకీయాల కోసమే తప్ప ప్రజలకు ఆహార భద్రత కల్పించదు.

వ్యవసాయాభివృద్ధికి కావలసిన మౌలిక సదుపాయాలు ఎందుకు కల్పించడం లేదని, ప్రభుత్వం పెట్టుబడులు ఎందుకు పెట్టడంలేదని ఆరుగాలం శ్రమిస్తున్న వారికి భూమిపై హక్కు ఎందుకు కల్పించడం లేదని, సమగ్ర భూసంస్కరణలు ఎందుకు అమలు చెయ్యడంలేదని, కార్పొరేట్ వ్యవసాయానికి, బహుళ జాతి సంస్థల కొరకు తెరచిన తలుపుల్ని ఎందుకు బంద్ పెట్టడంలేదని, సెజ్‌లకు, కారిడార్‌లకు వేల ఎకరాలు ఎందుకు ధారాదత్తం చేస్తున్నారని, ఆహార ధాన్యాల ధరలను పెంచుతున్న భవిష్య వాణిజ్యాన్ని ఎందుకు నిరోధించడం లేదని, అవినీతి రహిత సమర్థవంతమైన ప్రజాపంపిణీ వ్యవస్థను ఎందుకు అమలు పరచడంలేదనే ప్రశ్నలకు ప్రభుత్వం నుండి నిజమైన సమాధానం రావాలి. ఆయా సమస్యలు సక్రమంగా పరిష్కరించబడాలి. అప్పుడే ప్రజలకు నిజమైన ఆహార భద్రత ఏర్పడడానికి మార్గం సుగమం అవుతుంది. ప్రజలు పోరాటాలు చేస్తున్నారు. ఈ పోరాటాలకు బాసటగా నిలబడవలసిన చారిత్రక ఆవశ్యకత మనందరి మీదా ఉంది.

(రచయిత రీటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి) వీ

ఎపిఎస్ఆర్‌టిసిలో ఐషర్ కంపెనీకి చెందిన 100 బస్సులు నడుపుతున్నారు. వీటి నిర్వహణ కొరకు కిలోమీటర్‌కు రు. 2.25 చొప్పున సంవత్సరానికి సుమారు 3 కోట్ల రూపాయల అక్రమ ఒప్పందాలతో ఆర్‌టిసి ఆ కంపెనీకి చెల్లిస్తున్నది. అత్యంత అధునాతనమైన బస్సులను కోట్ల రూపాయలు చెల్లించి కొనుగోలు చేసి వాటిని సక్రమంగా నడపలేకపోవడంతో ఆర్థిక భారం ఆర్‌టిసిపై పడుతున్నది. అవసరం లేకున్నా సంస్థ నిధులను నిరుపయోగంగా రు. 5 కోట్లు సెల్ కంపెనీలకు, రు. 100 కోట్లు కమ్యూనికేషన్ సిస్టమ్స్‌కు (పిఐవిఆర్ఎస్) కార్పోరేట్ సంస్థలకు దోచిపెడుతున్నారు. మంత్రులకు, ఎం.ఎల్.ఎ.లకు బహుమతుల పేరుతో కోట్ల రూపాయలు పందేరం చేస్తున్నారు. మరొక వైపున ఆర్‌టిసి ఉన్నతాధికారులు, పాలకమండలి సభ్యులు వడ్డీలేని రుణాలు, వివిధ కొనుగోళ్లలో స్వదేశీ, విదేశీ సంస్థల నుండి కోట్ల రూపాయలు కమిషన్‌లు పొందుతున్నారు. డిఎం నుండి ఎండి వరకు ఉన్నతాధికారులు అలవెన్సుల రూపంలో, క్యాంప్‌ల పేరుతో (క్యాంప్‌లకు వెళ్లకుండానే) కోట్ల రూపాయలు దండుకుంటున్నారు.

ఆర్‌టిసి కార్మికులను ప్రైవేటీకరణకు అంగీకరింపచేయడానికీ, వారి మైండ్ సెట్‌ను క్రమంలో మార్చడానికీ ప్రతి సంవత్సరం 4 కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి క్లాసులు నిర్వహిస్తున్నారు. మరోవైపున కోట్ల రూపాయల విలువ చేసే సంస్థకు చెందిన ఖాళీ స్థలాలను 30 సంవత్సరాల లీజు పేరుతో అధికార పార్టీ ఎంఎల్ఎలు, మంత్రులు బినామీ పేర్లతో స్వంతం చేసుకుంటున్నారు.

పై విధంగా పాడిగేదెలాంటి ఆర్‌టిసి సంస్థ ఆదాయాలను, ఆస్తులను పాలకులు, ఉన్నతాధికారులు, పెట్టుబడిదారులు దోచుకుంటూ సంస్థను నష్టాలపాలుజేసి, అప్పులకు గురిచేస్తున్నారు.

ఆర్‌టిసిలో ఇప్పటికీ అద్దెబస్సులు తిప్పడం, సెట్విన్ బస్సులు, ప్రైవేట్ వ్యక్తులకు ఇవ్వడం, బస్టాండులో ఉద్యోగాలను (బుకింగ్, ఎంక్వయిరీ, రిజర్వేషన్, సెక్యూర్టీ గ్యారేజీలో మెయిన్ రిపేర్స్, బాడీబిల్డింగ్, ఆయిల్ ఫుల్ చేయడం, క్లీనింగ్, మరుగుదొడ్లు) ఔటు సోర్సింగ్ ద్వారా ప్రవేట్ వ్యక్తులకు అప్పజెప్పారు.

ఈ రోజు ఆర్‌టిసి 25 శాతం ప్రయాణీకులకు మాత్రమే ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నది. మిగతా 75 శాతం ప్రయాణికులకు ప్రయాణ సౌకర్యం కల్పించితే 4 లక్షల మందికి ఉద్యోగ అవకాశం కల్పించ వచ్చును. దీనితోపాటు వాహనాల రద్దీని, ఆయిలు వాడకాన్ని, కాలుష్యాన్ని తగ్గించడానికి అవకాశం ఉన్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. ప్యాసెంజరు సర్వీసుకు పనికిరాని బస్సులను సరుకుల రవాణాకు ఉపయోగించడం వలన సంవత్సరానికి 1000 కోట్ల రూపాయల ఆదాయం పొందవచ్చు అనే నిపుణుల సలహాను ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. బస్సుల అరుగుదల కింద, ఖర్చుల కింద చూపిన రు. 213 కోట్ల రూపాయల నిధులతో కొత్తబస్సులు కొనుగోలు చేయడానికి అవకాశం ఉన్నా, నిధులు లేవనే పేరుతో బస్సులు కొనుగోలు చేయకపోవడం, కార్మిక సంఘాల ఒత్తిడి వలన అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి కొనుగోలు చేయడం ఈ విధంగా సంస్థను అప్పుల ఊబిలోకి నెట్టారు. సామాన్య ప్రయాణీకులకు పూర్తిస్థాయిలో బస్సు సౌకర్యం కల్పించడం ద్వారా వచ్చే ఆదాయాన్ని వదులుకొని, ఉన్నత వర్గాలకి ఆధునిక బస్సులు, ఏసి బస్సులు ప్రవేశపెట్టి ఆర్‌టిసి ఆదాయాన్ని వారికి ఖర్చుపెడుతున్నారు.

ఆర్‌టిసి యాజమాన్యం ప్రయాణికులకు కనీసం మంచినీటి సౌకర్యంకానీ, ఉచిత మరుగుదొడ్లు సౌకర్యంకానీ కల్పించగపోగా, ప్రైవేటు సంస్థలు మరుగుదొడ్లు ఉపయోగించుకున్నందుకు 2 నుండి 5 రూపాయల వరకు దండుకుంటున్నాయి.

సంస్థ అభివృద్ధికి కార్మికులు అహోరాత్రులు శ్రమచేసి, ప్రజలు చెల్లించే ఛార్జీలతో ఆర్‌టిసిని 23,000 బస్సులతో, లక్షల కోట్ల రూపాయల ఆస్తులుతో, 1 లక్షా 30వేల మంది కార్మికులు, ఉద్యోగులతో దేశంలోను – ప్రపంచంలోను రవాణారంగంలో అనేక అవార్డులు, ప్రశంసలు పొందడానికి కారణమయ్యారు. అందుకు కార్మికుల శ్రమ, నైపుణ్యత, ప్రతిభే కారణం. ఈలాంటి కార్మికవర్గాన్ని – సంస్థ నష్టాలకు బాధ్యులను చేస్తూ, పోరాడి సాధించుకున్న హక్కులను, సౌకర్యాలను పాలకులు హరించి వేస్తున్నారు. సిబ్బందిని తగ్గించి పనిభారం పెంచారు. ఖాళీలను భర్తీచెయ్యడంలేదు – కలెక్షన్ పెరగలేదని కండక్టర్లని, కెఎంపిల్ పెరగలేదని డ్రైవర్లని వేధిస్తున్నారు. 8 గంటలు పని అమలు జరగడం లేదు. డబుల్ డ్యూటీ పేరుతో 18 గంటలు పనిచేయిస్తూ చేయని వారిపై కక్ష సాధిస్తున్నారు. డబుల్ డ్యూటీకి డబుల్ వేతనాన్ని ఇవ్వకుండా కొంత మొత్తాన్ని(150 నుండి 250 రూపాయలు) ఇస్తున్నారు. సంస్థకు 60,000 మంది డ్రయివర్లు అవసరంకాగా 35,000 రెగ్యులర్ డ్రైవర్లు, 10,000 మంది కాంట్రాక్టు డ్రైవర్లు మాత్రమే ఉన్నారు. కాంట్రాక్టు డ్రైవర్లను పర్మినెంట్ చేయాలన్న డిమాండ్ పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉంది. కండక్టర్లు చేయాల్సిన డ్యూటీని డ్రైవర్లకే టిమ్స్ మెషిన్లు ఇచ్చి చేయించడం వలన, డబుల్ డ్యూటీలు చేయించడం వలన ఏక్సిడెంట్‌ల సంఖ్య పెరిగింది. దీనికి డ్రైవర్లను బాధ్యులను చేస్తూ పనిష్‌మెంట్లు ఇస్తూ జీతాల నుండి రికవరీ చేస్తున్నారు. ఈవిధంగా సిబ్బంది కొరతతో, గ్యారేజీ కార్మికులపైన, డ్రైవర్లు, కండక్టర్లపైన రకరకాల వేధింపు చర్యలకు పాల్పడుతున్నారు.

మహిళా కార్మికులను ఆర్‌టిసి యాజమాన్యం వివక్షతకు గురిచేస్తున్నది. మహిళా కండక్టర్లకు ప్రత్యేక డ్యూటీ ఛార్టులు వేయకుండా డబుల్ డ్యూటీలు చేయిస్తూ, మహిళలు ఎదుర్కొంటున్న ప్రత్యేక ఆరోగ్య సమస్యలు పరిగణనలోనికి తీసుకొనకుండా నిర్దాక్షిణ్యంగా వ్యవహరిస్తున్నది. దూర ప్రాంతాలకు డ్యూటీకి వెళ్లిన సమయంలో విశ్రాంతి గదులు, మరుగుదొడ్లు లేక మహిళలు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారు. మహిళా కార్మికులకు నెలకి 3 రోజులు ప్రత్యేక సెలవులు ఇవ్వవలసి ఉండగా యాజమాన్యం పరిగణనలోకి తీసుకోవడంలేదు.

1999 నుండి 2012 వరకు ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ప్రపంచ బ్యాంకు ఆదేశాలకు అనుగుణంగా ఆర్‌టిసిని, దాని ఆస్తులను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టాలనే దురుద్దేశంతో ప్రభుత్వాలు చాప కింద నీరులాగా ప్రైవేటీకరణ విధానాలు అమలు జరపడంలో నిమగ్నమై ఉన్నాయి. 2001 – 2005 లలో ఆర్‌టిసిని ప్రవేటుపరం చేయడానికి జరిగిన తీవ్ర ప్రయత్నాలను కార్మికవర్గం ఐక్యంగా తిప్పికొట్టింది. ఈనాటి ప్రభుత్వం ఆర్‌టిసికి నష్టాలు వస్తున్నాయనే పేరుతో ప్రవేటు వ్యక్తులకు అప్పగించడానికి కుట్రలు ప్రారంభించింది. మరొక వైపున కార్మికులపైన దాడులను తీవ్రతరం చేసింది. కార్మికులు, కార్మిక సంఘాలు – ఆర్‌టిసి పరిరక్షణకు, కార్మిక ఉద్యోగ భద్రతకు, హక్కుల పరిరక్షణకు, వేల కోట్లరూపాయల విలువైన ఆస్తుల రక్షణకు ఉద్యమించవలసి ఉన్నది. తోటి పీడిత ప్రజల, ఉద్యోగ సంఘాల సహాయ సహకారంతో, గత ఉద్యమాల వెలుగులో ఐక్యంగా పోరాడవలసి ఉంది.

(రచయిత అఖిల భారత కార్మిక సమాఖ్య (న్యూ) రాష్ట్ర కమిటీ సభ్యులు) వీ

సిరియా పరిణామాలు

పెట్టుబడిదారుల, సామ్రాజ్యవాదుల వ్యూహాలు చాలా ముందుచూపుతో సాగుతున్నాయనీ, ప్రజలను రకరకాలుగా బలహీనులను చేసి లొంగదీసుకోవడమే వాటి వ్యూహమనీ అంటున్నారు **లోకసంచారి**

పాలక వర్గాలు జరుపుతున్న విధ్వంసపు వేగం, విస్తృతిని సరిగ్గా అంచనా వేయడం 99.5 శాతం ప్రజల పక్షం వహించే వారికి ముఖ్యమైన అంశంగా మారింది. గత సంచికలో 'మాదక ద్రవ్యాలను (డ్రగ్స్) ఇంకో పది సంవత్సరాలలో గ్రామస్థాయి యువతకు కూడా పాలక వర్గాలు అందుబాటులోకి తేనున్నాయి' అని రాసాను. ఆ వ్యాసం రాసి పదిరోజులు కూడా గడవ లేదు. ఆగస్ట్ మూడున నమస్తే తెలంగాణ దినపత్రిక (5వ పేజీ)లో కరీంనగర్‌లో మాదక ద్రవ్యాల ముఠాను పట్టుకున్నట్టు వార్త వచ్చింది. దీన్ని బట్టి అర్థం అయ్యేది ఏంటంటే, పాలక వర్గాలు ఒక పకడ్బందీ, ముందస్తు ప్రణాళిక కలిగిన విస్తృత కుట్రలో భాగంగా సామాజిక, సాంస్కృతిక విధ్వంసపు ఎజెండాను ప్రజాపక్షం వహించే వారి ఊహాశక్తికి మించిన వేగంతో, విస్తృతితో అమలు చేస్తున్నారు. భవిష్యత్‌లో జరగబోయే ఏ రకమైన విప్లవాలకైనా గ్రామీణ, పట్టణ ప్రాంత యువతనే ప్రాణ వాయువు అని అర్థం చేసుకున్న పాలకవర్గం, ఆ యువతను ఎన్ని రకాలుగా, ఎంత వేగంగా బలహీనం చేయగలదో అన్ని రకాలుగా, అంత వేగంగా బలహీనం చేస్తున్నారు. వారి విధ్వంసపు వేగాన్ని, విస్తృతిని సరిగ్గా అంచనా వేయడంలో ప్రజాపక్షం వహించే వారమే కొన్నిసార్లు విఫలం అవుతున్నామని అనిపిస్తుంది.

గత సంచికలోనే 'పాకిస్తాన్‌కు ఎంఎఫ్ఎన్ (అంటే అత్యంత ఆప్తులైన దేశం) ప్రతిపత్తిని 2014 ఎన్నికల అనంతరం ఇచ్చే యోచనలో భారత పాలకవర్గాలు ఉన్నాయని' రాసాను. అది రాసిన కాగితపు సిరా కూడా ఆరలేదు, ఆగస్ట్ ఒకటవ తేదీ నాడు భారత పాలకవర్గం పాకిస్తాన్‌కు ఎంఎఫ్ఎన్ ప్రతిపత్తి లాంటి చట్టాన్ని దొడ్డిదారిన ఇచ్చింది. ఈ చట్టం ప్రకారం పాకిస్తాన్ కంపెనీలే కాదు, చివరకు పౌరులు కూడా భారతదేశంలో వ్యాపారం చేసుకోవచ్చు, భారత పాలకవర్గాల వ్యాపార సంస్థలలో పెట్టుబడులు పెట్టుకోవచ్చు.

బిజెపి ఈ చట్టాన్ని మాట వరుసకు అయినా విమర్శించక పోగా, పై పెచ్చు సమర్థించింది. హిందూ మత పరిరక్షకులుగా చెప్పుకునే భజరంగ్‌దళ్, ఆర్ఎస్ఎస్‌తో పాటు దేశవ్యాప్తంగా ఉన్న ఎన్నెన్నో హిందూ సంస్థలు ఒక్కటి కూడా ఈ చట్టంపై మాట్లాడలేదు. భారతదేశాన్ని విచ్ఛిన్నం, విధ్వంసం చేయడానికి టెర్రరిస్టులను తయారుచేసే ఏకైక లక్ష్యమే పాకిస్తాన్ ప్రభుత్వానిదని భారత పాలకవర్గం ఒకవైపు చెపుతూనే, మరోవైపు పాకిస్తాన్ కంపెనీలు, పౌరులు భారతదేశంలో వ్యాపారం చేయడానికి అనుకూలంగా చట్టం చేయడం ఏంటని, ఈ ద్వంద్వ ప్రమాణాలను ప్రశ్నిస్తూ దేశవ్యాప్తంగా ఒక్క హిందూ మత సంస్థ కానీ, స్వాములు, బాబాలు కానీ, ప్రాంతీయ, జాతీయ పార్టీలు కానీ, ప్రజాపక్షం మాట్లాడుతామని చెప్పుకునే మీడియా, జయప్రకాశ్ నారాయణ్‌లూ, రామ్‌దేవ్‌లూ, హజారేలూ, కిరణ్‌బేడీలూ లాంటి వారు ఎవరూ మాట్లాడలేదంటే, వీరంతా ఎంత లోతుగా పాలకవర్గాల విస్తృత ఎజెండాలో భాగమై, వారి ఎజెండాను అమలు పరిచే క్రమంలో పాలకవర్గాలకు సేవ చేస్తూ పులకించి పోతున్నారో అర్థం అవుతుంది.

ప్రజాపక్షం వహించే శక్తులు, ఈ అంశాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లి పాలకవర్గాల, వారి సేవకుల నిజ స్వరూపాన్ని బయటపెట్టాలి. పెట్టుబడికి వివిధ దేశాల పాలకవర్గాలు బానిసలని, దానికనుగుణంగా వారు ఒకరిని ఒకరు ప్రేమించుకోవడం కాని, అసహ్యించుకోవడం కాని చేసుకుంటారని అలాగే, ప్రజలు శతాబ్దాల కొద్దీ పోరాడి సాధించుకున్న న్యాయం, హక్కులను అణచివేయడానికి పాలక వర్గాలు 'టెర్రరిజం' అనే బూచి తయారు చేసి దాని పేరు మీద ప్రజలు పోరాడి సాధించుకున్న హక్కులను, ప్రజాస్వామ్యాన్ని అణచి వేస్తున్నారని, ఈ అంశం ద్వారా ప్రజలకి విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ప్రజలకు పాలకవర్గాల విస్తృత ఎజెండాను అర్థం చేయించాలి.

ఇక సిరియా విషయానికి వస్తే, సిరియా కూడా ఒక విస్తృత ఎజెండాకే బలి అవుతున్నది. అదే పాశ్చాత్య బడా పెట్టుబడిదారుల ఎజెండా. ముందుగా మనకు అత్యంత స్పష్టంగా అర్థం కావాల్సిన విషయం ఏంటంటే, పాలకవర్గాలకు ఒక అత్యంత ముందు చూపుతో కూడిన, విస్తృత ఎజెండా ఉంటుందని తెలుసుకోవాలి. ఉదాహరణకు, భారత పాలకవర్గాలు ఆధార్ కార్డ్ పేరు మీద భారత ప్రజల వ్యక్తిగత వివరాలు, అడ్రస్‌లు, ఫొటోలు, వేలి ముద్రలతో సహా తీసుకొని కంప్యూటర్‌లలో ఎక్కిస్తున్నారు. సమీప భవిష్యత్‌లో ఆధార్ డేటాను సర్వ రకాల ప్రభుత్వ, ప్రైవేట్ డేటాబేస్‌లకు లింక్ చేసి, దేశాన్ని ఒక 'కాన్‌సంట్రేషన్ క్యాంప్' తరహా పోలీసు, మిలిటరీ రాజ్యంగా మార్చే వంద సంవత్సరాల ముందు చూపుతో వేసుకున్న ఎజెండాలో భాగమే ఆధార్ కార్డ్. భారత దేశం లాంటి మామూలు దేశమే ఇంత ముందు చూపుతో ఆలోచిస్తే, ప్రపంచంలోని మెజారిటీ దేశాలను తమ కబంధ హస్తాల్లో బంధించి, జలగల్లా దోచుకు తింటున్న పాశ్చాత్య పెట్టుబడిదారీ దేశాలు కనీసం ఐదు వందల సంవత్సరాల ముందు చూపుతో ఆలోచిస్తాయి.

కేవలం లక్ష రూపాయల నగదు మన చేతిలో ఉంటే దాన్ని దొంగల బారి నుండి కాపాడుకోవడానికి, దాని పై లాభాలు సంపాదించుకోవడానికి ఏమి చేయాలి, ఎలా చేయాలని తిండి సరిగా తినకుండా, నిద్ర కూడా సరిగా పోకుండా లక్ష రకాలుగా ఆలోచిస్తాం. అలాంటిది, ప్రతి సంవత్సరం లక్షల కోట్ల డాలర్లను, ప్రపంచంలోని దాదాపు 750 కోట్ల జనాలను దోచుకుంటూ సంపాదించే పాశ్చాత్య పెట్టుబడిదారులు, ఎంత ముందు చూపుతో కూడిన ఎజెండా కలిగి ఉంటారో అర్థం చేసుకోవచ్చు. సిరియా అర్థం కావాలంటే మనకు

పాశ్చాత్య పెట్టుబడిదారుల విస్తృత ఎజెండా అర్థం కావాలి. దాన్ని షార్ట్‌కట్‌లో వివరించే ప్రయత్నం చేస్తాను.

రెండవ ప్రపంచ యుద్ధంలో ఒకవైపు హిట్లర్, ఇంకోవైపు బ్రిటన్, ఫ్రాన్స్‌లకు ఆయుధాలు అమ్మి, అప్పులు ఇచ్చి బాగా బలపడిన, లాభపడిన అమెరికా పాలకవర్గాలు, ప్రపంచానికి తాము బలమైన రాజ్యం అని తెలపడానికి అప్పుడప్పుడే తమ శాస్త్రవేత్తలు కనిపెట్టిన ఆటం బాంబుకు (లొంగిపోవడానికి సిద్ధపడిన) జపాన్ దేశంపై ప్రయోగించారు. అప్పటివరకు అగ్రరాజ్యాలుగా ఉన్న బ్రిటన్, ఫ్రాన్స్‌లు యుద్ధంలో నష్టపోయి ఉన్నందున, అమెరికా ఆధిపత్యాన్ని అంగీకరించాయి. ఇంకోవైపు చాలా యూరప్ దేశాల్లో, చైనాలో కమ్యూనిస్టు విప్లవాలు రావడం పాశ్చాత్య పెట్టుబడిదారులను ఆందోళనకు గురిచేసాయి. దాంతో అమెరికా, పశ్చిమ యూరప్ బడా పెట్టుబడిదారులు, రెండవ ప్రపంచ యుద్ధానంతరం అమ్‌స్టర్‌డామ్ పట్టణంలో సమావేశమయ్యారు. వీరంతా 'బిల్డెర్ బెర్గ్ గ్రూప్' అనే సంస్థ పేరు మీద ఒకటయ్యారు. వీరు ఐదు వందల సంవత్సరాల ఎజెండా ఒకటి తయారుచేసుకున్నారు.

వీరి నిర్ణయాల్లో కొన్ని ముఖ్యమైనవి : తమలో తాము యుద్ధాలు చేసుకోకూడదని; తమ మధ్య ఉన్న వైరుధ్యాలను మూడవ ప్రపంచ దేశాలలో యుద్ధం చేయడం ద్వారా పరిష్కరించుకోవాలని నిర్ణయించుకొన్నారు. అలాగే, కమ్యూనిస్టు దేశాలను ఎలా అయినా కూల్చివేసి, ప్రపంచ ప్రజలు కమ్యూనిస్టు భావాల వైపు మరలకుండా వాటిపై అన్ని రకాల దుష్ప్రచారాలు చేయాలని, ప్రపంచమంతా తమ గుప్పిట్లోకి తెచ్చుకొని 'గ్లోబల్ గవర్నెన్స్' కాన్సెప్ట్‌ను (గ్లోబలైజేషన్ ఈ కాన్సెప్ట్‌లో భాగమే) అమలు చేయాలని, అలాగే ప్రపంచ ప్రజలు పెట్టుబడిదారీ వ్యవస్థపై తిరగబడకుండా ప్రజలను శారీరకంగా, మానసికంగా, ఆరోగ్యపరంగా పూర్తిగా బలహీనం చేసి, పెట్టుబడిదారీ వ్యవస్థకు వారిని స్వచ్ఛంద బానిసలుగా తయారు చేయాలని, అప్పటికీ తిరగబడే ప్రజలు ఉంటారు కాబట్టి ప్రజలను అణచడానికి, హిట్లర్ కనిపెట్టిన 'కాన్‌సంట్రేషన్ క్యాంప్' అనే 'అద్భుతమైన' (ఇది వారి భాష) కాన్సెప్ట్‌ను హిట్లర్‌లా నియంతృత్వం ద్వారా కాకుండా 'ప్రజాస్వామ్యం' పేరు మీదే (ప్రజలకు స్పష్టంగా అర్థం కాకుండా చేసి) అమలు పరచాలని నిర్ణయించుకున్నారు.

అలాగే, పాశ్చాత్య బడా పెట్టుబడిదారుల 'గ్లోబల్ గవర్నెన్స్' ఎజెండాకు అడ్డు వచ్చే దేశాలలో అంతర్యుద్ధాలను సృష్టించి, వివిధ రకాల లేబుల్స్ వేసి ఆ దేశాలపై యుద్ధం చేసి ఆక్రమించుకోవాలని, ఆ దేశాల నాయకులను హత్య చేయించడం, వారిపై తమకు అనుకూల వర్గం అయిన సైనికులచే సైనిక తిరుగుబాటు చేయించడం లాంటి పద్ధతులు పాటించాలని నిర్ణయించుకున్నారు. (ఇవన్నీ ప్రయోగాలు సిరియాతో పాటు చాలా దేశాలలో చేసారు, చేస్తున్నారు కూడా).

'గ్లోబల్ గవర్నెన్స్' అనే విస్తృత కుట్రలో భాగమైన గ్లోబలైజేషన్‌ను భారత పాలకవర్గాలు ప్రారంభించిన తర్వాత భారత బడా పెట్టుబడిదారులను కూడా బిల్డెర్ బెర్గ్ గ్రూప్‌లోకి తీసుకున్నారు. వీరి దీర్ఘకాలిక ఎజెండా ఏంటంటే, ప్రపంచమంతా ఒకే కరెన్సీ ఏర్పాటు చేసి, దాన్ని కూడా నోట్ల రూపంలో కాకుండా ఎలక్ట్రానిక్ కార్డ్‌ల రూపకంలో (ఇప్పటి ఎటిఎం, క్రెడిట్ కార్డులు అవే) మాత్రమే చెలామణీలో ఉంచాలని (తద్వారా ప్రజలు ఖర్చు చేసే ప్రతి పైసా వారి కంట్రోల్‌లో ఉంటుంది) వారి ప్రణాళిక. ఈ లక్ష్యాన్ని వారు గ్లోబలైజేషన్‌లో భాగంగా 75 శాతం వరకు సాధించారు. 'గ్లోబల్ గవర్నెన్స్' ఎజెండాలోని ఇంకో ప్రధాన అంశం ప్రపంచ బడా పెట్టుబడిదారులకు, వారి దోపిడీ, అణచివేతలకు అనుకూలమైన చట్టాలను ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల్లో అమలు చేయించడం, వాటిని అమలు చేయడానికి కావాల్సిన అంతర్జాతీయ సంస్థలను తయారు చేయడం. ఈ కుట్రలో భాగమే అంతర్జాతీయ ద్రవ్య నిధి, ప్రపంచ బ్యాంక్, ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్, డబ్ల్యు.టి.ఒ., అంతర్జాతీయ పేటెంట్ కేంద్రం, నాటో సైనిక కూటమి, ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్ట్, ఇంటర్‌పోల్, ఒఇసిడి, యూరోపియన్ యూనియన్ లాంటి సంస్థలు స్థాపించారు. ఐక్య రాజ్య సమితిని దాదాపుగా వీరు తమ గుప్పిట్లోకి తీసుకున్నారు. గల్ఫ్ దేశాలు ఏర్పరుచుకున్న ఓపెక్ సంస్థను, గల్ఫ్ కో ఆపరేషన్ కౌన్సిల్‌ను పూర్తిగా బలహీనం చేసి తమ కీలు బొమ్మల్లా మార్చుకున్నారు. అలీనోద్యమంను కూడా పూర్తిగా బలహీనం చేశారు.

సోవియట్ రష్యాను బలహీనం చేస్తే చాలా దేశాలు తమ గుప్పిట్లోకి వస్తాయని, తమ ఆధిపత్యానికి తిరుగు ఉండదని భావించిన పాశ్చాత్య బడా పెట్టుబడిదారులు, 80 దశకంలో సోవియట్ రష్యా విచ్ఛిన్నం కావడంలో విజయం సాధించారు. రష్యా పని అయిపోయిందనుకున్న వీరికి, గత దశాబ్ద కాలంగా ఆయిల్, సహజ వాయువు నిక్షేపాలను అమ్ముకుంటూ ఆర్థికంగా కూడా బలపడుతున్న రష్యా, వెనకటి నుండి సైనిక పరంగా కూడా ఉన్న బలంతో తిరిగి తన పూర్వ వైభవాన్ని కోరుకుంటూ అడుగులు వేయడం, పాశ్చాత్య బడా పెట్టుబడిదారులకు కంటగింపు అయ్యింది. ఈ రోజు ఇరాన్‌కు, సిరియాకు ప్రధాన మైత్రి, బలం రష్యానే. ఇంకోవైపు, ఆర్థికంగా, సైనికంగా బలపడిన చైనా కూడా రష్యాతో మిత్రుత్వంకు జత కట్టడం 'షాంఘై కో ఆపరేషన్ ఆర్గనైజేషన్' ద్వారా చూస్తాం. ఈ రెండు దేశాలతో జత కట్టడానికి వివిధ దక్షిణ అమెరికా, ఆఫ్రికా, ఆసియా దేశాలు ముందుకు వచ్చాయి. భారత దేశం పైకి తటస్థంగా కనిపిస్తున్నా, అమెరికా చట్ట సభల్లో జరిగిన చర్చల సందర్భంగా వారి ప్రభుత్వం ఇచ్చిన సమాధానం ప్రకారం భారత దేశంలో లక్ష వరకు అమెరికా సైనిక అధికారులు తిష్టవేసి ఉన్నారు.

సోవియట్ రష్యా పతనానంతరం, 'గ్లోబల్ గవర్నెన్స్' కుట్రలో భాగమైన గ్లోబలైజేషన్‌ను ప్రపంచ దేశాలపై రుద్ది, వాటిని అప్పుల్లో ముంచుతూ, సహజ వనరులను కొల్లగొడ్తూ లాభపడ్తూ ప్రపంచమంతా తమ గుప్పిట్లోకి వస్తుందని అనుకుంటున్న పాశ్చాత్య బడా పెట్టుబడిదారులకు, రష్యా, చైనాలు బలపడి తమ ఆధిపత్యాన్ని సవాలు చేస్తుండడంతో ఎలాగైనా రష్యా, చైనాలను బలహీనం చేయాలనే పథకం వేసుకున్నారు. దాంట్లో భాగంగా రష్యా, చైనా మిత్ర దేశాలను ముందుగా విచ్ఛిన్నం చేయాలని, ఆ దేశాల్లో వివిధ అసంతృప్తి వర్గాలకు డబ్బు, ఆయుధ సంపత్తి సమకూర్చి 'అంతర్యుద్ధా'లను లేపే పనిలో ఉన్నారు. ఈ నేపథ్యం నుండే సిరియాపై నేడు పాశ్చాత్య బడా పెట్టుబడిదారులు రుద్దిన 'అంతర్యుద్ధం' అనే కుట్రను చూడాలి. ఈ కుట్రను అర్థం చేసుకునే క్రమంలో మనకు నమ్మలేని నిజాలు తెలుస్తాయి. మార్క్సిస్ట్ – లెనినిస్ట్ భావాలు కలవారు కూడా బిన్ లాడెన్, తన అల్–ఖైదా సంస్థ ద్వారా అమెరికాకు వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడి చనిపోయాడని అనుకోవడం చూస్తుంటే, అమెరికా పాలకవర్గాలు పకడ్బందీగా చేసిన మైండ్ కంట్రోల్‌కు వారు కూడా హైజాక్ అయిపోయారు.

బిన్ లాడెన్ అమెరికాకు వ్యతిరేకంగా పోరాడలేదు. అది అమెరికా ఆడిన నాటకం. బిన్ లాడెన్ చనిపోలేదు. అది అమెరికా ఆడిన ఇంకో నాటకం. అమెరికా పాలకుల ఆధ్వర్యంలోని బిల్డర్‌బెర్గ్ గ్రూప్‌లో సౌదీ అరేబియాలో రెండవ అత్యంత ధనవంతుడైన బిన్ లాడెన్ కుటుంబానికి సభ్యత్వం ఉంది. వీరి 'గ్లోబల్ గవర్నెన్స్' అనే దీర్ఘకాలిక కుట్రను అమలు చేసే క్రమంలోనే బిన్ లాడెన్ అమెరికా పాలకవర్గాలతో కలిసి పనిచేసాడు.

బిన్ లాడెన్ అమెరికా సైన్యపు రక్షణలో తన స్వదేశమైన సౌదీలో నిక్షేపంగా ఉన్నాడు. అందుకే, అమెరికా ఆజ్ఞతో పాకిస్తాన్, బిన్ లాడెన్ భార్యల గుంపును (అందులో సౌదీ దేశస్తులు కాని భార్యలు కూడా ఉన్నారు) రాచ మర్యాదలతో సౌదీకి పంపింది. బిన్ లాడెన్‌తో అమెరికా మాజీ ప్రెసిడెంట్ జార్జ్ బుష్‌కు వ్యాపార సంబంధాలు ఉన్న విషయం రుజువులతో సహా 2003లోనే అమెరికాలో బహిర్గతం అయింది. మరి ఎందుకు, అమెరికా ప్రభుత్వం ఈ నాటకం ఆడుతోంది? ఎందుకంటే, సోవియట్ రష్యా పతనంతో అమెరికా పాలకులకు శత్రువు లేకుండా పోయింది. ఏ దేశంలోని పాలక వర్గాలకైనా, మరీ ముఖ్యంగా పాశ్చాత్య సామ్రాజ్యవాదులకు తమ దేశ ప్రజల, ప్రపంచ ప్రజల హక్కులు కాలరాయడానికి, ఇతర దేశాలను ఆక్రమించడానికి ఒక శత్రువు బూచి కావాలి. అందుకే, 80వ దశకంలో అఫ్ఘనిస్తాన్‌లో తిష్టవేసిన సోవియట్ సైన్యాన్ని తరిమికొట్టి, సోవియట్ రష్యాను బలహీనపరిచే ప్రణాళికలో భాగంగా సిఐఎకు సహకరించిన బిన్ లాడెన్‌ను సోవియట్ పతనానంతరం, తమకు కావలసిన ఒక ఊహాజనిత శత్రువును తయారు చేసుకోవడానికి అమెరికా వాడుకుంది. 2001 సెప్టెంబర్‌లో వరల్డ్ ట్రేడ్ సెంటర్ బిల్డింగ్‌లను అమెరికా పాలకవర్గాలే, ఇజ్రాయిల్ దేశ సహకారంతో స్వయంగా కూల్చుకొని, ఆ 'టెర్రరిస్ట్' చర్య బిన్ లాడెన్, అతని అల్-ఖైదా సభ్యులు చేశారని, ఇక ఇప్పటి నుండి టెర్రరిజమే అమెరికాకు ప్రధాన శత్రువు అని, టెర్రరిస్టులకు ఆశ్రయమిస్తున్న ఏ దేశమైనా అమెరికా శత్రువు అని ఒక వినూత్న కాన్సెప్ట్ తెచ్చింది. బిన్ లాడెన్ అఫ్ఘనిస్తాన్‌లో దాక్కున్నాడని, ఆ దేశం పై యుద్ధం చేసి ఆక్రమించుకుంది. (ఆ దేశాన్ని ఆక్రమించుకోవడానికి అసలు కారణం తమ తొత్తు దేశమైన తుర్క్‌మేనిస్తాన్‌లో ఉన్న ట్రిలియన్‌ల కొద్దీ డాలర్ల విలువైన సహజ వాయువును అఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్ గుండా పైప్‌లైన్ల ద్వారా తరలించి ఇండియాలో అమ్ముకొని ఏటా బిలియన్ల కొద్దీ డాలర్లు సంపాదించాలనే ప్లాన్. కాని పైప్‌లైన్లు వేసుకోవడానికి తాలిబన్లు ఒప్పుకోలేదు.) ఆ తర్వాత సద్దాం హుస్సేన్‌కు అల్-ఖైదాకు సంబంధం ఉందని, సద్దాం దగ్గర మానవ హనన ఆయుధాలున్నాయని ఇరాక్‌ను ఆక్రమించుకొని వారి ఆయిల్ నిక్షేపాలను తమ వశం చేసుకుంది. ఈ క్రమంలోనే అమెరికా పాలకులు ఇరాన్, ఇరాక్, సిరియా, ఉత్తర కొరియాలను చెడు దేశాలుగా చిత్రీకరించారు.

ఇక వయసు మీద పడిన బిన్ లాడెన్, తన పాత్రను అంతం చేసి తనకు రిటైర్‌మెంట్ ప్రసాదించండి అని కోరుకున్నట్టు ఉంది, అందుకే ఒక శుభ ముహూర్తం చూసుకొని పాకిస్తాన్ ప్రభుత్వ సహకారంతో బిన్ లాడెన్‌ను చంపినట్టు డ్రామా ఆడారు. అమెరికా డ్రామాలు ఎంత వాస్తవికంగా అగుపిస్తాయంటే, మనం మన మెదడుకున్న అత్యంత సామర్థ్యాన్ని వినియోగిస్తే తప్ప కొన్ని సందర్భాల్లో వాస్తవం ఏంటో అర్థం కాదు. అందుకే, వారి హాలీవుడ్ సినిమాలు అంత రక్తి కట్టిస్తాయి. 1960 దశకంలో అసలు అంతరిక్ష ప్రయాణ టెక్నాలజీ ఏ మాత్రం సరిగా అభివృద్ధి కాని సమయంలో అమెరికా తాము చంద్ర మండలం పోయి వచ్చామని కట్టుకథ అల్లింది. దాన్ని మనమంతా నమ్మి, పాఠ్యపుస్తకాల్లో కూడ ఎక్కించి చిన్నప్పటి నుండే బ్రెయిన్ వాష్ చేస్తున్నాం. వాస్తవానికి, ఈ కట్టుకథను లండన్‌లోని ఒక స్టూడియోలో సెట్టింగ్‌లు వేసి షూటింగ్ తీసారని బయటపడింది.

కనిపించేదంతా వాస్తవమనుకుంటే, దోపిడీ పాలకవర్గాలు మాట్లాడేదే నిజమనుకుంటే, మనకు మెదడు అనే అవయవం అవసరం లేదు. దానికి అంత్యక్రియలు చేయడం మంచిది. ఇదంతా ఎందుకు చెప్పాల్సి వస్తుందంటే, సిరియాకు సంబంధం ఉంది కాబట్టి. సిరియాను ఆక్రమించుకొని, ఆ తర్వాత ఇరాన్‌ను, ఆ తర్వాత ఉత్తర కొరియా, వెనెజుయలా, క్యూబా ఇలా ఒక్కొక్కటిగా తమ ఆధీనంలోకి తీసుకొని అంతిమంగా రష్యా, చైనాలను కూడా లొంగదీసుకొని తమ పాశ్చాత్య పెట్టుబడిదారుల ఆధ్వర్యంలోని 'గ్లోబల్ గవర్నెన్స్' ఎజెండాను సంపూర్ణంగా అమలు చేసి కొన్ని వందల సంవత్సరాల క్రితపు బానిసల రాజ్యాన్ని మళ్లీ అమలు చేసే బృహత్తర ఎజెండాలో భాగమే సిరియాపై పాశ్చాత్య దేశాల దాడి.

అమెరికా ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ దాడిలో అమెరికా పాలకులు అల్-ఖైదా సభ్యుల సేవలు వాడుకుంటున్న విషయం సిరియాలో పట్టుబడ్డ అల్-ఖైదా కిరాయి సైనికులు ఒప్పుకున్నారు. రెండు వారాల క్రితం అమెరికా మిత్ర దేశమైన జర్మనీ వారి మిలిటరీ ఇంటిలిజెన్స్ అధికారులు తమ స్వంత పరిశోధన చేసి చెప్పిన విషయం ఏంటంటే, సిరియా మీద దాడి చేయడానికి వచ్చిన వివిధ దేశాల కిరాయి సైనికుల్లో చాలా మంది అల్-ఖైదా టెర్రరిస్టులు కూడా ఉన్నారని. అత్యంత కిరాతక నాటో సైనికులు కూడా సిరియాలో కోవర్ట్ ఆపరేషన్లు చేస్తూ సిరియా చేతికి చిక్కారు. 18 ఫ్రెంచ్ సైనిక అధికారులు సిరియాలో కోవర్ట్ ఆపరేషన్‌లో పట్టుబడితే, వారిని విడిపించుకోవడానికి ఫ్రెంచ్ ప్రభుత్వం ఏకంగా తమ మినిస్టర్‌ను సిరియాకు పంపింది. ఐక్య రాజ్య సమితిని దాదాపుగా తమ ఆధీనంలోకి తీసుకున్న పాశ్చాత్య బడా పెట్టుబడిదారులు ఐక్య రాజ్య సమితి ఉద్యోగులను కూడా సిరియాలో కోవర్ట్ ఆపరేషన్‌లకు వాడుకుంటున్న వాస్తవాలు బయటకు వచ్చాయి. పాశ్చాత్య కార్పొరేట్ మీడియా సిరియాకు వ్యతిరేకంగా సిరియాపై తాము జరుపుతున్న అక్రమ దాడికి అనుకూలంగా ప్రపంచ ప్రజల సమ్మతిని తయారు చేసుకునే కుట్రలో భాగంగా రకరకాల కట్టుకథలు రోజువారి అల్లుతున్నారు.

మల్టీ మీడియాలో సిద్ధహస్తులైన పాశ్చాత్యులు, ఫోటో ఎడిటింగ్, వీడియో ఎడిటింగ్ సాఫ్ట్‌వేర్‌లు వాడుతూ సిరియా పై రకరకాలుగా కట్టుకథల వీడియోలు, ఫోటోలు తయారు చేసి దుష్ప్రచారం చేస్తున్నారు. అమెరికా ఆధ్వర్యంలోని ఈ పాశ్చాత్య కిరాతక ముఠాలు ఎంత నీచ స్థాయికి దిగజారుతాయో చూసి అక్కడి ప్రజలే ఆశ్చర్యపోతున్నారు. స్వయంగా ఐక్యరాజ్య సమితి, అమెరికా, యూరప్ దేశాలు టెర్రరిస్ట్‌గా ప్రకటించిన లిబియాకు చెందిన మహది-అల్-హరతి అనే టెర్రరిస్ట్, అతని అనుచరులు సిఐఎ ఆధ్వర్యంలో సిరియాకు వ్యతిరేకంగా పని చేస్తున్నారు. అలాగే, సౌదీ అరేబియా, అమెరికా ఫండింగ్‌తో నడిచే 'వహాబీ' ముస్లిం సంస్థలైన అల్-ఖైదా లాంటి వివిధ సంస్థల కిరాయి సైనికులు సిరియాలో అమెరికా రహస్య కార్యకలాపాల్లో పనిచేస్తున్నారు. తమ తోటి ముస్లిం దేశంపై పాశ్చాత్య పాలకులు అక్రమ యుద్ధం

చేస్తుంటే, ఖండించాల్సింది పోయి, సిరియా ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తూ గల్ఫ్ కో ఆపరేషన్ కౌన్సిల్ తీర్మానం చేసింది. అంతే కాకుండా, సిరియాపై యుద్ధానికి కావలసిన ఆర్థిక సహాయం, సైనిక స్థావరాలు కూడా పాశ్చాత్య పాలకులకు ఇవ్వడానికి సిద్ధమయ్యాయి. ఇన్నాళ్లు పొరుగు దేశాలతో స్నేహం నటించిన టర్కీ దేశం కూడా పాశ్చాత్య పాలకుల విషపు కుట్రలో పావుగా మారి, అన్ని రకాల సిరియా వ్యతిరేక శక్తులకు కేంద్రంగా వ్యవహరిస్తోంది. కుర్దిష్ సమస్యను సాకుగా చూపుతూ, సిరియాపై అవసరమయితే దాడి చేస్తామని సిరియాను టర్కీ హెచ్చరిస్తోంది. దుర్మార్గ నాటో సైనిక కూటమిలో భాగమైన టర్కీ ఇంతకంటే భిన్నంగా ప్రవర్తిస్తుందని ఊహించడం అత్యాశే అవుతుంది.

ఈ మధ్య ఈజిప్ట్ ఎన్నికలలో గెలిచి అధికారంలోకి వచ్చిన ముస్లిం బ్రదర్‌హుడ్ అనే సంస్థ అమెరికా వ్యతిరేక సంస్థ అనే అపోహలు ఉన్నాయి. నిజానికి, ఈ సంస్థను అమెరికా పాలకులే కొన్ని దశాబ్దాల నుండి పోషిస్తూ వస్తున్నారు. ఏ దేశ పాలకులైనా రకరకాల పార్టీలను పోషిస్తూ ఉంటారు. అందులో, ఒక పార్టీకి ప్రజాదరణ తగ్గితే, ఇంకో పార్టీని పైకి లేపుతారు. ఉదాహరణకు, జార్జ్ బుష్ చేసే యుద్ధాలతో విసుగు చెందిన అమెరికన్‌లకు మొత్తం వ్యవస్థపైనే అసహ్యం ఏర్పడకుండా 'శాంతి, మార్పు' అని చిలుక పలుకులు పలికిస్తూ ఒబామా పాత్రను దింపారు. ఒబామాతో శాంతి మాటలు మాట్లాడిస్తూ, ఆయనకు నోబెల్ శాంతి బహుమతి కూడా ఇచ్చి జార్జ్ బుష్ కంటే ఎక్కువ మందిని ప్రపంచ వ్యాప్తంగా ఒబామా ఆదేశాలతో చంపించారు. ఇదంతా 'గ్లోబల్ గవర్నెన్స్' ఎజెండాలో భాగమైన మైండ్ కంట్రోల్‌లో భాగంగా జరుగుతోంది.

అయితే, పాశ్చాత్య పాలకవర్గాలు సిరియాలో ఉన్న 'ముస్లిం బ్రదర్‌హుడ్' పార్టీని సిరియా విచ్ఛిన్నానికి వాడుకుంటున్నారు. 1990 దశకంలో అమెరికా సహాయంతో ముస్లిం బ్రదర్‌హుడ్ పార్టీ సిరియాలో సాయుధ తిరుగుబాటు ప్రయత్నం చేసి విఫలమైంది. ఇరాక్‌ను విచ్ఛిన్నం చేయడానికి కుర్దిష్‌ల పై కపట ప్రేమ చూపి వారిని వాడుకున్నట్టే, సిరియాలో కూడా ఉన్న కుర్దిష్ మైనారిటీలను అమెరికా వాడుకో చూస్తుంది.

ఈ పాశ్చాత్య పాలకుల కుట్రలు ఎంత లోతుగా ఉంటాయో తెలుసుకుంటే ఆశ్చర్యం కలుగుతుంది. ఉదాహరణకు, ఈజిప్ట్‌ను తీసుకుంటే, కొన్ని దశాబ్దాల క్రితం ముబారక్ సైనిక నియంతృత్వాన్ని అధికారంలోకి తెచ్చి, ముబారక్‌ను తమకు అనుకూలంగా వాడుకొన్న అమెరికా ఆధ్వర్యంలోని పాశ్చాత్య పాలకవర్గాలు, ఈ మధ్య తమకు గుదిబండగా మారిన ముబారక్‌ను దింపడానికి, తమ ఫండింగ్‌తో నడుస్తున్న ముస్లిం బ్రదర్‌హుడ్, ఇతర 'పౌరసమాజ' సంఘాలను వాడుకొని, వారితో తెహ్రీర్ స్క్వేర్‌లో ధర్నాలు నిర్వహించేట్టు చేసి, ఆ ఉద్యమానికి హాలీవుడ్ సినిమా లాగా ఒక పేరు కూడా పెట్టి, తమ మీడియా ద్వారా, సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేసి పెట్టి, మొత్తంగా ముబారక్ దిగిపోయేట్టు చేసారు. ఇప్పుడు తమ తొత్తే అయిన ముస్లిం బ్రదర్‌హుడ్ పార్టీని వాడుకొని ఈజిప్ట్ కొత్త రాజ్యాంగాన్ని అమెరికాకు చెందిన బిలియనీర్ అయిన జార్జ్ సోరోస్ ఫండింగ్‌తో నడిచే సంస్థతో రాయిస్తున్నారు. ఇదంతా వింటుంటే, ఒక హాలీవుడ్ పొలిటికల్ థ్రిల్లర్ సినిమాలా ఉంటుంది. కాని ఇదంతా నిజం.

అన్నా హజారే, రాందేవ్ బాబాల ఉద్యమం కూడా ఇలాంటి హాలీవుడ్ పొలిటికల్ థ్రిల్లర్ సినిమానే.

పాశ్చాత్య పాలకులు ఏ దేశాన్నయినా విచ్ఛిన్నం చేయాలనుకున్నా, దాడి చేయాలనుకున్నా చాలా ముందు నుండే దానికి కావలసిన అన్నిరకాల పునాదులు నిర్మించుకుంటారు. ఈ రోజు సిరియాలో జరుగుతోంది కూడా అదే. స్వయం నిర్ణయాధికార హక్కు ఉండాలని కోరుకునే ప్రతి దేశాన్ని కూడా పాశ్చాత్య పాలక వర్గాలు విచ్ఛిన్నం చేయాలని చూసాయి. భారత పాలకవర్గాలు తమ స్వార్థం కోసం పాశ్చాత్య పాలక వర్గాల 'గ్లోబల్ గవర్నెన్స్' ఎజెండాను అమలు చేస్తున్నాయి కాబట్టి సిరియాకు, ఇరాన్‌కు మద్దతుగా నిలబడరు.

ఈ 'గ్లోబల్ గవర్నెన్స్' అనే టెర్రరిస్ట్ పరిపాలన ప్రపంచ ప్రజల మీద రుద్దుతున్న పాశ్చాత్య పెట్టుబడిదారీ వర్గాలకు వ్యతిరేకంగా వీరోచితంగా నిలబడిన సిరియా ప్రభుత్వానికి, ప్రజలకు భారత పీడిత, తాడిత ప్రజలు మద్దతు ఇవ్వాలి. పెట్టుబడి ఉన్నంత వరకు పాలక వర్గాలుంటాయి, వారి మారణహోమాలు, టెర్రరిస్టు పాలనలు ఉంటాయి. అందుకే, మనం మన తర్వాత తరాలు ఒక స్వేచ్ఛా, శాంతియుత ప్రపంచంలో బతకాలంటే, 99.5 శాతం ప్రజల పక్షం వహించే నిజమైన ప్రజాస్వామ్యంలోనే సాధ్యం.

ఏ దేశ పాలకుల చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం. ప్రపంచ వ్యాప్తంగా పాలక వర్గాల చరిత్రంతా ప్రజలను దోపిడీ చేయడం, ప్రజలను చంపడం, వారిని అణచివేయడం. ఏ దేశ పాలక వర్గాల బీరువాలు తెరిచినా ఆస్తులతో పాటు అస్థిపంజరాల గుట్టలు కనబడతాయి. అసాద్ నాయకత్వంలోని సిరియన్ పాలక వర్గాలు దీనికి ఏ మాత్రం అతీతులు కారు. అయితే, సిరియన్ పాలక వర్గాలను మార్చాలా, కూల్చాలా అనే నిర్ణయం, దాని ఆచరణ పూర్తిగా సిరియన్ ప్రజల వ్యవహారం. అంతేకాని, పాశ్చాత్య పాలక వర్గాల వ్యవహారం కాదు. అందునా అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ లాంటి అత్యంత అమానవీయమైన, కోట్లాది మంది ప్రజలను ఊచకోత కోసిన, ఇంకా కోస్తున్న చరిత్ర కలిగిన దేశాల జోక్యం చాలా ప్రమాదకరమే కాదు, ప్రపంచ ప్రజాస్వామిక వాదులు ఖండించ వలసిన విషయం.

(రచయిత అనేక దేశాల్లో పని చేసిన సామాజిక కార్యకర్త) వీ

వీక్షణం చందాదారులకు విజ్ఞప్తి : *కొద్ది మంది చందాదారులు మాకు కాపీ అందలేదు, ఫలాన నెల సంచిక మాకు పంపగలరని రెండు, మూడు నెలల తరువాత మమ్మల్ని అడుగుతున్నారు. ఏ నెల పత్రిక ఆ నెల అందకపోతే ఆనెలాఖరులోపు మాత్రమే మమ్మల్ని కాపీ కోసం సంప్రదించవచ్చు. ఉదాహరణకు ఆగస్ట్ నెల సంచిక అందకపోతే ఆగస్ట్ నెలాఖరులోపే అడిగి తెప్పించుకోగలరు. గడిచి పోయిన నెలల కాపీలు మా వద్ద అదనంగా ఉండవు. ఇది దృష్టిలో ఉంచుకుని మాకు సహకరిస్తారని ఆశిస్తున్నాం. అవకాశం ఉన్నవారు పాత సంచికలకోసం www.veekshanam.wordpress.comలో చూడగలరు.*

గ్రామ అధ్యయనం - ఇవాళ్టి కర్తవ్యాలు

ఇవాళ గ్రామ అధ్యయనం చేయదలచిన వారికి అవసరమైన దృక్పథాన్ని పద్ధతినీ సూచిస్తున్నారు

ఎన్. వేణుగోపాల్

గ్రామాల అధ్యయన అవసరాన్ని, గ్రామ అధ్యయనంలోని వివిధ దృక్పథాలను, గ్రామ అధ్యయనం జరపడానికి విభిన్న పద్ధతులను, గ్రామ అధ్యయనాలలో మార్క్సిస్టు సంవిధానపు విశిష్టతను సవివరంగా చర్చించినతర్వాత, ముగింపుగా ఇవాళ మన గ్రామాలను ఎలా అధ్యయనం చేయవలసి ఉందో, గ్రామ అధ్యయనాల ముందు ఇవాళ్టి సవాళ్లేమిటో చూడవలసి ఉంది.

ఇప్పటివరకూ సాగిన చర్చలో గ్రామ అధ్యయన పద్ధతి గురించి, పరికరాల గురించి వివరించుకున్న అంశాలను ఒకసారి పునశ్చరణ చేసుకుంటే, ఇవాళ్టి కర్తవ్యాలు స్పష్టమవుతాయి. ఒక గ్రామాన్ని మార్క్సిస్టు దృక్పథం నుంచి అధ్యయనం చేయడమంటే ఆ గ్రామంలో సాగే ఉత్పత్తి సాధనాల యాజమాన్యాన్ని, శ్రమ దోపిడీని, ప్రజల ఆదాయాన్ని, జీవనస్థాయిని, ఉత్పత్తి శక్తులను, ఆస్తి సంబంధాలను, ఉపరితలాన్ని, ఆర్థిక, రాజకీయ, భావజాల స్థితులను, వర్గ సంబంధాలను అధ్యయనం చేయడమే అని వేరువేరు వ్యాఖ్యాతలు చెప్పి ఉన్నారు. (మనిషి మనుగడ సాగాలంటే ఉత్పత్తి జరగాలి. అది భూమి, అడవి, ఖనిజాలు, నీరు వంటి ప్రకృతి వనరుల మీద, పనిముట్లు, పరికరాలు, యంత్రాలు, విద్యుత్తు వంటి సాధనాల మీద ఆధారపడి జరుగుతుంది. వీటన్నిటినీ కలిపి ఉత్పత్తి సాధనాలు అంటారు. ఈ ఉత్పత్తి సాధనాలను వాడే పద్ధతిని సాంకేతిక విధానం అంటారు. ఈ సాంకేతిక విధానం ఎప్పటికప్పుడు మారుతూ ఉంటుంది. ఉత్పత్తి సాధనాలు, సాంకేతిక విధానం వాటికవిగా ఉత్పత్తి సాగించలేవు. మనుషుల సామూహిక శ్రమ ఆ ఉత్పత్తి సాధనాలతో కలిసినప్పుడే ఉత్పత్తి జరుగుతుంది. ఆ సామూహిక శ్రమ ప్రక్రియ వల్ల మనుషులకు చైతన్యం ఏర్పడి, విస్తరిస్తుంటుంది. ఉత్పత్తి సాధనాలను, సాంకేతిక విధానాన్ని, మానవశ్రమను, మానవ చైతన్యాన్ని కలిపి ఉత్పత్తి శక్తులు అంటారు).

ఈ వ్యక్తీకరణల మధ్య భేదాలు ఉన్నప్పటికీ, ఈ అన్నిటినీ కేంద్రీకరించి చెప్పాలంటే ఉత్పత్తి శక్తులు, సామాజిక సంబంధాలు, ఉపరితల అంశాలు అనే మూడు అంశాల అధ్యయనం ముఖ్యమని చెప్పవచ్చు. లేదా మరింత సాంద్రమైన, సారభూతమైన పద్ధతిలో చెప్పాలంటే గ్రామాల వర్గవిశ్లేషణే గ్రామ అధ్యయనం అని చెప్పవచ్చు. సమాజంలో వర్గాలు ఉన్నాయని, ఆ వర్గాల ప్రయోజనాల మధ్య ఘర్షణ ఉందని కార్ల్ మార్క్స్ కన్న వందల సంవత్సరాల ముందు నుంచీ ఎందరో విశ్లేషకులు చెప్పారు. కాని మార్క్స్ ప్రత్యేకత ఏమంటే ఆయన వర్గ విశ్లేషణకు సమాజాన్నీ చరిత్రనూ అర్థం చేసుకునే మౌలిక శాస్త్రీయ అంశంగా సాధికారత కల్పించాడు. కనుక ఇవాళ కూడ గ్రామ అధ్యయనానికి ఉపయోగించవలసినది వర్గ విశ్లేషణా దృక్పథమే.

ఇక పరికరాల విషయానికి వస్తే, అనేక సామాజిక శాస్త్ర శాఖలు తమవైన పరికరాలెన్నిటినో తయారుచేశాయి. గ్రామంలోని సమస్త ప్రజలను పరిగణనలోకి తీసుకునే జనగణన, సమూహాలకు ప్రతినిధులను ఎంపిక చేసి పరిశీలించే నమూనా పరిశీలన, ఆ నమూనాకు భిన్నంగా ఉండే విడి ఉదాహరణల పరిగణన, గణాంకాల విశ్లేషణ, అధ్యయనం చేయదలచుకున్న సమూహంతో కలిసి జీవించడం, గ్రామానికి సంబంధించిన చారిత్రక, సమకాలీన పత్రాల, గాథల పరిశీలన వంటి సామాజిక శాస్త్ర పద్ధతులు ఎన్నో ఉన్నాయి. అలాగే గ్రామంలోని వర్గాల విశ్లేషణ, విభిన్న వర్గాలకు ఉన్న విభిన్న ప్రయోజనాల మదింపు, గ్రామ సమాచారం ఇవ్వగల ముఖ్యులతో నిజనిర్ధారణ, ఉద్యమాచరణ వంటి మార్క్సిస్టు పరికరాలు కూడ ఉన్నాయి.

ఈ దృక్పథాలనూ, పరికరాలనూ వివరంగానే చర్చించిన నేపథ్యంలో, ఇవాళ తెలుగుసీమలోని ఒక గ్రామంలోకి వెళ్లి అధ్యయనం చేయాలంటే ఏం చేయవలసి ఉంటుంది?

ఆ గ్రామంలోని ఉత్పత్తి శక్తులను, సామాజిక సంబంధాలను, ఉపరితల అంశాలను మూడిటినీ సమగ్రంగా, సమన్వయంతో అధ్యయనం చేయాలి. ఆ అధ్యయనానికి అవసరమైన ప్రాథమిక సమాచార వనరులనూ (ప్రత్యక్ష పరిశోధన, ఆయావర్గాల ప్రజలతో సంబంధం, ప్రశ్నావళికి సమాధానాలు రాబట్టడం, చర్చ), ద్వితీయ స్థాయి సమాచార వనరులనూ (అధికారిక సమాచారం, అచ్చయిన సమాచారం, గ్రామ చరిత్ర పట్ల, మొత్తంగా గ్రామం పట్ల అవగాహన ఉండేవారితో సమావేశాలు) వీలయినంత ఎక్కువగా సేకరించాలి. అలాగే గ్రామ అధ్యయనం అనేది గ్రామంతోనే ముగిసిపోదు. గ్రామం అనేది విడిగా, బైటి సమాజంతో సంబంధం లేకుండా ఉనికిలో లేదు గనుక ఆ గ్రామానికి బైటి ప్రపంచంతో సంబంధాలు ఎలా ఉన్నాయో కూడ అధ్యయనం చేయాలి. వలసలు, పట్టణాలతో సంబంధం, సరుకుల మార్కెట్ తో గ్రామానికి ఉన్న సంబంధాలు కూడ అధ్యయనం చేయాలి. కొన్నిసార్లు పట్టణంలోని పారిశ్రామిక కార్మికులను, వలస కూలీలను పరిశీలించడం కూడ గ్రామ అధ్యయనానికి అవసరం కావచ్చు.

వీటిలో ఉత్పత్తి శక్తుల అధ్యయనం అంటే కొందరు పరిశీలకులు కేవలం ఉత్పత్తి సాధనాల అధ్యయనంగా కుదించి చూస్తున్నారు. ఎంత భూమి, ఎన్ని ట్రాక్టర్లు, ఎన్ని పంపుసెట్లు, ఎన్ని ఆధునిక పరికరాలు, ఎన్ని రకాల మార్కెట్ పంటలు, ఎంత దిగుబడి, మార్కెట్ కు చేరుతున్నదెంత అని లెక్కలు వేసి అదే గ్రామ అధ్యయనంగా భావిస్తున్నారు. మరి కొందరు కాస్త ముందుకు వెళ్లి గ్రామంలో భూమి, భూయాజమాన్యంలో అసమానతలు కూడ పరిగణనలోకి తీసుకుంటున్నారు. మరి కొందరు శ్రామిక జనాభా, శ్రమ పరిస్థితులు, శ్రమ ఫలితం, ఉత్పత్తిలో మిగులు, ఆ మిగులు ప్రవహిస్తున్న మార్గాలు వంటి అంశాలను కూడ ఉత్పత్తి శక్తుల అధ్యయనంలో భాగం చేస్తున్నారు. కాని ఉత్పత్తి శక్తులను సమగ్రంగా చూడాలంటే ఉత్పత్తికి మూలమూ సాధనమూ లక్ష్యమూ అయిన శ్రామికులు, ఆ శ్రామికుల చైతన్యంతో పాటు భూమి, నీరు వంటి శ్రమ

లక్ష్యాలయిన ప్రకృతి వనరులు, కొడవలి, గొడ్డలి, నాగలి నుంచి ట్రాక్టర్, విద్యుత్తు, పంప్ సెట్, హార్వెస్టర్, విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు, రవాణా సాధనాలు, నిలువ సదుపాయాలు, మార్కెటింగ్ సదుపాయాలు వంటి ఉత్పత్తి సాధనాలన్నీ భాగం కావాలి. ఉత్పత్తి శక్తుల అధ్యయనమనేది విశాలమైన, సమగ్రమైన, సంక్లిష్టమైన, చారిత్రక పరిశీలన. అది ఒక బిందువు కాదు, ఒక ప్రవాహం. అది ఒక ఘటన కాదు, ఒక పరిణామం. అది ఒక ఒక స్థితి కాదు, ఒక క్రమం.

అంత చేసినా, ఉత్పత్తి శక్తుల అధ్యయనం దానికదిగా చెప్పగలిగినది తక్కువే. ఉత్పత్తి శక్తులలో కీలకభాగమైన శ్రామికులు తమ శ్రమ ఫలితాన్ని అందుకోకుండా అడ్డుకుంటున్న ఉత్పత్తి సంబంధాలున్నాయి. ఆ ఉత్పత్తి సంబంధాల అధ్యయనం చాల అవసరం, కీలకం. ఉత్పత్తి శక్తులలో చాల అంశాలు కంటికి కనబడతాయి, లెక్కకు అందుతాయి గాని ఉత్పత్తి సంబంధాలు కనబడేవాటికంటే కనబడనివి ఎక్కువ. భూస్వామి చేతిలో కొరడా పట్టుకుని రైతు కూలీల మీద దోపిడీ పీడనలను అమలుచేసే సంబంధం స్పష్టంగా కనబడుతుంది. కాని ఆ కొరడా లేకుండా కూడ అంతకన్న ఎక్కువ దోపిడీ పీడనలను అమలు చేయగల సంబంధాలు కూడ ఉన్నాయి. ఆ నిగూఢ, అస్పష్ట, సంక్లిష్ట సంబంధాలను కనిపెట్టవలసి ఉంటుంది. ఉత్పత్తి సంబంధాలు, వర్గ సంబంధాలు, ఆస్తి సంబంధాలు, సామాజిక సంబంధాలు, మానవ సంబంధాలు అనే ఏ పేరుతో పిలిచినా, మనిషికీ మనిషికీ మధ్య ఉండే ఈ సంబంధాల సముదాయం మొత్తాన్ని నియంత్రించేది ఉత్పత్తి సాధనాల మీద, ఉత్పత్తి మీద, మిగులు మీద యాజమాన్యం ఎవరిది అనే అంశమే. ఆ యాజమాన్యమే వర్గాలను విభజిస్తుంది. అందువల్లనే అది కీలకమైనది. తిండి లేకుండా మనిషి మనుగడ లేదు గనుక, ఉత్పత్తి లేకుండా తిండి లేదు గనుక మానవ సమాజానికి మూలం, ఆధారం, కీలకం ఉత్పత్తి ప్రక్రియ. వర్గాలు ఆ ఉత్పత్తి ప్రక్రియను బట్టే రూపొందుతాయి గనుక వర్గాలు మౌలికమైనవి.

అయితే వర్గాన్ని నిర్ణయించేది ఉత్పత్తి సాధనాల యాజమాన్యం ఒక్కటే కాదు. 'మరొక వర్గానికి వ్యతిరేకంగా ఉమ్మడి పోరాటం సాగిస్తున్నంతవరకే విడివిడి వ్యక్తులు ఒక వర్గంగా రూపొందుతారు. అలా కాకపోతే వారు ఒకరికొకరు పోటీదారులుగా శత్రుపూరిత సంబంధంలో ఉంటారు' అని వర్గం అంటే సంఘటితత్వపు చిహ్నమే అనే సారాన్ని మార్క్స్ వివరించాడు. వర్గం రూపొందడంలో కొన్ని నిర్మాణాత్మక అంశాలు ఉంటాయని నిర్వచించడానికి ప్రయత్నించిన బ్రిటిష్ రాజకీయార్థిక శాస్త్రవేత్త టెరెన్స్ జె బైర్స్ 'ఉత్పత్తి సాధనాలతో ఉమ్మడి సంబంధం, మిగులు ఉత్పత్తిని స్వాధీనం చేసుకోవడంలో ఉమ్మడి సంబంధం, ఈ రెండు కారణాలవల్ల ఒకరితో ఒకరికి ఉమ్మడి సంబంధం కలిగిన స్త్రీలూ పురుషులూ ఒక వర్గంగా రూపొందుతారు. ఈ సంబంధాలవల్ల వారికి ఇతర వర్గాలతో పోలిస్తే వస్తుగతమైన, నిర్దిష్టమైన ఉమ్మడి ఆర్థిక ప్రయోజనాలు ఉంటాయి' అన్నాడు.

భారతదేశంలో వర్గాల గురించి చర్చించిన అరవింద్ ఎన్ దాస్ తన **ఇండియా ఇన్వెంటెడ్** పుస్తకంలో 'వర్గం అనేది కేవలం సైద్ధాంతిక భావన కాదు. అది దైనందిన జీవితంలోని సంబంధం. అది ఒక వస్తువు కాదు. వర్గం అనేది ఒక చారిత్రక దృగ్గోచరాంశమని చరిత్ర రుజువు చేసింది... మార్క్సియన్ అవగాహనలో వర్గాలను ఉత్పత్తి విధానంలో భాగంగానే గుర్తించవలసి ఉంటుంది. కాని ఈ ఉత్పత్తి విధానాలు అనేవి కూడ మానవజాతి ఒక మెట్టు తర్వాత ఒక మెట్టుగా ఉద్రిక్తంగా దుముకుతూ పోయే, విస్పష్టంగా ఏర్పడి ఉన్న చారిత్రక నిచ్చెన కాదు. ఉత్పత్తి విధానాలు కూడ చారిత్రకంగా గతిశీలమైనవి. ఆ గతిశీలతకు చోదకశక్తి సంఘర్షణా యుతమైన మానవ సంబంధాలు. ఆ సంఘర్షణాయుత సంబంధాలకు ఒక మౌలికమైన వ్యక్తీకరణే సామాజిక వర్గాలు. అంటే సైద్ధాంతికంగా చూసినా సామాజిక వర్గాల భావన పోరాట క్రమంలోనే రూపొందుతుంది' అని రాశాడు.

ఈ చర్చతో తేలేదేమంటే ఒక మనిషి ఏ వర్గానికి చెందుతారనేది నిర్ణయించడానికి ఆ మనిషికి ఉత్పత్తి సాధనాలతో ఉండే సంబంధం కీలకమే కాని అదే ఏకైక అంశం కాదు. మిగులు ఉత్పత్తి మీద అధికారం, ఇతర వర్గాలతో సంబంధం కూడ ప్రధానాంశాలు. మిగులు ఉత్పత్తి ఆస్తిగా మారుతుంది. ఈ ఆస్తిలో కొంత భాగం ప్రత్యక్ష ఉత్పత్తి సాధనంగా మారవచ్చు, కొంత పరోక్షంగా ఉత్పత్తికి సహకరించవచ్చు. కొంత అనుత్పాదకంగా వ్యర్థమయిపోవచ్చు. ఆ ఆస్తి మీద యాజమాన్యం, అధికారం వర్గాలను నిర్ణయిస్తాయి. అవి ఆస్తి సంబంధాలు అవుతాయి. ఉత్పత్తి క్రియలో తప్పనిసరి అయిన శ్రమ విభజన వల్ల గాని, ఉపరితలంలోని చట్ట, రాజకీయ, మత, నైతిక, తాత్విక భావాల వల్ల గాని, కట్టుబాట్లవల్ల గాని మనుషులు వేరు వేరు బృందాలుగా చీలి, ఆ బృందాల మధ్య సామాజిక సంబంధాలు ఏర్పడవచ్చు. అంటే ప్రత్యక్ష ఉత్పత్తి సంబంధాలతో పాటు మనుషుల మధ్య సంబంధాలను ఆస్తి, సామాజిక కట్టుబాట్లు కూడ ప్రభావితం చేస్తాయి. మానవులు ఒంటరిగా జీవించడం అసాధ్యం గనుక, మానవ సంబంధాలు అనివార్యం గనుక ఆ మానవ సంబంధాలన్నిటినీ ఈ ఉత్పత్తి, వర్గం, ఆస్తి, సామాజిక కట్టుబాట్లు ప్రభావితం చేస్తాయి. కనుక వర్గ విశ్లేషణ సాగించేటప్పుడు కేవలం ఉత్పత్తి సాధనాలతో సంబంధాన్ని మాత్రమే కాక, ఆస్తిని, అధికారాన్ని, ఉపరితలాంశాల ప్రభావాన్ని కూడ పరిగణనలోకి తీసుకోవాలి.

ఈ అవగాహనతో మొట్టమొదట గ్రామంలోని విభిన్న వర్గాలేమిటో గుర్తించవలసి ఉంటుంది. ఆ వర్గాల మధ్య సంబంధాలను, ఆస్తి సంబంధాలను, సామాజిక సంబంధాలను, మొత్తంగా మానవ సంబంధాలను అధ్యయనం చేయవలసి ఉంటుంది.

ఉత్పత్తి శక్తులు, ఉత్పత్తి సాధనాలు రెండూ సమాజానికి పునాది అంశాలు. ఈ పునాదిని కాపాడడానికి, పునరుత్పత్తి చేయడానికి, సాధికారత ఇవ్వడానికి ఉపరితలం తయారవుతుంది. సాధారణంగా మత, నైతిక, తాత్విక, సాహిత్య, సాంస్కృతిక, న్యాయ, పాలనా (రాజకీయ) రంగాలను ఉపరితలంలో భాగంగా చూస్తారు. ఐతే ఈ పునాది ఉపరితలాలను, లేదా ఉపరితలంలోని విభిన్న రంగాలను విడివిడిగా, సంబంధం లేనివిగా, లేక ఏకముఖ సంబంధం ఉన్నవిగా చూడడం సరి అయింది కాదు. పునాదీ ఉపరితలమూ రెండూ పరస్పరం ప్రభావం వేసుకుంటూ ఉంటాయి. ఈ రెండిటిలోనూ నిరంతరం మార్పులు జరుగుతూ ఉంటాయి. ఆ మార్పులు వేరువేరు వేగాలతో ఉంటాయి. వాటిలో కూడ అంతర్గత అంశాలకు వేరు వేరు చలన వేగాలు, చలన నియమాలు ఉంటాయి. అందువల్ల గ్రామాన్ని అధ్యయనం చేసేటప్పుడు ఆ గ్రామంలోని ఉపరితల అంశాలు ఏమిటి, ఆ ఉపరితల అంశాలలో ఒకటి మరొకదాని మీద వేసుకునే ప్రభావాలు ఏమిటి, ఆ ఉపరితలాంశాలమీద పునాది ప్రభావాలు ఏమిటి, తిరిగి ఈ ఉపరితలాంశాలు పునాది మీద వేసే ప్రభావం ఏమిటి కూడ అధ్యయనం చేయాలి.

మొట్టమొదట గ్రామంలో భూమి, జనాభా, వ్యవసాయాధార జనాభా, భూయాజమాన్యంలో అసమానతలు, భూమిలేని నిరుపేదల సంఖ్య, నీటి పారుదల, విద్యుచ్ఛక్తి, యంత్ర శక్తి వంటి ఉత్పత్తి సాధనాలు, గ్రామ

ఆర్థిక స్థితి, పేదరికం, అప్పులు, ప్రజల జీవన ప్రమాణాలు, రాజకీయ సంబంధాలు, పట్టణంతో, ఆధునిక మార్కెట్ తో సంబంధాలు, విద్యావకాశాలు, ఆరోగ్య సదుపాయాలు, రవాణా సంబంధాలు, సమాచార సంబంధాల ఉపకరణాలు, వలసలు వంటి వివరాలన్నీ సేకరించాలి. దాదాపుగా ఇవన్నీ అంకెలలో లభిస్తాయి. చాల సందర్భాలలో ఆ అంకెలు అంత కచ్చితమైనవీ, విశ్వసనీయమైనవీ కూడ కాకపోవచ్చు. అవి సరైన అంకెలే అనుకున్నా కూడ అవి పరిమాణ సూచనలే తప్ప గుణానికి సూచనలు కావు. ఇవన్నీ గ్రామ అధ్యయనానికి మౌలిక దినుసులే తప్ప ఇవి సేకరించినంత మాత్రాన గ్రామం అర్థం అయినట్టు కాదు. ఈ వివరాలను పరిశీలిస్తే గ్రామం గురించి స్థూలమైన అవగాహన కలుగుతుంది. ఆ అవగాహన మీద ఆధారపడి, ఆ అవగాహనకు పదును పెట్టి, అంతిమ నిర్ధారణలకు రావడానికి కొన్ని నిర్దిష్ట రంగాలకు సంబంధించిన కొన్ని నిర్దిష్ట ప్రశ్నలకు జవాబులు రాబట్టాలి.

అలాంటి ప్రశ్నలు సంధించవలసిన మౌలిక రంగాలు గ్రామంలో అందుబాటులో ఉన్న మొత్తం శ్రమ, శ్రమను అమ్ముకోవడం తప్ప గత్యంతరం లేని వారి స్థితి, ఇతరుల శ్రమను కొనుక్కోగలిగిన వారి స్థితి, సంపద పోగుపడుతున్న క్రమాలు, ఆ సంపదలో నుంచి తిరిగి మదుపులోకి, ఉత్పత్తిలోకి వస్తున్న భాగం, గ్రామ ఆర్థిక వ్యవస్థలో మిగులు రూపొందుతున్న తీరు, ఆ మిగులు ప్రవహిస్తున్న రంగాలు, గ్రామ ఆర్థిక వ్యవస్థలో ఉన్న సాంకేతిక విధానాలు, గ్రామ ఆర్థిక వ్యవహారాలు సాగడానికి వస్తున్న రుణం, పరపతి సౌకర్యాలు. ఈ రంగాల పరిశీలన గ్రామంలోని ఉత్పత్తి శక్తుల గురించి సమగ్రమైన అవగాహనను ఇవ్వగలుగుతుంది.

అయితే ఉత్పత్తి శక్తుల అధ్యయనం ఉత్పత్తి సంబంధాల గురించి, ఉపరితలాంశాల గురించి పరిశీలించక పోతే సంపూర్ణం కాదు. సమాజంలో ఉత్పత్తితో ప్రత్యక్ష సంబంధంలేని జనాభా గణనీయంగా పెరుగుతున్నది గనుక ఉత్పత్తి సంబంధాలు అనే మాట ఇవాళ కొంత అపనమ్మకంతో చూడబడుతున్నది. ఉత్పత్తి సంబంధాలు, వర్గ సంబంధాలు అనే మాటలే శాస్త్రీయమైనవి, వాడవలసినవి. కాని ఆ దృక్పథం వదులుకోకుండానే ఆస్తి సంబంధాలు, సామాజిక సంబంధాలు, మానవ సంబంధాలు అనే విశాలమైన మాటలు కూడ వాడవచ్చు. ఏ మాట వాడినా మనుషుల మధ్య సంబంధాలను నిర్ణయిస్తున్న అంశాలేమిటి, నిర్ణయిస్తున్నట్టు కనిపిస్తున్న అంశాల వెనుక ఉన్నదేమిటి అని విశ్లేషణ చేయడం అవసరం. అలా చేసినప్పుడు పుట్టుకకు సంబంధించిన అంశాలు (ప్రాంతం, భాష, మతం, కులం, కుటుంబం), సామాజికీకరణకు సంబంధించిన అంశాలు (పెంపకం, చదువు, సహవాసాలు, స్నేహాలు), జీవితాచరణకు సంబంధించిన అంశాలు (ఉద్యోగం, వృత్తి, అధ్యయనం, ఆచరణ, విలువలు, భాగస్తులైన నిర్మాణాలు) మనుషుల మధ్య సంబంధాలను నిర్ణయిస్తున్నట్టు, నిర్దేశిస్తున్నట్టు, మారుస్తున్నట్టు కనబడతాయి. నిజానికి ఈ అంశాలకు వేరువేరు శక్తి సామర్థ్యాలు ఉన్నప్పటికీ, కొన్ని మారడం అసాధ్యం అనిపించినప్పటికీ ఇవన్నీ రూపాలు మాత్రమే. వీటన్నిటికీ సారం వర్గమే. అందువల్లనే వర్గ సంబంధాలను పరిశీలిస్తే మౌలిక అవగాహన కలుగుతుంది. ఆ తర్వాత పైన చెప్పిన అంశాలలో బలమైన వాటిని కూడ పరిగణనలోకి తీసుకోవచ్చు.

పైననే చెప్పినట్టు ఉత్పత్తి శక్తుల, ఉత్పత్తి సంబంధాల యథాతథ స్థితిని నిలబెట్టడానికి ఉపరితలం నిర్మాణమవుతుంది. ఉత్పత్తి శక్తులమీద యాజమాన్యం ఉన్న వర్గాలే, ఉత్పత్తి సంబంధాల స్థితి వల్ల ప్రయోజనాలు పొందుతున్న వర్గాలే తమ యాజమాన్యాన్ని, తమ ప్రయోజనాలను సమర్థించే భావజాల చట్రాన్ని, ఆ భావజాలాన్ని ఎప్పటికప్పుడు పునర్నిర్మించి, పరిరక్షిస్తూ ఉండే ఉపరితల నిర్మాణాలను తయారుచేసుకుంటాయి. మత, నైతిక, సాహిత్య, న్యాయ, రాజకీయ తదితర ఉపరితల నిర్మాణాలన్నీ కూడ ఉత్పత్తి సాధనాల మీద వ్యక్తిగత యాజమాన్యం అనే తప్పుడు పద్ధతికి, అసమ సంబంధాలకు సాధికారత కల్పించడానికి రూపొందినవే. కనుక గ్రామాన్ని మాత్రమే కాదు, సమాజంలో ఏ భాగాన్ని అధ్యయనం చేసేటప్పుడైనా ఉపరితల నిర్మాణాలను, వాటి పనితీరును, అవి దాచిపెడుతున్న వర్గ ప్రయోజనాలను కనిపెట్టడం, అధ్యయనం చేయడం అత్యవసరం. ఒక గ్రామంలో మత విశ్వాసాలు, ఆచారాలు, బలులు, కర్మకాండలు, జాతరలు, సామూహిక ఉత్సవాలు, కళలు, సాహిత్యం, నైతిక నియమాలు, పాలనా చట్రాలు ఆ గ్రామంలోని ఏ వర్గ సంబంధాలను చెక్కుచెదరకుండా కాపాడడానికి తయారయ్యాయో అర్థం చేసుకోకపోతే అవగాహనలో పొరపాట్లు దొర్లే అవకాశం ఉంది. పాత కుల, మతాచారాలు మాత్రమే కాక ఎప్పటికప్పుడు తలెత్తుతున్న రాజకీయాల రూపంలో, విద్యా, న్యాయ, నైతిక ఆలోచనల రూపంలో కూడ ఉపరితలం పునర్నిర్మామవుతూ ఉంటుంది. ఆ ఉపరితలం నేర్పుతో, ముసుగులతో, ఆకర్షణలతో పాత వర్గ సంబంధాలను, ఆధిపత్యాన్ని, దోపిడీ పీడనలను, యథాతథ స్థితిని కొనసాగిస్తుంది. మార్పు జరుగుతున్నట్టుగా భ్రమ కల్పిస్తూ, పైపై అంశాలలో మార్పులు తెస్తూ, సంస్కరణలు జరుపుతూ, అట్టడుగున మౌలిక దోపిడీ పీడనల చట్రాన్ని కొనసాగిస్తుంది. 'మారిన దోపిడీ రూపాలు, మారని దోపిడీ' అనే నినాదం ఈ స్థితిని సరిగ్గా వివరిస్తుంది.

మార్క్సిస్టేతర దృక్పథాలతో గ్రామ అధ్యయనం చేసేవారికీ, మార్క్సిస్టు దృక్పథంతో గ్రామ అధ్యయనం చేసేవారికీ ప్రధానమైన తేడా ఇక్కడే ఉంటుంది. మిగిలిన గ్రామ పరిశీలకులందరూ ఈ రూపాలను చూసి భ్రమపడి మార్పులు జరుగుతున్నాయని విశ్లేషిస్తారు. మార్క్సిస్టు పరిశీలకులు ఆ మార్పుల సారాంశాన్ని, మౌలిక స్వభావాన్ని గుర్తించి, ఆ మార్పులు ఏ దిశగా సాగుతున్నాయో, ఆ మార్పుల అంతిమ ఫలితం ఏమిటో చెప్పగలుగుతారు. మార్పులు జరగడం లేదని మార్క్సిస్టులు ఎప్పుడూ అనరు, ఇతరులకు మార్పులుగా కనిపించేవాటిలో వర్గ ప్రయోజనాల సారాంశాన్ని వివరించి, మారినదేమిటో, మారనిదేమిటో విశ్లేషిస్తారు.

మొత్తంగా గ్రామ అధ్యయనం గురించిన ఈ వివరణ తర్వాత, నిర్దిష్టంగా ప్రస్తుతం గ్రామ అధ్యయనం చేయదలచిన వారు పరిశీలించవలసిన స్థూల రంగాలను కూడ సూచించవలసి ఉంది. ఈ సూచన సమగ్రం కాదు, అన్ని గ్రామాలలోను సార్వత్రికంగా, యథాతథంగా ఉపయోగపడేదీ కాదు. ఆయా గ్రామాన్ని బట్టి అదనపు ప్రశ్నలు కలుపుకోవడం, కొన్ని ప్రశ్నలు తీసివేయడం వంటి పనులు పరిశీలకులు స్వయంగా చేసుకోవలసి ఉంటుంది.

ఉత్పత్తి శక్తులు, ఉత్పత్తి సంబంధాలు, ఉపరితల అంశాలు అనే మూడు అంశాలకు తగిన ప్రాధాన్యత ఇచ్చి గ్రామాన్ని స్థూలంగా అధ్యయనం చేసే క్రమంలో, సూక్ష్మంగా కొన్ని రంగాల గురించి ఉదాహరణ ప్రాయమైన కొన్ని ప్రశ్నలు ఇవి.

మొదట గ్రామంలో శ్రామికుల పరిస్థితికి సంబంధించి కొన్ని ప్రశ్నలు వేయవచ్చు. శ్రామికులు స్వేచ్ఛగా ఉన్నారా, బంధనాలలో ఉన్నారా? తమ శ్రమను ఎవరికంటే వారికి అమ్ముకోగలిగిన స్థితిలో ఉన్నారా, ఏమైనా ఆటంకాలున్నాయా? ఏయే రకాల శ్రమ అమ్మకం/కొనుగోలు పద్ధతులు అమలులో ఉన్నాయి? శ్రమకు ప్రతిఫలం – ద్రవ్య రూపంలో – ఎలా ఉంది? శ్రమ పరిస్థితులలో ద్రవ్యేతర, ఆర్థికేతర అంశాలు ఉన్నాయా? పని స్థలంలో పరిస్థితులు ఎలా ఉన్నాయి? శ్రమ చేసే అవకాశం

దొరకడానికి ప్రాతిపదిక ఏమిటి? కేవలం శ్రమ చేయగల శక్తి మాత్రమేనా, లేక కులం, మతం, అప్పు, తక్కువ వేతనం అడగడం, వగైరా అంశాలు ఉన్నాయా? పాత సమాజంలో ఉండిన పాలేరు, జీతగాడు, వెట్టి (వేతనం లేని శ్రమ), అప్పు కింద బానిసత్వం వంటి రూపాల స్థానంలో వచ్చిన కొత్త రూపాలు ఏమిటి?

గ్రామంలో సంపద పోగుపడుతున్న (సంచయన) క్రమాల గురించి అడగదగిన ప్రశ్నలు: గ్రామంలో వ్యవసాయం ఎవరి చేతుల్లో ఉంది? వ్యవసాయ ఉత్పత్తిలో మిగులు ఎలా ఉంది? గ్రామంలోని వ్యాపారంలో/వ్యాపారాలలో లాభాలు ఎలా ఉన్నాయి? గ్రామానికి ప్రభుత్వ పథకాల ద్వారా నిధులు అందుతున్నాయా? అవి ఎవరి చేతుల్లోకి వెళ్తున్నాయి? సంపద భూస్వామిక దోపిడీ రూపాల ద్వారా పోగు పడుతున్నదా? రాజకీయ/ఆర్థిక మధ్యవర్తిత్వం (పైరవీ) ద్వారా పోగు పడుతున్నదా? సేవా రంగం ద్వారా పోగు పడుతున్నదా?

గ్రామంలో పోగుపడుతున్న సంపదలో మిగులు భాగం ఎంత? ఆ మిగులు ఎవరు చేజిక్కించుకుంటున్నారు? ఎలా చేజిక్కించుకుంటున్నారు? ఆ మిగులులో ఎక్కువమందికే వాటాలు దొరుకుతున్నట్టయితే ఆ వాటాలు నిర్ణయమవుతున్న ప్రాతిపదిక ఏమిటి? ఆ మిగులుకు కారణం తక్కువ వేతనాలు ఇవ్వడమా? శ్రమ ఫలితం సరిగా ఇవ్వకపోవడమా? వనరులకు తక్కువ ధర కట్టడమా? ఉమ్మడి, సమష్టి వనరులను సొంతం చేసుకోవడమా? ఉత్పత్తి సాధనాల మీద యాజమాన్యం ఉండడమా? కులం ద్వారా సంక్రమించిన ఆధిపత్యమా? రాజకీయ సంబంధాల ద్వారా వచ్చిన అధికారమా? అధికారులతో సంబంధాల ద్వారా వచ్చిన పెత్తనమా? ఉత్పత్తిలో మిగులు ఎక్కడికి వెళ్తోంది? పునరుత్పత్తికి మదుపు అవుతోందా? గ్రామంలోని మిగులు గ్రామం బైటికి వెళ్తున్నప్పుడు అది ఏ రంగంలోకి వెళ్తోంది? పారిశ్రామిక, సేవా రంగాలలోకి వెళ్తోందా? అదనపు ఉపాధి అవకాశాలను కల్పిస్తోందా? విలాసాలకు ఖర్చయిపోతోందా?

గ్రామంలోకి గ్రామం బైటి నుంచి ప్రవహిస్తున్న మదుపు – ప్రభుత్వం నుంచి మదుపు, పారిశ్రామిక, వ్యాపార, సేవా రంగాలలో సంస్థాగత పెట్టుబడి ద్వారా వస్తున్న మదుపు, గ్రామం నుంచి బైటికి వెళ్లిన వారు వ్యాపార వృత్తి ఉద్యోగాలలో సంపాదించిన దాని నుంచి వ్యక్తిగతంగా పెడుతున్న మదుపు, ఎంత ఉంది? ఎలా ఉంది? గ్రామంలోపల ఉత్పత్తి అయిన సంపద నుంచి గ్రామంలోనే పెడుతున్న మదుపు – వ్యవసాయోత్పత్తిలోని మిగులు నుంచి, వ్యాపార మిగులు నుంచి, వృత్తి ఉద్యోగాల ఆదా నుంచి – ఎంత ఉంది? ఎలా ఉంది? ఈ మదుపు స్వభావం ఏమిటి? – మిగులు సంపాదించే ఉద్దేశం తోనా? వినియోగ అవసరాల కోసమా? విలాసాల కోసమా? ఉత్పాదక మదుపా, అనుత్పాదక మదుపా? హోదా కోసం మదుపా? సామాజిక భద్రత కోసం మదుపా?

ఉత్పత్తి క్రమంలో వాడుతున్న సాంకేతిక విధానాలు ఏమిటి? గ్రామంలోకి కొత్త సాంకేతిక విధానాలు ఏమి వచ్చాయి? ఎలా వచ్చాయి? వాటి యాజమాన్యం ఎవరిది? అవి కొనసాగుతున్న సాంకేతిక విధానాన్ని తొలగించి వచ్చాయా, దానితో సహజీవనం చేస్తున్నాయా? కొత్త సాంకేతిక విధానం కొత్త సంబంధాలను ప్రవేశపెట్టిందా? ఆ సాంకేతిక విధానం వాడుతున్న వ్యక్తుల చైతన్యంలో మార్పు వచ్చిందా? ఆ సాంకేతిక విధానానికి ఎంత ఖర్చయింది?

ఉత్పత్తి క్రమాన్ని అభివృద్ధి చేయడానికి ఉన్న రుణ, పరపతి సౌకర్యాలు ఏమిటి? రుణ, పరపతి వనరులు ఏమిటి? ఎంత రుణం, పరపతి దొరుకుతోంది? ఆ రుణాన్ని, పరపతి సౌకర్యాన్ని ఎందుకు వాడుతున్నారు? వినియోగ అవసరాలకు వాడుతున్నారా? ఉత్పత్తిని పెంచడానికి వాడుతున్నారా? గ్రామంలో వడ్డీ వ్యాపారం ఎలా ఉంది? పాత తరహా భూస్వామ్య వడ్డీ వ్యాపారం లేకపోయినా, అనేక ద్రవ్య సంస్థల ద్వారా ఇతర రూపాలలో సాగుతున్న వడ్డీ వ్యాపారం ఎలా ఉంది? వడ్డీ రేట్లు ఎలా ఉన్నాయి? గ్రామంలోని ప్రజల రుణభారం ఎలా ఉంది? రుణ/పరపతి గ్రహీతల యోగ్యతను ఎలా నిర్ణయిస్తున్నారు? వారి భూమి, ఇల్లు, ఆస్తి, కులం, మతం వంటి ఏ ప్రాతిపదిక ప్రధానం? తిరిగి చెల్లింపుల క్రమం ఏమిటి? ఎంత రుణం/పరపతి మిగిలిపోయి ఉంది? ఎన్ని సంవత్సరాలుగా?

గ్రామం నుంచి వలసలు ఎలా ఉన్నాయి? వలస వెళ్లిన ప్రజలు ఆయా ప్రాంతాలలో ఏ వృత్తి ఉద్యోగాలలో స్థిరపడ్డారు? వారు వెనక్కి తిరిగి వస్తున్నారా? వారు గ్రామంతో సంబంధాన్ని కొనసాగిస్తున్నారా? వలసల వల్ల గ్రామ ఆర్థిక స్థితిలో మార్పులు ఏమైనా వచ్చాయా?

గ్రామంలో భూముల అమ్మకాలు, కొనుగోళ్లు ఎలా ఉన్నాయి? అవి వ్యవసాయావసరాలకోసం సాగుతున్నాయా, ఇతర అవసరాలకోసమా? గ్రామంలో వ్యవసాయంతో సంబంధం లేని వర్గాలు, సమూహాలు ఉన్నాయా? గ్రామంలో భూమి మాత్రమే ఉండి, గ్రామంతో మరే సంబంధమూ లేని అనుపస్థిత భూస్వాములు ఉన్నారా?

వ్యవసాయం మీద ప్రజలకు ఆసక్తి తగ్గుతున్నదనే వాదన నిజమేనా? వ్యవసాయ సంక్షోభం వల్ల, గిట్టుబాటు కాకపోవడం వల్ల ఆ మాట అంటున్నారా? ఆ సంక్షోభం లేకపోయినా, గిట్టుబాటు అయ్యే వ్యవసాయ స్థితి ఏర్పడినా వ్యవసాయం నుంచి వైదొలగదలచుకున్నారా?

గ్రామంలో పార్లమెంటరీ ప్రజాస్వామిక సంస్థలు చేసిన వాగ్దానాలు ఏమిటి? అవి నెరవేరినదెంత? అవి తెచ్చిపెట్టిన భ్రమలు ఏమిటి? గ్రామంలో కుల, మత కట్టుబాట్లు ఉత్పత్తి ప్రక్రియ మీద, మిగులు స్వాధీనం మీద వేస్తున్న ప్రభావాలు ఏమిటి?

ఇలా ఆలోచిస్తూ వెళ్తే ఏ గ్రామానికి ఆ గ్రామంలో పరిశీలకులు మరెన్నో ప్రశ్నలు కూడ తట్టవచ్చు. ఆ జవాబులు రాబట్టే క్రమంలో గ్రామం గురించిన అవగాహన పెరగవచ్చు. ఏ ప్రశ్ననూ అడ్డుకోకుండా, అన్ని ప్రశ్నలకూ జవాబులు వెతికే ప్రయత్నం చేయడం పరిశీలకులకు మొదటి షరతు.

అయితే ఎన్ని ప్రశ్నలు వేసినా, ఏ అవగాహనకు వచ్చినా, ఈ అధ్యయనమంతా దేనికోసం అనే మౌలిక ప్రశ్న దగ్గరికి మళ్లీ మళ్లీ రాకతప్పదు. గ్రామ అధ్యయనం కేవలం సాక్షి దృష్టితో, నిష్పాక్షిక పరిశీలకుల దృష్టితో గ్రామాన్ని అధ్యయనం చేయడం కోసం కాదు. గ్రామ అధ్యయనం అనేదే అంతిమంగా గ్రామాన్ని అభివృద్ధి వైపు, సమానత్వం వైపు, సామాజిక న్యాయం వైపు మార్చడానికి. గ్రామంలోని అసమ సంబంధాల వ్యవస్థను మార్చే విప్లవం తేవడానికి. గ్రామంలో విప్లవ శక్తులను గుర్తించి, వారిని విప్లవానికి సన్నద్ధం చేయడానికి. గ్రామంలో విప్లవానికి చోదకశక్తులేవి, విప్లవానుకూల శక్తులేవి, విప్లవానికి తటస్థ శక్తులేవి, విప్లవ వ్యతిరేక శక్తులేవి అని గుర్తించే వర్గ పోరాట ఆచరణలో భాగమే గ్రామ అధ్యయనం. ఆ విస్పష్టమైన లక్ష్యం కోసమే గ్రామ అధ్యయనం చేపడుతున్నామని ఒక్క క్షణం కూడ మరచిపోకపోవడం, అదే సమయంలో ఆ అధ్యయన క్రమంలో వీలయినంత సమగ్రమైన సమాచారాన్ని, పరిశీలకుల అవగాహనలకు భిన్నమైన, సవాళ్లు విసిరే సమాచారాన్ని కూడ, సేకరించడం, వాటిని వివరించడం, శాస్త్రీయమైన విశ్లేషణ సాగించడం ఇవాళ ప్రజా ఉద్యమ కార్యకర్తల, సామాజిక విశ్లేషకుల కర్తవ్యం. వీ

(రచయిత వీక్షణం సంపాదకులు)

వాకపల్లి ఘటనకు ఐదు సంవత్సరాలు

వాకపల్లి ఘటన జరిగి ఏళ్లు గడిచినా, బాధితుల్లో కొంతమంది చనిపోయినా ఇప్పటికీ న్యాయం జరగలేదంటూ, దేశవ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను, హింసను వివరిస్తున్నారు డా. జి. లచ్చయ్య

మన రాజ్యాంగం చాలా పెద్దది. ఎన్నో దేశాల రాజ్యాంగాల్ని కాచి, వడపోసి తయారు చేసింది కాబట్టి పేజీలు ఎక్కువగానే ఉంటాయి. అధికరణలతో పాటు సవరించబడిన చట్టాలతో పేజీలు పెరుగుతూనే ఉన్నాయి. కాబట్టే అన్ని పేజీలను గుర్తుంచుకోవడం కష్టం. అయినా, చట్టం తెలియకపోవడం క్షమార్హం కాదు అని మన న్యాయస్థానాలు తరచూ అంటూ ఉంటాయి. నేరస్తులకు చట్టం తెలియకపోయినా ఫర్వాలేదుగాని, బాధితులకు మాత్రం చట్టాలు బాగా తెలియాలి. పోలీసులతో పరిచయాలుండాలి. రాజకీయ పలుకుబడి ఉండాలి. కోర్టులో కేసులు వేయగలగాలి. డబ్బుల్ని విరజిమ్మగలగాలి. సంవత్సరాల తరబడి సాక్షాల్ని కాపాడుకుంటూ నిరూపించగలగాలి. లేదంటే చట్టం తెలిసిన ఫాయిదా లేదు. గత అరవై సంవత్సరాలుగా మన రాజ్యాంగం, చట్టాలు మన ప్రజలకు నేర్పిన న్యాయ పాఠాలివి. అయినా నేతి బీరకాయలోని నేతిలాగా వంద మంది నిందితులు తప్పుకున్నా ఫర్వాలేదు గాని, ఒక్క నిర్దోషికి శిక్ష పడకూడదన్న చిలక పలుకుల్ని ప్రవచిస్తుంది మన న్యాయనీతి. దీన్ని విలోమంలో అన్వయించుకుంటే వంద మంది నిందితుల్ని కాపాడడానికి అవసరమైతే ఓ నిర్దోషికి శిక్ష వేయాలనేది అనుభవంలోకి వచ్చిన నేటి న్యాయనీతి. వాకపల్లి గిరిజన మహిళలకు జరిగిన అన్యాయం నుంచి నేటి దాకా జరిగిన, జరుగుతున్న సంఘటనలు దీన్నే సూచిస్తున్నాయి.

గత ఏప్రిల్ 26న రాష్ట్ర హైకోర్టు, వాకపల్లి గిరిజన మహిళలపై జరిగిన అత్యాచారం కేసును కొనసాగించాలని సూచించిన నేపథ్యంలో పోలీసులకు సంకెళ్లు వేసినట్లు అయింది. అయినా హైకోర్టు సూచనపై కూడా తిరిగి అప్పీలు చేయాలని, ఆ విధంగా పోలీసు ప్రతిష్టను, ప్రభుత్వ కపట నీతిని కాపాడాలని పోలీసులు సమాయత్తం కావడం గమనార్హం. వాకపల్లి గిరిజన మహిళలపై అత్యాచారం జరిగి సరిగ్గా ఏప్రిల్ 20, 2012కు ఐదు సంవత్సరాలు. పదకొండు మందిపై, అందునా గిరిజన మహిళలపై జరిగినా నేటికీ ప్రభుత్వానికి చీమ కుట్టినంత బాధ కూడా లేదు. అసలు చీము నెత్తురున్న ప్రభుత్వాలైతే గదా బాధ పడడానికి. కారణం వారో మారుమూల ప్రాంతాల్లో ఉన్న ఆదివాసులు కావడం, నోరులేని వారు కావడం, రాజకీయ పలుకుబడి లేనివారు కావడమే. ఇంకా చెప్పాలంటే ఈ దేశ పౌరులుగా ఓట్లకు తప్ప దేనికీ పనికిరాని అలగాజనం కావడమే.

అన్నల వేటలో (మానవ వేట) ఆరితేరిన పోలీసులకు నీతి బాహ్యమైన చర్యలు చేయడం ఆది నుంచి అలవాటే. మానవీయతను మంటగలపడంలో మన పోలీసులకు మరెవ్వరూ సాటిరారని నిరూపించిన సంఘటనే 2007, ఆగస్ట్ 20న విశాఖ జిల్లా జి. మాడుగుల మండలంలోని వాకపల్లి గిరిజన గూడెం సంఘటన. అన్యాయాన్ని ఓర్పుతో సహించ గలిగే భారతీయ మహిళ, అత్యాచారం జరిగిందని సిగ్గు విడిచి బాహ్య సమాజానికి గొంతెత్తి విన్నవించినా, అంతా అభూత కల్పన అని, అన్నల ప్రోద్బలంతో ఆ గిరిజన మహిళలు మానాన్ని కూడా ఫణంగా పెడుతున్నారని పోలీసుల, ప్రభుత్వ యంత్రాంగం ప్రత్యారోపణ.

అందుకే సంఘటన జరిగిన సరిగ్గా పదకొండు రోజులకు యుపిఎ చైర్‌పర్సన్ సోనియా గాంధీ రాజమండ్రిని, ఏలూరును సందర్శించి తానూ మహిళల పక్షమని ప్రకటించారు. రాజమండ్రిలో ఓ సందర్శకురాలు సోనియాను ముద్దుపెట్టుకున్న ఫొటోలు పత్రికల్లో పతాక శీర్షికన వచ్చాయి. ఇప్పుడైతే ఆమె ఏకంగా ఫోర్బ్స్ పత్రిక గుర్తించిన వంద మంది శక్తివంతమైన తల్లుల్లో ఆరవ స్థానాన్ని పొందింది. అదే శక్తితో ఇప్పుడామె రాహుల్‌ను ఈ దేశానికి మహరాజును చేయాలని కలలు కంటున్నది. అలాంటి మహాతల్లికి వాకపల్లి, భల్లుగూడెం మహిళలు తల్లుల్లాగా కాదుగదా, సాటి మహిళలుగా కూడా కనపడడం లేదు. మహిళలకు రక్షణ లేదనే విషయాన్ని ఎక్కడా కూడా తన ప్రసంగంలో ఆమె ప్రస్తావించలేదు.

అన్ని సంఘటనల్లాగే వాకపల్లి సంఘటనకూ తెల్లవారుతుంది, పొద్దూకుతుంది. ఆదివాసులు ఆచరించే ఇంటి బహిష్కరణ, శుద్ధి కార్యక్రమాలు జరిగాయి. ఉన్నత సంస్కృతి కలిగిన ఆదివాసులు తిరిగి ఆ మహిళల్ని అక్కున చేర్చుకున్నారు. దాదాపు సంఘటన జరిగిన మూడు నెలల పాటు అధికారులకు, పత్రికలకు, రాజకీయ పార్టీలకు, కనిపించిన వారందరికీ తమ గోడుని విన్నవించుకున్నారు. ఆధునిక పరీక్షల పేరున కింగ్ జార్జ్ హాస్పిటల్ అత్యాచారాన్ని నిర్ధారించడంలో వివక్షతనే చూపింది. పక్షం రోజుల తర్వాత పరీక్షలు నిర్వహిస్తే ఫలితాలెలా ఉంటాయో అందరికీ తెలుసు. జరిగిన అన్యాయాన్ని పూసగుచ్చినట్లు గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి వి. నాగిరెడ్డికి, సిఐడి ఎస్‌పి శ్రీనివాస్ రెడ్డిలకు వివరించారు. అత్యాచారం జరిగిన ప్రదేశాల్ని వారు చూపించారు. గిరిజన గూడెం మొత్తం అత్యాచారం జరిగిందని ముక్తకంఠంతో చెప్పింది. జాతీయ ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ వాకపల్లి ఘటనపై అసంతృప్తిని వెలిబుచ్చింది. ఎస్‌పి, కలెక్టర్ల నిర్లక్ష్యాన్ని నాగిరెడ్డి ఘాటుగా విమర్శించారు. అయినా కేసులో కదలిక లేదు. దోషులు పోలీసులు కాబట్టి, వారి పరువు ఈ రాజ్యానికి చాలా అవసరం కాబట్టి, లేకుంటే పోలీసుల మద్దతు రాజ్య పాలకులకు ఉండదు కాబట్టి కేసును నలిపివేసే చర్యలే గత ఐదు సంవత్సరాలుగా జరుగుతున్నాయి. అప్పటికే నాటి పాడేరు ఎంఎల్ఎ రాజారావు ఎస్.ఆర్. శంకరన్‌తో విచారణ చేయించాలన్న విన్నపాన్ని ఎవరూ పట్టించుకోలేకపోయారు.

అత్యాచారం జరిగిన పదిహేను రోజుల తర్వాత పరీక్షలకు నిలబడని రుజువులు, సంఘటనకు నేపథ్యం మావోయిస్టులనే తప్పుడు ప్రచారంతో, అప్పటిదాకా ఈ సంఘటనను నిరసించిన వివిధ రాజకీయ పార్టీలు,

మహిళా సంఘాలు వాకపల్లిని మర్చిపోవడానికే ప్రాధాన్యతనిచ్చాయి. దాదాపుగా ఇప్పుడు వాకపల్లి సంఘటన మన మనోఫలకంపై చెదిరిపోతున్నది. బాధితురాండ్రల్లో పంగి బర్సో (30) పాము కాటుతో, వనతల చిట్టెమ్మ (43) అనారోగ్యంతో గత సంవత్సరం చనిపోయారు. ఆరోపణల్ని ఎదుర్కొంటున్న 21 మంది పోలీసులపై పాడేరు కోర్టులో కేసు నమోదు కాగా, ఎనిమిది మందిపై గల కేసుల్ని హైకోర్టు రద్దు చేయగా, పదమూడు మందిపై కేసును విచారించాలని ఆదేశించింది. వీరిపైకూడా కేసుల్ని ఎత్తివేయించాలని పోలీసు శాఖ తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఈ విధంగా పోలీసులు మచ్చలేని వారుగా చలామణీ కావడం ఇదేమి కొత్తకాకపోయినా, గిరిజనుల విషయంగా జరిగిన సంఘటన, వారి హక్కులకై పోరాడుతున్న సంఘాలకు కూడా పెద్దగా పట్టింపు లేకుండా పోవడం బాధాకరం!

మహిళలపై అత్యాచారాలు జరగడం ఈ దేశానికి కొత్తేమీ కాదు. అందునా, దళిత, గిరిజన మహిళలపై అతి సాధారణమైపోయాయి. గత నాలుగు దశాబ్దాల కాలంలో ఆడవారిపై జరుగుతున్న అత్యాచార కేసులు 792 శాతం పెరగ్గా 2010లో కేవలం 27 శాతం నిందితులకు మాత్రమే శిక్షలు పడ్డాయి. ఈ సంఖ్య గతంలో 41 శాతంగా ఉండేది. ఒకవైపు అత్యాచారాల సంఖ్య 800 శాతానికి పెరిగితే శిక్షలు పడుతున్న సంఖ్య తగ్గిపోతూ వస్తున్నది. దీన్ని బట్టి ఈ కేసులన్నీ పోలీసులు (వీరే రేపిస్టులైతే..), న్యాయస్థానాలు, సమాజంలో పలుకుబడితో గల గూండా రాజకీయాలు కుమ్మక్కైతున్న వైనం వీటి వెనుక కనబడుతున్నది. 1983 ప్రాంతంలో జరిగిన మైనర్ బాలిక మధురా కేసులో (అప్పట్లో బాధితుల పేర్లను బహిర్గతం చేసేవారు) ఇద్దరు పోలీసుల్ని వదిలివేయడం జరిగింది. మాయా త్యాగి, రమీజాబీ కేసుల్లో కూడా ఇదే జరిగింది. సంతాల్ పరగణలో జరిగిన సామూహిక అత్యాచారాల కేసు ఎనభైవ దశకంలో సంచలనం సృష్టించింది.

గత నాలుగు దశాబ్దాలుగా మహిళలపై జరుగుతున్న అత్యాచారాలకు వ్యతిరేకంగా 'కాలి' అనే సంస్థ సభ్యురాలైన ఊర్వశి బుటాలియా స్పందిస్తూ, చివరికి మిలిటరీ, పోలీసు యూనిఫారం కూడా మహిళల్ని రక్షించలేకపోతున్నాయనీ, వారే ఆడవారికి కింకర్లుగా మారుతున్నారని దీనికి కాశ్మీర్, ఈశాన్య రాష్ట్రాలే సాక్ష్యాలని అనడం గమనార్హం. దీనికి మణిపూర్ రాజధాని ఇంఫాల్ విమానాశ్రయం దగ్గరలో నవంబర్ 1, 2000న జరిగిన సంఘటన ఉదహరించవచ్చు. స్థానిక సమస్యలపై నిరసన తెలుపుతున్న ఆ ప్రాంత గ్రామీణులపై సాయుధ బలగాలు విచక్షణా రహితంగా జరిపిన కాల్పుల్లో పది మంది మరణించగా, అనేక మంది గాయపడ్డారు. దీనికి నిరసనగా ఇరవై ఎనిమిది సంవత్సరాల ఓ సామాజిక కార్యకర్త ఇరోం చాను షర్మిల సాయుధ బలగాల ప్రత్యేక చట్టం (ఎఎఫ్ఎస్‌పిఎ)కు వ్యతిరేకంగా నిరవధిక నిరాహార దీక్షను చేపట్టింది. ఈ దీక్షను ఇప్పటికీ హాస్పిటల్‌లో ఆమె కొనసాగిస్తూనే ఉంది. బలవంతంగా ఆమెకు ముక్కునుంచి ద్రవ పదార్థాల్ని ఎక్కిస్తున్నారు. దీంతో సాయుధ బలగాల అకృత్యాలు, హత్యాచారాలు ఒక్కొక్కటీ బయట పడుతున్నాయి. షర్మిల మొదలుపెట్టిన ఉద్యమానికి మణిపూర్‌తో పాటుగా ఢిల్లీ కూడా కదలడం ప్రారంభించింది. ప్రపంచంలోనే షర్మిల దీక్ష అతి సుదీర్ఘకాల దీక్షగా నమోదు అయింది. ఈ సందర్భంలోనే కాశ్మీర్‌లో జరిగిన, జరుగుతున్న షోఫియానా లాంటి అత్యాచారాల ఘటనతో (వదిన మరదళ్లను సాయుధ బలగాలు అత్యాచారం చేసి చంపగా, వదిన గర్భవతి) బెంబేలెత్తిన ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా రాష్ట్రం నుంచి సాయుధ బలగాల్ని తగ్గించాలని కేంద్రంపై ఒత్తిడి ప్రారంభించారు. ఫలితంగా అక్కడ్నుంచి కొన్ని బలగాల్ని చత్తీస్‌గడ్‌కు పంపగా, ఇక్కడ గ్రీన్ హంట్ (పచ్చవనం వేట) పేరుతో ఆదివాసులను అత్యాచారాలు చేస్తూ ఊచకోత ప్రారంభించారు. ఈ బలగాల తరలింపు ఫలితాలే గత జూన్ 29న బీజాపూర్, సుకుమా జిల్లాల సరిహద్దు గ్రామాలైన బాసగూడ, దర్భెగూడా, సిల్గేర్, జాగెర్‌గూడాలలో జరిగిన సామూహిక హత్యాకాండ. ఈ ఘటనలో 19 మంది ఊచకోతకు గురైతే దాదాపు 14 మంది మైనర్లేనని పత్రికల కథనాలు. ఈ విషయంగా ఆ రాష్ట్ర కాంగ్రెస్ నిజనిర్ధారణ కమిటీగా వెళ్లడం, కేంద్ర గిరిజన శాఖ మంత్రి కిశోర్ చంద్రదేవ్ ఈ సంఘటన పట్ల తీవ్ర నిరసనను కేంద్ర ప్రభుత్వానికి తెలపడం తెలిసిందే. ఇక సోనీ సోరి ఉదంతం తెలిసిందే. ఈ సంఘటనలేవి చిలక పలుకులు పలికే చిదంబరానికి కనపడవు. వినపడవు. ఆయనకెప్పుడూ 'వేదాంత' ఘోషనే.

ఇక ఒడిశా పూరి జగన్నాథుని సాక్షిగా జరిగిన రెండు సంఘటనలు మానవత్వానికి మాయని మచ్చగా మిగిలాయి. ఏ మాత్రం విలువలున్నా, కేంద్ర హోం మంత్రి రాజీనామా చేయాల్సిన సంఘటనలవి. ఉజ్వల భవిష్యత్తు గల ఇద్దరమ్మాయిలు రాజకీయ అండదండలు గల గూండాల చేతిలో అత్యాచారానికి గురై చనిపోవడం జరిగింది. ఇరవై సంవత్సరాల వయస్సులో బబినా బెహరా గత జూన్ 21న చనిపోగా, ఈమె స్నేహితురాలు 2008లో అత్యాచార ఘటనను భరించలేక, ఆత్మహత్య చేసుకున్నది. బబినా, పదవ తరగతి చదువుతుండ గానే మంచి గాయనిగా గుర్తింపు పొందింది. ఈటివి కార్యక్రమంలో భువనేశ్వర్ ద్వారా ఆమె ఒడియాలో పాడిన పాటలకు గుర్తింపుతోబాటు అనేక బహుమతుల్ని పొందింది. తండ్రి పూరి జిల్లాలోని అర్జునగూడలో దినసరి కూలి. కూతురి ఎదుగుదలని చూసి ఎన్నో కలలు కన్నాడు. ఎదుగుతున్న ఆ చిన్నారిపై ముగ్గురు స్థానిక గూండాల కన్ను పడింది. దీన్ని గమనించిన బబినా, ఆమె తండ్రి జిల్లా పోలీసులకు విషయాన్ని రాత పూర్వకంగా తెలిపారు. పోలీసుల సహకారం లభించక పోవడంతో బబినా చదువును ఆపించాడు. అయినా బరి తెగించిన దుండగులు జనవరి 13, 2008న బబినాతో పాటుగా ఉన్న ఆమె స్నేహితురాలు ప్రభాతిని మానభంగం చేశారు. ఈ విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేసినా కనీసం కేసును రిజిస్టర్ చేసుకోలేదు. ఈ సంఘటన జరిగిన కొద్దిరోజుల తర్వాత అవమానాన్ని భరించలేక ప్రభాతి ఆత్మహత్య చేసుకుంది. ఒకవైపు స్నేహితురాలి ఆత్మహత్య, మరోవైపు జరిగిన సంఘటన బబినాను వెంటాడాయి. అయినా ధైర్యంగా ఉంటూ దుండగులకు ఎలాగైనా శిక్ష పడేలా చూడాలని దృఢ సంకల్పానికి వచ్చింది. అనేక ఒత్తిళ్లు వచ్చినా లొంగలేదు. దీన్ని జీర్ణించుకోలేని దుండగుల్లో ఒకరైన ప్రశాంత్ నాయక్ నవంబర్ 29, 2011న బబినాను అత్యాచారం చేసి హత్య చేయాలని చూసాడు. దావానంలా వ్యాపించిన వార్తతో దుండగుడు పారిపోగా, అచేతనంగా పడి ఉన్న బబినాను స్థానికంగా ఉన్న పిపిలి హాస్పిటల్‌కు తీసుకెళ్లగా, ఎలాంటి పరీక్షలు నిర్వహించకుండానే పాము కాటుకు గురైందని భావించి యాంటి వినమ్ ఇంజక్షన్ ఇచ్చి, భువనేశ్వర్ హాస్పిటల్‌కు పంపించారు. ఇక్కడ కూడా బబినాకు మరిన్ని యాంటి వినమ్ ఇంజక్షన్స్ ఇచ్చి కటక్‌లోని శ్రీరామచంద్ర బాన్‌జా మెడికల్ కాలేజీ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ కూడా ఎలాంటి పరీక్షలు నిర్వహించకుండానే క్షయ వ్యాధి వార్డుకు తరలించారు. పదిహేడు రోజుల తర్వాత ఆమె బతికే అవకాశాలు లేవని డాక్టర్లు ఇంటికి తీసుకెళ్లమనడంతో, చేసేది లేక భువనేశ్వర్ పరిసర ప్రాంతంలో గల

గటికియా ప్రాంతంలోని వారి బావగారి ఇంటికి బబినా తండ్రి తీసుకెళ్లాడు. తిరిగి జనవరి 8, 2012న మళ్లీ భువనేశ్వర్ హెడ్‌క్వార్టర్స్ హాస్పిటల్‌కు తీసుకువెళ్లినా, ఆమె బతికే అవకాశం లేదని చెప్పి ఎలాంటి సహాయం చేయడానికి ముందుకు రాలేదు నరహంతక డాక్టర్లు.

ఆ స్థితిలోనే బబినా తండ్రి రాష్ట్ర మానవ హక్కుల కమిటీకి విన్నవించడం, హలధార్ సేథి అనే లాయర్ సహాయం చేయడానికై ముందుకు రావడంతో రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం కదలడం మొదలుపెట్టింది. అయినా భువనేశ్వర్ డాక్టర్లు తిరిగి బబినాను కటక్ మెడికల్ కాలేజీ హాస్పిటల్‌కు పంపించారు. కాని రోజు రోజుకూ బబినా పరిస్థితి విషమించింది. పత్రికల్లో వార్త కథనాలు రావడం, మీడియా హెడ్‌క్వార్టర్ హాస్పిటల్‌కు వెళ్లి డాక్టర్ల నిర్లక్ష్యాన్ని బహిర్గతం చేయడంతో అఖిల భారతీయ వైద్య కళాశాల (ఎఐఐఎంఎస్) డాక్టర్ల బృందం, జాతీయ ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ కదలి రావడం జరిగింది. కాని అప్పటికే బబినా పరిస్థితి విషమించింది. జూన్ 21, 2012న ఆ చిన్నారి బంగారు భవిష్యత్తును అనుభవించలేక, రాజ్యం అమానవీయ సంస్కృతిని ఎదిరించలేక లోకాన్నే విడిచి వెళ్లిపోయింది. ఈ మొత్తం సంఘటనతో భయానికి గురైన అర్జునగూడా బబినా కుటుంబాన్ని గ్రామంలోకి రానివ్వలేదు. పత్రికల్లోని కథనాలను చూసిన సోని టివి 'క్రైమ్ పెట్రోల్'లో మూడు రోజులు సీరియల్‌గా చూపించింది. ఈ దేశంలో ప్రభుత్వం అంటూ ఉంటే, ఆ ప్రభుత్వంలో మనుషులంటూ ఉంటే ఈ సంఘటనకు బాధ్యతంటూ వహించాలనుకుంటే స్వయంగా విష నాగులతో కాటు వేయించుకోవాలి. కాని ఇదో భ్రమని అందరికీ తెలిసిందే. ఈ విధంగా ఓ సంఘటన అయిదు సంవత్సరాల పాటు జరిగినా చలించని పోలీసు వ్యవస్థలో, వారి పహారాలో మనం జీవిస్తున్నామంటేనే ఓ భయానక స్వప్నం.

పై సంఘటన ఓ మారుమూల గ్రామానికి సంబంధించినదైతే, మొన్న జూలై 9న జరిగిన గౌహతిలోని సంఘటన రాష్ట్ర రాజధానిలో పట్టపగలే, అందరూ చూస్తుండగా, అందునా ఓ టివి ఛానల్ వీడియో తీయడం జరిగిందంటే ఈ దేశంలో అర్ధరాత్రి కాదుగదా, పట్టపగలే ఒక మహిళ జనారణ్యంలోనే ఎలా నిస్సహాయతకు గురైతోందో తెలుపుతుంది. గౌహతి నగరంలోని క్రిస్టియన్ బస్తీలో గల ఓ బారు ముందే ఓ ఇరవై సంవత్సరాల అమ్మాయి (పేరును కూడా అక్కడ మీడియా బహిర్గతం చేసింది) ని పదకొండు మంది సామూహికంగా బలాత్కరించి అత్యాచారం చేసారంటే, ఈ దేశ పోలీసుల పట్ల, రాజ్యం పట్ల వారికెంత నమ్మకం ఉందో తెలుస్తుంది. ఈ సంఘటనను తరుణ్ గగోయ్ మంత్రివర్గంలోని ఓ మంత్రికున్న టివి ఛానల్ వీడియో తీసి ప్రసారం చేయడంతో సంఘటన పట్ల స్పందించడం కన్నా, తనను పదవి నుంచి తప్పించడానికే ఇదంతా జరిగిందని రాజకీయం చేసుకుంటున్నాడు ఆ ముఖ్యమంత్రి. ఆ వీడియో ద్వారా పోలీసులకు ఆధారాలు లభించాయేమోగానీ, ఓ అమ్మాయిపై జరుగుతున్న అత్యాచారాన్ని, అనుమతి లేకుండా సినిమా రీల్‌గా ప్రసారం చేయడం చర్చనీయాంశంగా మారడంతో, ఆ ఛానల్ ఎడిటర్ రాజీనామా చేశాడు. ఏది ఏమైనా అస్సోం ప్రజల చైతన్యంతో ఆ సంఘటనకు వ్యతిరేకంగా అనూహ్య స్పందన రావడం, స్వచ్ఛంద సంస్థలు, మానవ హక్కుల కమిషన్‌లు కదలడం ప్రారంభమయ్యాయి. వీడియో ఆధారాలతో ఓ నలుగుర్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అస్సోం పబ్లిక్ వర్క్ (ఎపిడబ్ల్యు) అనే స్వచ్ఛంద సంస్థ ఏకంగా ఆరుగురి ప్రధాన నిందితుల ఫొటోలతో గౌహతి నగరంలోని ప్రధాన కూడళ్లలో హోర్డింగులను పెట్టించింది. అందరు డిజిపి ల్లాగానే అస్సోం డిజిపి కూడా ఈ సంఘటన పట్ల స్పందిస్తూ, పోలీసు శాఖ ఎటిఎం లాంటిది కాదని, మిషన్‌లో కార్డు పెట్టగానే నేరస్తుల్ని పట్టుకోవడం జరగదని వ్యాఖ్యానించడంతో నిద్రమేల్కొన్న కేంద్రమంత్రి చిదంబరం డిజిపి వ్యాఖ్యలపై స్పందించడం గమనార్హం. ఈ కేసు ఇంతగా కదలడానికి గల కారణం అత్యాచారానికి గురైన అమ్మాయి రిటైర్డ్ పోలీసు అధికారి కూతురు కావడం. అలా అని ఈ అమ్మాయికి న్యాయం జరగకూడదని కాదు – కాని ఇలాంటి సంఘటనలే దేశ వ్యాప్తంగా రోజూ వందలకొద్దీ జరుగుతున్నాయి. స్పందన ఎలా ఉందో ఒడిశా సంఘటననే తెలియజేస్తున్నది.

స్త్రీని పవిత్రంగా భావించే ఈ పుణ్యభూమిలో అత్యాచారానికి గురైన స్త్రీ, సిగ్గు విడిచి చెప్పుకోలేని పరిస్థితి. అదవా చెప్పుకున్నా, బరితెగించిందని, భవిష్యత్తు లేకుండా చేసుకుందని, కుటుంబ గౌరవం మంటగలిపిందని భావించేవారే అత్యధికం. ఇక చిన్నారుల పై జరుగుతున్న అత్యాచారాలు అచ్చుకెక్కనివే అధికం. అభం, శుభం తెలియని అమ్మాయిల్ని అయినవారే అత్యాచారానికి గురి చేయడం ఈ దేశంలో సర్వసాధారణం. హర్యానాలోని రుబికా గిరిహోత్ర పోలీసు మానవ మృగం రాథోడ్ చేతిలో ఎలా అత్యాచారానికి గురైందో, ఆ తర్వాత ఆమె కుటుంబ సభ్యులు ఎన్ని అవమానాలకు గురయ్యారో గుర్తెరిగిందే. దాదాపు పద్దెనిమిది సంవత్సరాలుగా ఈ కేసు అనేక మలుపులు తిప్పడం తెలిసిందే. ఇక నాలుగు దశాబ్దాల క్రితం ఇరవై ఐదు సంవత్సరాల అరుణా శాన్‌బాగ్ అనే నర్సు ముంబాయి కింగ్ ఎడ్వర్డ్ మెమోరియల్ హాస్పిటల్‌లో శోషన్‌లాల్ భరత్ వాల్మికి అనే వార్డుబాయి చేతిలో నవంబర్ 27, 1973న దారుణంగా అత్యాచారానికి గురవడమే కాకుండా, కుక్కను కట్టే గొలుసుతో గొంతుకు వేసి లాగడంతో మెదడుకు రక్తం, ఆక్సిజన్ అందక, స్పృహ కోల్పోవడంతో నేటికీ ఆమె అదే హాస్పిటల్‌లో జీవచ్ఛవంలా బతుకీడుస్తున్నది. పోలీసులు ఈ సంఘటనను అత్యాచారం నేరం కింద కేసు నమోదు చేయకుండా చెవి రింగులు దొంగతనం చేసాడనే నేరంతో పాటు, హత్యా నేరాన్ని మోపారు. దీంతో కేసు బలహీనమై ఎనిమిది సంవత్సరాల శిక్షతో భరత్ వాల్మికి బయటపడ్డాడు. ఆకాశమంత మానవీయ విలువలున్న ఆ హాస్పిటల్ సిబ్బంది నేటికీ ఆమెకు సపర్యలు చేస్తున్నారు.

ఈ సంఘటనకు చలించిన రచయిత్రి పింకి విరాణి ఆమెకు మరణించే హక్కును ఇవ్వాలని 1999లో ప్రభుత్వాన్ని కోరగా, చనిపోయే హక్కు రాజ్యాంగబద్ధం కాదని ప్రభుత్వం తిరస్కరించింది. తిరిగి 2009లో ఆమెకు సహజ మరణం పొందే హక్కును ప్రసాదించాలని సుప్రీంకోర్టును కోరింది. దీనిపై స్పందించిన సుప్రీంకోర్టు సహజ మరణానికి అనుమతి ఇచ్చే ముందు, హైకోర్టు కమిటీచే అరుణా శాన్‌బేగ్ నిస్సహాయ స్థితిని నివేదించాలని, ఆ తర్వాతనే ఆమెకు సహజ మరణానికి అనుమతి పార్లమెంట్ చట్టం ద్వారా అనుమతి ఇవ్వబడుతుందని గత సంవత్సరం మార్చ్ 7న స్పష్టం చేసింది. ఇప్పటికీ ఈ కేసు ఇలాగే కొనసాగుతున్నది.

చట్టాలను చేయడంలో అతి ఉత్సాహం చూపే మన రాజ్యం, వాటిని ఆచరించడంలో, అందించడంలో ఆది నుంచి వైఫల్యం చెందుతూనే ఉంది. నేటికీ తనకు జరిగిన అన్యాయాన్ని చెప్పుకోలేని స్థితిలో భారతీయ సగటు మహిళ ఉందనేది కాదనలేని సత్యం. ఒక వేళ తెలిపినా ఆ సంఘటన కేసుగా మారడం, కోర్టుల్లో నిలదొక్కుకోవడం, మలుపులు తిరగడం, కింది కోర్టు నుంచి హైకోర్టుల్లోకి వెళ్లడంలో, బాధితురాండ్రు జీవితాన్నే త్యాగం చేయాల్సి వస్తున్నది. ఇంతగా ఓర్చుకునే ఓపిక, ఓర్పు, శక్తి ఎంతమందికి ఉంటుందనేది సమాధానం లేని ప్రశ్ననే. అందుకే

మత మార్పిడులు - ఒక దృక్కోణం

***దళితులను ఊరికీ, గుడికీ, బడికీ అంటరానివారిగా ఉంచే మతాన్ని, సమానత్వం, గౌరవం ఇవ్వని హిందూ మతాన్ని వారు వదిలితే తప్పేమిటని అంటున్నారు* అరుణ్**

తిరుమలను అన్య మతస్తులలో కేవలం వెంకటేశ్వరునిపై విశ్వాసమున్న వారికే పరిమితం చేస్తున్నారనే వార్తలు టెలివిజన్ ద్వారా తెలిసాయి. అంతకు ముందు అక్కడ క్రైస్తవ మత ప్రచారం జరిగిందనీ, అందుకు కారణమైన భార్యాభర్తలిరువురూ శిక్షించబడ్డారని విన్నాం. వారిద్దరూ చిరుద్యోగులు కావడం, నిమ్న కులాలకు చెందిన వారు కావడం యాదృచ్ఛికమేమీ కాదు. పై మత ప్రచారానికి వ్యతిరేకంగా, హిందూ మతోద్ధారకులనబడే ఒక మఠాధిపతి, మరొక హిందూ మతోద్ధారకుడు ముఖ్యమంత్రిని కలిసారని తెలిసింది. మరి ఆయన వీరికేమి హామి ఇచ్చాడో తెలియదుగానీ, ఆ తర్వాత కొన్ని రోజులకే తిరుమలలో 'అన్య మతస్తుల డిక్లరేషన్' లాంటి నిబంధనలు మొదలయ్యాయి.

మరొకవైపు, అగ్రవర్ణ హిందువులు తమను దేవాలయ ప్రవేశానికి అడ్డుకుంటున్నారని, దాన్ని ప్రతిఘటించినందుకు తమపై దాడులు జరిగాయని, కర్నూలు జిల్లాలోని ఒక గ్రామ దళితులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు వార్తలు. ఆ రెండు వర్గాల మధ్య సయోధ్య కుదిర్చి హిందూ మతాన్ని బలోపేతం చేయడానికి ఒక స్వామిజీ కంకణం కట్టుకున్నాడని తెలిసింది. దాని ఫలితమెలా ఉన్నా, రాజీ పడాల్సింది దళితులేననే విషయం కర్నూలు జిల్లాలో గతంలో జరిగిన కొన్ని సంఘటనలు మనకు చెబుతాయి. జిల్లాలోని గూడూరు గ్రామంలోని ఒక దేవాలయంలో పోలీసుల సహాయంతో దళితులు ప్రవేశించారనే అక్కసుతో, ఆ గ్రామ అగ్రవర్ణస్తులు ఆ దేవాలయాన్నీ, దేవుడ్నీ బహిష్కరించారు.

ఈ నేపథ్యంలో 'మత మార్పిడులు', దానిపై సోకాల్డ్ హిందూ మతోద్ధారకులు, పీఠాధిపతులు పడుతున్న ఆందోళనలను పరిశీలించాల్సి ఉంది.

'మతం ఒక మత్తు మందు' అని మార్క్స్ అన్నప్పుడు, అది మానవులకు తాత్కాలిక ఉపశమనం కలిగించే పెయిన్ కిల్లర్ లాంటిదని, మానవుని కష్ట సుఖాలకు భౌతిక కారణాలున్నాయని, వాటికి ఆనాటి వ్యవస్థతో లంకె ఉందని, వ్యవస్థ మార్పు మాత్రమే పీడన, అణచివేత, రకరకాల దోపిడీల నుండి విముక్తి కల్గిస్తుందని మార్క్స్ చెబుతాడు.

జీవితంలో రాజీపడడం, సంఘటనతో రాజీపడడం, రాజీ కుదిర్చే ఓ మిథ్యా వ్యవస్థ భారత సమాజంలో రోజురోజుకూ పెరుగుతున్నది. 'అత్యాచారం' అనే పదం నిషిద్ధ పదంగా మారడంతో, కుటుంబాలే మౌనంగా ఉండి పోతున్నాయి. పోరాటం చేయాలంటే జీవిత కాలమే అవుతుంది. అయినా న్యాయం జరగుతుందని గ్యారంటీ లేదు. వీటన్నింటిని మించి రాజకీయ ఒత్తిడిని తట్టుకోవడం ఎవరి తరం కాదు. ఇక డాక్టర్లు, పోలీసులు సరేసరి! న్యాయం నెగ్గకుండా, రాజ్యం పరువు పోకుండా వీరు ఎల్లవేళలా జాగ్రత్త పడుతూ ఉంటారు.

చిన్నారుల అత్యాచారాల సంఘటనలకు వ్యతిరేకంగా చెన్నై కేంద్రంగా పని చేస్తున్న 'తులీర్' (టియుఎల్ఐఆర్) సంస్థ నిర్వాహకురాలు విద్యారెడ్డి ఈ సందర్భంగా స్పందిస్తూ, ఈ దేశంలోని డాక్టర్లకు అత్యాచారం గురైనవారిని ఎలా అక్కున చేర్చుకొని పరీక్షించాలో తెలియదని, అసహనంతో, సంఘటనలకు బాధితులే బాధ్యులన్న దృక్పథంతో వ్యవహరిస్తారని, ఇక పోలీసులైతే కేసు నమోదు చేసుకోవడాన్నే వ్యతిరేకిస్తూ, బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తారని పేర్కొనడం గమనార్హం. అత్యాచార సంఘటనల్ని నిరూపించడానికి, బ్రిటిష్ దేశంలోని రక్షణ పద్ధతులు మన దేశంలో అమలు చేయాలని ఆమె ఈ సందర్భంగా ప్రస్తావించింది. లండన్ లాంటి మహా నగరాల్లో 'స్వర్గం'గా పిలవబడే ఈ కేంద్రాలు (సెక్సువల్ అసాల్ట్ రిఫెరల్ సెంటర్స్ - ఎస్ఎఆర్సి) అత్యాచారానికి గురైన బాధితులకు ఇరవై నాలుగు గంటలు సేవలందిస్తాయి. ఎలాంటి భేషజాలు లేకుండా నిపుణులైన డాక్టర్లు, ఫొరెన్సిక్ నైపుణ్యంతో రెండు గంటల పాటు పరీక్షలు నిర్వహించి, అత్యాచారం జరిగిందీ, జరగలేనిదీ నిర్ధారించి, నివేదికల్ని ఏడు సంవత్సరాల పాటు ఆధారాలతో భద్రపర్చడం చేస్తారు. దీంతో బాధితులు ఎవరి సహాయం లేకుండానే ఈ కేంద్రాలను ఆశ్రయించి న్యాయాన్ని పొందే వ్యవస్థ ఇంగ్లండ్‌లో కొనసాగుతున్నది. పాశ్చాత్య పోకడల్ని అనుకరించే మనం, ఇలాంటి ఆరోగ్యకరమైన విధానాల్ని అమలు చేయడంలో ఎప్పుడూ వెనకంజల్లోనే ఉంటాం. ఎందుకంటే, ఈ సంఘటనల్ని సామాజిక కోణంతో కాకుండా రాజకీయ కోణంతోనే చూసే అలవాటు పడిన రాజ్య వ్యవస్థ మనది.

పశ్చిమ బెంగాల్‌లో జరిగిన రెండు సంఘటనలే దీనికి చక్కని ఉదాహరణలు. మహిళలు రాజ్యాధికారం చేబడితే మహిళలకు దక్కేది ఏమీలేదని తెలియజేసే సంఘటనలివి. కట్వా జిల్లా బుర్ద్వాన్‌లో ఓ మహిళపై జరిగిన సామూహిక అత్యాచార సంఘటన, కొలకత్తాలోని పార్క్ స్ట్రీట్‌లో ఓ ఆంగ్లో ఇండియన్‌పై జరిగిన అత్యాచారం మార్క్సిస్టుల పనే అని, తనను గద్దె దింపడానికే ఇలాంటి ఆరోపణలు చేస్తూ, సంఘటనలకు పాల్పడుతున్నారని మమత బెనర్జీ వాపోవడం గమనార్హం. మాయావతి హయాంలోనూ నోయిడా ప్రాంతంలో జరిగిన సంఘటనలు కూడా ఇలాంటి ఆరోపణల్నే ఎదుర్కొన్నాయి.

ఇలాంటి ఘటనలతో ప్రవర్ధమానంగా ఎదుగుతున్న భారత్‌కు వాకపల్లి సంఘటన పెద్ద ఆశ్చర్యం కాకపోవచ్చు. అయినా మన గొంతును మాత్రం విప్పుదాం. ఈ అన్యాయాల్ని అరికట్టే సమాజం నిర్మాణంలో భాగస్వామ్యం కావడానికి మనవంతు ప్రయత్నం చేద్దాం.

(రచయిత ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు) వీ

మనది కుల – వర్గ వ్యవస్థ. నిచ్చెన మెట్ల కుల వ్యవస్థ. అయితే ఇక్కడ కులానికి – వర్గానికి వెంట్రుక వాసి భేదం కూడా లేదు. నిమ్న కులాలకు చెందిన వాళ్లే ఎక్కువగా పీడిత వర్గాల వాళ్లవారు. కొందరిని మినహాయిస్తే, పీడకులు అగ్రకులాలకు చెందిన వారే. అలాంటి సమాజంలో ఒకే మతానికి చెందినా, వారి మధ్య సమభావం, స్నేహం ఉండే అవకాశం లేదు. సామాజికంగా, సాంస్కృతికంగా ఇక సరే. ఆర్థికపరంగా అధికులమన్నవారు చారిత్రకంగా నిర్లక్ష్యం చేయబడి, వెనుకకు నెట్టబడిన వారిని నీచంగా చూడడం మనం చూస్తున్నాం.

పట్టణాలలో, నగరాలలో, విద్యాధికుల్లో కూడా పై ఆధిపత్య ధోరణి కనపడుతూనే ఉంది. తాము పుట్టి పెరిగిన వాతావరణం, వ్యక్తులకు తెలియకుండానే వారిలో నిమ్నతాభావాన్నో, ఆధిపత్య ధోరణులనో కలుగచేస్తుంది కూడా. ఆ స్వభావం అభ్యుదయ భావాలు గల వారిలో కూడా ఎప్పుడైనా మాటల్లో బయటపడే అవకాశం ఉంది. ఆ స్వభావాన్ని పోగొట్టుకోవడానికి, ఆయా వ్యక్తులు నిత్యమూ తమను తాము ప్రశ్నించుకోవాలి, సంస్కరించుకోవాలి. అదొక నిరంతర అంతర్గత పోరాటం. అలాంటి వారితో సమస్యలేదు గాని, తమ ఆధిపత్య ధోరణులను, పశు ప్రవృత్తిని సహిస్తూ, నిమ్న కులాలవారు తమ వెంటనే అనుచరులుగా, బానిసలుగా ఉండాలని కోరే వారితోనే మనం పోరాడాల్సి ఉంది. మన సమాజంలో వారే ఎక్కువ.

'అమ్మ పెట్టదు, అడుక్కోనివ్వదు' అనే నానుడి, తల్లిని కించపరిచేదిగా ఉన్నా, విశాల అర్థంలో అది అగ్రకులాల వారికి సరిపోతుంది. నిమ్న కులాల వారిని, మరీ ముఖ్యంగా దళితుల్ని దగ్గరకు రానివ్వరు, సరికదా, తోటి మనుషులుగా కూడా చూడరు. అలాంటప్పుడు, ఆ దళితులు తమకు సామాజికంగా గౌరవం లభించే, ఒక్కొక్కమారు ఆర్థికంగానూ లబ్ధి లభించే ఇతర మతాల్లోకి మారితే, ఈ అగ్రకులాల వాళ్లు ఎందుకు గగ్గోలు పెడుతున్నారు? హిందూ మతానికి ద్రోహం జరుగుతోందని ఎందుకు ఆందోళన చెందాలి? ఇది ఏ హేతువుకూ అందని విషయం. మన్నించండి, మతంలో హేతువును వెతకడం మూర్ఖత్వమే అవుతుంది.

దళితుల పట్ల చూపే వివక్ష కూడా, వారి ఆర్థిక స్తోమత బట్టి ఉంటుంది. ఒక పేద దళితుడు ఇంటికి వస్తే బయట నుంచో పెట్టేవాళ్లే, దళిత కులానికి చెందిన ఒక కలెక్టరో, మంత్రో ఇంటికి వస్తే సాదరంగా ఆదరిస్తారు. (మనసులో వీన్ని గౌరవంగా చూడాల్సి వచ్చిందని ఏడుస్తారనుకోండి). ఇక్కడే అగ్రవర్ణాల వారి ద్వంద్వ స్వభావం బయటపడుతుంది. మన దేశ చరిత్ర క్రమంలో కొన్ని దశాబ్దాల క్రితం, ఇప్పుడు అగ్రవర్ణాలుగా చెప్పబడుతున్న రెడ్డి, కమ్మ, వెలమ, బలిజ, సాలె కులాలు కూడా బ్రాహ్మణ కులానికి అంటరానివే. ఇప్పటికీ, ఆయా కులాల మధ్య 'కంచం – మంచం' పొత్తుల్లేవు. ప్రేమ వివాహాలేమైనా జరిగినా సామాజికంగా, ఆర్థికంగా ఒకే స్థాయి వారి మధ్య జరగడం గమనార్హం. అంటే, ఈ కులాంతర వివాహాల విషయంలో కూడా, సామాజికహోదా, సంపద పరిగణనలోకి వస్తాయి. సామాన్య దళితుడు క్రైస్తవం స్వీకరిస్తే ఆందోళన చేసి, దాడులు చేసే హిందూ మతోద్ధారకులు, ఏ పెద్ద రెడ్డో, కమ్మనో క్రైస్తవం స్వీకరిస్తే అభ్యంతరం తెల్పరు. ఆ మతంలో కూడా 'కుల విషవృక్షం' తన శాఖలను విస్తరింప చేసుకుంటుంది. రాజశేఖర రెడ్డి లాంటివాళ్లు, రెడ్లకు రెడ్డి, క్రిస్టియన్లకు క్రిస్టియన్ కావడం గమనార్హం. అయినా ఆయన కుల, మతాల కతీతంగా సంపన్నులకంతా ఆత్మీయుడే. అలాంటి వారిది 'సంపన్నుల కులం', 'సంపన్నుల మతం'.

'హిందువు'లుగా తాము పొందని ఆదరణ, ఆత్మగౌరవం, క్రైస్తవునిగా పొందుతామని భావించే హక్కు దళితులకే కాదు అందరికీ ఉంది. ఎవరైనా, తాము పుట్టిన మతాన్నొదలి, ఇతర మతం స్వీకరించే హక్కు ఉంది. దాన్ని కాదనే హక్కు మన బూర్జువా రాజ్యాంగంలోనే లేదు. దేశంలోని ఏ వ్యక్తి అయినా, తనకిష్టమొచ్చిన ఆచార, వ్యవహారాలను ఇతరులను ఇబ్బంది పెట్టనంత వరకు పాటించే స్వేచ్ఛ ఉంది. అదే విధంగా అతని ఆహారపుటలవాట్లను, మతాచారాలను మనం ప్రశ్నించలేం.

ఒక దళితున్ని తోటి హిందువుగా అగ్రవర్ణ హిందువులు భావిస్తున్నట్టయితే, అతని పట్ల వారు వ్యవహరించే తీరు, తెన్నులూ పరిశీలించాలి. దళితుల మత మార్పిడులకు కారణం కేవలం ఆర్థికమైనవే కావు. ఒకవేళ ఆర్థిక కారణాలు ఉన్నా తప్పేమీ లేదు. మరొకర్ని దోచి, మోసం చేసి, దేశాన్నే తాకట్టు పెట్టి సంపన్నులు కావాలని వారేమీ అనుకోవడం లేదు. తాము మారబోయే మతంలో సామాజికంగా, ఆర్థికంగా ఎదిగే అవకాశాలున్నాయని వారు భావించడంలో తప్పులేదు. కాని, మతాంతీకరణకు ప్రధాన కారణం హిందూ మతంలోని 'కుల జాఢ్యం' అని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. మతాంతీకరణ చెందుతున్న వారిలో ఎక్కువగా దళితులు ఉండడం గమనిస్తే, మనకు పై విషయం స్పష్టమవుతుంది. ఏ శర్మో, శాస్త్రో, రెడ్డినో ఎందుకు మతాంతీకరణ చెందడం లేదు. అందుకు కారణం, హిందూ మతంలో వారి కులాలకున్న ప్రాధాన్యత. 'కూటికి పేదనే గాని, కులానికి పేదను కాదనే' అహంభావం.

ఒక సాధారణ దళితున్ని తనలో ఇముడ్చుకునేందుకు, హిందూ మతం, పీఠాధిపతులు ఏం చేస్తున్నారు. అడపా, దడపా 'దళిత గోవిందం' అంటూ, ఉత్సవ విగ్రహాలను దళిత వాడల్లోకి తీసుకుపోవడం (ఆ తర్వాత ఆ విగ్రహాలకు ప్రాయశ్చిత్తం పేరిట, గోమూత్రం, పాలతో కడగడం). దళితులు తమ దైనందిన జీవితాల్లో అగ్రవర్ణాల చేత పొందే మానసిక హింస మాటేమిటి? అసలు, హిందూ మతం అంత ఉన్నతమైందైతే ఎందుకు ఇతర మతస్తులను ఆకర్షించలేదు. వివేకానందుడు లాంటి వాళ్లు, దేశ, విదేశాల్లో ప్రచారం చేసినా, ఎందుకు హిందూ మతం వ్యాప్తి చెందలేదు. అదే బౌద్ధం ఎందుకు వ్యాప్తి చెందింది? ఏనాడైనా హిందూ మతవాదులు ఈ ప్రశ్నలు వేసుకున్నారా? ఆ ప్రశ్నలకంతా ఒకే ఒక జవాబు, హిందూ మతంలోని కుల వ్యవస్థ, అణచివేతలే. పై వాటిని తొలగించకుంటే, మనిషిని మనిషిగా చూడగలిగే కనీస మానవత్వం లేని హిందూ మతంలో దళితులే కాదూ, పీడిత కులాలు ఎందుకు ఉండాలి?

అంతమాత్రాన క్రైస్తవంగా సర్వ సమానత్వం ఉందనుకోవడం పొరపాటు. అక్కడ కుల వ్యత్యాసాలు ఉన్నాయి. క్రైస్తవం పుచ్చుకున్న రెడ్డి రెడ్డే, బాపనోడు బాపనోడే. ఏ మతంలోనైనా డబ్బున్న వానిదే అధికారం, ఆధిపత్యం. ఇక్కడే వర్గ ప్రాధాన్యత కనబడుతుంది. దాన్ని గుర్తించి కుల రహిత – వర్గ రహిత సమాజంకై అందరం పోరాడాలి.

(రచయిత ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు) వీ

రెండు నాల్కల రాజ్యం

క్రిస్టియన్, ముస్లిం దళితుల రిజర్వేషన్‌ల విషయంలోనూ, ముస్లిం మైనారిటీల రిజర్వేషన్‌ల విషయంలోనూ పాలక పార్టీల అవకాశవాద రాజకీయాలను వివరిస్తున్నారు **ఎం. అప్పలాచారి**

ముస్లింలలోని కొన్ని వర్గాలకు ఉన్నత విద్యలో రిజర్వేషన్‌ల విషయంలో మళ్లీ చుక్కెదురైంది. ఒబిసి కోటాలోనే 4.5 శాతం ఉపకోటా ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుని 28 మే 2012న హైకోర్టు కొట్టివేసింది. రాష్ట్ర ఉప ఎన్నికలపై కన్నువేసిన కాంగ్రెస్ ప్రభుత్వం హడావుడిగా అప్పీలుకి వెళ్లినా, హైకోర్టు ఉత్తర్వుపై 'స్టే' ఇవ్వడానికి సుప్రీం కోర్టు నిరాకరించింది. తగిన ఆధారాలతో డాక్యుమెంట్లు కోర్టుకి సమర్పించలేదని ఆక్షేపించింది. అంతకు ముందు ఉత్తర్‌ప్రదేశ్, పంజాబ్ మొదలగు రాష్ట్రాలలో (ఫిబ్రవరి, మార్చ్ 2012) ఎన్నికల సందర్భంగా కేంద్రం కూడా ఇదే సమస్యపై ఇలాంటి ఎదురుదెబ్బలే తిన్నది. ఈ సమస్యలోని న్యాయన్యాయాలు, మంచి చెడూ చర్చిస్తున్నారు.. ఈ విస్తృత చర్చలోకి వెళ్లకుండా, కొన్ని రాజకీయ, సామాజిక, చారిత్రక వాస్తవాలను పేర్కొనడం, కొన్ని ప్రశ్నలు లేవనెత్తడం ఈ వ్యాసం పరిమిత లక్ష్యం.

నిజానికి దేశంలోని మైనారిటీలకు రిజర్వేషన్‌లు ఇవ్వాలా వద్దా అన్న చర్చ అరవై ఏళ్ల కిందే మొదలైంది. ఇంకా చెప్పాలంటే 'గవర్నమెంట్ ఆఫ్ ఇండియా యాక్టు 1935'తోనే మొదలైంది. 1935 చట్టంలోనే అంటరాని వారిని 'షెడ్యూల్డ్ కులాలు'గా పేర్కొనడం మొదలుపెట్టారు. కాని ఆ మరుసటి ఏడాదే 'ఇండియన్ క్రిస్టియన్‌లు' ఎస్‌సిలు కాజాలరు అని ఉత్తర్వులు జారీ చేసింది. కుల మతాలను, రిజర్వేషన్‌లను 'విభజించి పాలించు' వలస విధానంలో భాగంగా పాలకులు ఉపయోగించిన విషయం నిర్వివాదాంశం. అదే రాజకీయాన్ని 1947 తర్వాత కూడా పాలకవర్గాలు అనుసరిస్తున్నాయి. ఆయా వర్గాల ప్రజల సమస్యలను, కోర్కెలను సమగ్రంగా, సమదృష్టితో, శాశ్వతంగా ఎలా పరిష్కరించాలి అని కాక, ప్రజలని చీల్చి, వాటిని ఎలా వాడుకోవాలీ అన్నదే పాలకవర్గాల లక్ష్యం. వలస పాలకులను మించిన నైపుణ్యంతో నేటి పాలకులు వ్యవహరిస్తున్నారు. మేకియవిల్లి, చాణక్య నీతులు రెండింటినీ పుణికి పుచ్చుకున్న పాలకులు వీరు.

1935 చట్టానికి నకలుగానే 1950 రాజ్యాంగం వచ్చిందని పరిశీలకులు, నిపుణులు చెప్తున్నారు. ఏయే కులాలను ఎస్‌సి జాబితాలో చేర్చవచ్చును, లేదా తొలగించవచ్చును, పార్లమెంట్‌కు ఈ విషయంలో గల అధికారాలు వగైరా రాజ్యాంగ నిబంధన 341లో చర్చించారు. మత ప్రసక్తి లేకుండా అంటరాని వారందరికీ ఈ గుర్తింపు ఇవ్వాలన్న భావన ఆనాడే చర్చకు వచ్చింది. 341వ నిబంధనలో దానికి వీలు కల్పించినట్టే ఉంటుంది. కాని దాన్ని కాదనే రీతిలో త్వరలోనే సవరణ ఉత్తర్వులు వచ్చాయి. ఎందుకంటే 1935–36లో లాగే హిందువులు కాక ఇతర మతాల వారిని మినహాయించాలని ఒత్తిడి వచ్చింది. దానితో 1950 ఆగస్ట్‌లోనే రాష్ట్రపతి ఉత్తర్వు ఒకటి వెలువడింది. 'హిందూ మతం' కాక వేరే మతానుయా యులను ఎస్‌సిలుగా పరిగణించజాలరు అని అందులో స్పష్టం చేశారు. (ఆర్టికల్ 341, పేరా 3) అంటరానివారైన దళిత క్రిస్టియన్‌లను ఇలా మినహాయించడం న్యాయం కాదని చెప్పి, ఆనాడే ఆయా ప్రతినిధులు వారిని కూడా చేర్చాలని మొరపెట్టుకున్నారు. ఆ విన్నపాన్ని పరిశీలిస్తామని రెండు లేఖల ద్వారా ఆనాటి (7 నవంబర్ 1950) ప్రధాని హామీలు ఇచ్చారు. మరో ఏడాది తర్వాత మొదటి సాధారణ ఎన్నికలు జరగబోతున్న సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఈ వాగ్దానం చేశారు. నేటికీ ఆ వాగ్దానాలు అలాగే ఉన్నాయి!

మన దేశంలో దళితుల బాధను, అంటరానితనాన్ని లోతుగా అధ్యయనం చేసిన, అనుభవించిన అంబేద్కర్ రాజ్యాంగ రూపకర్తలలో ముఖ్యులు. 1947 నుంచి 1951 చివరి వరకూ కేంద్ర న్యాయశాఖా మంత్రి కూడా ఆయనే. ఈ సమస్యపై ఆయన వైఖరీ, కృషి ఏమిటి? చూడాలి. అదేలా ఉన్నా ఆయన బాధితులకు ఆచరణలో ఏమీ చేయలేక పోయారన్నది చారిత్రక వాస్తవం. పై పేరాయే దానికి నిదర్శనం.

క్రిస్టియన్‌లను చేర్చలేదు కానీ, 1956లో సిక్కు దళితులను ఎస్‌సిలుగా గుర్తిస్తూ సవరణ చేశారు. అంబేద్కర్ చనిపోవడానికి కొద్ది ముందు బౌద్ధమతం స్వీకరించారు. ఆయనతోపాటు మహారాష్ట్రలో లక్షలాది మంది దళితులూ ఆ పని చేశారు. కాని బౌద్ధులకు ఆ గుర్తింపు ఆనాడు ఇవ్వలేదు. ఇందులో ఆయన పాత్ర, వైఖరి, కృషి ఏమిటి? నలభై ఏళ్ల తర్వాత 1990లో బౌద్ధ దళితులకు ఈ గుర్తింపునిస్తూ మరొక సవరణ చేశారు.

సిక్కు, బౌద్ధమతాలు హిందూయేతర మతాలు కావా? వారికిచ్చిన గుర్తింపు క్రిస్టియన్, ముస్లిం దళితులకు ఇవ్వకపోవడం ఏమిటి? ఇది మతపరమైన వివక్ష, రాజ్యాంగ విరుద్ధం కాదా? సిక్కు, బౌద్ధమతాలు హిందువులకు 'దగ్గరి' మతాలని భావించి పక్షపాతం చూపించారని భావించకూడదా? క్రైస్తవ, ముస్లిం దళితుల పట్ల ఇది వివక్ష కాదా? భారతరాజ్యం 'హిందూ' పక్షపాతిగా ఉంటూ, సెక్యులరిజం అని చెప్పుకుంటున్నదని ఎందుకనుకోకూడదు? ఇది కుహనా సెక్యులరిజం కాదామరి?

దళితులందరి ప్రయోజనాల కోసం నిలుస్తాం – అని చెప్పి దళిత సంఘాల వారు, అంబేద్కర్ వారసులు కూడా ఆ వివక్షకు వ్యతిరేకంగా పోరాడలేదు. నిజానికి వారిలో కొందరు మితవాద, మతవాద పార్టీల్లో (బిజెపి, శివసేన) చేరి, ఈ వివక్షను బలపరుస్తున్నారు. మరికొందరు అలా చేయకపోయినా, రిజర్వేషన్‌లలో వాటా తగ్గిపోతున్నదని లెక్కలు వేసుకొని, సూత్రబద్ధ వైఖరిని తీసుకోకుండా ఉండి పోయారు. అంతేకాదు, క్రిస్టియన్‌లు, ముస్లింలను చేర్చడానికి వీల్లేదు అని కొన్ని దళిత, అంబేద్కర్ వాద బహుజన సంఘాలు, శక్తులు బాహాటంగా వాదిస్తున్నాయి. మాయావతి వంటివారు 'చేర్చాలి' అని మాటవరసకు చెప్పినా, దానికై గట్టి కృషి ఏమీ చెయ్యలేదు. రిజర్వేషన్‌ల శాతాన్ని పెంచి, వారిని చేర్చాలని ఆమె చెప్పారు. అదీ దళితుల పట్ల చిత్తశుద్ధితోనని భావించడానికి వీల్లేదు. ఎందుకంటే ఆమె అగ్రకులమైన జాట్లను కూడా ఒబిసిలుగా, అగ్రవర్ణాల పేదలని ఇబిసిగా గుర్తించాలని కాంగ్రెస్ మార్క్ ఎత్తుగడలని అనుసరించారు. 'బహుజన' పార్టీ 'సర్వజన' పార్టీగా ఫిరాయించినా,

బ్రాహ్మణ – బనియాలను 'చెప్పుతో నాల్గు దెబ్బలు' కొట్టాలన్న నినాదం ఇచ్చిన ఆ పార్టీ ఆయా అగ్రకులాల చెప్పులు మోసినా ఈసారి ఉత్తరప్రదేశ్ ఎన్నికల్లో ఓట్లు, సీట్లు కూడా కోల్పోయి ఓడిపోయింది. మైనారిటీలకు రిజర్వేషన్‌లు అంటూ హడావిడి చేసిన కాంగ్రెస్ 12 శాతం ఓట్లతో నాల్గో స్థానంలోనే ఉండిపోయింది. కాగా దాన్ని ప్రతిఘటించి, హిందువులను కాపాడుతాం అన్న బిజెపి మూడోస్థానానికి (15 శాతం ఓట్లు) పరిమితమైంది. ఇలా రిజర్వేషన్స్ పేరిట ఎన్ని ఆటలాడినా, ఉత్తరప్రదేశ్ ఎన్నికల్లో ఈ పార్టీలేవీ గట్టెక్కలేకపోయాయి. మన రాష్ట్ర తాజా ఉప ఎన్నికలలో – మైనారిటీలకు రిజర్వేషన్‌ల విషయంలో సుప్రీంకోర్టుకి వెళ్లినా – ఇక్కడి కాంగ్రెస్ కూడా చిత్తుగా ఓడిపోయింది.

క్రిస్టియన్‌లు, ముస్లిం మైనారిటీల విషయంలో, ఆ మతాల్లోని దళితుల విషయంలో భారత రాజ్యం, రాజ్యాంగం, అధికార పార్టీలు అనుసరిస్తున్న వివక్ష గురించి చూశాం. అందులో భాగంగానే కోర్టులు కూడా అలాగే వ్యవహరిస్తున్నాయి.

'మతం ఆధారంగా వివక్షత కూడదు' అని రాజ్యాంగం (ఆర్టికల్ 15) చెప్తున్నా, దళిత క్రిస్టియన్‌లకు, అది అక్కరకు రాలేదు. వారికి అనుకూలంగా ఆచరణలో కోర్టులు ఒరగబెట్టిందేమీ లేదు. వారికి ఆ సౌకర్యాలు దక్కకుండా దశాబ్దాలు ఆలస్యంచేస్తూ అన్యాయం చేస్తున్నాయి.

కులం, అంటరానితనం ఎంత గర్హనీయమైన అనాచారాలుగా ఉన్నాయో ప్రస్తావించిన సుప్రీంకోర్టు ఒక తీర్పులో – మతం మారినంత మాత్రాన అది పోవడం లేదని అంగీకరించింది. (ఎఐఆర్ 1984 ఎస్ 411) కాని పైన పేర్కొన్న వివక్ష అలానే కొనసాగింది. ఒకవైపు సిక్కు, బౌద్ధ దళితులను ఎస్‌సిలుగా గుర్తిస్తూనే, క్రిస్టియన్, ముస్లిం దళితుల పట్ల మత వివక్షకు కారణం అయిన 1950 రాష్ట్రపతి ఉత్తర్వులను రాజ్యాంగ విరుద్ధమైనవిగా కొట్టివేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో 2004 నుంచి అనేక రిట్ పిటీషన్‌లు దాఖలైనాయి. (180/2004, 625/2005, 94/2005) క్రిస్టియన్ పక్షాన; 47/2006 ముస్లింల పక్షాన) ఎనిమిది ఏళ్లు దొర్లిపోయాయి. డజను సార్లయినా కోర్టులో వాదనలు సాగాయి. కాని కేసు ముగియలేదు.

పైస్థాయి జడ్జీలుగా దళితులను నియమించాలని ఒక డిమాండ్ ఉన్నది. మాయావతి, ఇతర రాజకీయ శక్తులు, దళిత బహుజన సంఘాల వారు ఈ మధ్య మళ్లీ మళ్లీ లేవనెత్తారు కూడా. ఈ మధ్యకాలంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా దళితుడైన కెజి బాలక్రిష్ణన్ నియమితులయ్యారు. ఆయన నేతృత్వంలోని బెంచి ముందుకే ఈ వ్యవహారం వచ్చింది కూడా. మధ్యలో దళిత, ముస్లిం రాష్ట్రపతులు కూడా వచ్చిపోయారు. చాలా బలం, పలుకుబడిగల దళిత ముఖ్యమంత్రులూ పెద్ద పెద్ద రాష్ట్రాల్లో వచ్చారు, పోయారు. కానీ ఈ వివక్షత అంతం కాలేదు. దరిదాపుల్లో కూడా అంతమయ్యేట్టు లేదు.

నిజానికి కోర్టు, ప్రభుత్వాలూ కూడా ఈ వివక్షను అంతం చేసే దిశలో ఉన్నట్టు కూడా కనపడదు. 1950 ఉత్తర్వు క్రిస్టియన్‌ల పట్ల వివక్షతో ఉంది – అన్న వాదనను సుప్రీంకోర్టు ఒక కేసులో తోసిపుచ్చింది. (1985–సూసాయ్ వెర్సస్ యూనియన్ ఆఫ్ ఇండియా) వివక్ష ఉంది అనడానికి – దళిత క్రిస్టియన్‌లు హిందూ దళితుల్లాగే బాధ పడుతున్నారని రుజువు చేయాల్సి ఉంటుంది అని తీర్పులో చెప్పారు. మతం మారినా కులం కొనసాగుతున్నదంటే చాలదు. వివక్ష – అణచివేత తీవ్రతలు కూడా నిరూపించాలని కూడా అన్నారు. కాని ఆ కట్టెదుట వాస్తవాన్ని కోర్టులో నిర్ధారించడానికి గట్టి ప్రయత్నమేదీ జరగలేదు.

నిజానికి మైనారిటీ మతాల్లో కూడా కులవివక్ష కొనసాగుతున్నదని అనేక కమిషన్‌లు నిర్ధారించినా, కోర్టులు సానుకూలంగా స్పందించలేదు. కేంద్రం నియమించిన మొదటి బిసి కమిషన్ 1955 మార్చిలో నివేదికనిచ్చింది. చర్చిలో కల్పికూర్చోవడం, శ్మశానం, పెళ్లి తదితరాల్లో దళిత క్రిస్టియన్‌లు వివక్షకు గురవుతున్నారని అందులో పేర్కొంది. ఇతర ఎస్‌సిలలాగే మతం మార్చుకొన్న దళితులు కూడా వివక్షకు గురవుతున్నారని మా పర్యటనల్లో గమనించాం. వారికీ ఎస్‌సిలకిచ్చే సౌకర్యాలన్నీ కల్పించాలి – అని ఎలియ పెరుమాళ్ కమిషన్ (1969) పేర్కొంది (పేరా 32లో). బౌద్ధం, క్రైస్తవం మొదలగు మతాల్లోకి మారిన దళితుల సాంఘిక హోదాలో మార్పు లేనందున, వారిని ఎస్‌సిలుగా పరిగణించాలని మండల్ కమిషన్ (1980 డిసెంబర్) సూచించింది. అది అమలయ్యే లోపు ఒబిసిలుగా చేర్చాలన్నది (అనేక రాష్ట్రాల్లో ఇది అమలులో ఉన్నది). 1980లోనే మైనారిటీ కమిషన్‌ను మూడవ వార్షిక రిపోర్టులో కూడా మతమార్పిడి జరిగినా క్రిస్టియన్, ముస్లిం, బౌద్ధ దళితులూ వివక్షను, ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, అందువల్ల మత మార్పిడికి ముందు వారికి లభించిన రాయితీలు ఇవ్వవచ్చునని సూచించింది. ఆ తర్వాతి కాలంలో (మహారాష్ట్ర ఎన్నికల కోసం) దళిత బౌద్ధులకు ఎస్‌సి గుర్తింపు (1990) ఇచ్చినా, క్రిస్టియన్, ముస్లిం దళితులను ఒబిసిలుగా మాత్రమే గుర్తించారు (1993లో). వారికి 27 శాతం బిసి రిజర్వేషన్‌ల వాటా కల్పిస్తూ కొన్ని రాష్ట్రాలలో నిర్ణయించారు.

పివి ప్రధానిగా ఉన్న చిట్టచివరి రోజుల్లో, తర్వాతి ఎన్నికలకు సన్నాహంగా, దళిత క్రిస్టియన్‌ల గురించి మాట్లాడారు. 1996 ఫిబ్రవరిలో 103 మంది బిషప్పులు ఆయనకొక వినతి పత్రం ఇచ్చారు. ఎస్.సిలుగా గుర్తిస్తూ వెంటనే ఆర్డినెన్సు జారీ చేయాలని కోరారు. (తమ మతంలో కుల వివక్ష ఉందని ఆ విధంగా వాస్తవాన్ని అంగీకరించారు). 1996 మార్చ్ 7న కేంద్రమంత్రి వర్గం ఆ ప్రతిపాదనను అంగీకరించి మార్చ్ 12న పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టాలని కూడా నిర్ణయించింది. ఆ పని పూర్తికాకుండానే పివి హయాం ముగిసిపోయింది. నేటికీ అంతే సంగతి. (ఇలాంటి రాజకీయ చిట్కాలు ఈ దేశంలో అపూర్వం కాదని ప్రత్యేకవాదులు గమనించాలి). మైనారిటీల దళిత, బహుజనులకు రిజర్వేషన్‌లు ఇవ్వడాన్ని బిజెపి వ్యతిరేకిస్తూ వచ్చింది. కాగా కాంగ్రెస్ ఎన్నికల కోసం మాటల్లో బలపరుస్తూ వచ్చింది. ఆ క్రమంలోనే యుపిఎ ప్రభుత్వం 2005లోనే రంగనాథ్ మిశ్రా కమిషన్‌ని నియమించింది. మన దేశంలో దళితుల సమస్య దక్షిణాఫ్రికాలోని వర్ణ వివక్షను పోలినదే అని ప్రధాని మన్మోహన్ బాహాటంగా అన్నారు. 2006 చివరిలో, దీన్ని ప్రభుత్వ రాజకీయ వైఖరికి సూచికగా భావించారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా రిటైరైన మిశ్రా – విస్తృత పరిశీలన అనంతరం – 2007లో మైనారిటీలకు అనుకూలంగా సాధికారికమైన రిపోర్టునిచ్చారు. మరో సీనియర్ జడ్జి రాజేంద్ర సచార్ కమిటీ కూడా సిఫారసు చేసింది. దళితుడైన ప్రధాన న్యాయమూర్తి బాలక్రిష్ణన్ బెంచి ముందుకు ఈ కేసు వచ్చింది.

ఇందుకు 'న్యాయమూర్తు'ల సహకారం ఉంది. ఇక తేలిపోతుందనుకున్న ఈ వ్యవహారంపై నిర్ణయాన్ని 2008 జనవరి 23న బాలకృష్ణన్, మరో ఇద్దరితో కూడిన బెంచి వాయిదా వేసింది. రంగనాథ్ మిశ్రా రిపోర్టుని ఎస్‌సిల నేషనల్ కమిషన్‌కు ఇచ్చామని, వారి సూచనల కోసం ఎదురు చూస్తున్నామని, ఇంకో ఎనిమిది వారాలు టైం కావాలని – కేంద్రం తరఫున అడిషినల్ సొలిసిటర్ జనరల్ గోపాల్ సుబ్రమణియన్ కోరారు. ఆలస్యమా? 1950 ఉత్తర్వులపై 54 ఏళ్ల తర్వాత పిటిషనర్‌లు వచ్చారు. దానికి ఇంతలో 'అర్జెన్సీ' ఏమిటి? అని ఒక జడ్జి వ్యాఖ్యానించినట్టు పత్రికలూ రిపోర్టు చేశాయి. ఎనిమిది వారాలేమి? నాలుగున్నరేళ్లు దొర్లిపోయాయి. 'అంతా గజ ఈతగాళ్లే, గజం ఈదలేకపోయిన చందం'గా ఈ వ్యవహారం నేటికీ స్తంభించిపోయింది. 2009 ఎన్నికలు గట్టెక్కిపోయారు.

పైన పేర్కొన్న పిటిషన్‌లపై డజనుసార్లు వాదనలు జరిగాక, 'ఫైనల్ హియరింగ్' అని 2011 ఫిబ్రవరి 24న సుప్రీంకోర్టు నిర్ణయించింది. అంతకుముందు నుంచీ, ఇది మతం ఆధారంగా వివక్షేనని ప్రశాంత్ భూషణ్ వంటి ప్రముఖులు గట్టిగా వాదించారు. రాం జెత్మలాని కూడా (అనేక ఇతర విషయాల్లో లాగే, తానున్న బిజెపి విధానాన్ని ధిక్కరించి) వాదించారు. రంగనాథ్ మిశ్రా సూచనలను అమలు చేయాలంటే, 'తేల్చాల్సినవి' అంటూ రెండు ప్రశ్నలను సుప్రీంకోర్టు ముందుకు తెచ్చింది. 1950 ఉత్తర్వులు (మత వివక్ష వల్ల) రాజ్యాంగ విరుద్ధమూ, చెల్లనేరవూ అని నిర్ధారించవచ్చునా? ఇక్కడున్న ఎస్‌సి రిజర్వేషన్‌లు – ముస్లిం, క్రిస్టియన్ దళితులకు విస్తరించడం ద్వారా – పలుచన ('డైల్యూట్') చేయదగునా? (2011 జనవరి 22). ఇవీ ఆ ప్రశ్నలు. బెంగాల్, ఉత్తర్‌ప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ వంటి అనేక పెద్ద రాష్ట్రాల్లో ఎన్నికలు వస్తున్నాయి. ఈలోగా ఈ ప్రశ్నలని తేల్చరా? అని ఆశించారు. తేల్చలేదు. ఆ ఎన్నికలు జరిగిపోయాయి.

ఈ అంతులేని ఆలస్యం ఎందుకు? లీగల్ కన్నా రాజకీయ కారణాలే ప్రధానం. మైనారిటీలు, వాటిల్లో బలహీన వర్గాల ఓట్ల కోసం కాంగ్రెస్ తాపత్రయంతో వాగ్దానాలు చేస్తున్నది. మతం పేరిట రిజర్వేషన్‌లను వ్యతిరేకిస్తున్నాం – అంటున్న బిజెపి, దానికి తోడు హిందూ దళితుల కోటా తగ్గిపోతుందని కూడా రెచ్చగొడుతున్నది. ఇటీవలి బీహార్ ఎన్నికలకు ముందు వారిని భారీ స్థాయిలో సమీకరిస్తాం అని కూడా ప్రకటించింది. వాగ్దానం వల్ల వచ్చే ఓట్లెన్నో కాని, హిందూ దళితుల ఓట్లు పోతాయేమోనని కాంగ్రెస్ భయం. కరవమంటే కప్పకు, విడవమంటే పాముకు కోపం! అందుకే మాటల్లో ఔనంటూనే, 'చేతి'తో కాదనే ద్వంద్వ విధానం అనుసరిస్తున్నది కాంగ్రెస్. నిజానికి ఈ సమస్యపై సూత్రబద్ధ వైఖరికి ఈ రెండే కాదు, ఏ పార్టీ కూడా సిద్ధంగా లేదు. ఎస్‌సి కమిషన్, దళిత బహుజన సంఘాల సంగతి అంతే. ఎస్‌సి కోటా పెంచితే అంగీకరించక పోవచ్చును అంటున్నారు. అయితే రిజర్వేషన్‌లన్నీ కలిపి 50 శాతం మించరాదన్న సుప్రీంకోర్టు ఆదేశం ఉంది కదా! అన్న ప్రశ్న లేవనెత్తుతున్నారు.

ప్రభుత్వం చేయబోతే కోర్టులు అడ్డుపడుతున్నాయి అన్న అభిప్రాయం ఒకటి ఉంది. కోర్టుల్ని నిరసిస్తూ 31 జనవరి 2007 నాడు కొన్ని దళిత, క్రిస్టియన్, బహుజన సంఘాల వారు ఢిల్లీలో ధర్నా జరిపారు. సుప్రీం కోర్టుని ఘెరావ్ చేస్తామన్నారు కూడా. పై కోర్టులు సామాజిక న్యాయానికి అవరోధంగా ఉన్నాయని, 'రెండు నాల్కల విధానం' అనుసరిస్తున్నాయని డా. ఉదిత్‌రాజ్ అరోపించారు. 'సుప్రీం కోర్టుది పక్షపాత వైఖరి', కోర్టు 'కులతత్వం ఆచరిస్తున్నది' అని బాహాటంగా విమర్శించారు మరికొందరు. (ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ ప్రతినిధి, 31 జూలై 2007. ఈ సంస్థ 'వేలాది' సంఘాలకు, శాఖలకు, వ్యక్తులకు ప్రతినిధి అని చెప్పుకుంది) దేశంలోని పై కోర్టులు అగ్రవర్గ, అగ్రవర్ణ పక్షపాతం వహిస్తున్నాయనడం నిరాధారం అని కొట్టిపారేయలేం. వాటి వర్గ స్వభావాన్ని కృష్ణ అయ్యర్ వంటి జడ్జిలు బాహాటంగా విమర్శించారు. సంపన్నుల వ్యవహారాల్లో తనంత తాను (సుమోటో)గానో, 'స్పాన్సర్డ్ పిల్స్' ద్వారానో జోక్యం చేసుకునే పై కోర్టులు ఇలాంటి అభాగ్యుల కేసుల్లో ఎందుకు చొరవ తీసుకుంటాయి?

అయితే కోర్టులే అడ్డుపడుతున్నాయి, ప్రభుత్వాలు 'అభ్యుదయంగా' ఆలోచిస్తున్నాయి అనే వాదన వాస్తవాలతో పొసగదు. ప్రభుత్వాలు, అధికార పార్టీలు తలుచుకుంటే అరవై ఏళ్లు ఆలస్యం అయ్యేదా? వందకి పైగా రాజ్యాంగ సవరణలు చేసిన పాలకవర్గాలు, అధికార పార్టీలు తలుచుకుంటే ఈ సమస్యని పరిష్కరించలేక పోయేవారా? అరవై ఏళ్లుగా సాగదీస్తున్నది వారే. కోర్టులూ, కమిషన్‌లూ వారి కనుసన్నల్లోనే పని చేస్తున్నాయి. ప్రభుత్వాలు, పార్టీలు, కోర్టులు, కమిషన్‌లు – ఇవన్నీ కలిసిన రాజ్యమే ద్వంద్వ విధానాలతో ఇరు వర్గాల వారినీ మోసగిస్తున్నది. రాజ్యంలోని వివిధ అంగాల మధ్య పరస్పర వైరుధ్యాల వలె కన్పించే ఈ ప్రక్రియ వెనుక ఒక ఏకసూత్రత కూడా పనిచేస్తుంది. అదే ఈ కుహనా ప్రజాస్వామ్యం ఆడే నాటకం. ఆ నాటకంలో పాత్రలే కోర్టులైనా, ఇతర విభాగాలైనా.

ఈ వ్యవహారంలో ప్రభుత్వం ఒక రాజకీయ నిర్ణయం తీసుకోవాల్సి ఉందనీ, పార్లమెంట్‌కే ఆ అధికారం ఉందనీ, కోర్టులు ఈ వ్యవహారంలో వేలు పెట్టవద్దనీ – నాటి అటార్నీ జనరల్ మిలన్ బెనర్జీ 2005 ఫిబ్రవరిలో సుప్రీంకోర్టుకి స్పష్టం చేశారు. అయినా రాజకీయ అవసరాలు, రంగనాథ్ మిశ్రా, రాజేంద్ర సచార్ రిపోర్టులు మళ్లీ కోర్టులపై ఒత్తిడి తెచ్చాయి. మత వివక్ష ఉందని, 1950 ఉత్తర్వు రాజ్యాంగ విరుద్ధమని కోర్టులో బలంగా వాదించారు – ప్రశాంత్ భూషణ్, రాంజెత్మలాని వంటి ఉద్దండులు. ఈస్థితిలో ప్రభుత్వం యథాపూర్వ స్థితినే కొనసాగించదల్చిందని, ఆమేరకు న్యాయ శాఖ కోర్టుకి సూచించ దల్చిందని టైమ్స్ ఆఫ్ ఇండియా (21 మార్చ్ 2011) రిపోర్టు చేసింది. 'రాజ్యాంగాన్ని తేలిగ్గా తీసుకొని, మార్పులు చేయడం కుదరదు' అని ఒక సీనియర్ మంత్రి 'టైమ్స్'తో అన్నారు. రాజకీయ వ్యవహారాల కేంద్ర కేబినేట్ కమిటీలో చర్చ తర్వాత ఆయనీమాట చెప్పారు. 1985 సూసాయ్ కేసులో కోర్టు వ్యాఖ్యల్ని ఉటంకించి, న్యాయశాఖ సూచించింది.

మరోవైపు – ప్రభుత్వాలు ఉద్దేశ్యపూర్వకంగానే బిల్లుల్లో, కోర్టుల్లో లొసుగులతో, అశ్రద్ధతో కూడిన వ్యవహారం నడిపించాయని విమర్శలు ఉన్నాయి. అవి నిరాధారం అనడానికి వీల్లేదు. ఒక చేత్తో ఇచ్చి మరో చేత్తో తీసేసుకోవడం అనే ప్రక్రియ మన రాజ్యంలో, రాజ్యాంగంలో, ప్రభుత్వంలో అసాధారణమేమీ కాదు. అందువల్ల కోర్టులే అడ్డు పడుతున్నాయని చెప్పలేం. రాజ్యంలో వివిధ అంగాలు సమన్వయంతోనే ఇలాంటి పనులు చేస్తున్నాయి. లేకపోతే అరవై ఏళ్లనాటి న్యాయమైన డిమాండ్ – 1996లో పార్లమెంట్‌లో బిల్లు దాకా వచ్చిన వ్యవహారం – నేటికీ అపరిష్కృతంగా మిగిలిపోవడం జరిగేది కాదు.

రిజర్వేషన్‌లు పదేళ్ల కోసమే అని 1950లో చెప్పారు. అవసరం బట్టి కొద్దిగా పొడిగించవచ్చునన్నారు. అలా అరవై ఏళ్లు దొర్లిపోయాయి. ఫలితంగా హిందూ దళితుల్లో ఒక చిన్న సెక్షన్ చదువుల్లో, ఉద్యోగాల్లో పైకి వచ్చినమాట నిజమే. అయినా, దళితుల్లో కనీసం 80 శాతం మంది – అరవై ఏళ్లు దొర్లిపోయినా – వెనకబడే ఉన్నారు. అందరికీ విద్య, ఉపాధి, సమన్యాయం లభించే వ్యవస్థాపరమైన మౌలిక మార్పు రాకుండా, ఇంకెన్నాళ్లీ ప్రయాణం? 'ఈ రిజర్వేషన్‌ల ఊత కాళ్లు ఇంకెన్నాళ్లు?' అని ఎవరో కాదు, కాన్షీరాం ప్రశ్నలేవనెత్తారు. 'సర్వజన' రాజకీయాల్లో భాగంగా మాయావతి కూడా ఈ నినాదాన్ని వల్లించారు. ఈ రోజుల్లో అన్ని అధికార రాజకీయ సర్పాలకూ రెండు నాల్కలే. వారి కాటుకి బలయ్యేది అన్ని కులాల్లోని పేదలే. ఈ రిజర్వేషన్‌లు ఎన్నెన్ని ఉన్నా, కాసులతో చదువుల్ని, ఉద్యోగాల్ని, సకల వనరులని కొనగల సంపన్నులకు సమస్య ఏమీ లేదు. అన్నింటా 'లిబరల్' విధానాలు వారికి వడ్డించిన విస్తరి. మిగిలి పారేసిన ఎంగిలాకుల కోసం జనం కుక్కల్లా పోట్లాడుకుంటుంటే, లోలో చిరునవ్వులతో ఈ సంపన్నుల రాజ్యం కపట నాటకాలు ఆడుతున్నది. ప్రజల బలహీనతల ఆధారంగా పార్టీలు రాజకీయ క్రీడలు ఆడుతున్నారు. వ్యవస్థలో సమూల మార్పే పరిష్కారం. దానికి అన్ని మతాల, అన్ని కులాల ప్రజలు చీలిక వాదాల్ని కాదని, పరస్పర సానుభూతితో సమైక్య పోరాటాలకు ముందుకు రావాలి.

(రచయిత రిటైర్డ్ ఉపాధ్యాయులు) వీ

ముంబై భవన నిర్మాణ కార్మికుల స్థితిగతులు

ముంబై కేవలం ఈ దేశ ఆర్థిక రాజధాని మాత్రమే కాదనీ, అది కార్మికుల రాజధాని అనీ, ఏ హక్కులూ లేని కార్మికుల దుర్భర పరిస్థితిని వివరిస్తున్నారు **రమేశ్ గోండ్యాల, దుర్గేశ్ అక్కనపల్లి**

భారతదేశంలోనే ముంబాయి నగరానికి దేశ ఆర్థిక రాజధానిగా పేరు ప్రఖ్యాతులు ఉన్నాయి. భారత, ప్రపంచ పెట్టుబడుదారులకు ముఖ్యమైన నగరంగా ఉంది.

ముంబై గత చరిత్రలోకిపోతే 450 సంవత్సరాల క్రితం సముద్రంతో నిండి ఉన్న ఈ ముంబాయి నగరం 7 దీవులుగా విసిరేసినట్టు అక్కడ అక్కడ ఉండేది. ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతం పోవాలంటే తెప్పల సాయంతో మాత్రమే వెళ్లేవారు. ముంబై నగరం దీవులుగా ఉన్నప్పటి నుండే మన తెలంగాణవారు వలస కార్మికులుగా వచ్చారు. ముంబై సెంటర్ పక్కనే వలస వచ్చిన భవన నిర్మాణ కార్మికులకు కమాటిపురాలో నివాసాలు ఏర్పాటు చేశారు. (కమాటి అంటే మరాఠీలో మట్టి మనుషులు అని అర్థం).

తెలంగాణ వలస కార్మికులు ముంబై భవన నిర్మాణ రంగంలో కీలక పాత్ర వహించారు. ప్రధానమైన కట్టడాల నుండి చిన్న గుడిసె వరకు వారు నిర్మించంది లేదు.

తెలంగాణలోని పది జిల్లాల బడుగు బలహీన వర్గాలు ఎక్కువ మొత్తంలో ముంబాయికి ఉపాధి కోసం రావడానికి కారణం ముంబై పట్టణం కార్మిక నగరంగా ఉండడమే. కాలక్రమంలో ఎన్నో మిల్లులను, కంపెనీలను ఇక్కడి నుండి వేరే ప్రాంతాలకు తరలించి ఆ ప్రాంతంలో పెద్ద పెద్ద మాల్స్, మల్టీపెక్స్‌లు, ఎత్తైన భవనాలను నిర్మించి కార్మికుల పొట్టమీద కొట్టారు.

తెలంగాణ ప్రాంతం నుండి వలస వస్తున్న ప్రజల సంఖ్య నానాటికి పెరుగుతోంది. ఉన్న ఊరిలో ఉపాధి లేక, చుక్కల్లో నిత్యావసర వస్తువుల ధరలతో, చాలీచాలని కూలీలతో పూట గడవక, తప్పని సరి పరిస్థితులలో పొట్ట చేతబట్టుకొని ముంబై చేరారు. ఊరిని, కన్న తల్లిదండ్రులను, పిల్లలను వదిలి పుట్టెడు దుఃఖంతో, మనసుని చంపుకొని ముంబై, భివాండి, థానే తదితర ప్రాంతాలకు జీవనోపాధి కోసం తరలి వెళుతున్నారు.

ప్రాంతంగాని ప్రాంతంలో తెలియని భాష, ఆపై దళారుల పెత్తనం, బిల్డర్‌లు, కాంట్రాక్టర్‌ల ఆధిపత్యం కింద నలిగిపోతుంటే, కార్మిక చట్టాలు పార్లమెంట్, అసెంబ్లీల నుండి దాటక పోవడం రాజకీయ నాయకుల ద్వంద్వ పాలనకు అద్దం పడుతుంది.

తెలంగాణ నుండి వస్తున్న కార్మికులంతా అత్యధికులు భవన నిర్మాణ కార్మికులే. భివాండిలోని పవర్‌లూమ్ మిల్లుల్లో పనిచేసే కార్మికులు తెలంగాణ వారే. ముంబైలో నిర్మించిన ప్రతి కట్టడం మన తెలంగాణ కార్మికులు నిర్మించినవే! ఇంత చరిత్ర ఉన్న భవన నిర్మాణ కార్మికుల నివాసాలు రైలు పట్టాల పక్కన, ఫూట్ పాతులు, మురికి కాల్వల పక్కన రేకులు, బస్తచింపులతో వేసిన గుడిసెలలో అత్యంత దయనీయంగా ఉంటాయి. వీరు వీథిలైట్ల వెలుగులో, ఎప్పుడో వచ్చే ఒక క్యాన్ మంచి నీళ్లతోనే జీవనం కొనసాగిస్తున్నారు. భాష వేరు, ప్రాంతం వేరు కావడం వల్ల స్థానిక అధికారులను ప్రశ్నించే సాహసం చేయరు. ఎన్ని కష్టాలు వచ్చినా దుఃఖాన్ని దిగమింగి, మన బతుకులు ఇంతేనని కాలాన్ని నెట్టుకొస్తున్నారు.

అసంఘటిత కార్మికులకు ఎన్నో చట్టాలు ఉన్నా, రాజకీయ నాయకులకు వాటిని అమలు చేసే ఉద్దేశం లేదు.

భవన నిర్మాణ కార్మికులకు పని దొరికేది నెలకు 20 రోజులు మాత్రమే. మేస్త్రికి 450 రూపాయలు, బిగారికి 200 రూపాయలు ఒక రోజు కూలీగా ఉన్నాయి. వీరు కొద్దో గొప్పో సదుపాయాలు ఉన్నకాడ ఉండాలంటే కనీసం రు. 3000 నుండి 4000 వరకు ఇంటి అద్దె ఉంటుంది. నెల మొత్తం పని దొరకక కిరాయి ఇండ్లలలో ఉండలేక రోడ్ల మీద జీవనం గడుపుతున్నారు.

భవన నిర్మాణ కార్మికులకు సూపర్ వైజర్, కాంట్రాక్టర్, బిల్డర్లు కూలీ పైసలు ఇవ్వక పోవడం, ప్రశ్నిస్తే కొట్టడం లాంటివి–నిత్యం జరుగుతున్నా, వారి కోసం ఏర్పడ్డ యునియన్‌లు కూడా ప్రశ్నించక పోవడం వలన చెప్పింది చేయడం, ఇచ్చింది తీసుకోవడం జరుగుతోంది.

కార్మికులు ఇన్ని సమస్యలతో సతమతమవుతుంటే అధికారులు, ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుంటాయి. మహిళా కూలీలకు రోజు కూలీ రు. 100 నుండి 150 వరకు మాత్రమే ఇస్తారు. పని చేసేటప్పుడు కార్మికులు సేఫ్టి బెల్టు, హెల్మెట్ తప్పక పెట్టుకొని పని చేయాలి. కాని బిల్డర్లు వాటిని పట్టించుకోకపోవడం వలన భద్రత లేక వందలాది మంది కార్మికులు చనిపోతున్నారు. దెబ్బలు తగిలి వికలాంగులు అవుతున్నారు. ఇటువంటి ఘటనలు జరిగినప్పుడు బాధితునికి 5 వేల నుండి 10 వేలు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. ఇంకా మాట్లాడితే ఇవి కూడా ఇవ్వమని బెదిరిస్తారు.

కార్మికులు పని చేసేటప్పుడు సేఫ్టి బెల్టు, హెల్మెట్ లేకుండా పని చేయకుండా చూసుకొనే బాధ్యత అక్కడ పనులను పర్యవేక్షించే సూపర్ వైజర్‌ది. కాని కొన్ని బిల్డింగ్‌ల నిర్మాణల దగ్గర వీరు అసలు కనిపించరు. ఏదైనా ఘటన జరిగిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. బిల్డర్, కాంట్రాక్టర్‌ల మీద ఎఫ్.ఐ.ఆర్. బుక్ చేసి బాధ్యులైన వారిని శిక్షించాలి. ఇవన్నీ తుంగలో తొక్కి బాధితుల్ని అదిరించి, బెదిరించి పంపిస్తారు. కనీసం మృతదేహాలను సొంత ఊరికి తీసుకపోలేక గుండెలు బాదుకుంటూ రోదించడం తప్ప మార్గం లేదు.

ఈ ముంబై నగరం ఒక పక్క ఆర్థిక రాజధానిగా ఉంటూ మరొక పక్క రోడ్డు మీద బతుకుతున్న కార్మిక నగరంగా కనిపిస్తుంది.

ఈ కార్మికుల బతుకులను దగ్గరగా చూసిన మేం 'శ్రమజీవి సంఘం'ను స్థాపించి భవన నిర్మాణ కార్మికులకు అండగా ఉండాలని, వారిని సామాజిక ఆర్థిక రాజకీయ కోణాలలో చైతన్యం చేయాలని నిర్ణయించినాం.

ముంబై నగరంలో అనేక కార్మికుల నాక(అడ్డా) వద్ద శ్రమజీవి సంఘం కమిటీలను వేసి వారికి భవన నిర్మాణ రంగంలో జరుగుతున్న అన్యాయాలను వివరించి చెప్పి, కార్మికులందరం అండగా ఉంటామని భవన నిర్మాణ రంగంలో దోపిడికి గురయితున్న విధానంపై రాజకీయ చైతన్యం ఇవ్వడం మా బాధ్యతగా గుర్తించి పని చేస్తున్నాం. శ్రమజీవి సంఘం కార్మికులకు అండగా ఉంటుందని, ఏ బిల్డరైనా, కంట్రాక్టరయినా

ఇదేనా ఆదివాసుల ప్రగతి?

ఆదివాసుల పట్ల పాలకుల నిర్లక్ష్య వైఖరిని ఉదాహరణలతో వివరిస్తూ స్వయం పాలిత ప్రాంతాల ఏర్పాటుతోనే ఆదివాసుల అభివృద్ధి సాధ్యమంటున్నారు **ఎం. నాగమణి**

వాళ్లూ ఆదివాసులే... వీళ్లూ ఆదివాసులే... అయినప్పటికీ వీరికీ వారికీ మధ్య ఎంతో వ్యత్యాసం... కొండకు ఎగువన వాళ్లుంటే, కొండ దిగువన వీళ్లున్నారు. అంతే వీరి మధ్యన తేడా. అయితే ఈ తేడాయే ఈ ఆదివాసుల మధ్యన తీవ్రమైన వెనుకబాటుతనానికి కారణమవుతున్నది. ఏజెన్సీలోని వారు మారుమూలన ఉండడంతో వారు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా, సాంఘికంగా, సాంస్కృతిక పరంగా వెనుకబడగా, మైదాన ప్రాంత ఆదివాసుల పరిస్థితి ఇందుకు భిన్నంగా ఏమీ లేదు. మైదాన ప్రాంత ఆదివాసులుగా వీరు అటు ఏజెన్సీలోనూ, ఇటు మైదాన ప్రాంతంలోనూ తీవ్రమైన వివక్షకు గురవుతున్నారు. ఏజెన్సీలో ఆదివాసీలను ఆదుకోవడానికి ఒక ఐటిడిఎ, సబ్ కలెక్టర్, వివిధ శాఖల అధికారులు నానా హంగామా అంతా ఉంది. అదే మైదాన ప్రాంతానికి వచ్చేసరికి వీరిని పలకరించే నాథుడే ఉండరు. కనీసం తాగునీరు, సాగునీరు, విద్య, వైద్యం, విద్యుత్ ఇలా అన్ని విధాలుగా వెనుకబాటుకు లోనై ఉన్నారు.

ఏజెన్సీ పదకొండు మండలాల్లో దాదాపు ఐదు లక్షల యాభై వేల మంది ఆదివాసులు ఉంటే, మైదాన ప్రాంతంలోని ఎనిమిది మండలాల్లో మొత్తం లక్ష మంది ఆదివాసులు జీవిస్తున్నారు. మైదాన ప్రాంతంలోని దేవరాపల్లి, మాడుగుల, చీడికాడ, రావికమతం, రోలుగుంట, గొలుగొండ, నాతవరం, కోటవురట్ల మండలాల్లో 280 గ్రామాల్లో ఆదివాసీలు జీవనం సాగిస్తున్నారు. వీరికి విద్యాపరం గానూ, ఉపాధిపరంగానూ తీవ్ర అన్యాయం జరుగుతున్నది. మైదాన ప్రాంతంలో ఏలాంటి రిజర్వేషన్ సౌకర్యాలకుగానీ, ఆదివాసీలకు వర్తించే చట్టాలకు గానీ, హక్కులకు గానీ నోచుకోవడం లేదు. పైగా మైదాన ప్రాంతంలో మైనారిటీలుగా, పరాయి (కొండోళ్లు) వాళ్లుగా పరిగణింపబడుతూ చిన్న చూపుకు గురిచేయబడుతున్నారు. వీరి సామాజిక జీవితం రోజురోజుకూ ఛిద్రమవుతోంది. మైదాన ప్రాంత వాసుల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, వేషధారణ, భాష వంటి వాటి ప్రభావానికిలోనై తమదైన సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాల నుండి దూరం చేయబడుతున్నారు. ఏజెన్సీలోని ఆదివాసులతో పోల్చితే, వీరికి జరుగుతున్న అన్యాయం అంతా ఇంతా కాదు. కేవలం కొండకు దిగువన ఉన్న కారణంగానే వీరు వివక్షకు గురవుతున్నారు.

బెదిరిస్తే మా నెంబర్లకు ఫోన్ చేయాలని చెప్పి కార్మికుల ఐక్యతతో కొన్ని విజయాలను సాధించాం. శ్రమజీవి సంఘం స్థాపించిన తర్వాత కార్మికుల ఐక్యతతో విజయాలను సాధిస్తూ సంఘం ముందుకు పోతోంది.

22 నవంబర్ 2010 నాడు థానే జిల్లా డోంచిపల్లి పట్టణం తూర్పులో గో్గ్రాఫ్వాడి జిజాయినగర్‌లో సదానంద్ ధర్వాల (శివసేన పట్టణ అధ్యక్షుడు) బిల్డర్ దగ్గర వెంకటయ్య అనే కార్మికుడు ప్లాస్టర్ చేస్తూ కిందపడి చనిపోయాడు. అతనికి భార్య, ముగ్గురు ఆడ పిల్లలు ఉన్నారు. తోటి కార్మికులు శ్రమజీవి సంఘంకు సమాచారం ఇచ్చారు. బిల్డర్, పోలీసుల ఎత్తుగడలను తిప్పికొట్టి రెండు వందల మంది కార్మికులతో పోలీస్ స్టేషన్‌కు వెళ్లి బిల్డర్ మీద కేసు బుక్ చేయించాం. ఉదయం నాక బంద్‌కు పిలుపు ఇచ్చి, ఆరు వందల మంది కార్మికులతో బిల్డర్ ఆఫీసును ముట్టడించి, బిల్డర్‌ను అరెస్టు చేయాలని కార్మికులు పట్టు బట్టారు. చేసేది ఏమిలేక బిల్డర్ దిగివచ్చి రు. 2,75,500(రెండు లక్షల డెబ్బై ఐదు వేలు) ఎచ్.డి.ఎఫ్.సి. బ్యాంక్‌లో మృతుని భార్య పేరు మీద డి.డి ఇచ్చాడు.

2011 నవంబర్ 9న ముంబై భవన నిర్మాణ కార్మికులంతా చిన్నబోయిన రోజు. ఆ రోజు ఎప్పటిలాగనే పనికి పోయిన కార్మికులు ఇండ్లకు విగత జీవులై తిరిగి వచ్చారు. ముంబైలోని మీరాబాయందర్‌లో జి.ఎం. గోయంకా నిర్మిస్తున్న ఐదు అంతస్తుల బిల్డింగ్ అది. రెండు సంవత్సరాల క్రితం కట్టిన పరంచాను ఇప్పేందుకు వెళ్లిన కార్మికులు పది మంది కట్టిన తాళ్లు తెగడం వలన 14వ అంతస్తు నుండి కింద పడ్డారు. ఏడుగురు అప్పుడే చనిపోగా, ముగ్గురు కార్మికులను ఆస్పత్రిలో చేర్పించినారు. ముంబైలోనే భవన నిర్మాణ రంగంలో అతి పెద్ద ఘటన జరిగినా స్థానిక రాజకీయ నాయకులు, ప్రభుత్వం పట్టించుకోక పోవడం శోచనీయం. ఈ విషయం తెలిసిన వెంటనే శ్రమజీవి సంఘం, తెలంగాణ ఉద్యోగ వేదిక నాయకులతో చర్చించి, మీరాబయందర్ బోరివలి నాకలను బంద్ చేసి, 1000 మంది కార్మికులతో నవగార్ పోలీస్ స్టేషన్ ముట్టడించి, బిల్డర్‌ను అరెస్టు చేయాలని, కార్మికులకు న్యాయం జరగాలని పోలీస్ స్టేషన్ ముందు బైఠాయించారు. బిల్డర్ పంపించిన దళారీగాళ్లను తరిమికొడుతూ దగ్గరకు రానివ్వలేదు. చేసేది లేక జి.ఎం. గోయంకా చనిపోయిన ప్రతి ఒక్కరికి 7లక్షల రూపాయలు, దెబ్బలు తగిలినవారికి మూడు లక్షల ఏభై వేల రూపాయలను ఇచ్చి, హాస్పిటల్ ఖర్చులు రు.21 లక్షలు కట్టాడు. ఈ మృతుల కుటుంబాలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక్కొక్కరికి ఒక లక్ష రూపాయల చొప్పున ఇచ్చింది.

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం జరుగుతున్న ఉద్యమాన్ని, విద్యార్థుల త్యాగాన్ని ఎత్తిపడుతూ, రాజకీయ నాయకుల స్వార్థాలను ప్రజలకు వివరించాలని 'తెలంగాణ ఉద్యమ సంఘీభావ వేదిక- ముంబై ఆధ్వర్యం'లో తెలంగాణ ప్రజలను ఐక్యం చేస్తూ, దానికి తోడుగా 'తెలంగాణ కళ సాహితీ వేదిక-ముంబై'ని ఏర్పాటు చేసి, తెలంగాణ అమరుల త్యాగాలను ఎత్తిపడుతూ ఉద్యమానికి ఆసరాగా నిలుస్తున్నాం.

భవన నిర్మాణ కార్మికుల చట్టాలను అమలు పర్చాలి.

భవన నిర్మాణ కార్మికులను కార్మికులుగా గుర్తించి ప్రభుత్వం ఇండ్లు నిర్మించాలి. అన్ని వసతులను కల్పించాలి

ప్రభుత్వం ప్రతి ఒక్కరికీ ఐడెంటీ కార్డును ఇవ్వాలి.

(రచయితలు ముంబై శ్రమజీవి సంఘం సభ్యులు) వీ

గతంలో మైదాన ప్రాంత ఆదివాసులకు కేంద్ర నిధులు మంజూరయ్యేవి. ఈ నిధులతో కల్చర్ అభివృద్ధి వంటి చిన్న చిన్న పనులు చేసేవారు. ఈ కేంద్ర నిధులు ఏడేళ్లుగా పూర్తిగా నిలిచిపోయాయి. దీనితో ఐటిడిఎ నుంచి అందే అరకొర సాయం కూడా ఆగిపోయింది. ఇక అప్పటి నుంచి మైదాన ప్రాంత ఆదివాసుల వంక తొంగిచూసేవారు కరువయ్యారని చెప్పాలి. విద్య, వైద్యం, తాగునీరు, సాగునీరు ఇలా ఏ అంశం చూసినా కనీసం ఒక్కటంటే ఒక్క పథకం కూడా మైదాన ప్రాంత ఆదివాసులకు దక్కడం లేదు. అంటే వీరి పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

మైదాన ప్రాంతంలో జీవనం గడుపుతున్న ఆదివాసులు ఏజెన్సీ వాసుల మాదిరిగానే అటవీ ఉత్పత్తుల సేకరణపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. వాతావరణం కారణంగా అక్కడ పండిన దినుసులు మాత్రం ఇక్కడ పండవు. కేవలం కొండ తేనే, వెదురు, చింతపండు సేకరణ వంటి వాటి ద్వారానే వీరి జీవనం కొనసాగు తోంది. దినుసులు ఉంటే వారికి బతుకు, లేదంటే కరువే. మారుమూలన ఉన్న గ్రామాల్లో నివసించే వారు పూర్తిగా అటవీ ఉత్పత్తుల పైనే ఆధారపడి జీవనం సాగిస్తారు. కోస్తా రోడ్డు పక్కన గ్రామాల్లో నివసిస్తున్న వారు మాత్రం వెదురు కూపుల్లో కూలీలుగా, కాంట్రాక్టు పనుల్లో, క్వారీల్లో, వ్యవసాయ పనుల్లో అసంఘటిత కార్మికులుగా బతుకు వెళ్లదీస్తున్నారు. వానకాలం వచ్చిందంటే వీరికి కనీసం తినడానికి కూడా ఆహారం దొరకని పరిస్థితి ఏర్పడుతుంది. రహదారి సౌకర్యం లేకపోవడంతో వీరంతా ఎంత దూరమైనా కాలినడకనే వెళ్లవలసి వస్తున్నది. అనారోగ్యానికి గురైతే వైద్య సౌకర్యాలు అందడమే కష్టం.

కొండ కోనల్లో నివసిస్తున్న వీరి గ్రామాలకు కనీస సౌకర్యాలు లేవు. ఇప్పటికీ తాగునీరు, సాగునీరు కూడా దొరకని గ్రామాలు ఉన్నాయి. ప్రత్యేకించి ఈ గ్రామాలకు కనీస రహదారి సౌకర్యం లేదు. రావికమతం మండలం చీమలపాడులో ఇప్పటికీ వేసవిలో తాగునీటి కోసం ఆదివాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ గ్రామానికి మూడుసార్లు చోడవరం ఎం.ఎల్.ఎ. పర్యటించినా వారి సమస్య ఈరోజుకీ పరిష్కారం కాలేదు. మాడుగుల మండలంలో చాలా గ్రామాలకు రహదారి సౌకర్యం లేదు. ఆ గ్రామాలకు ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి. కోనాం జలాశయం ఎగువన ఉన్న ఆదివాసీ గ్రామాల పరిస్థితి దేవుడెరుగు. ఎన్నో గ్రామాలకు ఇప్పటికీ విద్యుత్ సౌకర్యం లేదు. ఇక దేవరాపల్లి మండలంలోని నేరళ్లపూడి, బోడిగరువు, మద్యగరువు, తుమ్మలపాలెం, బొర్రచింత, నకరంపాడు, చీడికాడ మండలం బిళ్లలపాలెంలకు విద్యుత్ లేదు. నాతవరం మండలంలోని సిరిపురం, భమిడికలొద్ది, ముంతమామిడిలొద్ది, సుందరకోట వంటి గ్రామాల్లో కనీస సౌకర్యాలు లేవు. చాలా గ్రామాల్లో ఇప్పటికీ ఇందిరమ్మ ఇళ్లు లేవు. వానాకాలం వస్తే ఇప్పటికీ ఈ గ్రామాలకు కొన్ని రోజుల పాటు బాహ్య ప్రపంచంతో సంబంధాలు ఉండవు. ఉరకగెడ్డ దిగువన ఉన్న గొప్పూరు, దిబ్బూరు, గ్రామాలకు వర్షకాలం వచ్చిందంటే వాగులు పొంగిపోయి బయట ప్రపంచంతో సంబంధాలు కూడా తెగిపోతాయి. అలాంటి సమయంలో పిల్లా పాపలతో ఆదివాసులంతా రోజుల తరబడి పస్తులు ఉండాల్సిందే. వ్యవసాయానికి కూడా వీరికి అవకాశం లేని పరిస్థితి. ప్రభుత్వం అందించే పథకాలేవీ వీరికి అందవు. అధికారులు ఎవరూ వీరివంక కన్నెత్తి కూడా చూడరంటే చూడరు. కష్టపడి మండల కార్యాలయాలకు వచ్చినా వీరి గోడు పట్టించుకునే అధికారి ఉండరు. ఒకవేళ ఏ అధికారి అయినా వీరి దీనస్థితికి జాలిపడి ఏదైనా చేయాలనుకున్నా, ఏమీ చేయలేని నిస్సహాయ స్థితి. ఏజెన్సీలోని ఐటిడిఎ అధికారుల నుంచి ఏ విధమైన సహకారం అందకపోవడంతో మైదాన ప్రాంతంలోని అధికారులు మిన్నకుండి పోతున్నారు. మైదాన ప్రాంతంలో ఉన్న ఆదివాసీలకు ఏజెన్సీలోని ఉద్యోగ అవకాశాల్లో వివక్ష ఎదురవుతున్నది. ఏజెన్సీల్లోని భర్తీచేసే ఉద్యోగాల్లో మైదాన ప్రాంత ఆదివాసులకు ఏమాత్రం అవకాశం కల్పించరు. భారత రాజ్యాంగం 5వ షెడ్యూల్డ్ 1వ పేరా ప్రకారం – షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాలన్నీ ఆదివాసీల చేత భర్తీ చేయాలి. దీని ఆధారంగా మైదాన ప్రాంత ఆదివాసీలను, ఏజెన్సీలోని ఉద్యోగాల్లో భర్తీ చేయడానికున్న ఆటంకం ఏమిటి? రాజ్యాంగ నియమాలను ఉల్లంఘిస్తూ, ప్రభుత్వ జి.ఒ.లను కాలరాస్తూ ఆదివాసేతరుల చేత, షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఉద్యోగాలన్నీ భర్తీ చేస్తున్నప్పుడు అడ్డురాని రూల్స్, రెగ్యులేషన్స్ ఆదివాసులకా? ఇది కచ్చితంగా ఆదివాసీల పట్ల ప్రభుత్వ వివక్షకు నిదర్శనం.

మైదాన ప్రాంతంలోని ఆదివాసీల అభివృద్ధి కోసం ప్రత్యేక ఐటిడిఎలు ఏర్పాటు చేస్తున్నట్టు చాలా ఏళ్లుగా ప్రభుత్వం, పాలకవర్గాల నాయకులు ప్రకటనలు, వాగ్దానాలు, హామీలైతే చేస్తున్నారు తప్ప ఇప్పటివరకు కార్యరూపం దాల్చలేదు. ఆ మైదాన ప్రాంత ఐటిడిఎల ఏర్పాటు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. మైదాన ప్రాంతంలో ఆదివాసులు అభివృద్ధి చెందాలంటే, ఇప్పటికైనా వారిని ఆదివాసులుగానే గుర్తించి వారి బాగోగులు పట్టించుకునే ఏజెన్సీ ఒకటి ఏర్పాటు చేయాల్సిన అవసరమెంతైనా ఉంది. మైదాన ప్రాంత మండలాల్లోని ఆదివాసుల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించాలి.

రాష్ట్ర శాసనసభా పతి నాదెండ్ల మనోహర్ ఆధ్వర్యంలో అరకు లోయలో మన్యం సమస్యలపై అధ్యయన తరగతులను నిర్వహించడం, ప్రత్యేకంగా నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తామని ప్రకటించడం హాస్యాస్పదమే. ఎందుచేతనంటే రాష్ట్ర బడ్జెట్ (2011–12)లో కేటాయించిన రు.901 కోట్లలలో కేవలం రు.614 కోట్లు ఖర్చు చేసి, మిగిలిన నిధులను ఇతర పనులకు మళ్లించారు. ఇపుడేమో అరకు డిక్లరేషన్ పేరుతో ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తామనడం ఆదివాసీలను మభ్యపెట్టడానికే. అధ్యయన తరగతుల కోసం మారుమూల గ్రామాలు, సమస్యల వలయంలో చిక్కుకొని కొట్టుమిట్టాడుతున్న మైదాన ప్రాంత ఆదివాసీ గ్రామాలకు వెళ్లకుండా, అరకు వంటి పర్యాటక ప్రాంతాన్ని ఎంపిక చేసుకోవడం, ఆట–పాటలకు పరిమితం కావడం విహారయాత్రను తలిపించింది. బాక్సైట్ తవ్వకాలను ఆదివాసులు ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్న ప్పటికీ, ప్రభుత్వం లీజుల అనుమతులు రద్దు చేయకుండా రెండు నాల్కల ధోరణిని అవలంబిస్తోంది. ఎం.ఎల్.ఎ.లు మూడు రోజుల పర్యటనలో దీని రద్దుకు సమగ్రంగా చర్చించకపోవడం విచారకరం. అరకు డిక్లరేషన్‌లో బాక్సైట్ ఒప్పందాలు రద్దు చేసి ఉండాల్సింది. అదివాసీ ఉపప్రణాళిక ప్రకటించి ఉంటే ఏడు వేల కోట్ల రూపాయల నిధులు కేటాయించబడేవి. అలాగే మైదాన ప్రాంతంలో జీవిస్తున్న ఆదివాసీ గ్రామాలను 5వ షెడ్యూల్డ్‌లో చేర్చి, ఆదివాసులకు రక్షణ కవచంగా ఉన్న 1/70 భూ బదలాయింపు చట్టం, అటవీ హక్కుల చట్టం, విద్యా, వైద్యంపై డిక్లరేషన్‌లో పొందుపర్చాల్సింది. మౌలిక విషయాల ప్రస్తావనే మరచి, అంతగా ప్రాధాన్యంలేని అంశాలపై దృష్టిపెట్టారు. ఒక్క మాటలో చెప్పాలంటే, మన్యంలో గల సహజ వనరులు కొల్లగొట్టేందుకే అరకు డిక్లరేషన్. ఇలాంటి డిక్లరేషన్‌తో ఆదివాసుల అభివృద్ధి సాధ్యం కాదు. ఆదివాసుల స్వయం పాలిత ప్రాంతాల ఏర్పాటుతోనే ఆదివాసుల అభివృద్ధి సాధ్యం. అలాంటి స్వయం పాలిత ప్రాంతాల స్థాపనే ధ్యేయంగా, ఆదివాసీలు సమైక్యంగా పోరాడాలి.

(రచయిత సామాజిక ఉద్యమ కార్యకర్త) వీ

ఎందుకీ మోడల్ స్కూళ్లు?

సక్సెస్ స్కూళ్లు, మోడల్ స్కూళ్లు ఇలా రకరకాల పేర్లతో విద్యారంగంలో అసమానతలను పెంచడం కాకుండా అందరికీ నాణ్యమైన విద్య కోసం, కామన్ స్కూలు విధానం కోసం పోరాడాలని అంటున్నారు **కె. ప్రభాకర్**

విద్యాహక్కు చట్టంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి 737 మోడల్ స్కూళ్లను మంజూరు చేసింది. ఈ పాఠశాలలు తమకు అవసరమైన మాధ్యమంలో ఆరవ తరగతి నుండీ ఇంటర్ వరకు విద్యను అందించవచ్చని తెలిపింది. ఇందుకోసం ఐదు ఎకరాల స్థలాన్ని 75:25 శాతం కేంద్రం, రాష్ట్రం వాటాలతో ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. కానీ, రాష్ట్ర ప్రభుత్వం వీటి అవసరాన్ని గానీ, రాష్ట్రంలో ఇప్పటికే నడుస్తున్న 6500 సక్సెస్ స్కూళ్ల గురించి గానీ, ఇతర 3500 సరైన పోస్టులు, వసతులు లేని పాఠశాలల గురించి గానీ ఆలోచించలేక పోయింది.

ఇప్పటికీ స్థల సేకరణ జరిగిన 355 పాఠశాలలకు రు. 412 కోట్లను, ఒక్కో పాఠశాలకు సుమారు మూడు కోట్ల అంచనాతో నిధులు విడుదల చేసింది. నల్గొండలో 33, నిజామాబాద్‌లో 16, మెదక్‌లో 24, మహబూబ్ నగర్‌లో 7, కరీంనగర్‌లో 47 పాఠశాలలకు నిధులు మంజూరయ్యాయి. నిర్మాణాలు కొనసాగుతున్నాయి.

దాదాపు 7500 పోస్టుల భర్తీకి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ కూడా ఇచ్చింది. అయితే ఈ నియామకాలకు కచ్చితంగా ఆంగ్ల మాధ్యమంలో చదివినవారే అర్హులుగా ప్రకటించడంతో నిరుద్యోగ అభ్యర్థుల్లో ఆందోళన మొదలైంది.

ఇన్ సర్వీస్‌లో పని చేస్తున్న వేలాది మంది ఉపాధ్యాయులకు అర్హతలు, అనుభవం ఉన్నప్పటికీ కేవలం ఆంగ్ల మాధ్యమంలో చదవలేదన్న సాకుతో ఇన్ సర్వీస్ టీచర్లను నిరాకరిస్తోంది. దీనికి తోడు ఇప్పటిదాకా అర్హతలు పొందిన ఎస్.సి.లు టెట్, డి.ఎస్.సి.లకు సిద్ధమవుతున్న లక్షలాది మంది నిరుద్యోగుల్లో కూడా అత్యధిక శాతం తెలుగు మాధ్యమంలో చదువుకున్న వారే.

దీనికి తోడు తెలంగాణ ప్రాంతంలో నైజాం పరిపాలన ఉండడం వలన ఇక్కడివారు ఆంగ్ల మాధ్యమంలో చదివే అవకాశం లేకపోయింది. ఆంధ్ర ప్రాంతంలో బ్రిటిష్ పరిపాలన ఉండడం వలన ఆంగ్ల మాధ్యమం లో చదువుకునే అవకాశం ఏర్పడింది. దీనిని ఆధారంగా చేసుకొని మోడల్ స్కూళ్లలో ఇంగ్లీష్ చదివిన ఆంధ్ర నిరుద్యోగులకే అవకాశాలు ఇవ్వబోతోంది.

మండలానికో పాఠశాల పేరిట ఏర్పాటు చేస్తున్న ఈ పాఠశాలల ద్వారా ప్రభుత్వం ఏం సాధించదలుకున్నదో అర్థం కావడం లేదు. ప్రాథమిక విద్యా రంగాన్ని పటిష్ట పరచకుండా ఆరవ తరగతి నుండి లాటరీ పద్ధతిలో విద్యార్థులను ఎంపిక చేయడం ద్వారా ఎట్లాంటి విద్యను ఎవరికి అందించచూస్తున్నారో విధానకర్తలకే తెలియాలి. విద్యాహక్కు చట్టంలో పొందుపరిచిన అందరికీ 'నాణ్యమైన, సమానమైన విద్య' అన్న ప్రజాస్వామిక స్ఫూర్తికి విరుద్ధంగా ఈ మోడల్ సూళ్లు ఏర్పడబోతున్నాయని అర్థమవుతోంది. ఇట్లాంటి స్కూళ్లను తెరవాలని వామపక్ష విద్యార్థి సంఘాలు ఆందోళనకు పూనుకోవడం విడ్డూరంగా ఉంది.

ఇప్పటికే ప్రభుత్వ, పంచాయతీరాజ్, మున్సిపల్, ఎయిడెడ్, ప్రైవేట్ సక్సెస్, రెసిడెన్సియల్, నవోదయ పాఠశాలల వల్ల వేర్వేరు రకాలుగా విద్యా బోధన జరుగుతోంది. అసలు ప్రభుత్వ నియమాలు, శిక్షణలు, లక్ష్యాలు అవసరం లేకుండానే మరొక వైపు సమాంతరంగా ప్రైవేట్ రెసిడెన్సియల్స్, టెక్నో స్కూల్స్ వేలాదిగా ప్రతి మండలంలో పుట్టుకొస్తున్నాయి. వీటిలో అమలవుతున్న సిలబస్, పర్యవేక్షణ ఫలితాలు సరిగ్గా అందుబాటులోకి రాక అనేక రకాల విద్యార్థులు వివిధ విద్యా స్థాయిల్లో పైకి నెట్టబడుతున్నారని అర్థమవుతోంది.

కొంతకాలం క్రితం అసలు ప్రభుత్వ పాఠశాలల్లో ఫలితాలు రాక పోవడానికి, విద్యార్థుల సామాజిక, ఆర్థిక సాంస్కృతిక అంశాలను పరిగణనలోనికి తీసుకోకపోవడం ఒక కారణం. కేవలం హాస్టల్ మెతుకుల కోసం, మధ్యాహ్నపు బడి మెతుకులకోసం తప్ప, మెరుగైన విద్యను అందించడం గురించి ఆలోచించలేదు.

అనాలోచితంగా ఆంగ్ల మాధ్యమం పట్ల విద్యార్థులు, తల్లిదండ్రులు మక్కువ చూపుతున్నారన్న సాకుతో 6500 పాఠశాలలను ఆంగ్లమాధ్యమంతో సక్సెస్ స్కూల్స్‌గా మార్చింది.

కనీసం ఈ పాఠశాలల గురించిన పాఠశాలల్లో తెలుగు మీడియం నుండి చేరిన విద్యార్థులు, ఆ విద్యార్థులకు సరైన శిక్షణలేని టీచర్లు బోధిస్తున్న అంశాలు పరిగణనలోనికి తీసుకోకుండా, మళ్లీ ప్రభుత్వం మోడల్ స్కూల్స్ పేరిట మండలానికి మూడు కోట్ల రుపాయలతో కొత్త పాఠశాలలను తెరవ పూనుకుంది.

అది కూడా ఆరు నుండి పన్నెండో తరగతి వరకు ఆంగ్ల మాధ్యమంలో తెరవడం భాషాభిమానులకు ఆవేదన కలిగిస్తోంది. ఇప్పటికే నడుస్తున్న 6500 సక్సెస్ స్కూళ్లను పరోక్షంగా మూతవేయచూస్తోంది. అసలు మాతృభాషలో నడుస్తున్న వేలాది పాఠశాలల్లో కనీస ప్రమాణాలు సాధ్యం కావడం లేదని అనేక సర్వేలు స్పష్టం చేస్తున్నప్పుడు వాటిని మెరుగు పరచడం కోసం ఆలోచించడం లేదు. ఇప్పటికీ సక్సెస్ స్కూళ్ల పేరిట నడుపబడుతున్న 6500 పాఠశాలలకు సరైన పోస్టుల మంజూరీ లేక విద్యార్థుల సంఖ్య పరిమితంగా ఉన్నటువంటి పాఠశాలల గురించి పట్టించుకోకపోవడం శోచనీయం.

ఆ మోడల్ స్కూళ్లకు కేటాయించిన బడ్జెట్‌ను ఇప్పుడున్న పాఠశాల లకు మెరుగైన వసతుల కోసం, అన్ని సబ్జెక్టులకు, అన్ని తరగతులకు టీచర్లను నియమించడం కోసం ఆలోచించాల్సింది. అసలు ప్రాథమిక విద్యారంగం పూర్తిగా నిర్లక్ష్యం చేయడం వల్ల విద్యార్థుల్లో కనీస స్థాయిల్ని సాధించలేకపోతున్నామని టీచర్లు వాపోతున్నారు. ఇందుకు భిన్నంగా కొద్ది మందికే మంచి అవకాశాలు అన్న పద్ధతిలో మండలంలో ఏర్పాటు చేస్తున్న మోడల్ స్కూళ్ల వల్ల గ్రామాలలోని పాఠశాలలు, మాతృభాషలోని విద్య పూర్తిగా నిర్లక్ష్యానికి గురి కానున్నాయి.

మెరుగైన విద్యార్థుల్ని ఎంపిక చేసుకోవడం వల్ల, తెలుగు మీడియంలో మెరుగైన విద్యార్థుల్ని ఇప్పటికే సక్సెస్ స్కూళ్లలో, ఆంగ్ల మాధ్యమంలో

ఎం.జె. - జీవితమంతా పోరాటమే

మూడు దశాబ్దాలుగా ప్రజా ఉద్యమాలన్నిటిలోనూ సాధారణ రైతు ఆహార్యంతో అసాధారణ ప్రభావం వేసి ఇటీవల మరణించిన ఎంజె సుబ్బరామిరెడ్డి జీవితాన్ని వివరిస్తున్నారు **పి. వరలక్ష్మి**

'ఆ మిణుగురు దారి పొడవునా వెలుతురు పువ్వుల్ని రాల్చుకుంటూ వెళ్లిపోయింది. పదండి, ఏరుకుంటూ ముందుకెళదాం..' కామ్రేడ్ ఎం.జె. కోసం ఒక కవి మిత్రుడి కలం నుండి మెరిసిన అక్షర నివాళి. ఇవి ఆయన జీవితానికి అద్దం పట్టే పదాలు. ఎం.జె.గా రాయలసీమలో సుపరిచితులైన ములపాకు జంగంరెడ్డి సుబ్బరామిరెడ్డి తన జీవితమంతా వ్యవస్థతో గొడవ పడుతూ ఈ ఆగస్ట్ 2న (తన 62వ ఏట) శాశ్వత విశ్రాంతికిలోకి వెళ్లిపోయాడు. చేతిలో సంచి, మాసిన గడ్డం, అడ్డపంచె, భుజంపై ఎర్ర తువాలు.. పాత తరం మధ్యతరగతి రైతు ఆహార్యంతో దాదాపు జీవితమంతా సంచారంలోనే గడిపిన ఎం.జె.ది అంతుపట్టని ఒక విలక్షణమైన వ్యక్తిత్వం. రాయలసీమలోనే కాదు, రాష్ట్రవ్యాప్తంగా విప్లవ ప్రజాసంఘాలతో పరిచయమున్న వారందరూ ఆయనను మహామొండి మనిషిగా గుర్తిస్తారు. ఆయన ఎక్కడ ఏ సమావేశం జరిగినా, ఏ పిలుపులేకపోయినా ఎక్కడినుండో వచ్చి ప్రత్యక్షమవుతాడు. (విరసం సభల్లో దాదాపు తప్పనిసరిగా కనపడేవాడు.) ఉపన్యాసాలు, చర్చలు సాంతం శ్రద్ధగా వింటాడు. చిత్తుకాగితాల వంటి వాటిపై రాసుకుంటూ కూర్చుంటాడు. ఆయనకు అవసరమనిపించినప్పుడు, అది ఏ మీటింగైనా చనువుగా చొరబడి మాట్లాడతాడు. వాదిస్తాడు. ఒక్కోసారి ఆయన నమ్మే భావజాలానికి ఏ మాత్రం సంబంధం లేని సమావేశాల్లో చొరబడి గొడవ పడతాడు. అధికార్లను, సోకాల్డ్ ప్రజాప్రతినిధులను చడామడా కడిగేస్తాడు. చాలాసార్లు గెంటేయబడతాడు. ఒక్కోసారి దెబ్బలు కూడా తింటాడు. ఆయనంతే, మొండోడు.. పిచ్చోడు.. అనే కామెంట్స్ తరచుగా వినపడుతుంటాయి. కాని ఆయన్ని కదిలిస్తే అనర్గళంగా సిద్ధాంతం, రాజకీయాలు చర్చిస్తాడు. పురాణాలు, మతగ్రంథాలను రెఫర్ చేస్తాడు. ఎక్కడెక్కడి చరిత్రనో కళ్లముందు నిలుపుతాడు. రాయలసీమ నీటి కేటాయింపులు, వివాదాలు, టిఎంసిల లెక్కలు చిన్న పిల్లలకు కూడా అర్థమయ్యేలా విడమర్చి చెప్తాడు. మొండిగా, మొరటుగా ఉంటాడు కానీ, ఆయన జ్ఞానం అనితరసాధ్యం... ఇవి ఆయనతో ఏ కొద్ది పరిచయమున్న వ్యక్తులైనా ఆయన గురించి చెప్పే విషయాలు. ఎవరెన్ని పరిశీలనలు చేసినా సులభంగా అంతుచిక్కని సంక్లిష్టత ఆయన వ్యక్తిత్వానిది.

ఎం.జె.కు వ్యక్తిగత జీవితం దాదాపు లేదు. ఆయన వివాహం చేసుకోలేదు. కడపజిల్లా మైదుకూరులో ఆయన అక్క, మేనల్లుడి ఇళ్లు కేరాఫ్ అడ్రస్. మైదుకూరులో బస్సుదిగి ఎవరినడిగినా ఆయన ఎక్కడుంటారో చెప్తారు. అయినా ఆయనది ఎక్కువగా సంచార జీవితమే. ఏ ఊరిలో ఏ సమస్యపై ఆందోళనకు దిగుతాడో అది తేలే వరకు ఆయన మకాం అక్కడే. కడుపునిండా తిండి తప్ప ఏమీ ఆశించని వాడు. సుదీర్ఘకాలం పాటు కె.సి. కెనాల్ ఆయకట్టుదారుల సమస్యలపై, కె.పి. ఉల్లి గిట్టుబాటు ధర కోసం, పసుపు రైతుల కోసం అవిశ్రాంతంగా పోరాడిన వాడు. మద్యంపై రాజీలేని పోరాటం చేసినవాడు. ఎక్కడికక్కడ ప్రజాసమస్యలపై ఉద్యమించే ఆయన తెగింపు ఒక్కోసారి ఆశ్చర్యం కలిగిస్తుంది. అది ఒక సమూహానికి సంబంధించిన సమస్య అయినా,

---

చేర్చడం వలన అటు తెలుగు మీడియం ఫలితాలు ఒకరకంగా దెబ్బతింటే, ఇటు ఇంగ్లిష్ మీడియంలో బోధనా అస్తవ్యస్తంగా మారింది.

అసలు ప్రభుత్వాలకు పేద, ధనిక పిల్లలందరికీ సమానమైన, నాణ్యమైన విద్యను అందించాలన్న లక్ష్యం ఉండి ఉంటే ఇప్పుడున్న వివిధ యాజమాన్యాల్లోని పాఠశాలలన్నిటిని ప్రభుత్వ యాజమాన్యం కిందకు తీసుకరావాలి. మోడల్ స్కూళ్లకు కేటాయిస్తున్న నిధులను, నియామకాలను ఇప్పటికే కొనసాగుతున్న సక్సెస్ పాఠశాలలను బలోపేతం చేసి, ఎక్కువ మంది విద్యార్థులకు విద్యను అందించవచ్చును. సక్సెస్ పాఠశాలలకు సరైన వనరులు కల్పించి బలోపేతం చేయడం మానేసి, పాఠశాల విద్యారంగాన్ని అస్తవ్యస్తంగా మార్చడానికి ప్రభుత్వం పూనుకుంటోంది. ప్రైవేట్, ఎయిడెడ్, అన్ ఎయిడెడ్ పాఠశాలలన్నిటినీ ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి. పాఠశాల విద్యారంగంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సవాలక్ష సమస్యల్ని విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలు, మేధావులతో చర్చించి ఒకే రకమైన విద్యను అందించడానికి కృషి చేయాలి.

అంతిమంగా కొఠారీ కమిషన్ 1966లో సూచించినట్లుగా ఎవరి పిల్లలపైనా స్థానిక పాఠశాలల్లో చదివే అవకాశం కలిగించాలి. విద్యార్థులకు అవసరమైన విద్యా సంబంధ అంశాలన్నిటితో పాటు, హాస్టల్ సౌకర్యాలను కల్పించాలి. మధ్యాహ్న భోజనాన్ని మెరుగుపర్చడంతో పాటు, కుప్పకూలిపోతున్న ప్రాథమిక, మాధ్యమిక విద్యలను కామన్ స్కూల్ విధానంలోకి తీసుకురావాలి.

మోడల్ స్కూళ్ల పేరిట మిగిలిన ప్రభుత్వ పాఠశాలల్ని డల్ స్కూల్స్‌గా మార్చి విద్యార్థుల సంఖ్య, మాధ్యమం పట్ల వివక్షతతో ప్రభుత్వ విద్యా రంగాన్ని నాశనం చేయకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలపై ఉంది.

దళిత బహుజన పేద పిల్లలకు నాసిరకం విద్య, అంతో, ఇంతో ఆర్థిక స్తోమత, అవకాశాలు గల పిల్లలకు మెరుగైన విద్య అందించడం ద్వారా ప్రభుత్వమే ప్రజాస్వామిక సూత్రాలకు విరుద్ధంగా ప్రవర్తిస్తోంది. విద్యార్థుల్లో విభజన రేఖను గీస్తోంది.

ఈ పద్ధతుల వల్ల కేవలం పది పాస్ కావడమే ప్రభుత్వ పాఠశాలల కర్తవ్యంగా, కనీస ప్రమాణాలు, అవకాశాలు లేని విద్యా వ్యవస్థను ప్రభుత్వం సృష్టించబోతోంది. మోడల్ స్కూల్స్ తెరవాలని ఆందోళనకు పూనుకొంటున్న విద్యార్థి, ఉపాధ్యాయ, విద్యాభిమానులు అందరూ సమాన విద్యావకాశాల కోసం పోరాటం చేయాలి.

(రచయిత తెలంగాణ టీచర్స్ ఫోరం కన్వీనర్) వీ

ఒక వ్యక్తి సమస్య అయినా బాధితులను వెంటబెట్టుకొని అధికార్లతో, నాయకులతో గొడవకు తెగబడతాడు. చాలాసార్లు ఒక్కడిగానే! జనం మన వెంట లేకుంటేనేం, తప్పు జరుగుతున్నప్పుడు దాన్ని ఎండగట్టాలి. అన్యాయాన్ని అన్యాయం అనాలి. మీరెవ్వరూ లేకపోయినా నేనొక్కడినైనా నిలబడతానంటాడు. దానివల్ల ప్రయోజనమేంటి అంటే తప్పును తప్పు అనడం, అన్యాయాన్ని అన్యాయం అని అరవడమే ప్రయోజనం అని వాదిస్తాడు. ఇంకొంచెం వాదనలోకి దిగితే కోపంతో విరుచుకుపడతాడు. లెక్కలేనన్నిసార్లు పోలీసు దెబ్బలు తిని ఉంటాడు. రక్తం కార్చుకుంటూనే నిరసనల్లో పాల్గొన్న సందర్భాలున్నాయి. ఎన్నో సార్లు అరెస్టయ్యాడు. కేసుల గురించి లాయర్లకే సలహాలిస్తాడు. ఆయన కేసులు ఆయనే వాదించుకున్న సందర్భాలూ ఉన్నాయి. ఎప్పుడు ఏం చేస్తాడో ఎవరికీ అంతుబట్టదు. ఇటీవలి ఉపఎన్నికల్లో పోటీచేయడానికి ఆయన పులివెందుల బయలుదేరి వెళ్లాడు. వై.యస్.విజయమ్మకు పోటీగా నామినేషన్ వేయబోతే అక్కడ ఆయనను అడ్డుకొని అరెస్టు చేశారు. మరుసటిరోజు 'పులివెందులలో ప్రజాస్వామ్యం లేదనడానికి ఇదే దాఖలా' అంటూ అయన ఇచ్చిన పత్రికా ప్రకటన చూసి మేమంతా అవాక్కయ్యాం. ఆయన ఏ సంఘంలోనూ ఉండడు. ఒక్కోసారి సంఘాలే ఆయన దగ్గరికి పోయి ఆందోళనలకు మద్దతుగా నిలబడతాయి. ఆయన మొండితనం నిర్మాణాలకు సమస్యలు తెచ్చిపెట్టేది. (వివిధ కమిటీల్లో ఆయనతోపాటు పనిచేసిన వారు దీనికి సంబంధించిన ఎన్నో అనుభవాలు చెప్తారు.) అసలు ఆయనే నిర్మాణాల్లో పొసగేవాడు కాదు. విద్యార్థి దశనుండి వివిధ సంఘాల్లో పనిచేసి చివరికి ఆయనే రాయలసీమ పౌరహక్కుల సంఘం పెట్టుకున్నాడు. అందులో ఆయన తప్ప మరో కార్యకర్త కనపడరు.

నిజానికి ఆయన వ్యక్తిత్వం నిర్మాణాల్లో పనిచేస్తున్న వారికి పెద్ద ప్రశ్న. అతడే ఒక సైన్యంలా కదిలే బలం ఆయనకు ఎక్కడి నుండి వచ్చింది? ఏ నిర్మాణాల్లో లేకున్నా ఆయన జనంతో, జనం ఆయనతో ఎలా ఉన్నారు? బహుశా అది వ్యక్తిగత జీవితాన్ని త్యజించడం వల్ల వచ్చిన బలమేమో. విప్లవ రాజకీయాలు సరే. కాని వ్యవస్థతో రాజీపడనితత్వం ఆయన వ్యక్తిత్వంలోనే ఉన్నది కావచ్చు. వ్యవస్థ దుర్మార్గాల పట్ల విపరీతమైన అసహనం, ప్రజలపై అవ్యాజమైన ప్రేమ, మాటలో, చేతలో ఎక్కడా తొణకనితనం ఆయన చిన్నతనం నుండి ఉండేదని చెప్తారు. చిన్నతనంలో ఆయన గాంధేయవాది. ఆయన పుట్టిన ఊరు తిప్పాయపల్లెలో మరుగుదొడ్లు ఊడ్చడం చూసి ఆయనను పిచ్చోడనుకునేవారట. విద్యార్థిగా ఆయన అత్యంత చురుకైన పిల్లవాడని ఆయన మిత్రులు చెప్తారు. ఫిఫ్త్ ఫారంలోనే ఆయన కంద పద్యం రాసి గురువుల్ని ఆశ్చర్యపరిచాడట. ఎస్ఎస్ఎల్సిలో ఉన్నప్పుడు భగవద్గీత శ్లోకాలు అనర్గళంగా వల్లెవేయడం చూసి ఏదో హిందూమతపీఠం వాళ్లు ఆయనను సన్యాసాశ్రమంలోకి ఆహ్వానించిన సందర్భమొకటి వాళ్ల బంధువులు చెప్తారు. అయితే అటుతర్వాత ఆయన హేతువాద, వామపక్ష సాహిత్యం, మిత్రుల సాహచర్యంలో కమ్యూనిస్టయ్యాడు. నక్సల్బరీ రాజకీయాల వెలుగులో తొలిదశలో ఆయన విరసం సభ్యుడయ్యాడు. ఆ తర్వాత రైతుకూలీ సంఘంలో, ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం లోనూ పనిచేశాడు. అదే సమయంలో 1972 జైఆంధ్రా ఉద్యమం, 80ల్లో జరిగిన రాయలసీమ ఉద్యమంలో ఆయనది క్రియాశీలక పాత్ర. రాయలసీమ విషయంలో ఆయనది కచ్చితమైన వైఖరి. ఇటీవలి 'సమైక్యాంధ్ర' శబ్ద కాలుష్యంలో ఆయన కడప నుండి ప్రత్యేక రాయలసీమ వాదన వినిపించడమే కాదు, తెలంగాణ ప్రజల ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను గట్టిగా బలపరిచాడు. రెండు ప్రాంతాల్లో పెద్దమనుషుల ఒప్పందాలు ఎట్లా వంచనకు గురయ్యాయో ఆయన అత్యంత వివరంగా, అంతే సరళంగా వివరించేవాడు.

మొరటుగా, మొండిగా కనపడే ఎం.జె. ఒక్కోసారి ఏదో జనం సమస్యను వివరిస్తూ కళ్లనీళ్లు పెట్టుకుంటాడు. ఆయన మొండి తనం వెనక ఉన్న సున్నిత మనసు చూడగలిగితే బహుశా ఆయన సంక్లిష్టమైన వ్యక్తిత్వం అర్థమవుతుంది. ఒకసారి చెన్నూరు(కడప పక్కన చిన్న ఊరు)లో బాగా తాగి ఉన్న ఒక పోలీసాయన దారిలో అడ్డంగా మొరుగుతున్న ఒక కుక్కను విపరీతంగా కొడితే అది చచ్చిపోయింది. ఎం.జె. దాన్ని తీసుకుని సరాసరి పోలీసుస్టేషనుకు పోయి కేసు రిజిస్టరు చేయమని పోలీసులతో గొడవపడ్డాడట. ఆయనకు ప్రాణం విలువను గుర్తించడం లో, హింస పట్ల వ్యతిరేకతలో ఎంత సున్నితత్వం, గాఢత ఉన్నాయో అంచనా వేయగలిగితేగాని వ్యవస్థ పట్ల, దాని దుర్మార్గం పట్ల ఆయనకున్న ఆగ్రహంలోని తీవ్రత అర్థం కాదు. ఈ సంఘంలోని అపసవ్యతను, అన్యాయాలను ప్రశ్నించిన వేమన వంటి వ్యక్తిత్వం రూపుదిద్దుకున్న రాయలసీమలో ఎం.జె. వంటి మరో విలక్షణమైన వ్యక్తిత్వం రూపొందింది. సమాజంలో వ్యక్తిగత ఆస్తి పునాదిపై నిర్మాణమైన కుహనా విలువల్ని కాలదన్నివేసి, తన సొంతమైనదంటూ ఏమీ ఉంచుకోని ధిక్కార సంస్కృతికి చిహ్నమైన వేమన అంటే ఎం.జె.కు చాలా ఇష్టం. విగ్రహాల సంస్కృతికి వ్యతిరేకమైనా మైదుకూరులో వేమన విగ్రహాన్ని నెలకొల్పడానికి ఆయన పోరాటం చేశాడు. ఈ ఆధునిక యుగంలోనూ ఫ్యూడల్ పట్టు విపరీతంగా ఉన్న రాయలసీమలో, రాజకీయ, సాంస్కృతిక ఉద్యమాల ప్రభావాలు పెద్దగా లేని రాయలసీమలో వ్యక్తిగానే వ్యవస్థతో జీవితమంతా గొడవపడుతూనే వెళ్లిపోయిన ఆయన విప్లవ రాజకీయాలతో ఉంటూ కూడా ఏ నిర్మాణాలు చేయలేకపోవడానికి, ఏ నిర్మాణాల్లో భాగం కాలేకపోడానికి ఆ నేల నుండి రూపుదిద్దుకున్న ఆయన సంక్లిష్టమైన వ్యక్తిత్వమే కారణమా, ఆలోచించాలి.

'91 నుండి ఎం.జె. రాయలసీమ పౌరహక్కుల సంఘం పేరుతో అన్నీ తానే అయి పనిచేస్తున్నాడు. ఈ క్రమమంతా ఆయన విస్తృతంగా రాయలసీమ గ్రామాలు తిరిగాడు. కడప జిల్లాలో కొన్ని పల్లెల్లోనయితే ఆయనకు ప్రతి గడపతో పరిచయం. పిల్లలు, పెద్దలతో సహా అందరి పేర్లూ ఆయనకు గుర్తుంటాయి. ఆయన దళితుల్లో ఎంత మమేక మయ్యాడంటే ఇక్కడి దళిత సంఘాల ప్రతినిధుల మాటల్లో చెప్పాలంటే మాలల్లో పనిచేస్తున్నప్పుడు ఆయన ఎం.జె. మాల. మాదిగల్లో పనిచేసేటప్పుడు ఆయన ఎం.జె. మాదిగ. ఒక ఎంఆర్పిఎస్ జిల్లాస్థాయి నాయకుడు మైదుకూరులో జరిగిన ఆయన సంస్మరణ సభలో ఎం.జె. అంటే మాదిగ జాంబవంతుడు అన్నాడు. ఆయన అంత్యక్రియల్లో విప్లవాభిమానులు ఎర్రజెండా పట్టుకొని, రైతు సంఘాల వాళ్లు పచ్చజెండా పట్టుకొని వచ్చారు. ఇంకొకరెవరో జాతీయ జెండా తీసుకొచ్చారు. మద్యంపై పోరాడిన పెద్దపసుపుల మహిళలు వచ్చి ఆయన మావాడన్నారు. ఆ ఊర్లో ఆయన ఇల్లిల్లూ తిరిగి మద్యం మానమని ప్రమాణాలు చేయించాడు మరి. ఆయన మనముందు పరిచిపెట్టిపోయిన ఆయన జీవితాన్ని చూస్తే ఒకేసారి ఆయన ఎన్నెన్ని సమూహాల వెంట నడిచాడోనని ఆశ్చర్యమనిపిస్తుంది. అయితే ఆయనే కోరుకున్నట్టు విరసం, అమరుల బంధుమిత్రుల సంఘం వాళ్లం కలిసి ఆయన దేహంపై ఎర్రజెండా కప్పాము. కనపడగానే పిడికిలి బిగించి అభివాదం చేసే కొండంత మనిషిని ఇక చూడం కదా అని దు:ఖిస్తూ ఆయనకు లాల్‌సలాంలు చెప్పాము.

(రచయిత విప్లవ రచయితల సంఘం కార్యదర్శి) వీ

ఐక్య పోరాటాల్ని రగిలించడమే నేటి లక్ష్యం

కులతగాదాల కుంపటిని రాజేయడం కాదు. ఐక్యపోరాటాల్ని రగిలించడమే నేటి లక్ష్యం! లక్షింపేట భూమి సమస్య నుంచి గ్రహించాల్సిన సందేశం ఇదే!

'లక్షింపేట-భూమి సమస్య మౌలికం' శీర్షికతో వీక్షణం ఆగస్ట్ 2012 లో ప్రచురించిన సవివరమైన రిపోర్టులు-వ్యాఖ్యలు బాగున్నాయి. విషయాన్ని లోతుగా పరిశీలించడానికి ఉపయోగపడేలా ఉన్నాయి. ఈ సంఘటనలో కథనాల్లో గమనించవలసిన కొన్ని అంశాలు ఇవీ.

1. లక్షింపేట సర్పంచ్ సింహాలమ్మ మాలకులస్తురాలు, స్థానిక (రాజాం) ఎం.ఎల్.ఎ. కొండ్రు మురళి కూడా అదే కులం. అంతేకాక ప్రస్తుతం మంత్రి కూడా. డి.ఎస్.పి. ఇంకా వివిధ స్థాయిల్లో అధికారులూ మాలలే. అయినా మాలలకు న్యాయం జరగలేదు. మనోడే అనుకున్నా అతను ఉపయోగపడేది ఆధిపత్య వర్గాలకే తప్ప, అణగారిన వారికి కాదనేది అక్షర సత్యం. ఈ కులం, పదవుల్లో రిజర్వేషన్‌లు, పాలకవర్గాల ఓటుబ్యాంక్ రాజకీయాల కోసం, వాటిని పొందిన వ్యక్తుల మేలు కోసమే తప్ప, పీడిత ప్రజల కోసం కాదని మరోసారి స్పష్టమైంది. అందుకే మంత్రి గారికి భూమి సమస్యను వివరించుకొంటే ఆ బురదలోకి నన్ను లాగవద్దని ఆయన అన్నారు.

2. దాడికి పాల్పడిన తూర్పు కాపులు బి.సి.లకు చెందినవారు. వారికి ఈ జిల్లాలో రాజకీయ బలం, బొత్స వారి ద్వారా అధికార పదవులూ చాలానే ఉన్నాయి. రాష్ట్ర మంత్రివర్గంలో, అధికారపార్టీలో కీలకమైన బొత్స కూడా అందులో ఒకరు. అయినా ఈ నాయకులకు తమ ప్రాంతంలో ప్రజల మధ్య ఐక్యత అక్కరలేదు. ఆ ప్రజల పట్ల బాధ్యతా లేదు. దౌర్జన్యాన్ని, అన్యాయాన్ని ప్రోత్సహించడానికి వారి కులం, పదవీ ఉపయోగపడినాయే తప్ప, నిగ్రహానికీ, న్యాయానికీ తోడ్పడలేదు.

3. ఈ గ్రామంలోని, ప్రాంతంలోని ప్రబలమైన పార్టీ అధికార కాంగ్రెస్. ఇక్కడి మాలలు, తూర్పు కాపులూ కూడా 2009లో ఆ పార్టీకే హెచ్చు ఓట్లు వేసి గెలిపించారు. అంతా ఒకే (అధికార) పార్టీ అయినా, ఇద్దరి నాయకులూ ఒకే గ్రూపు వారయినా ఆ ప్రజలను ఐక్యం చేయడానికీ, న్యాయమైన రాజీకి రావడానికీ ఈ పార్టీ, ఈ గ్రూపు రాజకీయం తోడ్పడలేదు. ఏదో ఒక మేరకు అక్కడున్న ముఖ్య ప్రతిపక్ష పార్టీ కూడా ఈ విషయంలో అక్కరకు రాలేదు. సమస్య కొద్ది ఏళ్లుగా రగులుతున్నా ఈ పార్టీలేవీ ప్రజలను ఐక్యం చేసి, రాజీతో పరిష్కరించలేదు. విభజించి పాలించే రాజకీయాలివి - అని మరోసారి ధృడపడింది.

4. అంబేద్కర్, పూలేల పేర్లు చెప్పుకొని తిరిగేవారు చాలామందే తయారయ్యారు. అలాంటి వారు పాలక పార్టీల్లో, ముఖ్యంగా కాంగ్రెస్‌లో కూడా ఉన్నారు. ఉద్యోగస్తుల్లో, ముఖ్యంగా అధికారుల్లోనూ ఉన్నారు. పూలే బొమ్మని ప్రముఖంగా తెచ్చి, బిసి రాజకీయంతో వచ్చిన చిరంజీవి పార్టీ కాంగ్రెస్‌లో కలిసిపోయింది. 'దళిత - బహుజన ఐక్యత' పేరిట రాజకీయం చేస్తున్న ప్రతిపక్షాలూ, ఉద్యమ సంస్థలూ, నాయకులూ కూడా మీడియా నిండా వెలిగిపోతున్నారు. ఏళ్లకొద్దీ రగులుతున్న ఈ సమస్య హత్యాకాండగా పరిణమించకుండా ఈ శక్తులేవీ ప్రయత్నించ లేదు. వారికీ 'రాజ్యాధికారం' మీద కన్నే తప్ప, ప్రజల పట్ల బాధ్యత లేదు. కమ్యూనిస్టు నామధేయులు, ముఖ్యంగా 'మాజీ'లు చాలామంది కూడా రాష్ట్రంలో ఈ దళిత - బహుజన రాజకీయాలు చేస్తున్నారు. అధికార, ప్రతిపక్ష రాజకీయాల్లో ఉన్న వీరందరికీ 'దళిత - బహుజన రాజకీయాలు' ఓటు బ్యాంకుల కోసమే తప్ప, ప్రజల సంక్షేమం కోసం కాదు. 'రాజ్యాధికారం' అనేమాట వీరు తరచూ వల్లిస్తున్నా, నిజానికి అది 'దళిత - బహుజన కులాల' విశాల ప్రజలకు ఒరగబెడుతున్నదేమీ లేదు. (కొద్దిమందికి రిజర్వేషన్లు తప్ప). ఆ మాటకొస్తే అది 'ప్రభుత్వం'లో, దోపిడీలో వాటా కోసమే తప్ప, దానివల్ల రాజ్యంలో ప్రజానుకూలత ఏమీ లేదు. రాజ్యం (అధికారవర్గం, పోలీసు, కోర్టు, జైలు మొదలైనవి) దోపిడీ వర్గాల చేతిలో అణచివేత సాధనంగా ఉందేతప్ప, ప్రజలకేమీ రక్షణగా లేదు. లక్షింపేట సమస్య అధికారుల మధ్య, కోర్టుల్లో ఏళ్లుగా నలుగుతున్నా - ఈ దురంతాన్ని ఆపలేకపోయింది రాజ్యం. దౌర్జన్యాన్ని ప్రేరేపించడానికి, దౌర్జన్యకారులను కాపాడడానికీ ఈ 'రాజ్యం' ఉపయోగపడుతున్నదే తప్ప, పీడిత ప్రజలకు కాదు. ఇది వారి రాజ్యం కాదు - అని లక్షింపేట మరోసారి స్పష్టం చేసింది.

5. రాష్ట్రంలో ఇలాంటి మూకుమ్మడి దాడులు గతంలోనూ జరిగాయి (కారంచేడు, చుండూరు, నీరుకొండ మొదలైనవి). ఇవి ఏవీ వర్గ పోరాటాలు, విప్లవశక్తులు ప్రబలంగా ఉన్నచోట్ల జరుగలేదు. అలాంటి చోట్ల కూడా వ్యక్తుల, గుంపుల స్థాయిలో కులం - కుల ద్వేషాలు ఉన్నా, పీడితులపై మూకుమ్మడి దాడులు చేయగలిగిన దుస్సాహసం సంభవించలేదు. దశాబ్దాల అనుభవం నిరూపిస్తున్న సత్యం ఇది. ఎన్ని లోపాలు ఉన్నా కమ్యూనిస్టులూ, వర్గపోరాట శక్తులూ గర్వంగా చెప్పుకోదగినదీ వాస్తవం. దళిత - బహుజన రాజకీయాల పేరిట సాగుతున్నదంతా 'అధికారంలో' వాటాకోసమే తప్ప, పీడిత ప్రజల హక్కుల కోసం కాదు. నేటి 'రాజ్యంలో' పీడిత ప్రజలకు స్థానంలేదని అనుభవాలు పదే పదే చెప్తున్నాయి. జనాభాలో 2-3 శాతం కూడా లేని ప్రభుత్వం(రంగ) ఉద్యోగులకు రిజర్వేషన్‌లు ఉపయోగపడుతున్నాయి. రాష్ట్రంలో 80 శాతం మందికిపైగా జనం తెల్లకార్డులు, వాటివల్ల లభించేవి పొందుతున్నారు. వీటిని మినహాయిస్తే దళిత - బహుజన రాజకీయాల వల్ల విశాల ప్రజలకు ఒరిగేది ఏమీ లేదు. పాలకవర్గంలో కొత్తగా వచ్చి చేరిన శ్రేణులకు దోపిడీలో వాటాకు, వారి సాయంతో దోపిడీరాజ్య రాజకీయ పటిష్టతకు అవి ఉపయోగపడతాయే తప్ప, పీడిత ప్రజల రక్షణకు, వారి వికాసానికీ అక్కరకు రావడం లేదు. యుపి, బీహార్ లాంటి చోట్ల దళిత - బహుజన రాజకీయాల పేరిట సాగుతున్న దోపిడీ అనుభవాన్ని ఇప్పటికే ఒకటి రెండు దశాబ్దాలుగా చూస్తున్నాం. అట్టడుగు, కింది కులాల నుంచి 'నియోరిచ్' కొత్త దోపిడీ వర్గాలు పెంపొంది, తమ జేబులు నింపుకొని, దోపిడీ రాజ్యాన్ని ఎలా పటిష్టం చేస్తున్నారో అక్కడే కాదు, మన రాష్ట్రంలోనూ చూస్తున్నాం. లక్షింపేటలో రెండు వైపులా నాయకత్వ స్థానంలో ఉన్నది ఇలాంటి దోపిడీ వర్గాలూ, శక్తులే. వర్గపోరాట శక్తులు తమ లోపాల్ని అధిగమించి, పీడిత ప్రజల మధ్య పోరాట ఐక్యతకు పునరంకితమవ్వాల్సిన అవసరాన్ని లక్షింపేట నొక్కి చెప్తున్నది. లెంపలు వేసుకోవల్సింది వారు కాదు, దళిత - బహుజన రాజకీయాల పేరిట ప్రజల పోరాట ఐక్యతను దెబ్బతీస్తున్నవారు. 'సమాజం మొత్తంగానే ఈ దుర్మార్గ హత్యాకాండల పట్ల తీవ్రమైన ప్రతిస్పందన చూపకుండా ఎలా ఉండగలుగుతున్నది? గతంలో తానే ప్రదర్శించిన చైతన్యాన్నయినా, స్పందననయినా చూపలేనంత నిస్సహాయ స్థితిలోకి ఎందుకు జారిపోతున్నది?' అనే ప్రశ్నను సంపాదకీయంలో లేవనెత్తారు. దేశ, రాష్ట్ర రాజకీయాల్లో దళిత - బహుజన రాజకీయాల పేరిట దెబ్బతిన్న ప్రజల పోరాట ఐక్యత దీనికొక ముఖ్యకారణం. ఈ రాజకీయాలు దోపిడీ వర్గాల పార్లమెంటరీ వ్యవస్థకు, వారి 'విభజించి పాలించే' ఎత్తుగడలకు ఉపయోగపడుతున్నాయే తప్ప, పీడిత వర్గాలకు, వారి విప్లవ లక్ష్యానికి తోడ్పడలేవు. పైగా అవరోధంగా కూడా తయారవుతాయి, అయినాయి. వర్గపోరాట శక్తులు చేయాల్సిన పని - తాము లెంపలు వేసుకోవడం కాదు, చీలిక రాజకీయాలను తమలో కూడా ప్రవేశించిన ఈ తప్పుడు భావజాలాలనీ, పెడధోరణులనూ సవాలు చేసి పోరాడడం. సామ్రాజ్యవాదులు, వారి దళారీ పాలకవర్గాలు ఈ చీలిక రాజకీయాలను పనిగట్టుకొని పెంపొందిస్తున్నారని వారు గ్రహించాలి. ఈ పెడధోరణుల్లో కొట్టుకు పోకుండా అన్ని కులాల్లోని పీడిత జనం, పీడిత జన పక్షపాతులు గట్టిగా నిలబడాలి. కులాలకతీతంగా పోరాట ఐక్యత నేటి అవసరం.

6. 'భూమి సమస్యే మౌలికం' అన్న శీర్షిక కీలకమైనది. అదే సమయంలో కులం పాత్రను విస్మరించలేం. పైన పేర్కొన్న వర్గపోరాట ఐక్యతను పెంపొందించ నప్పుడు – ప్రజల్లో ఉండేది ఫ్యూడల్ వెనుకబాటుతనం, అందులో విడదీయరాని భాగంగా ఉన్న కులతత్వం, కుల దురహంకారం. లక్షింపేటలో వాటి నగ్న తాండవాన్ని చూశాం. దీన్ని ఎదుర్కొని దెబ్బతీయాలి. అయితే ఈ సందర్భంగా రెండు విషయాలు గమనించాలి:

దేశంలోని పేదరికం, వెనుకబాటుతనం, వనరుల పరిమితి వల్ల భూ సమస్య చాలా తీవ్రరూపాల్లో, ఒక్కోసారి వికృత రూపాల్లో వ్యక్తమవుతుంది. అది మతం రూపంలో (1921 మోప్లా తిరుగుబాటు నుంచి నేటి కోక్రార్ఝార్ దాకా), కులం రూపంలో (బీహార్ కుల సైన్యాల నుంచి కారంచేడు, లక్షింపేట దాకా) కూడా వ్యక్తమవుతుంది. రూపమూ ముఖ్యమే కాని, దాని వెనక ఉన్నది మౌలికం. కవర్ పేజీ శీర్షిక దాన్నే నొక్కి చెప్పింది. లోపలి పేజీల్లో శీర్షిక రెండో అంశాన్ని ఎత్తి చూపింది. 'జర్మనీలో రైతాంగ యుద్ధం' అన్న రచనలో ఎంగెల్స్ 16వ దశాబ్దంలోని 'సోకాల్డ్ మత యుద్ధాలు' వాస్తవంలో వర్గ ప్రయోజనాలతో, వర్గ యుద్ధంతో ఎలా కూడి ఉన్నాయో వివరించాడు. 'వివిధ వర్గాల ప్రయోజనాలు, అవసరాలు, డిమాండ్లు మతం తెరచాటున దాగి ఉన్నా, అసలు విషయంలో మార్పేమీ ఉండదు'. ఆ కాలాన్ని బట్టి అవి (సాయుధ రూపంతో సహా) వివిధ రూపాల్లో వ్యక్తమవుతాయని చెబుతాడు. మన దేశంలో మతానికే కాక, కులానికీ ఇది వర్తిస్తుంది.

లక్షింపేటలో కుల ఘర్షణ రూపంలో దాని చాటున వర్గ ఘర్షణ ఉంది. తూర్పు కాపులు మాలలపై చేసిన దాడి రూపంలో జరిగినా, దీని వెనుక భూమి సమస్య, అందులో ఆయా వర్గాల 'ప్రయోజనాలు, అవసరాలు, డిమాండ్లు' ఇమిడి ఉన్నాయి. అయితే దీనర్థం తూర్పు కాపుల వర్గానికి, మాలల వర్గానికి మధ్య వర్గపోరాటం కాదు. కులాన్ని వర్గంగా చూపెట్టే మీడియా పరిభాష, కుల శక్తుల భాష అలా చిత్రిస్తున్నది. అది తప్పు. ఇందులో భూస్వామ్య విధానానికీ, ప్రజలకూ మధ్యనున్న వైరుధ్యంతో పాటు ప్రజల మధ్య వైరుధ్యం కూడా దాగి ఉంది. ఈ రెండు వైరుధ్యాలనూ జాగ్రత్తగా వేరుచేసి చూడాలి.

7. తూర్పు కాపులంతా అగ్రవర్గాలు, శత్రువర్గాలు అన్న రీతిలో కొందరు (వీక్షణం కాదు) వ్యాఖ్యానిస్తున్నారు. అగ్రవర్ణ వ్యతిరేకపోరాటం పేరిట దీన్ని కల్తీలేని వర్గ ఘర్షణలాగా చిత్రిస్తున్నారు. నిజానికి తూర్పు కాపుల్లోనూ నూటికి 90 మంది రైతాంగమే. అందులో అధిక భాగం పేద రైతాంగం కూడా. లక్షింపేట కూడా దీనికి మినహాయింపు కాదు. కాని భూమి సమస్య, పేదరికం, రైతాంగంలో ఉండే ఫ్యూడల్ ప్రభావం ఎలాంటివీ అంటే, చాలా కర్కశంగా, ఉన్మాదంతో ప్రవర్తిస్తారు. దోపిడీ వర్గాలే కాదు, ప్రజలు కూడా అలా ప్రవర్తిస్తారు. భూమి తగాదాల్లో రెండు కులాలే కాదు, స్వయంగా అన్నతమ్ములు, దాయాదులు తలలు నరుక్కోవడం, కుటుంబాలను పరస్పరం ఆర్థికంగా నాశనం చేయడం, ఈ తగాదాలు తరతరాలుగా కొనసాగడం తరచూ జరిగేదే. ఇలాంటి తగాదాల్లో ఒకే కుటుంబం, లేదా ఒకే కులంలోని ఒకవైపు వారు రెండో వారిని దెబ్బతీయడానికి కులకట్టుని వీడి, ఇతర కులాలతో చేతులు కలపడం కూడా జరుగుతుంది. ఇలాంటి చీలికలు, ఇలాంటి ఘర్షణలు దళిత ఉపకులాల మధ్యనే కాక, దళిత దాయాదుల మధ్య కూడా ఉండడం, వాటిని భూస్వాములు, పాలకపార్టీలు వాడుకోవడం అరుదేమీ కాదు. ఎన్నికల పార్టీలు ఇలాంటి తగాదాలను ఎగదోసి, వాడుకోడమూ తెల్సిందే. అవి ఎంత తెలివి మీరాయీ అంటే ఒకే కులంలోనూ, వివిధ విప్లవ గ్రూపుల మధ్య కూడా ఇలాంటి ఘర్షణలను రెచ్చగొట్టగలవు. వేంపెంటలో దళితుల్లోనే రెండు ఉపకులాలు – రెండు ఎన్నికల పార్టీల వెనుకే కాక, రెండు ఎం.ఎల్. గ్రూపుల వెనుక కూడా చీలి, చాలా కాలం సంఘర్షించుకున్నాయి. చత్తీస్‌గడ్‌లో, బస్తరులో గిరిజన తెగల మధ్యే చీలికని, ఘర్షణలని సృష్టించి వాడుతున్నారు. పశ్చిమ గోదావరి ఏజెన్సీలో గిరిజన, గిరిజనేతర చీలికతో ఏళ్ల తరబడి ఘర్షించుకున్నారు. ప్రజల ప్రయోజనాలు, ప్రజల మధ్య వైరుధ్యాలు పాలకవర్గ పోరాట రాజకీయాలతో, కుల తగాదాలతో పెనవేసుకు పోతున్నాయి. వర్గ చైతన్యంతో వాటిని జాగ్రత్తగా వేరుచేసి, పరిష్కరించాలి. సోంపేటలో, కాకరాపల్లిలో తూర్పు కాపులు, దళితులు, ఇతరులూ కలిసి ఐక్యంగా న్యాయం కోసం పోరాడారు. యానాంలో కార్మిక నాయకుడు (దళితుడు) చనిపోయినప్పుడు దళితులూ, ఇతర కులాల వారూ ఐక్యంగా నిలబడి ఉద్యమించారు.

8. 'బ్రాహ్మలు, రాజులు, కమ్మలు, రెడ్లు, వెలమలు దాటి ఇప్పుడు కొన్ని బిసి కులాలూ ఆధిపత్య స్వభావం సంతరించుకుంటున్నాయి' అని రాశారు (పేజీ 14). పాక్షిక సత్యమైన దీనిలో దాగి ఉన్న వర్గ రాజకీయాలను వెలికితీసి చూపెట్టాలి. ప్రతి కులంలోనూ వర్గ విభజన ఉన్నది. పెరుగుతున్నది. ఒకే గ్రామంలో ఒకే కులం వారు వందలాదిగా ఉన్న గ్రామాలను చూస్తే రెడ్లలో (ఉదాహరణకు నల్లగొండలో), కమ్మల్లో (ఉదాహరణకు కృష్ణా, ఖమ్మం), రాజుల్లో, కాపుల్లో (ఉదాహరణకు గోదావరి జిల్లాలు) నూటికి 40–50 మంది దాకా కూడా సెంటు భూమిలేని కౌలుదార్లుగా, కూలీలుగా ఉండడం, వారితో కలిసి 80 శాతం మంది మొత్తంగా పేద, మధ్యతరగతి రైతాంగంగా ఉండడం అనేక గ్రామాల్లో చూడవచ్చును. ఏ గ్రామంలోనూ, ఏ కులంలోనూ ఆయా అగ్రకులాలకు చెందిన వారు భూస్వాములుగా ఉన్నచోట్ల – జనాభాలో 10 శాతానికి మించి భూస్వామ్య వర్గంగా దాదాపు ఎక్కడా ఉండరు. మరో 10 శాతం ధనిక రైతాంగం ఉండవచ్చును. దాదాపు ఏ కులంలోనూ ఏ గ్రామం లోనూ భూస్వామ్య వర్గం ధనిక రైతాంగం కలిపినా నూటికి ఇరవై మందికి మించి ఉండరని చెప్పవచ్చు. ఇది తూర్పు కాపు వంటి మధ్య కులాలకు ఇంకా హెచ్చుగా వర్తిస్తుంది.

9. లక్షింపేట తూర్పు కాపుల్లో ఎంతమందికి బొత్తిగా భూమిలేదు? ఎంతమంది కౌలుదార్లు? ఎంతమంది కొద్దిపాటి భూమిగల పేదరైతులు? అని పరిశీలించాలి. అలాంటివారు కచ్చితంగా ఉంటారు, ఉన్నారు. కానీ ఆ లెక్కను చాలామంది విస్మరిస్తున్నారు. వారిని వేరు చేయాలి, కలుపుకు రావాలి. ఐక్య సంఘటనను వ్యూహంగానూ, ఎత్తుగడగానూ కూడా సాధించాలి. ఏ ఒక్క కులమైనా విడిగా ఉంటే, ఇతరులతో పోరాడి గెలవజాలదు. ఇది దళితులకు మరింతగా వర్తిస్తుంది. కులతత్వం వారికి వ్యతిరేకంగా మరింత పదునుగా పనిచేస్తుంది. ఏ కులంలో ఉన్నా పేదలంతా ఒకటి, బాధలన్నీ ఒకటి అనే ప్రాతిపదికపైన పోరాడాలి. అప్పుడే విజయం సాధ్యం. దళితుల్లో కూడా అగ్రవర్గంగా ఎదిగిన కొంద్రు మురళి వారి పక్షం వహించలేదు. అలాగే దళిత రెవెన్యూ – పోలీసు అధికారులూ, ఉద్యోగులూ దళిత పేదల్ని కాపాడలేదు అని గమనించాలి. కొద్దిమందికి సానుభూతి ఉన్నా, నేటి డబ్బు – అధికార రాజకీయ ఒత్తిడుల మధ్య వారు ఏమీ చేయలేరు. ఇవాళ 80 మంది తూర్పు కాపులు అరెస్టయినారు. బిసి మంత్రులెవరూ వారిని కాపాడలేక పోయారని వారు గ్రహించాలి. దాడిలో పాల్గొన్న నేరస్తులని, అంతకన్నా ముఖ్యంగా వారిని ప్రేరేపించిన వారినీ శిక్షించాల్సిందే. అయితే దాడుల్లో పాల్గొనని పేదలపై కేసులు ఎత్తివేయాలి అనే డిమాండ్ కూడా ముఖ్యమైనదే. దళిత బాధితులకు ప్రభుత్వం చేసిన వాగ్దానాలన్నీ (భూమి, ఉద్యోగం, డబ్బు) అమలు జరిగేలా పోరాడాలి. మరోవైపు తూర్పు కాపుల్లోని పేదలు, దళితులూ రాజీకి వచ్చి, కలిసి జీవించేలా కృషి చేయాలి. అలా చేయకపోతే ఆ కుల విషం పక్క గ్రామాలకూ విస్తరిస్తుంది. పోరాటాల్ని దెబ్బతీస్తుంది. దాని కోసం వివాదాస్పదమైన 250 ఎకరాల్లో కొంత భాగాన్ని భూమిలేని తూర్పు కాపులకు కూడా దక్కేట్టుగా చూడాలి. అప్పుడే పీడితులకు, ముఖ్యంగా దళితులకు న్యాయం దక్కుతుంది. (బొజ్జా తారకం వంటివారు (కనీసం తొలిదశలో) ఇలాంటి సంయమన దృష్టి ప్రదర్శించారు). దీనికి విరుద్ధంగా చేస్తే అక్కడ కొంత కాలం పాటు రావణకాష్టమే కొనసాగుతుంది. దళితులకు నష్టమే జరుగుతుంది. ఈ ఐక్యపోరాట దృష్టి దళితులకు అవసరం. వారికిదే మేలు చేస్తుంది. ఈనాడు కావాల్సింది కులాలకతీతంగా పోరాడిన కాకరాపల్లి, యానాం, సోంపేటలు. అంతేకాని ప్రజల మధ్య చీలికల్ని శాశ్వతం చేయజూచే లక్షింపేటలు కావు. నేటి లక్ష్యం కులతగాదాల కుంపటిని రాజేయడం కాదు. ఐక్య పోరాటాల్ని రగిలించడం. లక్షింపేట నుంచి గ్రహించాల్సిన సందేశం ఇదే.

ఎస్. కృష్ణమూర్తి, రాజమండ్రి వీ

అణు రియాక్టర్ల గురించిన సందేహాలు

అణు విద్యుత్ గురించిన భయాలు పాలక విధానాల ఫలితమేననీ, అయితే అది పనిచేసే తీరుతెన్నులు, మంచి చెడులపై అవగాహన అవసరమనీ అంటున్నారు **డా. కొడవటిగంటి రోహిణీప్రసాద్**

మన దేశపు విద్యుచ్ఛక్తి వినియోగం విపరీతంగా పెరగడం, పారిశ్రామికీకరణ పెద్ద ఎత్తున తలపెట్టడం వగైరాల కారణంగా ఇతర వనరులకు తోడుగా అణువిద్యుత్తు కోసంకూడా ప్రయత్నాలు ముమ్మరం అవుతున్నాయి. ఈ సందర్భంలో మహారాష్ట్రలోని జైతాపూర్ సమీపంలో మొత్తం 9900 మెగావాట్ల సామర్థ్యంగల అణురియాక్టర్లు నిర్మించడాన్ని వ్యతిరేకిస్తూ స్థానికులు ఆందోళన చెయ్యడం, పోలీసు కాల్పులూ వగైరాలన్నీ జరిగాయి. ఇది పూర్తవుతే ప్రపంచంలోనే అన్నిటికన్నా పెద్ద అణుకేంద్రం కాగలదు. ఎటొచ్చీ ఇటీవల జపాన్‌లో జరిగిన ప్రమాదాల వల్ల అణుకేంద్రాల గురించిన భయాలు అందరిలోనూ పెరుగుతున్నాయి.

అణురియాక్టర్ల గురించిన సైన్స్‌పరమైన చర్చలో రాజకీయ, సామాజిక అంశాలకు కొంతయినా చోటుంటుంది. ఎటొచ్చీ అనవసరమైన అపోహలూ, భయాలూ లేకుండా రియాక్టర్ల పనితీరులో సురక్షిత వ్యవస్థలు ఏమిటో, కానివేమిటో తెలుసుకోవడం సామాన్యులకు కూడా లాభిస్తుంది. మరీ సంక్లిష్టమైన సాంకేతికవివరాలు కాకపోయినా స్థూలంగా సంగతేమిటో తెలుసుకోవడం అంత కష్టంకాదు. ఇక్కడ గమనించ వలసినదేమిటంటే మానవనిర్మితమైన ఎటువంటి వ్యవస్థ అయినా నూటికి నూరుశాతం సురక్షితమని చెప్పలేము. ఏ గ్రహశకలమో వచ్చి భూమిని ఢీకొనట్టయితే ఎంతటి వినాశనం జరుగుతుందో ఎవరూ చెప్పలేరు. ఎంత గట్టి కట్టడమైనా అటువంటి ఉత్పాతానికి తట్టుకోలేదు. అందుకని మామూలుగా ఊహించగలిగినంత స్థాయిలో తలెత్తే ప్రమాదాలకూ, ప్రకృతివైపరీత్యాలకూ మాత్రమే మానవులు కొంత సంసిద్ధతకు ప్రయత్నిస్తారు.

సామాన్య ప్రజలకు ఇందులోని సాంకేతిక విషయాలను అర్థం చేసుకునే ఓపికా, సామర్థ్యమూ లేకపోవడంతో ఇటువంటి పరిస్థితుల్లో అర్థం లేని భయాలూ, తెలిసీతెలియనివారు పుట్టించే పుకార్లూ ప్రధాన పాత్ర వహిస్తున్నాయి. జపాన్‌లో ఎటువంటి పరిస్థితిలో ఎలాంటి ప్రమాదం జరిగిందో, ఏ పెద్ద పారిశ్రామికవ్యవస్థ అయినా ఎంత పెద్ద విఘాతానికి తట్టుకోవడం సాధ్యమవుతుందో మొదలైన అంశాలను మనం పరిశీలించాలి. ఒకప్పుడు కేంద్రప్రభుత్వవర్గాలు ప్రజల పక్షం వహిస్తాయనే నమ్మకం అందరికీ ఉండేదిగాని, ఈ మధ్య ప్రపంచీకరణ పేరుతో ప్రభుత్వాలే బడా కంపెనీల ఏజంట్లుగా పనిచేసి ప్రజలను బురిడీ కొట్టించేందుకు ప్రయత్నిస్తున్నాయనే అనుమానాలు బలపడుతున్నాయి కనక ప్రభుత్వ సంస్థలు చెప్పే విషయాలు 'నాన్నా పులి' అన్న చందంగా సందేహాస్పదం అవుతున్నాయి.

అణు రియాక్టర్లకు వాటిల్లే ప్రమాదాలు వాటి నిర్మాణలోపాలవల్లనో, పనిచేసేతీరు వల్లనో తలెత్తు తాయా, లేక ప్రకృతివైపరీత్యాల కారణంగా మొదలవుతాయా, లేక రెండూ ఒకేసారి సంభవించడంవల్లనా మొదలైన సంశయాలకు సులువైన సమాధానాలు సామాన్యులకు దొరకవు. దుకాణంలో ఏ టీవీ సెట్టో కొంటున్నప్పుడు మనకు తెలిసినా, తెలియక పోయినా అమ్మేవాడి మాటలను పట్టించుకోకుండా స్వయంగా పైపైన అయినా పరీక్షగా చూసుకునిమరీ కొనడం మనకు అలవాటే. అణుశక్తి వంటి జటిలమైన విషయాల గురించి ఎవరు నమ్మబలికినా ప్రజలకు నమ్మబుద్ధికాదు. ఇందులోని ముఖ్యవిషయమేమిటంటే అణువులవల్ల కలిగే హాని కళ్లకు కనబడేదికాదు. ఆ సమస్యలకు సులువైన పరిష్కారం కూడా ఎవరికీ తెలియదు.

ఇలాంటి విషయాల్లో ప్రజలకు కాస్త నమ్మకం పెరగాలంటే రియాక్టర్ కడుతున్నచోట ఎంతమంది నివసిస్తారో, పరిసరప్రాంతాల్లో ఎంతమంది ఇళ్లు కట్టుకున్నారో, ఏదైనా అనుకోనిది జరిగితే ఎంతమందిమీద ఎన్నిరకాల ప్రభావాలు పడతాయో అందరికీ స్పష్టంగా తెలియాలి. అంతేకాక ఎటువంటి ప్రమాదం జరగకుండా ఎవరు బాధ్యత వహిస్తున్నారో, ఏయే జాగ్రత్తలు తీసుకుంటున్నారో నలుగురికీ తెలియ జెయ్యాలి. ముఖ్యంగా విదేశీ సహకారం తీసుకుంటున్నప్పుడు బీమా నిబంధనలను తప్పించుకునేందుకు పరాయిదేశాలు శతవిధాల ప్రయత్నిస్తాయి. తప్పులను స్థానిక నిర్వాహకులమీదకు నెట్టడానికే చూస్తాయి. భోపాల్ దుర్ఘటన తరవాత దీన్ని గురించి అందరికీ అర్థమయింది కనక చివరకు నష్టపోయేది మన ప్రజలే అవుతారు. చట్టాలూ, హక్కుల సంగతి ఎంత బాగా తెలియజేస్తే అన్ని అపోహలు తగ్గే అవకాశముంటుంది.

మన దేశానికి మొత్తం 335 రియాక్టర్ సంవత్సరాలు నడిపిన అనుభవం ఉంది. అంటే ఇది ఒకే రియాక్టర్ 335 సంవత్సరాలు పని చెయ్యడానికో, 335 రియాక్టర్లు ఒక్క ఏడాది పనిచేసినదానికో సమానం అని కాదు. మరొకవంక మన దేశంలో సామాన్యప్రజల, రాజకీయవేత్తల ప్రవర్తన చాలా మారిపోయింది. లాభార్జనే లక్ష్యంగా, ఎటువంటి సామాజిక విలువలనూ పాటించకుండా అందినంత డబ్బు దండుకోవడమే ప్రధానమని ప్రతివారూ భావించే పరిస్థితులు వచ్చేశాయి. దోచుకోలేనివాడే దౌర్భాగ్యుడని తేలుతోంది. ప్రపంచదేశాల్లో ముందుకు దూసుకెళుతున్నదిగా పేరుపొందిన ఇండియాకు విద్యుత్తు అవసరం చాలా పెరగబోతోందనే విషయంలో సందేహమేమీ లేదుగాని అందు కోసం అడ్డదార్లు తొక్కకూడదనే పట్టింపు ఎవరికీ ఉన్నట్టు కనబడదు. ఈ రోజుల్లో రాష్ట్ర, కేంద్రప్రభుత్వపు సభ్యులే ఊహించలేనంత స్థాయిలో లంచాలకు ఆశించి, కొన్ని సందర్భాల్లో పట్టుబడి, కటకటాల పాల వుతున్నారంటే ఇంత పెద్ద పారిశ్రామికవ్యవస్థల విషయంలో ఎన్ని లక్షల కోట్లు చేతులు మారగలవో, ఎన్ని నిబంధనలను తుంగలో తొక్కే అవకాశాలుంటాయో ఆలోచిస్తే భయం వేస్తుంది.

మన దేశంలో తారాపూర్‌లోని రెండు పవర్‌రియాక్టర్లు అమెరికన్ల సహాయంతో నిర్మించిన తరవాత చాలామటుకు మనవాళ్లు రూపకల్పన చేసి నిర్మించుకున్నవే. ఆ తరవాత విదేశీ పెట్టుబడులకు తలుపులు బార్లా తెరిచే ధోరణి మొదలయింది. పశ్చిమదేశాలు అర్థికంగా దెబ్బతినడం, మనతో పంచుకోకూడదనుకున్న న్యూక్లియర్ టెక్నాలజీ సైతం ఇవ్వడానికి అవన్నీ సిద్ధపడడం, ఇండియాను ఒక పెద్ద అగ్రరాజ్యంగా గుర్తింపునిస్తూ, అందులో పెట్టిన డబ్బు తమకు లాభాలను సమకూరుస్తుందని ఆశించడం మొదలైన పరిణామాలన్నీ జరిగాయి, జరుగుతున్నాయి. ఒకప్పుడు మనకు అవసరమైన యురేనియం ఇంధనంగా ఇవ్వరాదని ఆంక్షలు పెట్టుకున్న దేశాలు క్రమంగా కొన్ని షరతులు విధించి దారికి వస్తున్నట్టుగా అనిపిస్తోంది. ప్రస్తుతపరిస్థితి ఏమిటంటే మనవాళ్లు నిర్మిస్తున్న కొన్ని రియాక్టర్లు విదేశీపరిధిలోకి రావు. వాటి నిమిత్తం మనకు విదేశీయ సాంకేతిక, ఆర్థిక సహాయం ఏదీ అందదు. మునుపటినుంచీ ఉన్న ఆంక్షలు కొన్ని మటుకు మరింత కఠినం అవుతున్నాయి. రష్యా, అమెరికా, ఫ్రాన్స్, కజఖ్స్తాన్ తదితర దేశాల సహాయంతో నిర్మించే రియాక్టర్లకు మాత్రం ఆయాదేశాల తోడ్పాటు ఉండబోతుంది. మనవాళ్ల బ్రీడర్ రియాక్టర్లూ, జలాంతర్గాములను నడపగలిగే రియాక్టర్లూ వగైరా సైనికసంబంధం ఉన్నవాటికి మనమే పాటుపడాలి.

1998 తరవాత మన దేశాన్ని ఒక అణ్వస్త్రశక్తిగా అయిష్టంగానే అగ్రరాజ్యాలు గుర్తిస్తున్నాయి. పాకిస్తాన్‌కూడా వాటిని కలిగి ఉన్నప్పటికీ, ఆర్థికంగా, రాజకీయంగా వెలి అవుతున్న కారణంగా దానికి మనతో సమానస్థాయి లభించదు. ఇక చెయ్యడానికి వాటికి మిగిలినదల్లా అణురియాక్టర్ల రంగంలో డబ్బు పెట్టడం, లాభాలు ఆర్జించడమే. మన దేశంలో లంచాలిస్తే అన్ని పనులూ సులభంగా జరుగు తాయని అందరికీ తెలుసు గనక మనం చాలా భయపడవలసిన అంశంకూడా అదే.

మనది చాలా జనసాంద్రత కలిగిన దేశం. నిర్జనప్రాంతాలు కనబడడం అరుదే. రెండోది అన్ని విధాలా అనువుగా ఉన్న ప్రదేశాలను విదేశీ కంపెనీల స్థాపనకు కట్టబెట్టడం, ముడుపులు తీసుకోవడం మనవాళ్లకి మామూలే. అందుచేతనే పర్యావరణ నిబంధనలూ, చట్టాల అతిక్రమణలూ కేవలం ప్రభుత్వాధికారుల అజమాయిషీకి వదిలిపెట్టడం చాలా ప్రమాదకరమని అందరికీ అనిపిస్తోంది. ముఖ్యమంత్రులనూ, ప్రధానమంత్రినీ సైతం కనిపెట్టి ఉండవలసిందేననే ఫిర్యాదులు తలెత్తడానికి కారణం అదే. ఎప్పుడో జవాహర్లాల్‌నెహ్రూ కాలంనాటి సజ్జనులెవరూ ఈనాటి పదవుల్లో లేరనేది ఎవరూ మరిచి పోకూడదు. అందుచేత అణురియాక్టర్ల భద్రత విషయంలో ఎన్ని సందేహాలు తలెత్తినప్పటికీ అన్నిటికీ సవ్యంగా సమాధానాలిచ్చి సంతృప్తిపరచడం, ప్రభుత్వ జోక్యంలేని స్వచ్ఛందసంస్థలూ, నిపుణులచేత అధ్యయనాలు జరిపించి నివేదికలు తీసుకోవడం తప్పనిసరి.

(రచయిత అణుధార్మిక శాస్త్రవేత్త) వీ

(... 4వ పేజీ తరువాయి)

కులం లేకుండా ఒక్క సమస్యనూ అర్థం చేసుకోలేం. ఒక్క ఆదిమ కమ్యూనిస్టు సమాజం తప్ప ఆ తరువాత వచ్చిన సమాజాలన్ని కులంతో నిండి ఉన్నాయి. బానిస విధానంలో వేళ్లూనుకొన్న కులం ప్రతి కులానికి ఎంత భూమి ఉండాలి, ఎటువంటి భూమి ఉండాలి, ఎంత గుడ్డ ఉండాలి, నీ నివాసానికి ఇల్లు ఎట్లా ఉండాలి దీని కొలతలతో సహా ఇచ్చేశారు. ఎలాంటి తిండి తినాలో ఎట్లా దారి వెంబడి నడవాలో, ఎట్లా మాట్లాడాలో ఆ భాష కూడా నిర్ణయించి, అమలు చేశారు. ఆనాడు రూపుదిద్దుకున్న సంస్కృతి సాంప్రదాయాలే ఈ నాటికీ రూపం మార్చుకొంటూ కొత్త కొత్త వేషాలతో తిరిగి తిరిగి జన్మిస్తు సమాజాన్ని శాసిస్తూనే ఉన్నాయి. గతంలో జరిగిన దాడులు గాని ఈనాడు జరిగిన దాడులు గాని చూస్తే ఒక్క మాల, మాదిగ కులస్తుల మీదనే జరుగుతున్నాయనేది యదార్థమే గదా! ఎందుకని? అగ్రవర్ణాల కులస్తులకు మాల, మాదిగ కులస్తులకు మధ్యలో ఎన్నో కులాలున్నాయి గదా! వారందరికి అగ్రవర్ణాల సరసన ఇళ్లున్నాయి. వీళ్ల పొలాల పక్కన పొలాలున్నాయి. వారి మీద దాడులు జరగడం లేదు కదా! అయితే దీనర్థమేమిటి? అంటే మాల, మాదిగ కులస్తులు గౌరవప్రదమైన జీవితానికి అర్హులు కారనేకదా! భూమి సంపాయించుకొనే వాళ్లందరి మీద ఇటువంటి దాడులు జరుగుతున్నాయా? కుల అణచివేతలో భాగమే ఈ దాడులు అనేది నిస్సందేహం. ఈ క్రమంలో చూడాలి గాని, కేవలం భూమి కోసమే అనేది ప్రధానం కాదు. హిందూ విషసంస్కృతిలో నుండి చూడాల్సిన విషయమిది. పైకి భూమి సమస్యగానే కనపడవచ్చు. అంతర్గతంగా కులమే. అగ్రవర్ణాల ఇళ్ల పక్కన, పొలాల పక్కన మాల, మాదిగ కులస్తులు తప్ప ఇంకెవరైనా ఉండవచ్చుకాని వీరుండడానికి లేదుకదా! అయితే దీనికి మూలాలు ఎక్కడున్నాయంటే హిందూ సంస్కృతిలోనే ఉన్నాయనవచ్చు. హిందూ సంస్కృతిని అర్థం చేసుకొంటేనే భారతదేశ సామాజిక స్వరూపం అర్థమవుతుంది. ఈ సంస్కృతి మీదనే ఈ సామాజిక వ్యవస్థ నిలదొక్కుకొని జీవిస్తున్నది. పునాదిని తొలగించకుండా పైకి ఎన్ని మార్పులొచ్చినా ఫలితం శూన్యం. హిందూ బ్రాహ్మణిజంతోను, ఈ కుల అంటరానితనంతోను పోరాడకుండా సమూలమైన మార్పులు తీసుకొని రాలేం. హిందూ బ్రాహ్మణిజంలోని మర్మాన్ని బయటపెట్టాలి. వారి అవసరానికి తగ్గట్టు సాంప్రదాయాల్ని వాడుకొంటుంటారు. మాల, మాదిగ కులస్తుల్ని అంటరాని వారని అంటారే గాని, వారు లేకుండా ఒక్క క్షణం వీరు బతకలేరు. వీరికి చెప్పులు కుట్టి ఇవ్వాలి. వాటికి అంటరానితనం లేదు. అగ్రవర్ణాల ఇళ్లపైకెక్కి ఇంటికప్పు వేయాలి. ధాన్యం పండించి గాదెలను నింపాలి. ఈ పనులు చేసేటప్పుడు రాదా ఈ అంటరానితనం. లేదా అంటే నాల్గు మంత్రాలు చదివి శాస్తి చేసేస్తారు. ఇవన్నీ చేయించుకుంటారే గాని వారి బతుకులు బాగు పడనీయరు. వారు లేకుండా గ్రామ జీవితం ఉందా అని అడుగుతున్నాను. సమస్త కార్యాలకు వీరే ఉండాలి. వీరే చెయ్యాలి. కాని వారికి కడుపు నిండకూడదు. ఇది బ్రాహ్మణిజంలో ఉన్న ద్వంద్వ నీతి. ఈ విషపు సంస్కృతిని జీర్ణించుకొన్న సమాజం తద్భిన్నంగా ఎట్లా ఉంటుంది? భూమి కోసం ఎంత పోరాడినా రాదు. వారికి రానియ్యరు. ఈ సమాజంలోనే గాదు వచ్చే భవిష్యత్ సోషలిస్టు సమాజంలో కూడా ఈ సంస్కృతి ఉంటుంది. ఈ సంస్కృతికి వ్యతిరేకంగా పోరాడకుండా, మార్చకుండా వీరికి న్యాయం చెయ్యలేం.

ఆదివాసుల గురించి లోకసంచారి రాసిన వ్యాసం గొప్పగా ఉంది. బ్రాహ్మణీయ భావజాలంతో పోరాడకుండా ఆదివాసులకు విముక్తి లేదు. ఆదివాసుల్ని సమాజం నుండి తరిమేసి, వారి ఆస్తుల్ని గుంజుకున్న బ్రాహ్మణీయ పాలకవర్గాల చరిత్ర తెలియనిదేమున్నది. రామాయణ, మహాభారతాల చరిత్ర చదివిన వారందరికి విదితమేగా! ఈ నాటి పాలకవర్గాలు కూడా అదే దారిన పోతున్నాయన్నది వాస్తవం. ఆదివాసులు నివసించే ప్రాంతాలలో ఉన్న ఖనిజ సంపదల కోసం దేశీయ, విదేశీ సామ్రాజ్యవాదులు పన్నిన కుట్ర పేరే గ్రీన్‌హంట్. పేర్ల మార్పు అంతేగాని ఇవన్నీ కూడా సామ్రాజ్యవాద దండయాత్రలే. ఒకే ఒక్క మాటలో చెప్పాలంటే సామ్రాజ్యవాదమంటే ప్రజలపైన యుద్ధం. దీనికి సిద్ధాంత ప్రతిరూపం బ్రాహ్మణిజం. సమాజ పరివర్తనలో జరిగిన మార్పుల ఫలితంగా వీరు కొన్ని హక్కులను, సౌకర్యాలను సాధించుకొని అనుభవంలోకి తెచ్చుకొంటున్నారు గనకనే అది సహించని, హిందూ బ్రాహ్మణీయ శక్తులు వీరిని అంతమొందించాలనుకొంటున్నాయి. గతంలో లాగ వారి పాదాల ముందు పడి ఉంటే ఈ దాడులు జరిగేవి కావు. ప్రజలపైన స్పర్శచెయ్యడం అనే ఈ అంటు జాడ్యం ఏదో ఒకటి, రెండు అగ్రకులాలకి పరిమితంగాలేదు. సమస్త కులాలకూ ఈ అంటు రోగం బాగా తలకెక్కి వంటబట్టి పోయింది. గనక అగ్రకులాలే చేస్తున్నాయనడానికి వీలులేదు. సమస్త జాతులకు, కులాలకు ఈ అంటురోగం బాగా విస్తరించిపోయింది. ఈ వ్యాసం చాలా గొప్పగా ఉంది. ఇలాంటి వ్యాసాలు ఇంకా విరివిగా రావాలని ఆశిస్తున్నాను.

– కడియాల సుబ్బనాచారి, *దుత్తలూరు, నెల్లూరు*



తెలుగు అకాడమి

హిమాయత్‌నగర్, హైదరాబాదు - 500 029.

అధ్యక్షులు
మాన్యశ్రీ సి. దామోదర రాజనర్సింహా
ఉప ముఖ్యమంత్రి,
ఉన్నత, సాంకేతిక విద్య శాఖామాత్యులు,
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, హైదరాబాదు.

ఈ మెయిల్: info@teluguacademy.net
వెబ్: www.teluguacademy.net
ఫోన్‌నంబర్లు: 040-23225215, 23226041
ఫ్యాక్స్ : 040-23225359

అకాడమి లక్ష్యాలు

భాషాప్రయుక్త రాష్ట్రాల ఆవిర్భావం తర్వాత ప్రాంతీయ భాషల అభివృద్ధి, వికాసానికి భారత ప్రభుత్వం తీసుకున్న కొన్ని చర్యల ఫలితంగా తెలుగు అకాడమి ఆవిర్భవించింది. తెలుగు అకాడమి ప్రధాన ధ్యేయం తెలుగు భాషను అభివృద్ధి పరచి విద్యా విషయక గ్రంథాలను విద్యార్థులకు అందించడం.

అకాడమిలో లభించే పుస్తకాలు

ఇంటర్ నుంచి పి.జి.వరకు పాఠ్యపుస్తకాలు అందివ్వడం అకాడమి బాధ్యతలలో ప్రధానమైనది. మాండలీకాల వంటి భాషా గ్రంథాలు, నిఘంటువులు, పాఠశాల స్థాయి నిఘంటువులు, పదకోశాలు, పారిభాషిక పదకోశాలు, పోటీ పరీక్షలకు అవసరమైన గ్రంథాలు, తెలుగు బోధన శిక్షణగ్రంథాలు, వ్యక్తిత్వ వికాసగ్రంథాలు, స్వయం ఉపాధికల్పనకు ఉపకరించే పుస్తకాలు అకాడమి ప్రచురిస్తుంది. అకాడమి ప్రధానంగా భాషా వికాసం కోసం, భాషను పరిపుష్టం చేయడానికి ఉద్దేశించింది.

తెలుగు అకాడమి 40 సంవత్సరాలుగా "తెలుగు" త్రైమాసిక వైజ్ఞానిక పత్రికను కూడా నిర్వహిస్తున్నది.

అకాడమి విక్రయ కేంద్రాలు

అకాడమి ప్రచురించే పుస్తకాలను హైదరాబాదు, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, అనంతపురం, వరంగల్, గుంటూరులలోని పంపిణీ కేంద్రాల ద్వారా రాష్ట్రమంతటా విద్యార్థులకు అందచేస్తున్నది.

తెలుగు రానివారికి తెలుగు నేర్పించడం

పరిపాలన రంగంలో తెలుగును అధికారభాషగా ప్రవేశపెట్టి, దాన్ని సులువుగా అమలుపరచడానికి ప్రభుత్వం చేస్తున్న కృషిలో సహకరించడం అకాడమి లక్ష్యాలలో ఒకటి. అధికారభాషగా తెలుగును అమలుపరిచే ప్రభుత్వ విధానంలో భాగంగా, అకాడమి లక్ష్యాలకనుగుణంగా రెండోభాషగా తెలుగు బోధన కార్యక్రమం కింద తెలుగు భాషను నేర్చుకోవాలనుకునేవారికోసం, ప్రభుత్వ, ప్రభుత్వేతర ఉద్యోగుల తదితరుల కోసం గత 40 సంవత్సరాలనుంచి తెలుగులో పరిచయకోర్సును, ఉన్నత కోర్సులను నిర్వహిస్తుంది. బోధన కాల వ్యవధి 48 పనిరోజులు. కోర్సులు పూర్తి అయ్యేనాటికి తెలుగులో మాట్లాడడం, రాయడం, చదవడం కొంతవరకు అలవరచుకోవచ్చు. పరిచయ కోర్సులో ప్రవేశానికి విద్యార్హత ఎస్.ఎస్.సి., ఉన్నత కోర్సులో చేరడానికి పరిచయకోర్సు పూర్తిచేసి ఉండాలి. ఇప్పటివరకు 54 పరిచయకోర్సులు, 40 ఉన్నతకోర్సులను అకాడమి నిర్వహించింది. ఈ కోర్సు పూర్తిచేసి ఉత్తీర్ణులయి ఉన్నతస్థాయిలో నిలిచినవారికి బంగారు పతకం బహూకరించడం జరుగుతున్నది.

ఈకోర్సుకు సంబంధించి తెలుగు పరిచయవాచకం రూ.45/-లకు, రాత పనిపుస్తకం రూ.16/-లకు ఉన్నత వాచకం రూ.24/- లకు, లర్న్ తెలుగు సి.డి. రూ.60/-లకు తెలుగు అకాడమి విక్రయిస్తున్నది.

అకాడమి అందించే విద్యార్థి పురస్కారాలు

2001 సంవత్సరం నుంచి తెలుగు అకాడమి ఇంటర్మీడియట్‌లో తెలుగు మాధ్యమంలో చదివి రాష్ట్రస్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు పురస్కారాలు అందచేస్తున్నది.

ఉపాధ్యక్షులు
శ్రీ ఎమ్.జి. గోపాల్, ఐ.ఏ.ఎస్.
రాష్ట్రఉన్నత విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, హైదరాబాదు.

సంచాలకులు
ఆచార్య కె. యాదగిరి
ఎం.ఎ., పి.హెచ్.డి.

రేఖ నెం. 52/తెలి/శవి/ప్రచు/2012-13-52

లక్ష్మీ సెహగల్ మృతి

వలస పాలనకు వ్యతిరేకంగా దేశ స్వాతంత్రం కోసం పోరాడిన లక్ష్మీ సెహగల్(97) కాన్పూర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ జూలై 23న మరణించారు. సెహగల్ 1914 అక్టోబర్ 24న చెన్నైలో జన్మించారు. డా.ఎస్.స్వామినాథన్, అమ్ము స్వామినాథన్ తల్లిదండ్రులు. 1938లో ఎంబిబిఎస్ పూర్తిచేసి పై చదువులకు సింగపూర్ వెళ్లిన ఆమె అక్కడి నుండే స్వాతంత్రోద్యమం కోసం పోరాడిన ఇండియా ఇండిపెండెన్స్‌లో పనిచేశారు. స్వాతంత్రోద్యమ కాలంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్థాపించిన ఇండియన్ నేషనల్ ఆర్మీలో చేరి ఝాన్సీ రెజిమెంట్‌కు ఆమె కమాండర్‌గా పనిచేశారు. 2002లో ఆమె వామపక్షాల తరఫున రాష్ట్రపతి అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయారు.

దళితులపై దాడులు

దళితులపై జరుగుతున్న దాడులను పరిశీలిస్తే పట్టణాలకంటే గ్రామాల్లోనే ఎక్కువగా ఉంటున్నాయని జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్.హెచ్.ఆర్.సి) అభిప్రాయపడింది. బాధితులకు అండగా నిలబడేందుకు ఎన్.హెచ్.ఆర్.సి. గ్రామాలకు వెళ్లాల్సిన అవసరం ఉందని కమిషన్ ఛైర్మన్ జస్టిస్ కె.జి. బాలకృష్ణన్ అన్నారు. అసలు సమస్యలు గ్రామాల్లోనే ఉన్నాయన్నారు. మానవ హక్కుల ఉద్దేశం సామాన్యుల పక్షాన పోరాడడమే అని అన్నారు. నిరుపేదల సమస్యలను అధ్యయనం చేసేందుకు అసోం, మేఘాలయ, గుజరాత్ రాష్ట్రాల్లో ఎన్.హెచ్.ఆర్.సి. సభ్యులు పర్యటిస్తారని ఆగస్ట్ 7న చెన్నైలో బాలకృష్ణన్ అన్నారు.

గుజరాత్ అల్లర్ల కేసులో శిక్షలు

గుజరాత్‌లో గోద్రా ఘటన అనంతరం జరిగిన మత కల్లోలాలకు సంబంధించిన కేసులో, 21 మందికి యావజ్జీవ శిక్షతో పాటు, ఒక మాజీ పోలీసు ఇన్‌స్పెక్టర్‌కు ఏడాది జైలు శిక్ష విధిస్తూ ప్రత్యేక కోర్టు జూలై 30న తీర్పునిచ్చింది. ఇదే కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న 61 మందిని నిర్దోషులుగా విడుదల చేసింది. 2002 ఫిబ్రవరి 28న మెహసానా జిల్లాలోని విస్‌నగర్ పట్టణంలో ఒకే కుటుంబానికి చెందిన 11 మందిని చంపేశారు. ఈ కేసులో 83 మందిపై అభియోగాలు నమోదయ్యాయి. వారిలో 21 మందికి జీవిత ఖైదు, 10 వేల వరకు జరిమానా విధించింది ప్రత్యేక కోర్టు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అప్పటి విస్‌నగర్ ఇన్‌స్పెక్టర్ ఎం. కె. పటేల్‌కు ఏడాది జైలు శిక్ష విధించింది. బి.జె.పి. ఎం.ఎల్.ఎ ప్రహ్లాద్ గోపాల్‌తోపాటు 61 మందిని నిర్దోషులుగా విడుదల చేశారు.

సార్కిన్‌గూడ హత్యలకు నిరసనగా ధర్నా

చత్తీస్‌గడ్‌లోని సార్కిన్‌గూడలో జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్ ఘటనను నిరసిస్తూ, విప్లవ ప్రజాస్వామ్య ఫ్రంట్ ఆధ్వర్యంలో 20 పౌరహక్కుల సంఘాలు జూలై 31న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహించాయి. ఈ ధర్నాలో వివిధ రాష్ట్రాలకు చెందిన 500 మంది సామాజిక కార్యకర్తలు విప్లవ ప్రజాస్వామ్య ఫ్రంట్ అధ్యక్షులు వరవరరావు, ప్రొ. జి. హరగోపాల్, సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి రాజేంద్ర సచార్, రిటైర్డ్ ఐ.ఎ.ఎస్. అధికారి బి.డి. శర్మలతో పాటు 60 మంది వక్తలు పాల్గొన్నారు.

మారుతి సుజుకికి వాస్తు దోషం

ఇటీవల మారుతి సుజుకి ప్లాంట్‌లో తలెత్తిన సమస్యలకు వాస్తులో దోషముందనీ అందుకోసం వాస్తు పండితుడు దైవజ్ఞ కె.ఎన్. సోమయాజీని మారుతి సుజుకి యాజమాన్యం సంప్రదించింది. మానేసర్ ప్లాంట్‌లో తలెత్తిన వివాదం ఇతర ప్లాంట్‌లకు పాకకుండా ఉండాలంటే కొన్ని మార్పులు చేయాలని సోమయాజీ తెలిపారు. 600 ఎకరాల్లో నిర్మించిన మానేసర్ ప్లాంట్ స్థలాన్ని ఒకప్పుడు స్మశాన వాటికగా వాడేవారట. ప్లాంట్ నిర్మాణం కోసం ఆ స్థలంలో ఉన్న మూడు గుళ్లను కూడా కూలగొట్టారట.

దేశంలో సామాన్యుడి జీవన స్థితి

దేశంలోని 10 శాతం మంది గ్రామీణ ప్రజలు రోజుకి రు. 17 ఖర్చు చేస్తుండగా, పట్టణాల్లో ఉండే 10 శాతం మంది రోజుకి రు. 23.40 ఖర్చు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో తేలింది. జాతీయ శాంపిల్ సర్వే ఆర్గనైజేషన్ జూలై 2011 నుంచి జూన్ 2012 కాలానికి నిర్వహించిన సర్వేలో ఈ విషయం వెల్లడైంది. దేశంలోని పేదల జీవన స్థితిగతులు, స్థాయి తెలుసుకోవడం కోసం ఈ సర్వే నిర్వహించింది. ఈ గణాంకాలు ప్రణాళికా సంఘం పేదరికానికి నిర్దేశించిన ప్రమాణాలకంటే తక్కువగా ఉన్నాయి. పట్టణాల్లో రోజుకి రు. 28.65 గ్రామాల్లో రోజుకి రు. 22.42 కంటే తక్కువ ఖర్చు చేసేవారిని దారిద్ర్య రేఖకు దిగువనున్న వారిగా ప్రణాళికా సంఘం నిర్దేశించింది.

ఉపరాష్ట్రపతిగా హమీద్ అన్సారీ

భారత 14వ ఉపరాష్ట్రపతిగా యు.పి.ఎ అభ్యర్థి మహమ్మద్ హమీద్ అన్సారీ(75) ఎన్నికయ్యారు. ఎన్.డి.ఎ. అభ్యర్థి జశ్వంత్ సింగ్‌పై 252 ఓట్ల మెజార్టీతో గెలిచారు. అన్సారీకి 490 ఓట్లు రాగా జశ్వంత్ సింగ్‌కు 238 ఓట్లు వచ్చాయి. రాజ్యసభ, లోక్‌సభలో మొత్తం 787 ఓట్లు ఉండగా 47 మంది ఓటు హక్కును వినియోగించుకోలేదు. 8 ఓట్లు చెల్లలేదు. వరుసగా రెండు సార్లు ఉపరాష్ట్రపతిగా ఉన్నవాళ్లలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ తరువాత అన్సారీ రెండవవారు. ఆగస్ట్ 11న ఉపరాష్ట్రపతిగా మహమ్మద్ హమీద్ అన్సారీతో రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ప్రమాణ స్వీకారం చేయించారు.

ఆదివాసి ఆయుధాలపై నిషేధం

ఆదివాసులు ఆహార సేకరణకు, జంతువుల నుంచి రక్షణకు వాడే సంప్రదాయ ఆయుధాలైన గొడ్డళ్లు, బరిసెలు, ఈటెలు, విల్లంబులతో సంచరించడాన్ని చత్తీస్‌గడ్‌లోని నారాయణపూర్ ఎస్.పి నిషేధించారు. ఆదివాసులు వీటిని పట్టుకొని తిరగడం అంటే మావోయిస్టులకు అనుకూలమే నని నారాయణపూర్ ఎస్.పి అన్నారు. వీటిని బహిరంగంగా పట్టుకొని తిరగవద్దని, అడవిలో నుంచి సంతకు వచ్చేటప్పుడు ఆదివాసులు తమ వెంట తెచ్చుకున్న ఆయుధాలను సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో అప్పగించి సంతకు వెళ్లాలని, తిరిగి వెళ్లేటప్పుడు వాటిని తీసుకొని వెళ్లాలని ఎస్.పి సూచించారు.

నియంతలా మారిన మమత బెనర్జీ

ప్రజాస్వామిక దేశంలో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నియంతలా, నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఛైర్మన్ మార్కండేయ కట్జూ తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. రైతాంగ సమస్యలపై నిలదీసిన రైతును, మమత బెనర్జీపై కార్టూన్ వేసినందుకు జగదేశ్‌పూర్ యూనివర్సిటీ ప్రొఫెసర్‌ను మావోయిస్టులంటూ పోలీసులు అరెస్ట్ చేయడం ఘోర తప్పిదమని అన్నారు. టి.వి షోలో ప్రభుత్వ పాలనపై మమతను నిలదీసిన విద్యార్థినిపై ఆగ్రహం వ్యక్తంచేస్తూ మావోయిస్టు కాబట్టే ఇలాంటి ప్రశ్న అడిగావని ఆరోపించడం ఎంతవరకు సరియైనదన్నారు. మమత పాలన హిట్లర్ పాలనను తలపిస్తోందన్నారు.

లక్షింపేట ఘటనకు నిరసనగా ధర్నా

లక్షింపేట ఘటనకు నిరసనగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద దళిత మహాసభ ఆధ్వర్యంలో లక్షింపేట బాధితులు జూలై 22న ధర్నా చేశారు. ఈ ధర్నాకు స్వామి అగ్నివేష్ హాజరై బాధితులకు మద్దతు తెలిపారు. ఈ ధర్నాలో కత్తిపద్మారావు మాట్లాడుతూ దళితులపై దాడులు జరిగినా దళిత ఎం.పిలెవరు పార్లమెంట్‌లో మాట్లాడలేదన్నారు. ఈ ఘటనపై సి.బి.ఐ విచారణ జరిపించాలని, పార్లమెంటరీ కమిటీని లక్షింపేటకు పంపించాలన్నారు. బాధితులకు 250 ఎకరాల భూమిని నష్టపరిహారంగా ఇవ్వాలని, బాధిత కుటుంబాలకు రు. 10 లక్షల చొప్పున ఇవ్వాలని, ఈ దాడిని ప్రోత్సహించిన బొత్స సత్యనారాయణను పి.సి.సి అధ్యక్ష పదవి నుంచి మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. వీ

బ్యాంక్ ఉద్యోగుల సమ్మె

ప్రభుత్వ బ్యాంక్‌లను బలహీనపరిచే ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్‌లోని తొమ్మిది యూనియన్ల పిలుపు మేరకు ఆగస్ట్ 22, 23 తేదీల్లో దేశవ్యాప్తంగా బ్యాంక్ ఉద్యోగులు, అధికారులు సమ్మెచేశారు. దాదాపు 10 లక్షల మంది బ్యాంక్ ఉద్యోగులు ఈ సమ్మెలో పాల్గొన్నారు. 24 ప్రభుత్వరంగ బ్యాంక్‌లు, 12 ప్రైవేట్ బ్యాంక్‌లు, ఇతర అంతర్జాతీయ బ్యాంక్‌ల సిబ్బంది పాల్గొన్నారు. బ్యాంకింగ్ రంగంలో సంస్కరణలు, ప్రైవేటీకరణ, పెన్షన్ రివిజన్, నాన్ కోర్ కార్యకలాపాల ఔట్ సోర్సింగ్, ఖండేల్వాల్ కమిటీ నివేదిక అమలును వ్యతిరేకిస్తూ బ్యాంక్‌ల సిబ్బంది సమ్మెలో పాల్గొన్నారు. ప్రభుత్వరంగంలోని 87 వేల బ్యాంక్ శాఖలు పనిచేయలేదు. ప్రైవేట్, అంతర్జాతీయ బ్యాంక్‌లు కూడా మూసివేశారు. తాము చేపట్టిన సమ్మె విజయవంతం అయిందని అఖిల భారత బ్యాంక్ ఉద్యోగుల సంఘం జనరల్ సెక్రెటరీ సి.ఎచ్. వెంకటాచలం తెలిపారు. తాము వివిధ రూపాల్లో నిరసన తెలుపుతున్నప్పటికీ బ్యాంకింగ్ చట్టాల సవరణ బిల్లు లోక్ సభ ముందుకు తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. బ్యాంకింగ్ సవరణ బిల్లు 2011 ప్రకారం ప్రైవేట్ రంగ బ్యాంక్‌ల్లో ఓటింగ్ హక్కులు 10 శాతం నుంచి 26 శాతానికి పెరిగే అవకాశం ఉందన్నారు. దేశంలో సంస్కరణల పేరుతో అన్ని ప్రభుత్వ రంగాలను బలహీనపరిచి బడా పెట్టుబడి సంస్థలకు, విదేశీ సంస్థలకు ముడి సరుకులు సరఫరా చేసేవిగానూ మారుతున్నాయి. సంస్కరణలకు ప్రజామోదం ఉందని చెప్పడానికి రకరకాల పద్ధతుల ద్వారా ప్రభుత్వం సమ్మతిని కూడా సృష్టించుకుంటోంది. ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తున్నవారిని వివిధ కారణాలతో ఉద్యోగాల నుండి తీసివేయడం లేదా బెదిరించడం చేస్తోంది. సంస్కరణల ద్వారా ప్రభుత్వరంగంలోని ఉద్యోగులందరిని దినసరి కూలీలుగా మారుస్తోంది. అధికారంలో ఏ పార్టీ ఉన్నా ప్రభుత్వ సంస్థలను దశల వారిగా బలహీనం చేసి విదేశీ సంస్థలకు అప్పగించే ప్రయత్నం నిరంతరంగా కొనసాగుతూనే ఉంది. వ్యవసాయరంగంలో విదేశీ విధానాల అమలు వల్ల వ్యవసాయరంగం ఇప్పటికే అతలాకుతలం అవుతోంది. గ్రామాల్లోని రైతాంగానికి ప్రభుత్వ బ్యాంకింగ్ సేవలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ప్రభుత్వం తెస్తున్న సంస్కరణల వల్ల రైతులకు ఆ మాత్రం రుణం కూడా దొరికే అవకాశం లేకుండా పోతుంది. రాబోతున్న ప్రైవేట్, విదేశీ బ్యాంక్‌ల ప్రధాన లక్ష్యం లాభం. దీని వల్ల మన రైతాంగం పరిస్థితి మరింత దిగజారే ప్రమాదం ఉంది. ఇప్పటికే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు అనే కత్తి మన నెత్తిమీద వేలాడుతూనే ఉంది. మన దేశంలోకి వచ్చిన సెజ్‌లలో మన దేశ కార్మిక చట్టాలు కానీ, కనీసమైన హక్కులు కానీ అమలు కావడలేదు. దేశ ప్రజల హక్కులు కానీ, అవసరాలు కానీ అంత ప్రాధాన్యత ఉన్న అంశాలుగా ఈ దేశ పాలకులకు లేవనేది సంస్కరణల అమల్లో వెల్లడవుతున్న సత్యం.

అసోంలో ఆగని అల్లర్లు

అసోంలో జరుగుతున్న ఘటనలకు ప్రతీకారంగా ఇతర రాష్ట్రాల్లోని అస్సోమీయులపై దాడులు జరుగుతాయన్న వదంతులు వ్యాపిస్తున్నాయి. దీంతో హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, పూణే నగరాలలో చదువుకుంటున్న, ఉద్యోగాలు చేస్తున్న అసోం వాసులు అభద్రతకులోనై తమ స్వస్థలాలకు లక్షల మంది పయనమయ్యారు. పేదరికం, ఉపాధిలేమి కారణంగా మనిషి బతికి ఉండాలంటే అనివార్యంగా వలస వెళ్లి చేసిన కష్టంతో తమ జీవితాలను నిలుపుకుంటున్న పరిస్థితి ఉంది. అసోం విషయం చూసుకుంటే గతంలో బంగ్లాదేశ్ నుండి వచ్చిన ముస్లింలు అక్కడే స్థిరపడి పోవడంతో అక్కడ స్థానికంగా ఉన్న బోడోలు ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లడంతో స్థానికులు మైనారిటీలు అవుతున్న పరిస్థితి ఉంది. దీంతో ఉద్యోగ, ఉపాధి, భూమికి సంబంధించిన విషయాలలో స్థానికులకు, స్థానికేతరులకు మధ్య ఘర్షణలు జరిగి ఇప్పటికే 94 మంది మరణించారు. దాదాపు 4 లక్షల మంది బోడో, ముస్లిం ప్రజలు శరణార్థులుగా ప్రభుత్వం నిర్వహిస్తున్న శిబిరాల్లో ఉంటున్నారు. ప్రజల మధ్యన స్థానికులు, స్థానికేతరులు అనే భావనను రెచ్చగొట్టి ఈ సమస్యను మరింత రెచ్చగొడుతున్నారనేది తెలుస్తోంది. 1980ల నుండి బోడోలు తమకు ప్రత్యేక బోడోల్యాండ్ రాష్ట్రం కావాలని ఉద్యమాలు చేస్తూనే ఉన్నారు. స్థానికంగా ఉన్న భూమి సమస్యను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవడం కారణంగానే ఇప్పటి ఘర్షణల్లో ఘర్షణలు కొనసాగుతున్నాయి. ఇప్పటికీ చిరాంగ్, కొక్రాజార్ జిల్లాల్లో కర్ఫ్యూ కొనసాగుతూనే ఉంది. అసోంలో జరుగుతున్న మారణకాండను ఆపడానికి పంపాల్సింది పోలీసు బలగాలను కాదు, పంచాల్సింది భూమి అనే విషయాన్ని ఇప్పటికైనా ప్రభుత్వాలు గుర్తించాలి. అలా చేయకుండా చరిత్ర పొడవునా ప్రజల అజ్ఞానాన్ని ఆసరా చేసుకొని వారిని నమ్మకాల పేరుతో, విశ్వాసాల పేరుతో ప్రభుత్వాలు విడదీస్తున్నాయి. కులాల పేరా, ప్రాంతాల పేరా, మతాల పేరా, అంతరాల పేరా ప్రజలను విడదీసి ప్రజల్లో ఐక్యత లేకుండా చేసి తమ ఆధిపత్యాలను కొనసాగిస్తున్నాయి. ఈ విషయాలను స్థానిక ప్రజలు గమనించి తమకు ఏది మేలో అటువైపు ఆలోచించాలి. ప్రభుత్వాలు విభజించు పాలించు అనే బ్రిటిష్ పాలకుల విధానాలనే నేటికీ అమలు చేస్తున్నాయి. ప్రజలు తమ వెనుకబాటు తనం నుండి, నమ్మకాల నుండి బయటపడి సమిష్టికోసం ఆలోచించాలి. అదే నేటి అట్టడుగు వర్గాల ప్రజల జీవితాలకు విశ్వాసాన్ని ఇస్తుంది.

విద్యుత్ సంక్షోభం

జూలై 29, 30లలో ఉత్తరాది, తూర్పు, ఈశాన్య పవర్ గ్రిడ్స్ కుప్పకూలడంతో దేశంలోని 22 రాష్ట్రాల్లో దాదాపు సగం ప్రాంతానికి కరెంట్ లేదు. ఇంత పెద్ద ఎత్తున పవర్ గ్రిడ్స్ విఫలమవడం ప్రపంచంలోనే ఇది మొదటిసారి. ఉత్తరభారత దేశంలో ఢిల్లీ, పంజాబ్, హర్యానా, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్, చండీగఢ్, జమ్మూకాశ్మీర్‌లలో చీకటి అలుముకుంది. తూర్పు గ్రిడ్‌లోని పశ్చిమ బెంగాల్, చత్తీస్‌గఢ్, బీహార్, జార్ఖండ్, ఒడిశా, సిక్కిం, ఈశాన్య గ్రిడ్‌లోని అరుణాచల్‌ప్రదేశ్, నాగాలాండ్, అసోం, మేఘాలయ, మణిపూర్, మిజోరాం, త్రిపుర రాష్ట్రాలను పూర్తిగా చీకటి ఆవరించింది. దేశంలోని ప్రభుత్వ, ప్రైవేట్, విద్యుదుత్పత్తి ప్లాంట్లు, సబ్‌స్టేషన్లు, సరఫరా లైన్లను కలిపి అనుసంధానించడాన్ని గ్రిడ్‌గా వ్యవహరిస్తారు. తూర్పు, పశ్చిమ, ఈశాన్య, ఉత్తర, దక్షిణ గ్రిడ్‌ల ద్వారా దేశంలోని ప్రాంతాలన్నిటికి విద్యుత్ సరఫరా అవుతోంది. దక్షిణ గ్రిడ్ తప్ప మిగిలినవి అన్నీ ఒకదానితో ఒకటి అనుసంధానమై ఉన్నాయి. రాష్ట్రాలు తమకు కేటాయించిన వాటా కంటే అధికంగా కేంద్ర గ్రిడ్ నుంచి అధిక విద్యుత్‌ను తీసుకోవడం మూలాన్నే ఉత్తరాది, తూర్పు, ఈశాన్య పవర్ గ్రిడ్‌లు కుప్పకూలాయంటున్నారు. అణువిద్యుత్ వైపు ప్రజలను మళ్లించడానికే ఈ ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. భారత పౌర అణు ఒప్పందం ప్రకారం 2050 నాటికి అణు విద్యుత్ ద్వారానే దేశ అవసరాల్లో 25 శాతం తీరాలనేది లక్ష్యం. విద్యుదుత్పత్తికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసే వైపు కాకుండా ప్రైవేట్, విదేశీ సంస్థలకు కట్టబెట్టే ప్రయత్నంలో భాగమే ఈ పవర్ గ్రిడ్‌ల ఫెయిల్యూర్‌ను అర్థంచేసుకోవాలి.

వార్త – వ్యాఖ్య : వై. రామచంద్రం

వీ

పెట్టుబడిదారీ అంతం

అమెరికా సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ విధానానికి బొలివియా చరమగీతం పాడుతోంది. డిసెంబర్ 31న ముగియనున్న మయాన్ కాలెండర్ రోజు నుంచి తమ దేశంలో నుంచి కోకా కోలా కంపెనీ ఉత్పత్తులను నిషేధిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. అక్కడ విదేశాంగ మంత్రి మాట్లాడుతూ 'పెట్టుబడిదారీ విధానానికి తమ దేశం చరమగీతం పాడబోతోంద'ని ప్రకటించారు. బొలివియా ప్రజలకు తమ దేశంలో లభించే పళ్ల రసాలను తీసుకోవాలని సూచించారు. గత సంవత్సరం బొలివియా నుంచి మెక్ డోనాల్డ్ సంస్థ తమ కార్యకలాపాలను నిలుపుకుంది. అక్కడి ప్రజలు తమ ఉత్పత్తులను తిర్కరించడంతో తీవ్ర నష్టాలకు గురై సంస్థ బొలివియా నుంచి నిష్క్రమించింది. లాటిన్ అమెరికా ఖండంలో మెక్ డోనాల్డ్ లేని రెండో దేశంగా బొలివియా నిలిచింది.

కోఫీ అన్నన్ రాజీనామా

సిరియాలో జరుగుతున్న అంతర్గత యుద్ధానికి ఐక్య రాజ్య సమితి, అరబ్ లీగ్‌ల తరపున శాంతి దూతగా ఉన్న మాజీ ఐక్యరాజ్య సమితి అధ్యక్షుడు కోఫీ అన్నన్ తన పదవికి రాజీనామా చేశారు. ఆగస్ట్ నెలాఖరులో ముగియనున్న తన పదవీ కాలాన్ని పొడగించవద్దని ఆయన అధ్యక్షుడు బాన్ కీ మూన్‌కు ఆగస్ట్ 2న ఒక లేఖలో తెలియజేశారు. సిరియా అధ్యక్షుడు అసద్‌ను గద్దె దించాలని గత పదిహేడు నెలలుగా సాగుతున్న నిరసన ప్రదర్శనలు క్రమంగా అంతర్గత యుద్ధంగా మారి వేలాది సంఖ్యలో సామాన్య పౌరుల ప్రాణాలను బలిగొంది. భారీ ఆస్తి నష్టం జరిగింది. సిరియా ప్రభుత్వానికీ, తిరుగుబాటుదారులకూ మధ్య సయోధ్య కుదర్చడంలో విఫలమైన నేపథ్యంలో తన పదవిని పొడగించ వద్దని తెలిపారు.

చమురు ఉత్పత్తిలో ఇరాక్ రెండో స్థానం

చమురు ఎగుమతి దేశాల సమాఖ్య (ఒపెక్)లో ఇరాక్ రెండో స్థానానికి చేరుకుంటోంది. సౌది అరేబియాది మొదటి స్థానం . ఇప్పటి వరకూ ప్రతి దినం 2.82 మిలియన్ బారెళ్ల ఉత్పత్తి సామర్థ్యంతో రెండో స్థానంలో ఉన్న ఇరాన్‌ను, 3.2 మిలియన్ బారెళ్ల ఉత్పత్తి సామర్థ్యంతో ఇరాక్ అధిగమించింది. ఇది గత ఇరవై ఏళ్లలోనే అత్యధిక పెరుగుదల. ప్రపంచంలోనే ఇరాక్ అత్యధికంగా 145 బిలియన్ బారెళ్ల చమురు, 3.2 ట్రిలియన్ క్యూబిక్ మీటర్ల గ్యాస్‌ను నిల్వ ఉంచుకున్న దేశం.

జన్యు మార్పిడి ఉత్పత్తులపై లేబుళ్లు పెట్టాలి

కాలిఫోర్నియాలో జన్యుపరంగా మార్పులు చేసిన ఉత్పత్తులపై పూర్తి వివరాలు ఉండేలా చూడడానికి చేసిన చట్టానికి అనుకూలంగా మద్దతు వచ్చేలా అక్కడి ఉద్యమ కార్యకర్తలు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇది మోన్‌శాంటో లాంటి సంస్థలకు పెద్ద చెంపపెట్టు అవుతుంది. అందుకే ఈ చట్టం నీరు కారిపోవడానికి 4.2 మిలియన్ డాలర్ల దాకా ఖర్చు చేస్తోంది. ఈ చట్టం అమల్లోకి వస్తే మోన్‌శాంటో లాంటి కంపెనీలు తమ ఉత్పత్తులపై వాటికి సంబంధించిన పూర్తి వివరాలు అతికించాలి. డౌ అగ్రో సైన్స్ అనే కెమికల్ సంస్థ దాదాపు 1.2 మిలియన్ డాలర్లు ఈ చట్టం అమల్లోకి రాకుండా ఖర్చు చేస్తోంది. ఇప్పటి వరకు 37 కంపెనీలు కలిసి దాదాపు 25 మిలియన్ డాలర్ల వరకు పోగు చేసి వారి ఉత్పత్తులపై లేబుళ్లు అతికించకుండా ఉండేలా చట్టం రావడానికి అడ్డుకుంటున్నారు. ఇక ఇప్పుడిది వారికీ ప్రజలకూ మధ్య పోరాటంగా మారింది. నవంబర్‌లో ఈ బిల్లుపై ఎన్నికలు జరగనున్నాయి.

మిసిసిపి ఎండిపోతోంది

అమెరికాలో తీవ్ర వర్షాభావం వల్ల వాణిజ్య రవాణాకు అతి కీలకమైన నది మిసిసిపి ఎండిపోయే దశకు చేరుకుంది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే నది ఎండిపోయి రవాణా నిలిచిపోయే ప్రమాదం ఉంది. ఈ నది నుంచి రవాణా నిలిచిపోయిన క్రమంలో అమెరికాకు రోజుకు దాదాపు మూడు వందల మిలియన్ డాలర్ల నష్టం అవుతుంది. ప్రధానంగా 60 శాతం తిండి గింజలు, 22 శాతం చమురు, సహజ వాయువు, 20 శాతం బొగ్గు ఈ నది నుంచి వస్తుంది. నది క్రమంగా కృశించి పోవడంతో రోజురోజుకూ రవాణా తగ్గిపోతోంది. నదిలోని జీవజాలం కూడా చచ్చిపోతోంది. ఒకప్పుడు ఉగ్రంగా ప్రవహించే నది అడవుల విధ్వంసం వల్ల, వర్షాలు సరిగ్గా పడక ఎడారిగా కనిపిస్తోంది.

ఇరాన్‌లో భూకంపం

ఇరాన్‌లో ఆగస్ట్ 11న భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై 6.2 తీవ్రతతో భూమి కంపించింది. దాదాపు వంద మందికి పైగా మరణించారు. నాలుగు వందల మందికి పైగా గాయపడ్డారు. నాలుగు గ్రామాలు నేలమట్టమయ్యాయి. అరవై గ్రామాలు 80 శాతం దెబ్బతిన్నాయి.

టర్కీ ఎయిర్‌లైన్స్ ఉద్యోగుల సమ్మె

టర్కీలో గత ఆరు వారాలుగా టర్కీ ఎయిర్‌లైన్స్ ఉద్యోగులు అక్రమ తొలగింపులు, సమ్మె పై నిషేధానికి వ్యతిరేకంగా యాజమాన్యంతో పోరాడుతున్నారు. పని స్థలంలో మెరుగైన సౌకర్యాలు కల్పించకుండా, సిబ్బందిపై పని ఒత్తిడి పెంచడంతో పాటు, పని వేళలు కూడా పెంచడంతో సిబ్బంది సమ్మెకు దిగారు. అధికారులు సమ్మె నిషేధం అంటూ ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వులు పాటించని ఉద్యోగులను తొలగించారు.

అమెరికాలో పెరిగిపోతున్న తిండి వృథా

అమెరికాలో ఏటా దాదాపు తొమ్మిది లక్షల కోట్ల రూపాయల తిండిని వృథా చేస్తున్నారు. ఈ మొత్తం ఏడాదిలో వారు తినే తిండిలో దాదాపు సగం. ఇంధన పొదుపూ, కాలుష్య నియంత్రణపై ప్రపంచ దేశాలకు హితవు చెప్పే అమెరికా తన దేశంలో ఇంత ఆహార పదార్థాలను వృథా చేయడం ఏమిటని ప్రపంచ విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు.

నీల్ ఆర్మ్ స్ట్రాంగ్ మృతి

చంద్రుడిపై అడుగుపెట్టిన తొలి మానవుడు అమెరికా వ్యోమగామి నీల్ ఆర్మ్ స్ట్రాంగ్ (82) ఆగస్ట్ 25న మరణించారు. ఆయన గత కొంతకాలంగా గుండె జబ్బుతో బాధపడుతున్నారు. 1930 ఆగస్ట్ 5న అమెరికాలోని ఓహియోలో ఆర్మ్ స్ట్రాంగ్ పుట్టాచారు. ఆయన తల్లిదండ్రులు స్టీఫెన్ కోనింగ్ ఆర్మ్ స్ట్రాంగ్, వయోలా లూయీ ఆర్మ్ స్ట్రాంగ్. 1969 జూలై 20న తొలిసారి చంద్రుడిపై మానవుడు కాలు మోపాడు. ఆ మానవుడు నీల్ ఆర్మ్ స్ట్రాంగ్. వీ

అస్సాంజ్ వర్సెస్ ఇంగ్లండ్

వికీలీక్స్ అధినేత జూలియస్ అస్సాంజ్‌ను అరెస్టు చేసి స్వీడన్‌కు అప్పగించాలని ఇంగ్లండ్ చేస్తున్న ప్రయత్నాలకు ప్రపంచ వ్యాప్తంగా తీవ్ర నిరసన ఎదురవుతోంది. స్వీడన్‌లో ఇద్దరు మహిళలపై అత్యాచారం చేశాడనే నేరారోపణపై అస్సాంజ్‌పై అక్కడి కోర్టులో కేసు నమోదయింది. ఈ నేపథ్యంలో అస్సాంజ్‌ను అరెస్టు చేసి స్వీడన్‌కు అప్పగించాలని ఇంగ్లండ్ ప్రయత్నాలు చేస్తోంది. అసాంజ్ తనను స్వీడన్ ప్రభుత్వం అమెరికాకు అప్పగిస్తుందనీ, అక్కడ తన ప్రాణాలు ముప్పు కలగవచ్చునని అంటున్నారు. అస్సాంజ్ తన వికీలీక్స్ వెబ్‌సైట్‌లో అమెరికాకు చెందిన దాదాపు రెండున్నర లక్షల రహస్య పత్రాలను బట్టబయలు చేశారు. దీంతో అమెరికా చేస్తున్న దుర్మార్గాల చిట్టాలు కొన్ని బయటపడ్డాయి. అస్సాంజ్ మొదట ఆస్ట్రేలియా వాసుడు. కానీ తన వృత్తి పరంగా ఎన్నో దేశాలు తిరిగాడు. అస్సాంజ్‌ను పట్టుకొని అతనికి సహకరిస్తున్న వారి వివరాలు తెలుసుకోవాలని అమెరికా తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. తమ రహస్యాలను బట్టబయలు చేస్తున్న వారిపై ఎంతటికైనా తెగించే అమెరికా అస్సాంజ్‌పై కక్ష్య సాధింపు చర్యలకు దిగింది. తన మిత్ర దేశమైన బ్రిటన్ ద్వారా అసాంజ్‌ను అరెస్టు చేయించి, స్వీడన్‌కు తరలించి అక్కడి నుంచి తమ దేశానికి రప్పించాలని చూస్తోంది. స్వీడన్‌లోని కేసు విషయంలో అతనిపై అభియోగాలు ఇంకా నిరూపితం కాలేదు. అప్పగింత నుంచి తప్పించుకోవడానికి లండన్‌లోని ఈక్వెడార్ రాయబార కార్యాలయంలో అస్సాంజ్ ఆశ్రయం కోరగా వారు దానికి అనుమతిచ్చారు. ఈక్వెడార్ అధ్యక్షుడు రాఫెల్ కొరెయా అస్సాంజ్‌కు అన్ని విధాలా సహాయపడడానికి ముందుకొచ్చారు. లండన్ పోలీసులు అస్సాంజ్‌ను ఎలాగైనా అరెస్టు చేసి స్వీడన్‌కు అప్పగించాలని పట్టుబడుతున్నారు, కానీ అంతర్జాతీయ ఎంబసీల భద్రతపై వియన్నా ఒప్పందం ఉండడంతో వారు రాయబార కార్యాలయం లోపలికి వెళ్లడం లేదు. అస్సాంజ్ ఎంబసీ నుంచి బయటికి వచ్చిన మరుక్షణం అతన్ని అరెస్టు చేయడానికి, ఎంబసీ నుంచి ఎట్టి పరిస్థితులలోనూ తప్పించుకోవడానికి వీలు లేకుండా లండన్ పోలీసులు గట్టి పహారా ఉంచారు.

గని కార్మికులపై ఉక్కు పాదం

దక్షిణాఫ్రికాలో మారికానా గనిలో సమ్మె చేస్తున్న కార్మికులపై అక్కడి పోలీసులు విచక్షణా రహితంగా కాల్పులు జరపడంతో నలభై ఐదు మంది కార్మికుల ప్రాణాలు పోయాయి. చరిత్ర నిండా దక్షిణాఫ్రికా గని కార్మికులు తీవ్ర నిర్బంధానికీ, అణచివేతకూ గురయ్యారు. కొందరు అధికారుల అవినీతి వల్ల నష్టాల్లో ఉన్న ప్రైవేట్ గనులను జాతీయం చేసి వాటికి ఉద్దీపన పథకాల ద్వారా సహాయం పొంది, లాభాలను గడించాలని గని యజమానులు చూస్తున్నారు. ఈ యజమానులలో అధ్యక్షుడి బంధువూ, మండేలా మనవడూ ఉండడం గమనార్హం. మారికానా గని ప్రపంచంలోనే అత్యంత విలువైన ప్లాటినమ్ తవ్వి తీసే గని. గనులలో వచ్చిన లాభాలతో రాత్రికి రాత్రే కోటీశ్వరులు అవుతున్నారు. అయినా గనులలో పనిచేస్తున్న కార్మికులకు కనీస సౌకర్యాలూ, వేతనాలూ, ఆరోగ్య సహాయం కల్పించడం లేదు. కార్మిక సంఘాల నేతలు కూడా యాజమాన్యంతో, ప్రభుత్వంలోని అవినీతి అధికారులతో కలిసి కార్మికులకు అన్యాయం చేస్తున్నారు. కార్మిక సంఘాల నేతలకు లక్షల ర్యాండ్‌లలో జీతాలు ఉండగా, కార్మికులకు కనీస వేతనాలు కూడా అందడం లేదు. అత్యంత ప్రమాదకరమైన పరిస్థితులలో పనిచేస్తున్నా వారికి అందేది స్వల్పం. వారి ప్రాణాలకు భద్రత ఉండదు. రక్తం, చెమటోడ్చి వారు వెలికి తీస్తున్న ఖనిజంతో వారు కోట్లకు కోట్లు దండుకుంటున్నారు. పేదరికం, ఆకలి, నిరక్షరాస్యత, నిరుద్యోగం అక్కడి ప్రజలకు ఇంతటి దుస్థితికి కారణం అవుతోంది. కార్మికులు ఎక్కడెక్కడి నుంచో వచ్చి మారికానా గని చుట్టూ నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. తమకు పని స్థలంలో సౌకర్యాలు, తగిన భద్రత, కనీస వేతనం అమలు చెయ్యాలనీ గని కార్మికులు సమ్మె మొదలు పెట్టారు. కార్మిక సంఘ నేతలకు ఇది మింగుడు పడని విషయం అయింది. పోలీసులతో ఈ సమ్మెను అణచడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఆగస్ట్ రెండవ వారంలో పోలీసులు జరిపిన అమానుష దమనకాండలో నలభై ఐదు మంది గని కార్మికుల ప్రాణాలను హరించారు. గని కార్మికులు శాంతియుతంగా తమ హక్కులను, తమ కుటుంబాలకు సరైన జీవన పరిస్థితులను కల్పించడానికి సమ్మె ప్రారంభించారు. కానీ ప్రభుత్వం వారిపై తీవ్ర అణచివేత ధోరణితో నిరసపై ఉక్కుపాదం మోపింది. ఆఫ్రికా నేషనల్ కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులపై ఇంత దమననీతిని అవలంబించడానికి కారణం వ్యవస్థలో పేరుకుపోయిన అవినీతి. దేశంలో పెట్టుబడిదారీ విధానం క్రమంగా పట్టు బిగుస్తోంది. వ్యవస్థలో వేళ్లూను కుంటోంది. ప్రభుత్వంలో పనిచేస్తున్న కింది సిబ్బంది జీతం నెలకు ఇరవై వేల ర్యాండ్‌లు. గని కార్మికులకు వచ్చేది నాలుగు వేల ర్యాండ్‌లు. ఇదీ అక్కడి అసమానత. కష్టం చేసి, చెమటోడ్చి పని చేసే కార్మికులకు సరైన జీతాలు లేక, ఆకలి, నిరుద్యోగం పెరిగిపోవడం మరో తిరుగుబాటుకు దారులు వేస్తోంది.

లండన్ ఒలింపిక్స్ 2012

దేశ దేశాల మధ్య క్రీడా సమరానికి వేదిక ఒలింపిక్స్. ఈ సంవత్సరం ముప్పైవ ఒలింపిక్స్ లండన్ నగరంలో జూలై 27న ప్రారంభమయి ఆగస్ట్ 12న ముగిసాయి. 204 దేశాల నుంచి పదివేలకు పైగా క్రీడాకారులు 28 విభాగాల్లో జరిగిన పోటీల్లో పాల్గొన్నారు. ఈ ఒలింపిక్స్‌లో అమెరికా 46 బంగారు, 29 రజతం, 29 కాంస్య పతకాలతో మొదటి స్థానంలో నిలిచింది. దాని తర్వాత చైనా 38 బంగారు, 27 రజతం, 23 కాంస్య పతకాలతో రెండవ స్థానంలో ఉంది. మూడవ స్థానంలో ఆతిధ్య దేశమైన గ్రేట్ బ్రిటెన్ 29 బంగారు, 17 రజతం, 19 కాంస్య పతకాలను సొంతం చేసుకుంది. భారత దేశం 2 రజత, 4 కాంస్య పతకాలు సాధించి 55వ స్థానంలో నిలిచింది. ఈసారి ఎనిమిది విభాగాల్లో ముప్పై రెండు ప్రపంచ రికార్డులు నమోదు అయ్యాయి. ఇక ఈ క్రీడల నిర్వహణకుగానూ ఇంగ్లండ్ 9.3 బిలియన్ పౌండ్లను ఖర్చు చేసింది. ఒలింపిక్స్ కోసం ప్రత్యేకంగా నిర్మించిన స్టేడియంలూ, ఒలింపిక్స్ గ్రామం, ఇతర అభివృద్ధి పనుల ఖర్చు కలపకుండానే ఈ వ్యయం జరిగింది. ఇక ఈ స్టేడియంలనూ, ఒలింపిక్స్ గ్రామాన్ని ఇప్పుడు ఏ అవసరాల కోసం వాడుతారో చూడాలి. క్రితం సారి గ్రీస్ నిర్వహించిన ఒలింపిక్స్ వల్ల ఆ దేశ ఆర్థిక వ్యవస్థే కుప్పకూలి పోయింది. ఒక పక్క యూరోపియన్ యూనియన్ అనుబంధ దేశాలలో ఆర్థిక పరిస్థితి కొట్టుమిట్టాడుతుండగా, ప్రజలకు మౌలిక సౌకర్యాలు కల్పించకుండా, ఒలింపిక్స్ నిర్వహణ కోసం ఇంత ఖర్చు చేయడం ఏమాత్రం సబబు కదాని సర్వత్రా నిరసనలు వెల్లువెత్తాయి. మన రాష్ట్రంలోని ఒక్క జిల్లా అంత కూడా లేని జమైకా, బహమాస్ లాంటి దేశాలు బంగారు పతకాలు సాధించి ఎంతో ముందంజలో ఉన్నాయి. ప్రపంచంలోనే 122 కోట్ల జనాభాతో రెండో స్థానంలో ఉన్న భారతదేశం కేవలం ఆరు పతకాలు, అందులో నాలుగు కాంస్య పతకాలకు పరిమితమైంది. ఇది తీవ్రంగా ఆలోచించాల్సిన విషయం.

వార్త - వ్యాఖ్య : సి. రాజశేఖర్ వీ

అసహజ మరణాల సూచి


సంకలనం : రాంకి, వై. రామచంద్రం

మరణం ఎప్పుడయినా విషాద సూచకమే. మృతుల బంధువులకూ, మిత్రులకూ విచారకరమే కాని అందులోనూ మరణించిన మనిషి నిండు జీవితం గడిపి వయోభారంతోనే మరణిస్తే దాన్ని సహజ మరణంగా అంగీకరించి ఊరట పడవచ్చు. సగటు ఆయు ప్రమాణంలో సగం కూడా అనుభవించక ముందే మరణిస్తున్నారు. ఈ అసహజ మరణాలకు లెక్కలేనన్ని ఆర్థిక, సామాజిక, రాజకీయ కారణాలున్నాయి. మన పక్కనే మనతోనే ఉండే మనుషులు అర్ధాంతరంగా అసహజంగా అకాలంగా అదృశ్యమైపోతున్నారు. ఇటువంటి అసహజ మరణాలు ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇవి సామాజిక సంక్షోభానికి, సమాజం దిగజారుడుకు ఒక చిహ్నం. మన రాష్ట్రంలో సాలీనా ఈ రకంగా చనిపోతున్న వారి సంఖ్య వేలల్లోనే ఉంటుందని అంచనా. నిజానికి అసహజ మరణాలన్నీ అసహజ మరణాలుగా నమోదు కావడం లేదు గనుక ఈ సంఖ్య వాస్తవంలో ఒక భాగం మాత్రమే కావచ్చు. పత్రికలలో అచ్చయిన ఇటువంటి ఘటనలన్నిటినీ ఒక్కచోట నమోదు చేయాలని భావిస్తున్నాం. ఈ శీర్షిక ప్రతి నెల ఉంటుంది. అయితే రాష్ట్రంలో ప్రతి గ్రామంలో జరుగుతున్న సంఘటనలన్నీ ఇక్కడ రిపోర్ట్ కాకపోవచ్చు. కొన్నయినా మనల్ని ఆలోచింపజేస్తే, మనం మనచుట్టూ ఉన్న మనుషులకోసం ఇంకాస్త బాధ్యతగాను, జాగ్రత్తగాను వ్యవహరిస్తూ మొత్తంగా పరిష్కారాలవైపు వెళ్లడానికి ఏమయినా తోడ్పడితే ఈ శీర్షిక విజయవంతమైనట్లే.


(1 జూలై నుండి 31 జూలై 2012 వరకు జిల్లాలలో అసహజ మరణాల పాలైన వారి సంఖ్య – 1351)

జిల్లా	ఆకలి	ఆత్మహత్యలు				చికిత్స అందక, అనారోగ్యం			గుర్తు తెలియని		హత్యలు		ప్రమాదాలు				పోలీసు కాల్పుల్లో		పోలీసులు, సైన్యం	మిస్సింగ్/ లాకప్ మరణాలు	ప్రకృతి వైపరీత్యాలు
		వ్యవసాయ రంగం	చేనేత రంగం	ఇతరాలు స్త్రీ	ఇతరాలు పు.	స్త్రీ	పు.	పి.	స్త్రీ	పు.	స్త్రీ	పు.	పనిచేసే స్థలంలో	కరెంట్	రహదారి	ఇతరాలు	ఉద్యమ కారులు	ఇతరులు			
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)	(8)	(9)	(10)	(11)	(12)	(13)	(14)	(15)	(16)	(17)	(18)	(19)	(20)	(21)	(22)
ఆదిలాబాద్	–	3	–	25	20	9	7	4	2	2	3	4	2	2	20	21	–	–	–	1	6
హైదరాబాద్	–	–	–	10	16	1	–	–	2	10	4	3	–	–	37	25	–	–	–	10	–
ఖమ్మం	–	1	–	9	8	2	6	6	–	–	3	9	1	4	16	11	–	–	–	–	2
మహబూబ్‌నగర్	–	5	–	15	22	8	7	3	3	9	3	14	21	9	53	18	–	–	–	1	1
మెదక్	–	–	–	8	8	1	1	1	2	3	2	3	–	12	39	18	–	–	–	–	–
నిజామాబాద్	–	–	–	3	15	2	–	1	–	4	1	1	3	5	17	20	–	–	–	–	–
రంగారెడ్డి	–	5	–	20	12	14	13	2	5	3	7	8	2	2	30	13	–	–	–	–	–
వరంగల్	వివరాలు అందలేదు																				
అనంతపూర్	–	6	1	9	7	1	3	1	–	1	5	7	3	5	25	2	–	–	–	–	–
నెల్లూరు	–	–	–	2	2	–	–	–	–	2	–	4	–	6	18	40	–	–	–	–	4
గుంటూరు	–	–	–	4	4	–	–	–	–	2	15	15	–	6	18	4	–	–	–	–	–
కడప	–	–	–	–	4	1	1	2	–	1	–	7	–	3	28	12	–	–	–	–	–
క్రిష్ణా	–	–	–	2	7	–	1	–	–	–	1	5	4	1	8	14	–	–	–	–	–
విశాఖపట్నం	–	–	–	8	9	5	6	–	–	1	1	6	6	3	23	17	–	–	–	9	–
విజయనగరం	–	1	5	3	2	5	3	1	2	1	2	2	–	–	25	3	–	–	–	–	2
తూర్పు గోదావరి	4	–	–	7	2	2	2	–	–	–	1	2	1	3	17	10	–	–	–	–	–
మొత్తం	**4**	**21**	**6**	**125**	**138**	**51**	**50**	**21**	**16**	**39**	**48**	**90**	**43**	**61**	**374**	**228**	**–**	**–**	**–**	**21**	**15**


వీక్షణం దగ్గర అమ్మకానికి ఉన్న పుస్తకాలు




కొత్తచూపు
పేజీ 295, రు.120




అభివృద్ధిని ఇలా చూద్దాం
పేజీ 205, రు.80




మీరు-నేను- ఆర్థికం
పేజీ 215, రు.60




ఒక దళారీ పశ్చాత్తాపం
పేజీ 172, రు.50




కుట్రాజకీయం
పేజీ 114, రు.40




ఇన్ సర్చ్ ఆఫ్ మెథడ్
పేజీ 367, రు.200




ఇండివిడ్యుల్ సబ్-గ్రూప్స్
గ్రూప్స్ అండ్ ఫ్రీడం
పేజీ 59, రు.75




క్రైసిస్ అండ్ డెవలప్‌మెంట్
ఇన్ మార్క్సియన్ ఫ్రేంవర్క్
పేజీ 105, రు.80




ఆన్ ఎడ్యుకేషన్
పేజీ 142, రు.100



మెథడాలజీ ఆఫ్
సోషల్ ఎంక్వైరీ
పేజీ 201, రు.150





ఫిఫ్టీ ఇయర్స్
ఆఫ్
ఆంధ్రప్రదేశ్
1956 – 2006
పేజీ 568, రు.300




రాబందు వాలిన నేల
పేజీ 408, రు.180

వ్యవసాయం – ప్రపంచీకరణ
పేజీ 224, రు.100







కల్లముందరి చరిత్ర
పేజీ 309, రు.80




పరిచయాలు
పేజీ 194, రు.50




గంగానమ్మ
పేజీ 61, రు.15




లేచినిలిచిన తెలంగాణ
పేజీ 303, రు.120




రాబందు నీడ
పేజీ 111, రు.25




విశ్వాంతరాళం
పేజీ 189, రు.90



మానవ పరిణామం
పేజీ 211, రు.90



జీవకణాలూ – నాడీకణాలూ
పేజీ 184, రు.80



ప్రకృతి – పర్యావరణం
పేజీ 230, రు.90

VEEKSHANAM Telugu Monthly Journal of Political Economy and Society - 134 -September 2012 ● **ISSN 2231-6892**
● RNI Regn.No.APTEL/2003/11482 ● Published on 27/08/2012 ● Postal Regn. No. L II/RNP/HD/1100/2011-13

వీక్షణంలో ప్రకటనలు ఇవ్వండి

మీ సందేశం వేలాది మందికి చేర్చవచ్చు

వీక్షణంకు ఆర్థిక సహాయం అందించవచ్చు

వీక్షణం నాలుగు కాలాలపాటు మనగలగాలంటే ఆర్థిక పరిపుష్టి అవసరమని మీకు తెలుసు. వీక్షణం పాఠకులుగా, అభిమానులుగా వీక్షణంకు ఆర్థిక సహాయం అందించాలనే కోరిక, ఆర్థిక సహాయం అందించగలిగిన వారికి వీక్షణంను పరిచయం చేయాలనే కోరిక కూడా మీకు ఉన్నాయి. కానీ, ఆ ఆర్థిక సహాయం ఏ రూపంలో అందించాలో మీరు ఆలోచిస్తుండవచ్చు. చందాలు, విరాళాల రూపంలో మాత్రమే కాదు, ప్రకటనల రూపంలో కూడా ఆ ఆర్థిక సహాయం అందించవచ్చు. పూర్తి పేజీ, అర పేజీ, పావు పేజీ ప్రకటనలు ఎక్కువ ఖరీదు అవుతాయనీ, భరించలేమనీ అనుకుంటే వెయ్యి రూపాయల నుంచి ప్రారంభించి కూడా ప్రకటనలు ఇవ్వవచ్చు. లోపలి పేజీలలో 4.5 కాలమ్ సెంటీమీటర్ల ప్రకటన (4.5 సెం.మీ. పొడవు, 8.4 సెం.మీ. వెడల్పు) వెయ్యి రూపాయలలో వస్తుంది. శుభాకాంక్షలు తెలిపే ప్రకటనలు, జీవన సహచరి / సహచరుడు కావాలనే ప్రకటనలు, పుస్తక ప్రకటనలు, సందేశాలు... ఏమయినా సరే మీరు చెప్పదల్చుకున్న ఏ సంక్షిప్త సమాచారమయినా అతి తక్కువ ఖర్చుతో వీక్షణం పాఠకులకు చేరుతుంది. వీక్షణం పాఠకులలో ప్రజా ఉద్యమాల కార్యకర్తలు, నాయకులు, విద్యాలయాల విద్యార్థులు, అధ్యాపకులు, సామాజిక విశ్లేషకులు, రాజకీయ కార్యకర్తలు, మొదలైన ఎన్నో సమూహాల ప్రజలు ఉన్నారు. వీక్షణంలో ఒక ప్రకటన తెలుగు సీమలోని వేలాది పాఠకులకు చేరుతుంది. ఈ ప్రకటన ఇంటర్‌నెట్‌లో www.veekshanam.wordpress.com లో కూడా ఉంటుంది గనుక మరెన్ని వేల మందికి చేరుతుందో చెప్పలేం.

W : 84MM X H : 50 MM

వీక్షణం

మైత్రి రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029. ఫాక్స్, ఫోన్ : 040-66843495

Email : veekshanam2003@gmail.com www.veekshanam.wordpress.com

Edited, printed, published and owned by N. Venugopal Rao, Printed at Deccan Press for Charitha Impressions, Azamabad, Hyderabad - 500 020
and Published at 3-6-394, Mythri Residency, Street No. 3, Himayatnagar, Hyderabad 500 029. Editor : N. Venugopal Rao